సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 295

సోమవారం 8-7-2024



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



అభిషేక్ అదరహో

సెంచరీతో చెలరేగిన భారత ఓపెనర్.. జింబాబ్వేపై భారీ విజయం - 12లో



ఇక ఊరట!

పాలసీ సరెండర్ నిబంధనల్లోని తాజా మార్పులపై కథనం - 13లో


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఉత్తరాదిని ముంచెత్తిన వర్షాలు

ఉత్తరాది రాష్ట్రాలను వర్షాలు ముంచెత్తాయి. ముందస్తు జాగ్రత్తగా చార్‌ధామ్ యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపేశారు.

వివరాలు 6లో ▸



డేంజర్ మార్కు దాటేస్తున్న..

భూతాపం ఈ శతాబ్దంలో 2.5 డిగ్రీలకు పైగా పెరిగి మానవాళిని వినాశనం వైపు నెడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.


వివరాలు 6లో ▸



సీబీఐకి అప్పగించాలి

తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసును సీబీఐకి అప్పగించాలని ఆ పార్టీ అధినేత్రి మాయావతి డిమాండ్ చేశారు.

వివరాలు 6లో ▸



రష్యాలో మోదీ పర్యటన

ప్రధాని మోదీ నేడు, రేపు రష్యాలో పర్యటించనున్నారు. ఇండో–రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో మోదీ పాల్గొంటారు.

వివరాలు 6లో ▸

పంటల బీమాకు 'పాత'ర!

ఉచితానికి ఉద్వాసన.. పాత పద్ధతి వైపు సర్కారు చూపు

సీఎం చంద్రబాబు నిర్ణయంతో రైతన్న గుండెల్లో గుబులు

- ఐదేళ్లుగా అన్నదాతలపై పైసా భారం పడకుండా అమలు
- యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తూ బీమా రక్షణ
- నోటిఫై చేసిన ప్రతీ పంటకు, సాగు చేసిన ప్రతీ ఎకరాకు బీమా
- రైతుల తరఫున ప్రీమియం మొత్తం చెల్లించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఉచిత బీమా ద్వారా 2.04 కోట్ల మంది రైతులకు బీమా రక్షణ
- ఒక సీజన్ పరిహారం మరుసటేడాది అదే సీజన్ ప్రారంభానికి ముందే జమ
- బాబు హయాంలో రూ.3,411.20 కోట్లు.. జగన్ పాలనలో రూ.7,802.05 కోట్ల బీమా పరిహారం చెల్లింపు
- రూ.1,278.80 కోట్ల ప్రీమియం కట్టకుండా కూటమి సర్కారు ఎగనామం.. రైతులపై ఏటా సగటున రూ.800 కోట్లకు పైగా ప్రీమియం భారం

3లో





రూ.4 లక్షల బీమా పరిహారం అందుకున్నా..

పసుపు, కంద, అరటి, తమలపాకు సాగు చేస్తుంటా. వైఎస్సార్ ఉచిత పంటల బీమా రైతులకు ఎంతో బాసటగా నిలిచింది. గత ఐదేళ్లలో పైసా ప్రీమియం చెల్లించకుండా రూ.4 లక్షలకు పైగా బీమా పరిహారం పొందా. రూ.2 లక్షల వరకు పంట నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందుకున్నా. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పరిహారం జమైంది. రైతాంగానికి ఎంతో ఆసరాగా ఉన్న పథకాన్ని రద్దు చేసి 2019కి ముందు ఉన్న విధానం అమలు చేయాలని నిర్ణయించడం సరికాదు. ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలి.

– ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, కిష్కిందపాలెం, బాపట్ల జిల్లా

వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్



అండగా ఉంటాం.. ఆందోళనొద్దు

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ధైర్యం చెప్పిన వైఎస్ జగన్

దుర్మార్గ సంప్రదాయానికి టీడీపీ బీజం వేస్తోంది

హామీలను విస్మరించి దాడులను ప్రోత్సహిస్తోంది

అధైర్య పడొద్దు.. బాధితులందరినీ కలుస్తా

టీడీపీ దౌర్జన్యాలను దీటుగా ఎదుర్కొందాం

మన కాలం వస్తుంది.. ఓపిగ్గా ఉండండి

2లో



అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో పేలుడు

12లో

16 మంది కార్మికులకు గాయాలు

ఒకరి మృతి, మరో ముగ్గురి పరిస్థితి విషమం

విజయవాడ, తాడేపల్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు

యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన

కర్మాగారంలో ఫర్నీచర్ ధ్వంసం



జమ్మూకశ్మీర్‌లో కాల్పుల మోత

జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇద్దరు సైనికులు వీర మరణం పొందారు.

6లో



అదో దా'రుణ' యాప్

- నిషేధించినా బురిడీ కొట్టిస్తున్న 'క్యాష్ ఎక్స్‌పాండ్ యూ' యాప్.. ఆరు నెలల్లోనే 1,062 పైగా ఫిర్యాదులు
- ఆ యాప్‌ను ఫోన్ల నుంచి తొలగించాలని నేషనల్ సైబర్ పోర్టల్ ప్రకటన

14లో



పేరుకే ఉచితం

షరతులు షరా మామూలే..

- స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను వినియోగదారులకు సరఫరా చేయనున్న ప్రభుత్వం
- లోడింగ్, రవాణా చార్జీలను మాత్రమే వసూలు చేస్తామంటున్న అధికారులు
- ఈ చార్జీలు ఎంతో ఇప్పటికీ వెల్లడించని వైనం.. వాహనాలు, లోడింగ్ వ్యవస్థ అంతా వారి గుప్పెట్లోనే..
- ఈ ముసుగులో దండుకునేందుకు టీడీపీ నేతల పక్కా వ్యూహం
- వర్షాకాలం కావడంతో వచ్చే మూడు నెలలు ఇసుక తవ్వకాలు నిలిపివేత
- మళ్లీ సెప్టెంబర్ నుంచి తవ్వకాలకు కొత్త విధానం ప్రకటించనున్న ప్రభుత్వం

10లో

చదువులకు రాజకీయ చెద

- ప్రభుత్వ విద్యాసంస్థలపై కూటమి పార్టీల జులుం
- ఉపాధ్యాయులపై దాడులు.. బెదిరింపులు
- స్కూళ్ల నుంచి యూనివర్సిటీల వరకు అదే తీరు
- మరుగుదొడ్ల కార్మికులను సైతం తమ వారినే నియమించాలని హుకుం
- నంద్యాలలో టీచర్‌పై టీడీపీ రేషన్ డీలర్ బూతు పురాణం
- విశాఖలో బురదలోనే విద్యార్థుల మధ్యాహ్న భోజనాలు
- దర్శిలో వంట మనిషిని తొలగించడంతో పస్తులు
- కూటమి నెల రోజుల పాలనలో విద్యారంగం అస్తవ్యస్తం

12లో



నంద్యాల జిల్లా కోరమానుపల్లిలో ప్రభుత్వ టీచర్‌ను దూషిస్తున్న టీడీపీ నేత

విద్యార్థుల ఆశలపై నీళ్లు



- 2024–25లో ఐదు వైద్య కళాశాలల్లో తరగతులకు ఎన్‌ఎంసీ అనుమతులు నిరాకరణ
- అనుమతులకు చొరవ చూపని రాష్ట్ర ప్రభుత్వం
- వీటి ప్రారంభం కోసం గత వైఎస్సార్‌సీపీ సర్కారు విశేష కృషి.. కానీ, కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి అయ్యుండి పట్టించుకోని చంద్రబాబు
- వైద్యశాఖపై సమీక్షలో దీనిపై కనీసం చర్చించని సీఎం
- కొత్త మెడికల్ కళాశాలలపై ఉద్దేశపూర్వకంగా మోకాలడ్డిన ప్రభుత్వం

14లో



నేడు మహానేత వైఎస్సార్ 75వ జయంతి

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ ఏర్పాట్లు

ఇడుపులపాయలో నివాళులర్పించనున్న మాజీ సీఎం వైఎస్ జగన్

2లో

తెలుగు నేలపై చెరగని జ్ఞాపకం

ఇదం జగత్



అర్ధరాత్రి ఇండోర్ స్టేడియం కూల్చివేత

పుంగనూరులో కూటమి నేతల పైశాచిక ఆనందం

హిటాచీలు, జేసీబీలతో విధ్వంసం

- దాదాపు రూ.కోటి విలువైన ఆస్తి నష్టం
- కులమతాలు, పార్టీలకు అతీతంగా నిర్మించిన స్టేడియం కూల్చివేతపై జనాగ్రహం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు అసోసియేషన్ సభ్యుల ఫిర్యాదు
- దోషులను శిక్షించాలని మాజీ ఎంపీ రెడ్డప్ప డిమాండ్

ధ్వంసమైన పుంగనూరు ఇండోర్ స్టేడియం



సాక్షి, అమరావతి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి పార్టీల నేతల ఆగడాలు మితిమీరిపోయాయి. ఆస్తుల ధ్వంసం పరాకాష్టకు చేరింది. ఎన్నికల ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న విధ్వంసకాండ నెల రోజులైనా ఆగడం లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ అనే తేడా లేకుండా అన్ని రకాల ఆస్తులపై కూటమి శ్రేణులు విరుచుకు పడుతూ స్వైర విహారం చేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నేతలు, సానుభూతిపరులపై భౌతిక దాడులకు తెగబడుతున్నారు. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కళ్లున్న కబోదిలా వ్యవహరిస్తోంది. తాజాగా.. చిత్తూరు జిల్లా పుంగనూరులో చిన్నా, పెద్ద తేడా లేకుండా వందలాది మంది మానసికోల్లాసం కోసం

మిగతా 5వ పేజీలో ▶

ఆదివారం ఒడిశాలోని పూరీలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము



పూరీలో వైభవంగా రథయాత్ర

'జై జగన్నాథ్' నినాదాల నడుమ కదిలిన రథాలు

పూజలు చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

6లో

క్లుప్తంగా...

నేడు మహానేత వైఎస్సార్ 75వ జయంతి

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ ఏర్పాట్లు
- ఇడుపులపాయలో నివాళులు అర్పించనున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. రక్తదానం, పేదలకు వస్త్రాల పంపిణీ, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ, రహదారుల పక్కన మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలను భారీ ఎత్తున చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశాయి. వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు అర్పించనున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

ఆస్ట్రేలియాలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎన్నారైలు

సాక్షి, అమరావతి/ఫిరంగిపురం: కూటమి నాయకులు ఎన్ని అరాచకాలు సృష్టించినా.. ఎన్ని దాడులకు పాల్పడినా వైఎస్సార్‌సీపీ జెండాను విడవబోమని ఆస్ట్రేలియా ఎన్నారైలు నినదించారు. ఆస్ట్రేలియాలోని ప్రధాన నగరాల్లో కార్యవర్గ సభ్యులు వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్చువల్‌గా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి కాకాణి ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా కన్వీనర్ చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి వల్లూరి, కోటా శ్రీనివాసరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కర్రీ శ్రీనివాస్ రెడ్డి, ఇరువురి బ్రహ్మారెడ్డి, ఏరువ చిన్నపరెడ్డి, బొమ్మిరెడ్డి జస్వంత్ రెడ్డి, వంశీ చాగంటి, సురేశ్ కనుబుద్ధి, విజయేందర్, ఉమా శంకర్, చంద్రఓబుల్‌రెడ్డి,హరి, రాకేశ్ పాల్గొన్నారు.

అడిలైడ్‌లో ఘనంగా..

దక్షిణ ఆస్ట్రేలియాలోని అడిలైడ్ నగరంలో కొమ్మారెడ్డి విశాల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ 75వ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలను, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌వంగారెడ్డి, బి.వంశీధర్‌రెడ్డి, కె.విశాల్‌పాల్‌రెడ్డి, అరవింద్, నాని, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ మహోన్నత నాయకుడు

- ఆయన మృతిపై రోజూ విచారిస్తూనే ఉన్నాం
- ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ

సాక్షి, న్యూఢిల్లీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిజమైన దేశభక్తుడని, మహోన్నత నాయకుడని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ కొనియాడారు. మహానేత వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకొని ఆమె ఆదివారం ఓ సందేశం విడుదల చేశారు. 'డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భారత దేశ మహోన్నత నాయకుడు. దేశానికి, రాష్ట్రానికి, ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా, అంకితభావంతో సేవ చేసిన నిజమైన దేశభక్తుడు. మంచి వ్యక్తిగా, విలువలు ఉన్న సహచరుడిగా వైఎస్సార్ పట్ల మాకు అత్యంత గౌరవం ఉంది. పార్టీ కోసం కలిసి పనిచేసిన గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నా. ప్రజలకు గొప్ప సేవ చేసిన ఆ మహానేత లేరని మనమంతా ప్రతిరోజూ విచారిస్తూనే ఉన్నాం. వైఎస్సార్ దార్శనికత, మార్గదర్శకత్వం నుంచి స్ఫూర్తి పొందుదాం. వైఎస్సార్ జ్ఞాపకాలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గౌరవిస్తోంది. గొప్ప ప్రజా సేవకు బాటలు వేసిన వైఎస్సార్‌కు 75వ జయంతి సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నా' అని పేర్కొన్నారు.

మాజీ మంత్రులకు గన్‌మెన్ల తొలగింపుపై పరిశీలిస్తాం

డీజీపీ ద్వారకా తిరుమలరావు



నగరంపాలెం: ప్రజలకు జవాబుదారీగా పోలీస్ సేవలు అందిస్తామని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. గుంటూరు కృష్ణానగర్ రామానుజ కూటమిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయానికి ద్వారక తిరుమలరావు దంపతులు ఆదివారం సాయంత్రం విచ్చేశారు. శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. డీజీపీ మాట్లాడుతూ.. సాంకేతిక ఆధారాల ప్రకారం విచారణ జరుగుతుందని చెప్పారు. మాజీ మంత్రులకు గన్‌మెన్ల తొలగింపు అంశంపై మీడియా అడిగిన ప్రశ్నకు డీజీపీ బదులిస్తూ.. ఎవరెవరికి ఎంతమేర ప్రాణహాని ఉందనే విషయంపై అధ్యయనం చేస్తామని చెప్పారు. పోలీస్ పనితీరు గతంలో నిర్వహణ సరిగాలేక వేలిముద్రల సేకరణ విభాగం, ఎల్ఎంహెచ్ఎస్ వంటివి మూతపడ్డాయన్నారు. వాటిని పునఃప్రారంభిస్తామని చెప్పారు. కృష్ణా నగర్ సమీపంలోని పాఠశాలలో తాను చదువుకున్నానని చెప్పారు.


పులివెందుల క్యాంప్ కార్యాలయం వద్ద భారీగా తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

అండగా ఉంటాం.. ఆందోళనొద్దు

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ధైర్యం చెప్పిన జగన్

- దుర్మార్గ సంప్రదాయానికి తెలుగుదేశం పార్టీ బీజం వేస్తోంది
- హామీలను విస్మరించి దాడులను ప్రోత్సహిస్తోంది

సాక్షి ప్రతినిధి, కడప: 'టీడీపీ వర్గీయులు అరాచకాలు సృష్టిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గెట్ చేస్తూ వ్యక్తిగత దాడులు చేస్తున్నారు. కట్టడి చేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోయింది. ఇలా ఐదేళ్లలో మనం ఎప్పుడూ దౌర్జన్యాలు చేయలేదు' అంటూ అనంతపురం జిల్లాకు చెందిన బాధితులు వాపోతుంటే, అధైర్య పడొద్దని.. టీడీపీ దుర్మార్గాలను ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ సీఎం వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. 'మీ ప్రాంతానికి వస్తా.. మీకు అండగా నిలుస్తా.. ఆందోళన పడొద్దు, అందర్నీ కలుస్తా.. టీడీపీ దుర్మార్గాన్ని దీటుగా ఎదుర్కొందాం' అని ఊరడించారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా పులివెందుల క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ జిల్లాతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ శ్రేణులు, నాయకులతో ఆయన మమేకమయ్యారు. అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నేతలు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, వీరాంజనేయులు, మగ్బూల్ బాషా, సాంబశివారెడ్డి తదితరులు వైఎస్ జగన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాల అనంతరం ఆ జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ 'పోరాటాలు మనకు కొత్త కాదు. పోరాటం నుంచే పుట్టిన పార్టీ మనది. ఎంతో కాలం టీడీపీ దౌర్జన్యాలు నడవవు. మనోధైర్యం కోల్పోవద్దు. పార్టీ శ్రేణులకు అండగా ఉండండి. టీడీపీ బాధితులను నేను స్వయంగా కలుస్తా. అండగా నిలుస్తా. టీడీపీ దౌర్జన్యాలను సహించేది లేదు. మనందరం కలసికట్టుగా ఎదుర్కొందాం. మన కాలం వస్తోంది. అంత వరకూ కేడర్‌కు భరోసా ఇవ్వాలి' అని ఆయన పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు.


మహిళ సమస్యను వింటున్న వైఎస్ జగన్

హామీలను విస్మరించి దాడులకు ప్రోత్సాహం

'ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి, చంద్రబాబు సర్కార్ వైఎస్సార్‌సీపీ కేడర్‌ను టార్గెట్ చేసి దాడులను ప్రోత్సహిస్తోంది. గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదు. టీడీపీ సర్కార్ వ్యక్తిగత దాడులకు ఉసిగొల్పుతోంది. ప్రజలన్నీ గమనిస్తున్నారు. ధైర్యంగా ఉండండి. పార్టీ తరఫున అండగా ఉంటాం' అని మాజీ ఎమ్మెల్యేలు ఎస్ రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి తదితరులతో వైఎస్ జగన్ అన్నారు. చంద్రబాబునాయుడు ఇదివరకెన్నడూ లేని రీతిలో దుర్మార్గ సంప్రదాయానికి బీజం వేస్తున్నారని, పద్ధతి మార్చుకోకపోతే ఫలితం అనుభవించక తప్పదన్నారు.

యువకుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



మానవత్వం చాటుకున్న వైఎస్ జగన్

- ఈత కొడుతూ ప్రాణాపాయ స్థితిలోకెళ్లిన యువకుడు
- తన అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలింపు

సాక్షి ప్రతినిధి కడప : వైఎస్ జగన్ సకాలంలో స్పందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ యువకుడి ప్రాణాలు కాపాడారు. ఆదివారం వైఎస్ జగన్ పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలో పర్యటించారు. కోమన్నూతల గ్రామానికి చెందిన నారాయణ స్వామి కుమారుడు నరేష్ (25) సాయంత్రం దిగుడు బావిలో ఈత కొడుతుండగా శ్వాస తీసుకోవడం కష్టమైంది. స్నేహితులు గమనించి, అతన్ని బైక్‌పై కూర్చోబెట్టుకుని ఆస్పత్రికి పయనమయ్యారు. అదే సమయంలో చిన్నకుడాల వద్ద జగన్ కాన్వాయ్ ఆగింది. వెంటనే ఆ యువకులు తమ స్నేహితుడి పరిస్థితిని కాన్వాయ్‌లో ఉన్న వారికి వివరించారు. 108కు కాల్ చేసినా రాలేదని చెప్పారు. విషయం తెలుసుకున్న జగన్ ఆలస్యం చేయకుండా తన వెంట ఉన్న అంబులెన్స్‌లో ఆ యువకుడిని పులివెందుల ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వెంటనే చికిత్స చేయడంతో అతడికి ప్రాణాపాయం తప్పింది.




మాజీ ఎంపీపీ పెద్ద సుబ్బారెడ్డి సతీమణి లక్ష్మీనరసమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్.. పులివెందుల క్యాంప్ కార్యాలయం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్


చిన్నారితో ఆత్మీయంగా మాట్లాడుతున్న వైఎస్ జగన్

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

వైఎస్సార్‌సీపీ లింగాల మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ పెద్ద సుబ్బారెడ్డి సతీమణి లక్ష్మీనరసమ్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో వైఎస్ జగన్ ఆదివారం పెద్దకూడాల గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులందర్నీ పలుకరించి, ధైర్యం చెప్పారు. లింగాల మండలానికి చెందిన వివిధ గ్రామాలకు చెందిన నాయకుల్ని పేరుపేరునా పలుకరించారు. పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చక్రాయపేట మండలం గొంది గ్రామానికి చెందిన మబ్బు రామయ్య తన పట్టా భూమిలో దౌర్జన్యంగా టీడీపీ వర్గీయులు రోడ్డు వేస్తున్నారని వాపోయారు. అడ్డుకున్న తనపైనే తప్పుడు కేసు బనాయిస్తున్నారని వివరించారు. ఈ ఘటనపై వైఎస్ జగన్ స్పందిస్తూ.. బాధితుడికి అన్యాయం చేయొద్దని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు ఓపికగా విన్నారు. అవసరమైన చర్యలకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కే సురేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.


పాము కాటుతో మృతి చెందిన పులివెందుల మునిసిపల్ కౌన్సిలర్ రాజేశ్వరి సోదరి కుమార్తె చార్వికి నివాళులర్పిస్తున్న జగన్

ఆ పేరే ఒక స్ఫూర్తి

వైఎస్ రాజశేఖరరెడ్డి.. వైఎస్సార్.. ఈ పేరు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఓ భరోసా. అభివృద్ధికి, సంక్షేమానికి చిరునామా. అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించిన మహనీయుడు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తూ.. రూ.1,100 కోట్ల సేద్యపు విద్యుత్ బకాయిలను రద్దు చేస్తూ ఫైలుపై సీఎంగా తొలి సంతకం చేసిన పాలకుడు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులను ఉన్నత విద్య చదివించిన విద్యా దాత. ఆరోగ్య శ్రీ పథకంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించిన ప్రాణ దాత. పంట పండినా.. ఎండినా నష్టపోమనే భీమా రైతులకు కల్పించి.. వ్యవసాయాన్ని పండగలా మార్చిన రైతు బాంధవుడు. రూ.లక్ష కోట్ల వ్యయంతో 86 ప్రాజెక్టులను జలయజ్ఞం కింద చేపట్టి.. ఐదేళ్లలోలోనే 41 ప్రాజెక్టులను పూర్తి చేసి ఉమ్మడి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన మహా నేత. పారదర్శక పారిశ్రామిక విధానంతో పెట్టుబడులు వరదెత్తేలా చేసి.. ఉపాధి అవకాశాలను పుష్కలంగా కల్పించి.. 3 పోర్టులు నిర్మించి ఎగుమతులకు రాష్ట్రాన్ని కేంద్రంగా మార్చిన ప్రగతిశీలి. ఆర్థిక మాంద్యం ముప్పును ఎలా అధిగమించాలో చాటిచెప్పిన ఆర్థికవేత్త. సంక్షేమాభివృద్ధి పథకాలతో తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని జ్ఞాపకంగా నిలిచిన మహానేత.. పరిపాలనలో మానవత్వాన్ని జోడించి నవయుగానికి నాంది పలికిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి కోట్లాది మంది హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.



తెలుగు నేలపై చెరగని జ్ఞాపకం

ప్రజారోగ్యం, విద్యకు పెద్దపీట

- 2004 మే 14 నుంచి 2007 జూన్ 26 వరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రూ.168.52 కోట్లను విడుదల చేశారు. ఆ సమయంలో పేదలు పడిన వేదన గమనించారు. జబ్బునపడ్డ పేద కుటుంబాలు ఆ ఆపత్కాలంలో సహాయం కోసం సీఎం కార్యాలయానికి రావాల్సిన ప్రయాసకు స్వస్తి పలుకుతూ ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇది ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చింది. 108, 104 అంబులెన్స్ సర్వీసులను ప్రవేశపెట్టారు. ఆరోగ్యశ్రీ స్ఫూర్తితోనే కేంద్రం ఆయుష్మాన్ భారత్‌ను చేపట్టింది.
- పేదరికం వల్ల ఏ ఒక్కరూ ఉన్నత చదువులకు దూరం కాకుడదన్న లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి రూపకల్పన చేశారు. మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు పేదవాడి సొంతమైతేనే పేదరికం నిర్మూలన సాధ్యమని ఆయన బలంగా నమ్మారు. ఉన్నత చదువులను అందరికీ అందుబాటులోకి తేవడం కోసం జిల్లాకు ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెంలో ఉద్యాన వర్సిటీని.. తిరుపతిలో పశు వైద్య కళాశాలను నెలకొల్పారు. ప్రతిష్ఠాత్మక జాతీయ విద్యా సంస్థ ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ని హైదరాబాద్ సమీపంలో కంది వద్ద ఏర్పాటు చేశారు. బాసర, ఇడుపులపాయ, నూజివీడు వద్ద ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉన్నత చదువులు దక్కేలా చేశారు.
- కడలి పాలవుతున్న నదీ జలాలను ప్రాజెక్టుల ద్వారా మళ్లించి, తెలుగు నేలను సుభిక్షం చేయడానికి జలయజ్ఞం చేపట్టారు. ఒకేసారి పోలవరంతోసహా 86 ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఐదేళ్లలో 23.49 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా 41 ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా దేశ సాగునీటి రంగంలో రికార్డును నెలకొల్పారు.
- కొన్ని ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ సంస్థలు పేదల నుంచి రోజువారీ వడ్డీలు వసూలు చేసే సమయంలో.. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ ప్రవేశపెట్టిన పావలా వడ్డీ పథకం సంచలనం సృష్టించింది. మన రాష్ట్రంలోనే కాదు.. దేశమంతటా పొదుపు సంఘాల (డ్వాక్రా) వ్యవస్థలో విప్లవం తీసుకొచ్చింది.
- పెట్టుబడుల ఆకర్షణలో 2004 నుంచి 2009 వరకు రాష్ట్రం అగ్రగామిగా నిలిచింది. శ్రీసిటీ సెజ్‌తోసహా రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున పరిశ్రమలు ఏర్పాటవడంతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా వచ్చాయి. సుదీర్ఘమైన తీర ప్రాంతాన్ని వినియోగించుకోవడంలో భాగంగా గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులు నిర్మించారు. దాంతో ఎగుమతులు భారీ ఎత్తున పెరిగాయి. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హైదరాబాద్‌ను ప్రపంచ చిత్రపటంలో నిలిపారు. తద్వారా హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమ వేళ్లూనుకునేలా చేశారు. దాంతో ఐటీ ఎగుమతులు 566 శాతం పెరిగాయి.
- 2007-08, 2008-09 సంవత్సరాల్లో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలను ఆర్థిక మాంద్యం అతలాకుతలం చేసింది. ఆ ప్రభావం దేశంపైనా పడింది. కానీ.. వైఎస్సార్ దాని ముప్పు ప్రభావం రాష్ట్రంపై పడకుండా చేయగలిగారు. సాగునీటి ప్రాజెక్టులు, పేదల ఇళ్ల నిర్మాణం, రహదారులు వంటి అభివృద్ధి పనులు చేపట్టి మార్కెట్లోకి ధన ప్రవాహం కొనసాగేలా చేశారు. 2009 ఎన్నికల్లోనూ మరోసారి రాష్ట్రంలో, కేంద్రంలోనూ ఒంటిచేత్తో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు.

సంక్షేమం, అభివృద్ధికి మానవీయతను జోడించిన మహనీయుడు వైఎస్సార్

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా పనిచేసింది ఐదేళ్ల మూడు నెలలే. ఆ కొద్ది కాలంలోనే మనసుండాలే కానీ ప్రజలకు ఎంతో మేలు చేయొచ్చని చేతల్లో చూపించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పొదుపు సంఘాల మహిళలకు పావలా వడ్డీ రుణాలు, అర్హులందరికీ ఇళ్ల వంటి విప్లవాత్మక పథకాలు.. సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, పేదలకు పక్కా ఇళ్ల వంటి పథకాలతో సమగ్రాభివృద్ధి వైపు ఎలా పరుగెత్తించవచ్చో దేశానికే చాటిచెప్పారు. మహానేత మరణించి 15 ఏళ్లవుతున్నా ఇప్పటికీ ప్రజలు నమ్మలేకపోతున్నారు. వైఎస్సార్ అనే పదం వినగానే స్వచ్ఛమైన చిరునవ్వు మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. నమస్తే అక్కయ్యా.. నమస్తే చెల్లెమ్మా.. నమస్తే తమ్ముడూ.. అని ఆప్యాయంగా పిలిచే పిలుపు మన చెవుల్లో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. అందుకే ఆయన చిరస్మరణీయుడు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో 1949 జూలై 8న జన్మించిన వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్య విద్యను అభ్యసించారు. పులివెందులలో ఆస్పత్రి నెలకొల్పి ఒక్క రూపాయికే వైద్యం చేసి రూపాయి డాక్టర్‌గా ప్రజల ప్రేమాభిమానాలు పొందారు. డాక్టర్‌గా ప్రజల నాడి తెలిసిన వైఎస్సార్ 1978లో రాజకీయ అరంగేట్రం నాటి నుంచి 2009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంలో హఠాన్మరణం చెందే వరకూ తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేశారు.

జీవచ్ఛవంలా మారిన కాంగ్రెస్‌కు జీవం

అటు కేంద్రంలో.. ఇటు రాష్ట్రంలో వరుస ఓటములతో 2003 నాటికి కాంగ్రెస్ పార్టీ జీవచ్ఛవంలా మారింది. ఆ దశలో రాష్ట్రంలో పాదయాత్ర చేశారు వైఎస్ రాజశేఖరరెడ్డి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి మండుటెండలో 2003 ఏప్రిల్ 9న ప్రజాప్రస్థానం పాదయాత్రను ప్రారంభించారు. 2003 జూన్ 15న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వద్ద ముగించారు. మండుటెండలో 1,475 కిలోమీటర్ల వైఎస్సార్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తన పాదయాత్రతో కాంగ్రెస్‌కు జీవం పోసి 2004లో ఇటు ఉమ్మడి రాష్ట్రంలోను, అటు కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ, జలయజ్ఞం ప్రాజెక్టులతో, రైతు పథకాలతో వ్యవసాయాన్ని పండగలా మార్చి ప్రజారంజక పాలన అంటే ఏమిటో దేశానికి చూపించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 2004 మే 14న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపై నుంచే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా ఫైలుపై తొలి సంతకం చేసి రైతు రాజ్యానికి పునాది వేశారు. రూ.1,100 కోట్ల వ్యవసాయ విద్యుత్ బకాయిలను మాఫీ చేశారు. 35 లక్షలకు పైగా పంపు సెట్లకు ఉచిత విద్యుత్‌ను అందించారు. రూ.400 కోట్లతో మొదలైన వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ ఆ తర్వాతి ఏడాదికి రూ.6 వేల కోట్లకు చేరినా ఉచిత విద్యుత్ హామీ అమలుపై వెనక్కు తగ్గలేదు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తే విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందేనని ఎగతాళి చేసిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కూడా అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని కొనసాగించాల్సిన పరిస్థితిని కల్పించారు. వైఎస్సార్ స్ఫూర్తితో దేశంలో అనేక రాష్ట్రాలు వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నాయి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించారు. పంట ఎండినా రైతు నష్టపోకూడదనే లక్ష్యంతో పంటల బీమాను అమలు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీని అందించారు. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వంతో పోరాడారు. 2004 నుంచి 2009 మధ్య ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.550 నుంచి రూ.1000 వరకు పెరగడమే అందుకు తార్కాణం.

క్లుప్తంగా...

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే కఠిన చర్యలు

జనసేన నేతలకు మరోసారి స్పష్టం చేసిన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి: చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో కొత్తగా పాలనాపగ్గాలు చేపట్టిన ఎన్డీయే ప్రభుత్వానికి జనసేన శ్రేణులన్నీ వెన్నుదన్నుగా నిలబడాలని, పార్టీకి చెందిన ఏ ఒక్కరూ ప్రభుత్వానికి గానీ, అధికారులకు వ్యతిరేకంగా మాట్లాడవద్దంటూ ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మరోసారి సొంత జనసేన నేతలకు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ నియమనిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీలోని ఎవరు మాట్లాడినా, అధికారుల పని తీరును బలహీనపరిచేలా లేదా ఆధారాల్లేని ఆరోపణలు చేసినా కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా పార్టీ అధ్యక్షుడు ఆదేశించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘించి అధికారిక సమావేశాల్లో పార్టీ నాయకులుగానీ, కార్యకర్తలు గానీ పాల్గొనడం నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని, అలాంటి వారిపైనా చర్యలు తప్పవంటూ పార్టీ హెచ్చరించింది.

'ఎవరెంతో వారికంత' అనే సూత్రాన్ని అమలు చేయండి

సామాజిక న్యాయ పోరాట సమితి డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ అన్ని వర్గాలకు సామాజిక, సమ న్యాయం చేయాలని సామాజిక న్యాయ పోరాట సమితి (ఎస్‌జేఎఫ్) డిమాండ్ చేసింది. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల రిజర్వేషన్లలో సామాజిక అసమానతలను, అన్యాయాన్ని సరిచేయాలని కోరుతూ ఎస్‌జేఎఫ్ రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసిరామ్ యాదవ్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సమగ్ర జనగణన–కులగణన ద్వారా జనాభా ప్రాతిపదికన 'ఎవరెంతో వారికంత' అనే సూత్రాన్ని అమలు చేయాలన్నారు. అన్ని వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. రిజర్వేషన్ విధానంతో నష్టపోతున్న బీసీ, ఎంబీసీ, దళిత క్రైస్తవులు, కాపులు, అగ్రవర్ణ పేదలకు సామాజిక న్యాయం చేయాలని కోరారు.

నూతన కల్లు విధానం రూపొందించాలి



మాట్లాడుతున్న నరసింహమూర్తి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కల్లుగీత వృత్తిని ఆధునికీకరించి కల్లు గీత కుటుంబాలకు ఉపాధి కల్పించేలా నూతన కల్లు విధానాన్ని రూపొందించాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. విజయవాడలో ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని, ఆదరణ పథకం ప్రవేశపెట్టాలని, వృత్తి చేస్తున్న వారందరికీ ద్విచక్ర మోటార్ సైకిల్ ఉచితంగా ఇవ్వాలని కోరారు. తాటి చెట్టుకు రూ.10 పన్ను వసూలు చేసి, చెట్లను నరికివేయకుండా రక్షణ కల్పించాలని, ఆపదలో ఉన్న గీత కార్మికులను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వృత్తిసంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు హామీని అమలు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: టీడీపీ అధికారంలోకి వస్తే వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామంటూ ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ విషయమై సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తమ ప్రతినిధి బృందంతో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రమిచ్చారు. ఆ వివరాలను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. ఇప్పటివరకు దేశంలో వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసింది కేరళ మాత్రమేనన్నారు. కేరళలో వ్యవసాయ కార్మికులకు అన్ని రకాల హక్కులు అమలవుతున్నాయని అదే తరహాలో ఏపీలోనూ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 10న విజయవాడలో చర్చా వేదిక నిర్వహిస్తామని తెలిపారు.

రాజమహేంద్రవరంలో నేడు బీజేపీ సమావేశం

సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం సోమవారం రాజమహేంద్రవరంలో జరగనుంది. ఈ సమావేశంలో మండల స్థాయికి పైబడి రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ పదవుల్లో ఉన్న వారితో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి బీజేపీ అనుబంధ పార్టీ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారని పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలిపింది. ఈ సమావేశానికి జాతీయ పార్టీ తరఫున కేంద్రమంత్రి మురగన్ ముఖ్యఅతిథిగా హాజరవ్వనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ–జనసేనలతో పొత్తు కొనసాగుతున్న నేపథ్యంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకునే దిశగా కార్యాచరణతో పాటు ఇతర రాజకీయ అంశాలపై చర్చిస్తామని బీజేపీ నేతలు చెప్పారు.

పంటల బీమాకు 'పాత'ర!

ఉచితానికి ఉద్వాసన.. పాత పద్ధతి వైపు సర్కారు చూపు



సాక్షి, అమరావతి: ఇన్నాళ్లూ తమపై పైసా భారం పడకుండా కష్టకాలంలో ఆదుకున్న డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు పాతరేసే దిశగా టీడీపీ సర్కారు సన్నద్ధం కావడం అన్నదాతల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. 'సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తాం.. ఏ ఒక్కటీ ఆపే ప్రసక్తే లేదు. ఇంకా మెరుగైన రీతిలో అమలు చేస్తాం' అని ఎన్నికల ప్రచార సభల్లో హామీలిచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఇతర కూటమి నేతలు వాటిని గాలికి వదిలేశారు. రైతులకు మేలు చేసే వ్యవసాయ సలహా మండళ్లను రద్దు చేసిన కూటమి సర్కారు కన్ను తాజాగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంపై పడింది. ఈ – క్రాప్ నమోదు ప్రామాణికంగా నోటిఫై చేసిన ప్రతీ పంటకు, సాగు చేసిన ప్రతీ ఎకరాకు యూనివర్సల్ బీమా కవరేజ్ కల్పిస్తూ ఈ పథకం దేశానికే తలమానికంగా నిలిచింది. అయితే 2019కి ముందు అమలులో ఉన్న పాత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్టు తొలి సమీక్షలో సీఎం చంద్రబాబు చేసిన ప్రకటన రైతన్నల గుండెల్లో గుబులు రేపింది. గత ఐదేళ్లుగా తాము కట్టాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి పైసా భారం లేకుండా ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి బీమా పరిహారాన్ని మరుసటి ఏడాది అదే సీజన్ ప్రారంభానికి ముందే నేరుగా తమ ఖాతాల్లో జమ చేసే పరిస్థితి ఇక ఉండదన్న ఆందోళన వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. టీడీపీ సర్కారు తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకుని ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే ఉద్యమ బాట పట్టక తప్పదని హెచ్చరిస్తున్నాయి.

ఏళ్ల తరబడి ఎదురు చూపులు..

1965లో కేంద్రం తెచ్చిన క్రాప్ ఇన్సూరెన్స్ బిల్లు ఆధారంగా ప్రవేశపెట్టిన మోడల్ ఇన్సూరెన్స్ పథకం వివిధ రూపాలు మార్చుకుని ప్రధాని ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)గా 2016 నుంచి దేశవ్యాప్తంగా అమలవుతోంది. దీని ప్రకారం నోటిఫై చేసిన వ్యవసాయ పంటలకు ఖరీఫ్‌లో 2 శాతం, రబీలో 1.5 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం చొప్పున రైతులు ప్రీమియం చెల్లించగా మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించాయి. అయితే ప్రీమియం భారం అధికంగా ఉండడంతో పాటు అవగాహన లేక పలువురు రైతులు సొంతంగా బీమా చేయించుకునేందుకు ముందుకొచ్చేవారు కాదు. రుణాలు తీసుకునే రైతులకు మాత్రం బ్యాంకులు ప్రీమియం రూపంలో నిర్దేశించిన మొత్తాన్ని మినహాయించుకొని మిగతాది అందచేసేవి. అయితే బీమా చేయించుకున్న వారు సైతం ఎంతొస్తుందో? ఎప్పుడొస్తుందో అంతుబట్టక ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

2014-19 పరిహారం రూ.3,411.20 కోట్లే

చంద్రబాబు గతంలో అధికారంలో ఉన్నప్పుడూ కేంద్ర పథకాలపై ఆధార పడడం మినహా అన్నదాతల సంక్షేమం కోసం తపించిన దాఖలాలు లేవు. 2014–19 మధ్య తొలి రెండేళ్లు వ్యవసాయ ఇన్సూరెన్స్‌స్కీమ్ (ఏఐఎస్), ఆ తర్వాత పీఎంఎఫ్‌బీవై అమలు చేశారు. ప్రీమియం రూపంలో 2014–19 మధ్యలో రైతులు తమ వాటాగా రూ.1249.90 కోట్లు చెల్లిస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.1281 కోట్లు చెల్లించింది. హుద్‌హుద్ లాంటి పెను తుపాన్, కరువు కాటకాలతో రూ.వేల కోట్ల పంటలను కోల్పోయిన రైతులకు 2014–19 మధ్య దక్కిన పరిహారం కేవలం రూ.3,411.20 కోట్లు మాత్రమే.

పైసా భారం పడకుండా..

పాదయాత్ర హామీ మేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 జూలై 8న వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు శ్రీకారం చుట్టారు. తొలి ఏడాది పీఎం ఎఫ్‌బీవైతో అనుసంధానించి అమలు చేశారు. 2019 ఖరీఫ్ సీజన్‌లో రూపాయి ప్రీమియంతో పథకానికి శ్రీకారం చుట్టగా అనంతరం ఆ భారం కూడా రైతులపై పడకూడదన్న ఆలోచనతో ఖరీఫ్–2020 నుంచి నోటిఫైడ్ పంటలకు ఉచితంగా బీమా కవరేజ్ కల్పించారు. క్లెయిమ్‌లు, సెటిల్‌మెంట్లు, చెల్లింపుల బాధ్యతను కూడా ప్రభుత్వం తన భుజాన వేసుకుంది. తొలి ఏడాది రైతుల వాటా (రూ.468 కోట్ల)తో కలిపి ప్రీమియం రూపంలో వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.971 కోట్లు బీమా కంపెనీలకు చెల్లించింది. యూనివర్సల్ కవరేజ్‌కు కేంద్రం ముందుకు రాకపోవడంతో 2020–21, 2021–22 సీజన్లలో పీఎం ఎఫ్‌బీవైతో సంబంధం లేకుండా మొత్తం బీమా పరిహారం ప్రభుత్వమే చెల్లించింది. 2022–23 నుంచి ఫసల్ బీమాతో అనుసంధానించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. వాతావరణ ఆధారిత పంటలకు మాత్రం గత ప్రభుత్వం సొంతంగానే బీమా పరిహారం చెల్లించింది.

ఈ క్రాప్ ప్రామాణికంగా..

ఈ క్రాప్‌తో పాటు ఈ కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి కాగానే గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం వర్తించే నోటిఫై చేసిన పంటలకు (స్టార్) గుర్తుతో ప్రత్యేకంగా తెలియచేస్తూ రైతులకు భౌతిక రసీదు అందచేసింది. 'డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద నోటిఫై చేసిన పంటకు ప్రీమియంను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి పంట బీమా చేసింది' అని అందులో స్పష్టంగా తెలియచేసింది. ఈ జాబితాలను సామాజిక తనిఖీల్లో భాగంగా ఆర్బీకేల్లో ప్రదర్శించి అభ్యంతరాలను పరిష్కరించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా పరిహారం అందచేసింది. ప్రీమియం రూపంలో రైతుల వాటాతో కలిపి 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.3,022.26 కోట్లు కంపెనీలకు చెల్లించింది. 2019–24 మధ్య 1.91 కోట్ల హెక్టార్లకు బీమా కవరేజీ కల్పించగా 2.04 కోట్ల మంది రైతులకు బీమా రక్షణ లభించింది.

రికార్డు స్థాయిలో పరిహారం..

2014–19 మధ్య 30.85 లక్షల మందికి రూ.3411.20 కోట్ల పరిహారం చెల్లిస్తే 2019–24 మధ్య 54.55 లక్షల మందికి రూ.7,802.05 కోట్ల బీమా పరిహారం అందింది. టీడీపీ హయాంలో 6.19 లక్షల మంది రైతులకు చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల బకాయిలు కూడా చెల్లించి గత సర్కారు అండగా నిలిచింది. ఐదేళ్లలో టీడీపీ ప్రభుత్వం చెల్లించిన బీమా మొత్తం కంటే రూ.3,273.64 కోట్ల మేర అదనంగా లబ్ధి చేకూర్చగా 13.81 లక్షల మంది రైతులు అదనంగా ప్రయోజనం పొందారు.

ఏపీ బాటలో పలు రాష్ట్రాలు..

వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని దేశంలోనే అత్యుత్తమ పంటల బీమా పథకంగా కేంద్రం గుర్తించింది. ఇన్నోవేషన్ కేటగిరి కింద ఉత్తమ బీమా పథకంగా ఎంపిక చేసింది. 2023 ఏప్రిల్ 14న కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ అహూజా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందించారు. ఏపీ స్ఫూర్తిగా జాతీయ స్థాయిలో పీఎంఎఫ్‌బీవైలో పలుమార్పులు చేసినట్టుగా కేంద్రం ప్రకటించింది. ఏపీ తరహాలో మిగిలిన రాష్ట్రాలు కూడా అమలు చేయాలని సూచించింది. 2023–24 నుంచి మహారాష్ట్ర, మేఘాలయ, ఒడిశా, పుదుచ్చేరి తదితర రాష్ట్రాలు ఏపీ బాటలోనే రూపాయి ప్రీమియంతో పంటల బీమా అమలుకు శ్రీకారం చుట్టాయి. ఉచిత పంటల బీమా పథకాన్ని కేంద్రం సహా పలు రాష్ట్రాలు ప్రశంసించాయి.

రూ.1,278.80 కోట్ల ప్రీమియం చెల్లింపులకు ఎగనామం..

2023–24 సీజన్‌కు సంబంధించి బీమా కవరేజ్ పరిధిలోకి వచ్చిన అర్హుల జాబితాను గతంలోనే కేంద్రానికి పంపించారు. ఆ మేరకు రైతుల వాటాతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,278.80 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, ప్రభుత్వం మారడంతో ప్రీమియం చెల్లించాల్సిన బాధ్యత టీడీపీ సర్కారుపై ఉంది. అయితే పాత పద్ధతిలోనే పంటల బీమా అమలు చేస్తామని ప్రకటించడం ద్వారా 2023–24 సీజన్ ప్రీమియం చెల్లింపులు జరపవద్దని అధికారులకు సీఎం చంద్రబాబు సంకేతాలిచ్చారు. దీంతో 2023–24 సీజన్‌లో వర్షాభావం, వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు 2024–25 సీజన్ నుంచి రైతులే చెల్లించేలా చూడాలంటూ మౌఖిక ఆదేశాలు ఇవ్వడంతో వారిపై పెనుభారం పడనుంది.

రైతులపై ఏటా రూ.800 కోట్లకుపైగా భారం

ఏ పంటైనా సరే జిల్లాలో కనీసం ఐదువేల ఎకరాల్లో సాగైతేనే నోటిఫై చేస్తారు. నోటిఫై చేసిన పంట పెట్టుబడి ఖర్చులను బట్టి బీమా కంపెనీలు ప్రీమియం నిర్దేశిస్తాయి. ఉదాహరణకు వరికి ఎకరాకు రూ.40 వేలు ఖర్చవుతుంటే కనీసం 8 శాతం అంటే రూ.3,200 చొప్పున ప్రీమియం చెల్లిస్తేనే బీమా కవరేజ్ కల్పిస్తుంది. ఈ మొత్తంలో ఖరీఫ్‌లో అయితే 2 శాతం, రబీలో 1.5 శాతం చొప్పున రైతులు గతంలో చెల్లించగా మిగతాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించేవి. ఈ లెక్కన నోటిఫై పంటలకు రైతులు తమ వాటాగా ఏటా కనీసం రూ.800 కోట్లకు పైగా ప్రీమియం రూపంలో భరించాల్సి ఉంటుంది. బ్యాంకుల నుంచి రుణాలు పొందని కౌలు రైతులు, సన్న, చిన్నకారు రైతులు సొంతంగానే ప్రీమియం చెల్లించాలి. వీరికి అవగాహన కల్పించకపోవడం, ఆర్థిక భారం కారణంగా బీమాకు ముందుకు రావడం లేదు. దీంతో పంట నష్టపోతే విపత్తుల వేళ బీమా పరిహారం అందని దుస్థితి నెలకొంటుంది. వైఎస్సార్ రైతు భరోసాను హడావుడిగా అన్నదాతా సుఖీభవగా మార్చేసి రూ.20 వేలు ఇవ్వకుండా ఇప్పటికే సీజన్‌లో అన్నదాతలను ముంచేసిన టీడీపీ సర్కారు ఇప్పుడు ఉచిత పంటల బీమాను కూడా రద్దు చేసే దిశగా అడుగులు వేయడం పిడుగుపాటుగా మారింది.

2014-19 టీడీపీ హయాంలో బీమా పరిహారం ఇలా..

సీజన్	రైతుల సంఖ్య లక్షల్లో	లబ్ధి రూ.కోట్లలో
2014-15	1.03	132.24
2015-16	4.35	339.7
2016-17	8.70	954.75
2017-18	6.77	720.6
2018-19 (ఖరీఫ్-2018)	10	1263.91
మొత్తం	30.85	3411.20

2014-19 టీడీపీ హయాంలో (తొలి రెండేళ్లు ఏఐఎస్, తర్వాత పీఎంఎఫ్‌బీవై)

ఏడాది	విస్తీర్ణం లక్షల హెక్టార్లు	రైతుల సంఖ్య లక్షల్లో
ఏఐఎస్ కింద ఇలా..		
2014-15	6.40	4.60
2015-16	23.10	17.10
పీఎంఎఫ్‌బీవై కింద..		
2016-17	20.4	17.8
2017-18	24.30	18.20
2018-19	18.60	16.70

2019-24 వైఎస్సార్‌సీపీ హయాంలో బీమా పరిహారం ఇలా

సీజన్	రైతుల సంఖ్య లక్షల్లో	లబ్ధి రూ.కోట్లలో
2014-19 బకాయిలు	6.20	715.80
2019-20	9.50	1,252.20
2020-21	13.00	1,739
2021-22	15.60	2,977.80
2022-23	10.25	1,117.28
మొత్తం	54.55	7,802.08

ఉచిత పంటల బీమాతో ఎంత మేలు అంటే..

ఏడాది	విస్తీర్ణం లక్షల హెక్టార్లు	రైతుల సంఖ్య లక్షల్లో
2019-20	20.10	16.80
2020-21	34.80	35.20
2021-22	37	36.60
2022-23	30.74	37.55
2023-24	28.32	34.70
2023-24(రబీ)	15.42	16.1

రూ.2.75 లక్షల పరిహారం ఇచ్చారు



వైఎస్సార్ ఉచిత పంటల బీమా అన్నదాతలను ఎంతో ఆదుకుంది. నోటిఫై చేసిన పంటలు ఈ క్రాప్‌లో నమోదైతే చాలు బీమా వర్తింపచేశారు. మాకు 20 ఎకరాల భూమి ఉంది. పత్తి, శనగ, ఉల్లి సాగు చేస్తుంటాం. 2019–20లో ఒక్క ఉల్లి పంటకే రూ.1.10 లక్షల బీమా పరిహారం వచ్చింది. ఆ తర్వాత రూ.70 వేలు, రూ.42 వేలు, రూ.53 వేలు చొప్పున వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రూ.2.75 లక్షల బీమా పరిహారం అందింది. రూపాయి ప్రీమియం చెల్లించకపోయినా ఇంత భారీగా పరిహారం దక్కటం ఎంతో ఊరటనిచ్చింది. అన్నదాతలకు ఎంతగానో ఆసరాగా నిలిచిన ఈ ఉచిత పంటల బీమాను కొనసాగించాలి. 2019కి ముందు ఉన్న పంటల బీమా పథకాన్ని కొనసాగిస్తే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది.

–గౌర మహేశ్వరరెడ్డి, ఏ.గోకులపాడు, కర్నూలు జిల్లా

పాత విధానం సరికాదు..



30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. 2021 ఖరీఫ్‌లో అరటి పంట దెబ్బతినడంతో రూ.90 వేల పంటల బీమా పరిహారం నేరుగా నా ఖాతాలో జమ చేశారు. దళారుల ప్రమేయం లేకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. ఐదేళ్లు పైసా కూడా మేం ప్రీమియం చెల్లించలేదు. మా వాటా కూడా ప్రభుత్వమే కట్టింది. చంద్రబాబు ప్రభుత్వం పాత విధానంలో పంటల బీమా అమలు చేస్తామని చెప్పడం సరికాదు.

– గనివాడ సన్యాసినాయుడు, పెదమదుపాడ, విజయనగరం జిల్లా

రైతులు బీమా చేయించుకోలేరు



2019కు ముందు టీడీపీ హయాంలో రైతులు బీమా చేయించుకుంటేనే నష్టపరిహారం వర్తించేది. రైతులలో చాలా మంది నిరక్షరాస్యులు ఉన్నందున అవగాహన లేక నష్టపోయే ప్రమాదం ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచిత పంటల బీమాను అమలు చేసింది. 2021లో వర్షాలకు 80 సెంట్లు పొలంలో నష్టపోతే నేరుగా రూ.5,100 పరిహారం ఇచ్చారు.

– డి. ప్రభాకర్, తాటితూరు, భీమిలి మండలం

రూ.3.80 లక్షల పరిహారం వచ్చింది



నేను పైసా ప్రీమియం చెల్లించకపోయినా 2021లో ఖరీఫ్‌లో పంట నష్టపోతే రూ.3.80 లక్షల బీమా పరిహారం జమైంది. గతంలో ప్రీమియం చెల్లించిన తర్వాత కూడా పరిహారం కోసం అధికారులు, కంపెనీల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ఎంతగానో ఉపయోగపడింది. ఈ పథకాన్ని కొనసాగించాలి.

– వీరపురం భీమేష్, గడేకల్లు, అనంతపురం జిల్లా

రైతుల తరపున ఉద్యమిస్తాం..



రైతులపై భారం పడకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాల్సిందే. పాత పద్ధతిలో పంటల బీమా అమలు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించటాన్ని ఖండిస్తున్నాం. పెరిగిన పెట్టుబడి ఖర్చులకు తోడు బీమా ప్రీమియం రైతులకు తలకు మించిన భారమవుతుంది. ప్రీమియం చెల్లించలేక బీమాకు మెజార్టీ రైతులు దూరమవుతారు. ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించకుంటే ఉద్యమిస్తాం.

– కె.ప్రభాకరరెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

పాత పద్ధతితో తీవ్ర నష్టం



గతంలో క్రాప్ లోన్ ఆధారంగా రైతులు సాగు చేసిన పంటలకు కాకుండా ఇష్టానుసారంగా ఇన్సురెన్స్ ఇచ్చేవారు. ఐదేళ్లుగా ఉచిత పంటల బీమా అమలు చేయడం వలన పైసా ప్రీమియం చెల్లించాల్సిన పని లేకుండా సాగు చేసిన పంటకు బీమా పరిహారం నేరుగా అందింది. ఈ పథకాన్ని కొనసాగించాలి. పాత పద్ధతితో తీవ్రంగా నష్టపోతాం.

– ఎస్.రాజేశ్వరరెడ్డి, సింహాద్రిపురం, వైఎస్సార్ జిల్లా

కాలయాపనకే సీఎంల సమావేశం

- కేంద్రం మధ్యవర్తిత్వంతోనే విభజన హామీలపై చర్చ జరగాలి
- సీఎంల సమావేశానికి పవన్‌ను ఎందుకు పిలవలేదు?: మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్



రాజమహేంద్రవరం సిటీ: విభజన హామీల అమలు కోసం తెలంగాణ, ఏపీ సీఎంలు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశం కాలయాపనకే అన్నట్టు ముగిసిందని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఎద్దేవా చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ మధ్యవర్తిత్వం ద్వారానే విభజన హామీలపై చర్చించాలని సూచించారు. ఉభయ రాష్ట్రాల చీఫ్ సెక్రటరీల కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తామని, రెండోసారి మంత్రుల కమిటీ ఏర్పాటవుతుందని అంటున్నారని.. మూడోసారి సీఎంలు కూర్చొని చర్చిస్తారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీలా బేడీ కమిటీలో ఉభయ రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు విభజన హామీలపై పలుమార్లు చర్చించినా వాటిని గాలికొదిలేసి మళ్లీ సున్నా స్థాయి నుంచి కమిటీలు వేస్తామనడం తగదన్నారు. కేంద్రం జోక్యం లేకుండా రెండు రాష్ట్రాల సీఎంలు విభజన హామీలకు సంబంధించి వాటాలు ఎలా పంచుకుంటారో అర్థం కావడం లేదన్నారు. విభజన హామీలపై కూర్చున్న సీఎంలు రవాణా, డ్రగ్స్ గురించి పరస్పరం అవగాహన చేసుకున్నారని ఎద్దేవా చేశారు. దీనిని బట్టి తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం కూర్చున్నారనే విషయం అందరికీ అర్థమవుతోందన్నారు. విభజన తర్వాత తెలంగాణ బాగుపడిన విషయం అందరికీ తెలుసని, షెడ్యూల్ 9, 10కి సంబంధించి వందకు పైగా ఆస్తులు ఏపీకి రావాలని, వాటి విలువ రూ.1.50 లక్షల కోట్లు అని చెప్పారు. నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కేంద్ర హోం మంత్రి అధ్యక్షతన దక్షిణాది రాష్ట్రాల సమావేశం జరిగిందని, ఆ సందర్భంగా ఏపీకి జరుగుతున్న అన్యాయంపై మాట్లాడిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం కమిటీ వేసిందని గుర్తు చేశారు. ఈ కమిటీ ఉభయ రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో ఢిల్లీలో 14 సార్లు చర్చించిందని చెప్పారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీఎంల సమావేశంలో పాల్గొన్నారని, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఎందుకు ఆహ్వానించలేదో అర్థం కావడం లేదని భరత్‌రామ్ అన్నారు. ఎన్డీఏ అధికారంలోకి రావడానికి కారణమైన పవన్‌ను సమావేశానికి తీసుకెళ్లి ఉంటే ఇంకా బాగుండేదన్నారు.

పేరుకే ఉచిత ఇసుక

టీడీపీ నేతలు సొమ్ము చేసుకోవడానికే ఉచిత ఇసుక పాలసీని తెచ్చారని భరత్‌రామ్ ఆరోపించారు. రాజ్యాంగంపై ఒట్టు వేసిన రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఎన్ని కోట్లకు ఇసుక అమ్ముకున్నారని ప్రశ్నించారు. లారీ ఇసుక రూ.15 వేలకు, విశాఖకు రూ.30 వేల వరకూ వసూలు చేస్తున్నారని చెప్పారు. దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగొద్దని సిటీ ఎమ్మెల్యే అంటున్నారని, తన నీతి, నిజాయతీ, సచ్ఛీలతను నిరూపించుకునేందుకే దేవుడిపై ప్రమాణం చేయడానికి సవాల్ చేశానని అన్నారు. ఎమ్మెల్యే నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. శివాజీ అనే వ్యక్తి నెల 10 రోజులు ముందు మాత్రమే తమ వద్దకు వచ్చాడని, ఎన్నికలకు 6 నెలల ముందు తమ వద్దకు వచ్చినట్లు పోలీసులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను సవరించుకోవాలని కోరారు. ఎన్నికలకు ముందు ఒక్కొక్కరు 100 సార్లు ఫోన్ చేసుకుంటారని.. ఆధారాలుంటే బయట పెట్టాలని భరత్‌రామ్ సవాల్ చేశారు.

చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు

- రాష్ట్రానికి హోదా సాధించాలి
- సీపీఐ నేతలు నారాయణ, రామకృష్ణ



అనంతపురం అర్బన్: 'విభజన హామీలు అమలు చేయకుండా, ప్రత్యేక హోదా ఇవ్వకుండా పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసింది. అలాంటి ప్రమాదకర బీజేపీని చంద్రబాబు రెండోసారి రాష్ట్రంలోకి తెప్పించారు. దీనికి ఆయన మూల్యం చెల్లించుకోక తప్పదు'అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. అనంతపురంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ రెండు ఊతకర్రల సహాయంతో ప్రభుత్వాన్ని నడిపిస్తోందని అయినా మోదీలో అహం తగ్గలేదన్నారు. దేశంలో ఇప్పుడు బలమైన ప్రతిపక్షముందని, మోదీ ఆటలు సాగనివ్వబోమన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు ప్రధాని, కేంద్ర మంత్రులతో అమరావతికి రింగురోడ్డు, బైపాస్, ఫ్లైఓవర్ వంటివాటిని అడిగినట్లు తెలిసిందన్నారు. వాటితో పాటుగా హోదా, వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్‌లను కూడా సాధించాలని సూచించారు. ఆగస్టు 15న సందర్భంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రామకృష్ణ సీఎంకి రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు.

హోదా వదులుకుంటే రాష్ట్రానికి తీవ్ర నష్టం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదాను వదులుకుంటే రాష్ట్రానికి తీవ్ర నష్టమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. సీఎం చంద్రబాబు ఢిల్లీలో ప్రధాని, ఇతర మంత్రులను కలిసిన తర్వాత ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ రాష్ట్రానికి హోదా సమస్యకు అంత ప్రాధాన్యత లేదని చెప్పడం సరికాదని శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. రాష్ట్ర ఆర్థిక సమస్యలను ప్రత్యేక హోదాతో ముడిపెట్టడం ఆక్షేపణీయమన్నారు. హోదా ఆంధ్ర ప్రజల హక్కు అని, ఇది రాష్ట్రాభివృద్ధితో ముడిపడిన అంశమన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా మన బకాయిలను చెల్లించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, రాష్ట్రానికి ఆర్థిక సాయం చేయడానికి హోదాతో ముడిపెట్టడం సరికాదన్నారు.

ఇంటర్ బోర్డు చొరవతో దివ్యాంగ విద్యార్థులకు మేలు

25 మందికి ఐఐటీ, ఎన్‌ఐటీల్లో సీట్లు పొందే అవకాశం



సాక్షి, అమరావతి: సాంకేతిక కారణాలతో ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు వచ్చినా చేరలేకపోయిన దివ్యాంగ విద్యార్థులకు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు సకాలంతో స్పందించడంతో వారికి మేలు జరిగింది. రాష్ట్రంలో ఇంటర్ చదివే దివ్యాంగ విద్యార్థులు పరీక్షల్లో ఒక సబ్జెక్టు నుంచి మినహాయింపు ఉంది. దీంతో విద్యార్థులు ఇంగ్లిష్, తెలుగు, సంస్కృతం భాషల్లో (లాంగ్వేజ్ పేపర్) రాయడం లేదు. దీంతో విద్యార్థులు నాలుగు సబ్జెక్టులకే పరీక్షలు రాస్తున్నారు. అయితే, ఈ ఏడాది మద్రాస్ ఐఐటీ ప్రవేశాలకు ఐదు సబ్జెక్టుల విధానం తప్పనిసరి చేసింది. దీంతో ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించడంతో పాటు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోను ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థులు మద్రాస్ ఐఐటీతో పాటు పలు ఎన్ఐటీల్లోను సీట్లు సాధించారు. కానీ కౌన్సెలింగ్‌లో మార్కుల లిస్టును పరిశీలించిన అధికారులు 'నాలుగు' సబ్జెక్టులకే మార్కులుండటంతో వారి ప్రవేశాలను తిరస్కరించే పరిస్థితి తలెత్తింది. దీంతో గత నెలలో పలువురు దివ్యాంగ విద్యార్థులు తాడేపల్లిలోని ఇంటర్ విద్యా మండలికి చేరుకుని న్యాయం చేయాలని అభ్యర్థించారు. దీనిపై వెంటనే స్పందించిన ఇంటర్ బోర్డు అధికారులు మద్రాస్ ఐఐటీ అధికారులను సంప్రదించి, ఏపీలో దివ్యాంగ విద్యార్థులకు కల్పిస్తున్న సబ్జెక్టు వెసులుబాటును వివరించారు. అయితే, ప్రభుత్వం నుంచి జీవో ఇస్తే చేర్చుకుంటామని చెప్పడంతో ఇంటర్ బోర్డు అధికారులు మార్గాలను అన్వేషించారు. 1992లో పదో తరగతి దివ్యాంగ విద్యార్థుల కోసం జారీ చేసిన జీవో నం.1161 ప్రకారం ఇంటర్ దివ్యాంగ విద్యార్థులకు మేలు చేయవచ్చని ప్రభుత్వానికి ఫైల్ పంపారు. నాలుగు పేపర్లలో వచ్చిన మార్కుల సరాసరి ఆధారంగా పరీక్ష రాయని సబ్జెక్టుకు మార్కులు కేటాయించవచ్చని పేర్కొన్నారు. దీనిపై ఇటీవల పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ జీవో నం .255 ఇవ్వడంతో దాదాపు 25 మంది దివ్యాంగ విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు పొందే అవకాశం దక్కింది.



జీవితం అనేది ఏమిటో ఎవరూ ఎప్పటికీ కనుక్కోలేరు. అది పెద్ద విషయం కాదు. ప్రపంచాన్ని అన్వేషించండి. లోతుగా వెళ్లినకొద్దీ దాదాపుగా ప్రతిదీ ఆసక్తికరంగానే ఉంటుంది.

– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 8 జూలై 2024

నూరేళ్ల గురుదత్

'నువ్వు కమ్యూనిస్టువా?'... 'కాదు. కార్టూనిస్టుని'.... 'నీకు మంచి జీవితం తెలియక ఈ దిక్కుమాలిన కొంపను ఇల్లు అనుకుంటున్నావు'... 'దాన్దేముంది... మీకు ఫుట్‌పాత్‌ల మీద బతుకుతున్న లక్షల మంది గురించి తెలియదు. నేను వాళ్ల కంటే మెరుగే'... 'నువ్వు నౌకరువి! గుర్తుంచుకో'... 'నౌకర్‌నైతే? తల ఎత్తి మాట్లాడకూడదా?'... గురుదత్ సినిమాల్లోని డైలాగ్స్ ఇవి.

దేశానికి స్వతంత్రం వచ్చి గొప్ప జీవితాన్ని వాగ్దానం చేశాక కూడా, ఎక్కడా ఆ వాగ్దానం నెరవేరే దారులు లేక, ఉద్యోగ ఉపాధులు లేక, పేదరికం పీడిస్తూ, మనుషుల్లో స్వార్థం, రాక్షసత్వం దద్దరిల్లుతున్న కాలంలో 'ఇన్‌సాన్ కా నహీ కహీ నామ్ ఔర్ నిషాన్' అనిపించిన ఒక భావుకుడు, దయార్ద్ర హృదయుడు, ఎదుటి వారి కళ్లల్లో నాలుగు కన్నీటి చుక్కలు చూడగానే సొమ్మసిల్లే దుర్బల మానసిక స్వరూపుడు గురుదత్ వచ్చి ఆడిన కళాత్మక నిష్ఠూరమే అతడి సినిమాలు. స్వతంత్రం వచ్చిన పదేళ్లకు 'ప్యాసా' తీసి 'జిన్హే నాజ్ హై హింద్ పర్ ఓ కహా హై' అని ప్రశ్నించాడు. స్వతంత్రం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా ఏదో ఒక పాదధూళి దొరికితే కష్టాల నుంచి బయట పడదామనుకునే కోట్లాది నిరుపేదలను చూసి నేటికీ అనవలసిందే కదా– 'దేశాన్ని చూసి గర్వపడే పెద్దలారా... మీరెక్కడ?'

కలకత్తాలో బాల్యం గడిపిన గురుదత్ ఇంటెదురు ఖాళీ జాగాలో జరిగే తిరునాళ్లలోని పేద కళాకారుల ఆటపాటలతో స్ఫూర్తి పొందాడు. అతనూ డాన్స్ చేస్తే ఆ సుకుమార రూపం అద్భుతంగా మెలికలు తిరిగేది. డాన్స్ అతణ్ణి నాటి ప్రఖ్యాత డాన్సర్ ఉదయ్‌శంకర్ దగ్గరకు చేర్చింది. ఆ తర్వాత పూణేకు! అక్కడ ప్రభాత్ థియేటర్‌లో డాన్స్‌మాస్టర్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా అన్నింటికీ మించి దేవ్ ఆనంద్ స్నేహితుడిగా దారి మొదలెట్టాడు. బెంగాల్ పురోగామి ధోరణి, చదివిన పుస్తకాలతో ఏర్పరుచుకున్న బౌద్ధిక విమర్శ కళలో ఏం చెప్పాలో తెలిపాయి. అయితే సినిమా వ్యాపారకళ. వ్యాపారాన్నీ, కళనూ, ఆదర్శాన్నీ కలిపి నడిపించడం కష్టమైన పని. కాని ఆ పనిని గొప్పగా చేయగలిగిన జీనియస్ గురుదత్. అతనికి ముందు సినిమాల్లో డైలాగ్ ఉంది. గురుదత్ వచ్చి... ఆ డైలాగ్ చెప్పే సందర్భంలో తెర కవిత్వాన్ని చిందడం చూపగలిగాడు. అతనికి ముందు సినిమాల్లో వెలుతురూ చీకటీ ఉంది. గురుదత్ వచ్చి... వెలుగునీడల గాఢ పెనవేతను తెరపై నిలిపాడు. అతనికి ముందు సినిమాల్లో పాత్రలున్నాయి. గురుదత్ వచ్చి ఆ పాత్రల ప్రాంతం, మాట, నడత నిక్కచ్చి చేశాడు. 'ఆర్ పార్' (1954)తో ఈ ముద్ర మొదలైంది. 'మిస్టర్ అండ్ మిసెస్ 55' (1955), 'ప్యాసా' (1957), 'కాగజ్ కే ఫూల్' (1959), 'చౌద్‌వీ కా చాంద్' (1960), 'సాహిబ్ బీబీ ఔర్ గులామ్' (1962)ల వరకూ ఇదే ధోరణి కొనసాగింది. గాయని షంషాద్ బేగం అంది– 'ఏ సినిమా తీసినా నిజాయితీతో తీశాడు. తప్పుడుతనంతో ఒక్కటీ తీయలేదు'.

'ప్యాసా' క్లయిమాక్స్‌లో కవి పాత్రలో ఉన్న గురుదత్ పునరుత్థానం చెందుతాడు. సినిమాలో అతడు మరణించాడని జనం భావించాకే గుర్తింపు పొందుతాడు. నిజజీవితంలో కూడా అదే జరిగింది. పెద్ద హీరోల, దర్శకుల సినిమాల మధ్యలో... గురుదత్ జీవించి ఉండగా పేరు రాలేదు. మరణించాక కూడా రాలేదు. 1980లలో విదేశాలలో అతడి సినిమాలు ప్రదర్శింపబడి ప్రశంసలు దక్కాకే గురుదత్ పేరుకు ఉన్న మసి తొలిగింది. రాజ్‌కపూర్ 'కాగజ్ కే ఫూల్' చూసి 'ఇది కాలం కంటే ముందే తీశాడు. రాబోయే తరాలే దీనిని పూజిస్తాయి' అన్నాడు. అదే జరిగింది. నేడా సినిమా ప్రపంచంలోని ఎనిమిది యూనివర్సిటీల్లో పాఠ్యాంశంగా ఉంది.

'80 శాతం నటన నటీనటుల కళ్లతోనే పూర్తవుతుంది. మనం మనిషి కళ్లల్లో చూస్తాం. నటన కూడా అక్కడే తెలియాలి' అనేవాడు గురుదత్. అతని సినిమాల్లో టైట్ క్లోజప్స్, కళ్లు చేసే అభినయం పాత్రలను ప్రేక్షకులతో కనెక్ట్ చేస్తాయి. తీయబోయే పాట ఎలా ఉంటుందో ముందే తెలుసు కనుక రికార్డింగ్ సమయంలో ఆశా భోంస్లే ఎదురుగా నిలబడి గురుదత్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ ఉంటే ఆమె వాటికి తగినట్టుగా ఒయ్యారాలు పోతూ పాడిందట. 'భవరా బడా నాదాన్ హై' వినండి తెలుస్తుంది. గురుదత్ మన తెలుగు వహీదా రెహమాన్‌ను స్టార్‌ని చేశాడు. బద్రుద్దీన్ అనే బస్ కండక్టర్‌ని జానీవాకర్ అనే స్టార్ కమెడియన్‌ని చేశాడు. ఎస్.డి.బర్మన్, ఓపి నయ్యర్‌లతో సాహిర్ లుధియాన్వీ, మజ్రూ సుల్తాన్‌పురి, కైఫీ ఆజ్మీలతో అత్యుత్తమమైన పాటలను ఇచ్చాడు. సినిమాటోగ్రాఫర్ వి.కె.మూర్తి, రచయిత అబ్రార్ అల్వీల గొప్పతనం చాటాడు.

వసంత కుమార్ పదుకోన్ అలియాస్ గురుదత్ జూలై 9, 1925న జన్మించి కేవలం 39 సంవత్సరాలు జీవించాడు. 14 ఏళ్ల కెరీర్‌లో గొప్ప గొప్ప క్లాసిక్స్ తీశాడు. గాయని గీతాదత్‌ను వివాహం చేసుకుని, వహీదా రెహమాన్ సాన్నిహిత్యం కోరి ఛిద్ర గృహజీవనం సాగించాడు. కాగితపు పూలకే అందలం దక్కే సంఘనీతికి కలత చెంది అర్ధంతరంగా జీవితం నుంచి నిష్క్రమించాడు.

రేపటి నుంచి అతని శత జయంతి సంవత్సరం మొదలు. 'ప్యాసా' క్లయిమాక్స్‌లో 'మనిషి నుంచి మనిషితనాన్ని లాక్కునే సమాజం మీదే నా ఫిర్యాదు' అంటాడు గురుదత్. ఆ ఫిర్యాదు అవసరం మరింతగా పెరిగిన రోజులివి. గురుదత్‌ను పునర్ దర్శించాల్సిన సందర్భం. అవును. మెడలో ముళ్లహారం పడినా ముందుకేగా నడక.

హమ్‌నెతో జబ్ కలియా మాంగీ కాంటోంకా హార్ మిలా
జానే ఓ కైసే లోగ్ థే జిన్ కే ప్యార్ కో ప్యార్ మిలా...

మహోన్నత నాయకత్వం

సందర్భం



కొప్పోలు ప్రభాకర్ రెడ్డి

విలక్షణ నాయకుడు వై.ఎస్.ఆర్. విపక్షాలు సైతం కొనియాడిన వ్యక్తిత్వం ఆయనది! ఇచ్చిన మాట తప్పని నైజం. 'పేదల కోసమే పాలన' అన్నది ఆయన సిద్ధాంతం. అన్నదాతకు ఆపద్బాంధవుడు. విద్య, వైద్యం, ఉద్యోగం అందరికీ అందుబాటులోకి తెచ్చి, అసమానతలను రూపుమాపిన క్రాంతదర్శి. జన జీవితంతో ఆయన మమేకం అయ్యారు. జయాపజయాలకు అతీతంగా పాలన సాగించారు. ఏం చేసినా అది ప్రజల కోసమే! ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా అది ప్రజా సంక్షేమం కోసమే! తెలుగు నేలను సస్యశ్యామలం చేయటానికి జలయజ్ఞం తలపెట్టారు. విశ్వసనీయతే తన సైన్యంగా విమర్శలను తిప్పికొట్టారు. తెలుగు ప్రజల గుండె చప్పుడుగా ఆదర్శప్రాయుడైన ప్రజా నాయకుడిగా నిలబడ్డారు. నేడు ఆయన జయంతి.



అధికారం కోసం వెన్నుపోటుకైనా వెనుకాడని నేతలుండొచ్చు. పదవి కోసం ఎలాంటి వంచనకైనా నిస్సిగ్గుగా సిద్ధపడే పార్టీలుండొచ్చు. కానీ జయాపజయాలతో సంబంధం లేకుండా, జన జీవితంతోనే పెనవేసుకున్న నాయకత్వాన్ని వైఎస్ రక్తంలోనే చూస్తాం. అందుకే వైఎస్ఆర్ అనే మూడక్షరాలు తెలుగువాడి గుండె గొంతుకయ్యాయి. దశాబ్దకాలం దాటినా వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలోని పున్నమి వెలుగులే పేదవాడి చిరునవ్వుగా మారాయి. ఎంత పెద్ద ఆపదొచ్చినా పెద్దాయన ఉన్నాడనేది వైఎస్ పాలనలో ప్రజలకు ఉన్న నమ్మకం. మాటిస్తే మడమ తిప్పడనేది వైఎస్‌పై జనానికి ఉన్న విశ్వాసం. మేలు చేసేటప్పుడు వైఎస్ రాజకీయాలు చేయడనేది విపక్షాలే ఒప్పుకున్న నిజం. ఓ బ్యూరోక్రాట్‌గా నేను ఆయన్ని దగ్గర్నుంచీ చూశాను. ప్రజల కోసమే బతికిన విలక్షణ నాయకుడే వైఎస్ఆర్‌లో నాకు కన్పించాడు. కార్యకర్తలే కుటుంబం అనుకున్న గొప్ప వ్యక్తిత్వం వైఎస్‌లోనే చూశాను. దశాబ్దాల రాజకీయ అనుభవం కావచ్చేమో... ప్రజలకు ఏం కావాలో నిక్కచ్చిగా నిర్ణయించే సామర్థ్యం వైఎస్‌కే సొంతం. ఆయన పాలనలో ఎన్నో ఘటనలు... ఇంకెన్నో జ్ఞాపకాలు... మరెన్నో మరపురాని ఘట్టాలు..!

విన్నాడు... ఉన్నానని ధైర్యమిచ్చాడు!

పాదయాత్ర వైఎస్‌ను పూర్తిగా ప్రజల పక్షానికి చేర్చింది. ఊరూ వాడా జనం గుండె చప్పుళ్ళు విన్నాడు. అప్పుడే 'నేనున్నా'ననే భరోసా ఇచ్చాడు. వాళ్ళ కోసం ఏమైనా చేయాలనే పట్టుదల ఆయనలో బహుశా అప్పుడే మొదలైందేమో! పాలనలో అది స్పష్టంగా కన్పించింది. పేదవాడికి పెద్ద జబ్బొస్తే ఊపిరి పోవడమే వైఎస్ వచ్చే నాటికి ఉన్న పరిస్థితి. ముద్ద పెట్టే పొలం, తలదాచుకునే ఇల్లు అమ్మేసి వైద్యం చేయించుకునే దయనీయ పరిస్థితి అది. ఇది వైఎస్ మనసును చలించేలా చేసింది. సీఎంగా పగ్గాలు చేపట్టాక ఈ పరిస్థితే ఉండకూడదని ఆశించారు. చిన్న అర్జీ తీసుకొస్తే చాలు ఎన్ని లక్షలైనా వైద్యం కోసం ఇవ్వాలని ఆదేశించారు. ఇలా రోజుకు రూ. 1.20 కోట్లు ఖర్చయ్యేది. ఇదంతా ఖజానాకు భారం అని బ్యూరోక్రాట్స్ చెప్పబోతే వారించారాయన. 'పేదవాడి ఆపద తీర్చలేకపోతే ఎందుకయ్యా? బేవరేజ్ మీద సెస్ 1 నుంచి 2 శాతానికి పెంచితే సరిపోదా?' అంటూ తేలికగా చెప్పేవారు. పనుల్లో బిజీగా ఉండి, రాత్రి 8 గంటలకు ఇంటికొచ్చినా.. 'సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులన్నీ క్లియర్ అయ్యాయా?' అని అడిగేవారు. పేదవాడిపై ఇంత ప్రేమ ఎంతమందికి ఉంటుంది? గ్రేట్ అన్పించేది. ఇలా ఎంతకాలం సీఎం ఆఫీసుకు పేదవాళ్ళు అర్జీలు పట్టుకుని రావాలి? శాశ్వత పరిష్కారం లేదా? వైఎస్ వేసిన ఈ ప్రశ్నల్లోంచే 'ఆరోగ్య శ్రీ' పథకం ఆవిర్భవించింది. దీనిపైనా విపక్షాలు విమర్శలు చేశాయి. విషయం ఏమిటంటే విమర్శించిన విపక్ష నేతలే ఈ పథకం ద్వారా లబ్ధి పొందడం! వాళ్ళే వైఎస్ తమకు ప్రాణ భిక్ష పెట్టారని చెప్పటం!

తప్పు చేయను... ఏం చేసినా మీ కోసమే!

ఇది వైఎస్ గట్టిగా నమ్మిన సిద్ధాంతం. జలయజ్ఞం పేరుతో భారీగా సాగునీటి ప్రాజెక్టులు చేపట్టారు. ప్రతీ ప్రాజెక్టుపైనా విపక్షాలు రాద్ధాంతం చేశాయి. ఈ నేపథ్యంలో ఆయన అనుసరించిన విధానం విపక్షాల నోటికి తాళం వేసింది. ప్రతీ ప్రాజెక్టు దగ్గరకు విపక్ష నేతలను పిలిపించి, వాస్తవాలు అర్థమయ్యేలా చెప్పే ఏర్పాటు చేయడం వైఎస్ విజ్ఞతకు నిలువుటద్దం. ''నేను తప్పు చేయనయ్యా... ఏం చేసినా ప్రజలకోసమేనయ్యా...'' అని వైఎస్ చెప్పిన ఈ మాటలను ప్రజలు విశ్వసించారు. కాలగర్భంలో కలిసిన పోలవరం ప్రాజెక్టుకు ఫౌండేషన్ వేసినా... పోతిరెడ్డిపాడుతో వరద జలాలు వాడుకునే ప్రయత్నం చేసినా ఆయనకు ప్రజాభిష్టమే లభించింది. ప్రాణహిత ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినప్పుడు 'ఇక మిమ్మల్ని విమర్శించలేను' అంటూ జి. వెంకటస్వామి కృతజ్ఞతా పూర్వకంగా అనడం ఇప్పటికీ చాలామంది గుర్తు చేస్తారు. ఒక ప్రాంతం కాదు... ఒక పార్టీ కాదు... ప్రజలకు ఉపయోగపడేది ఏదైనా చేసి తీరాల్సిందే అనేది వైఎస్ సిద్ధాంతం. అద్భుతమైన తెలివితేటలుండీ ఆర్థిక ఇబ్బందులతో చదవలేని పేదలకు ఫీజు రీ–ఎంబర్స్‌మెంట్ తీసుకొచ్చిన వైఎస్ వల్ల... డాక్టర్లు, ఇంజనీర్లు అయిన పేదవాళ్ళున్నారు. అలా కొత్త వెలుగులు విరజిమ్ముతున్న జీవితాలు ఎన్నో! పేదవాడి నోటికాడికి ముద్ద చేర్చాలన్న లక్ష్యంతో రూ. 5.30 కిలో బియ్యం ధరను రూ. 2కు తగ్గించాలని భావించారు. దీన్ని బ్యూరోక్రాట్స్ వ్యతిరేకించారు. ''మీ అభ్యంతరాలు మీరు చెప్పండి... కానీ ఇది అమలు చేయడం నా బాధ్యత'' అంటూ... నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడ్డ గొప్ప వ్యక్తి వైఎస్ అనడం అతిశయోక్తేమీ కాదు.

తిరుగులేని నిర్ణయాలు

వైఎస్ సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు అంతర్జాతీయ పరిణామాల వల్ల మిర్చి ధర ఒక్కసారిగా పడిపోయింది. ఆ సమయంలో మిర్చి రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. జిల్లాల నుంచి అందిన ఈ సమాచారంతో వైఎస్ అప్పటికప్పుడే అధికారులను సమావేశపర్చారు. మార్కెట్లో రూ. 800 క్వింటాలున్న మిర్చిని, రూ.1500కు కొనాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నిర్ణయంతో కొన్ని వేల మంది మిర్చి రైతుల కళ్ళల్లో ఆనందం చూశాం. ఇలాంటిదే మరో ఘటన. నిజామాబాద్‌లో రైతులు పండించే ఎర్ర జొన్నలు పంజాబ్, హర్యానాలకు సరఫరా అవుతాయి. వీటిని సేకరించే దళారులకు కేజీకి రూ. 12 వస్తే, రైతుకు వచ్చేది రూ. 4. రైతులకు ఎక్కువ ధర చెల్లించే ఓ దళారికి అవసరమైన బ్యాంకు లోన్ ఇప్పించడంలో అధికారులు కాదన్నా, వైఎస్ఆర్ నిర్ణయం తీసుకుని రైతులకు మేలు చేయడాన్ని ఇప్పటికీ అక్కడి రైతులు మరిచిపోరు. మరొక సందర్భం – వైఎస్ఆర్ హయాంలో దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరిగాయి. ప్రతీ సిలిండర్‌కు రూ. 50 సబ్సిడీ ప్రకటించారు. రూ. 50 సబ్సిడీ ఇవ్వడం మామూలు విషయమేమీ కాదు. ఆర్థిక భారం పడుతుందని అధికారులు, ఆర్థిక మంత్రి చెప్పినా 'ప్రతీ ఇంట్లో మేలు జరుగుతుంది కదా' అని తన నిర్ణయంతో ముందుకు వెళ్లారు వైఎస్ఆర్. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వేసేప్పుడు స్వపక్షం నుంచే అనేక రకాల ఒత్తిడి వచ్చింది. ఇవేవీ లెక్క చేయలేదు. 150 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును అంత ధైర్యంగా చేపట్టడం వల్ల రాజధాని రూపురేఖలే మారాయి. హైదరాబాద్ విమానాశ్రయం పరిశీలనకు వెళ్ళినప్పుడు ఓ ముఖ్య విషయం ఆయన దృష్టికి వచ్చింది. విమానాల హబ్ ఏర్పాటు వల్ల అనేక రకాల అభివృద్ధి ఉంటుంది, దీనికి టాక్స్‌ను 14 నుంచి ఒక్క శాతానికి తగ్గించాలన్న విజ్ఞప్తి అది. అప్పటికప్పుడే ఆయన దానిపై అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల విమానాశ్రయం ఆర్థిక పురోగతే మారింది.

విశ్వసనీయతే ఆయన సైన్యం

ఇంటిలిజెన్స్ కన్నా ముందే వైఎస్‌కు రాష్ట్రంలో ఏం జరుగుతోందో తెలిసేది. ఒకసారి గుంటూరు దగ్గర రైలు ప్రమాదం జరిగితే అధికారుల కన్నా ముందే ఆయన అప్రమత్తమయ్యారు. ఆయనే అందరికీ ఫోన్లు చేసి బాధితులకు అండగా ఉండమని చెప్పారు. ప్రతీ ఊళ్ళో ఆయనకు నెట్‌వర్క్ ఉండేది. ఏ జిల్లాకు వెళ్ళినా కనీసం 40 మంది కార్యకర్తలతో ఆయన విడిగా మాట్లాడేవారు. ఏ అర్ధరాత్రయినా ఆయనకు వాళ్ళు ఫోన్లు చేసేవాళ్ళు. విషయం చెప్పేవాళ్లు. ఆయన కూడా వినేవాడు. దీంతో కచ్చితమైన సమాచారం వచ్చేది. చుట్టూ ఉన్న కోటరీపై ఆయన ఎప్పుడూ ఆధారపడేవాడే కాదు. ఎంత పెద్ద ఆందోళన జరిగినా రైతులు, ప్రజలపై తుపాకులు ఎక్కుపెట్టొద్దని స్పష్టమైన సంకేతాలు ఇచ్చేవాడు. నిజామాబాద్‌లో ఎర్ర జొన్నల వివాదం సందర్భంగా, ముదిగొండలో కాల్పుల సందర్భంగా... 'రైతులకు ఏమైనా జరిగిందా?' అంటూ ఆయన పడ్డ కంగారు మాటల్లో చెప్పలేనిది. విపక్ష నేతలను అసెంబ్లీలోనూ పేర్లు పెట్టి పిలిచే స్వతంత్రం... చంద్రబాబు బీజేపీతో పొత్తు పెట్టుకున్నా– మళ్ళీ సెక్యులర్ మాటలు చెప్పినా తేలికగా కొట్టిపారేసే ధైర్యం... ఓడిపోయినా ప్రతీ క్షణం ప్రజా క్షేత్రంలోనే ఉండే గొప్ప నైజం... వైఎస్ ఉన్నతిని పెంచాయి. ఈనాటికీ ఏ నేతకూ లేని ప్రజాదరణను తెచ్చి పెట్టింది. వైఎస్ మన మధ్య లేకపోవచ్చు. సడలని విశ్వాసం... చెదిరిపోని ప్రజల కలల స్వప్నంలో పథకాల రూపంలో ఎప్పటికీ ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారు.

వ్యాసకర్త రిటైర్డ్ ఐఏఎస్ అధికారి
(వై.ఎస్.ఆర్. సీఎంగా ఉన్నప్పుడు సీఎంవో కార్యదర్శి)


జనహృదయ విజేత

సమైక్య రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేసిన ఏకైక నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి. ఆయన పేద ప్రజల్లో దైవంలా కొలువై నిలిచారు. అధికారాన్ని స్వప్రయోజనాలకు ఉపయోగించుకునే రాజకీయ నాయకులున్న రోజుల్లో... వైఎస్సార్ పేద ప్రజల బాగుకోసం దాన్ని ఉపయోగించారు. 'ఆరోగ్యశ్రీ' పథకం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. 108 అంబులెన్స్ సర్వీసులు ప్రారంభించారు. ఆ విధంగా ప్రభుత్వ వైద్యాన్ని పేదలకు దగ్గర చేశారు. పాదయాత్రలో రైతుల కష్టాలు చూసి చలించిపోయిన ఆయన దేశానికి వెన్నెముక వ్యవసాయమేనని బలంగా విశ్వసించి, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 'జలయజ్ఞం' ఆరంభించారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు అండగా నిలిచారు. ఆయన కాలంలోనే ఎన్నో విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు జరిగాయి. రైతులకు ఉచిత విద్యుత్ అందించారు. ఏక కాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచారు.

దళిత, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఫీజు రీయింబర్స్‌మెంటు పథకాన్ని తీసుకువచ్చి ఇంజనీరింగ్, వైద్య విద్యలను అందించి అనేక మందిని ఇంజనీర్లుగా, వైద్యులుగా తీర్చిదిద్దారు. ప్రతి నిరుపేదకూ 'ఇందిరమ్మ ఇల్లు' పేరిట రాష్ట్రంలో లక్షల ఇళ్లను కట్టించి పేదవారి సొంతింటి కలను నిజం చేశారు. నిరుపేద ముస్లిం యువతకు విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించడం ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం. పండుటాకుల వంటి వృద్ధులకు పింఛన్‌ను క్రమం తప్పకుండా ఇచ్చి వారి ఆకలి తీర్చారు.

ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు తాను రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత 'రచ్చబండ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ కార్యక్రమానికి వెళ్తూ హెలికాప్టర్ ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఈ వార్త విని ఎందరో అభిమానుల గుండెలూ ఆగిపోయాయి. ఆయన భౌతికంగా లేకపోయినా సకల జనుల హృదయాల్లో 'రాజన్న'గా ఆయన నిలిచే ఉన్నారు.

– సంపత్ గడ్డం, కామారెడ్డి జిల్లా



చెప్పింది చేసిన అరుదైన నేత

వైఎస్ రాజశేఖర రెడ్డి వ్యక్తిత్వం ఎందరికో ఆదర్శం. రాజకీయాల్లో ఇచ్చిన మాటకు కట్టుబడిన వారిలో వైఎస్సార్‌ది మొదటి స్థానం. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ప్రయత్నించారు. ఎప్పుడూ తెలుగువారి సంప్రదాయ పంచెకట్టులోనే కనిపించేవారు. వివిధ సందర్భాల్లో రాజకీయ ప్రత్యర్థులు ఎదురైనప్పుడు నవ్వుతూ పలకరించేవారు. ఆయన మాటలూ, చేతల్లో హుందాతనం తొణికిసలాడేది. ప్రజల జీవితాల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన ప్రజా నాయకుడాయన. రాజకీయాల్లో ప్రవేశించినప్పటి నుంచి అంతిమ ఘడియల వరకూ ఓటమి ఎరుగని నేత.

తెలుగు ప్రజల గుండెల్లో వైఎస్సార్‌గా చిరస్థాయిగా నిలిచిన ఆయన పూర్తి పేరు యెడుగూరి సందింటి రాజశేఖర రెడ్డి. నేటి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో రాజారెడ్డి, జయమ్మ దంపతులకు 1949 జూలై 8న జన్మించారు. బళ్లారిలో పాఠశాల విద్యాభ్యాసం, తర్వాత విజయవాడ లయోలా కళాశాలలో పీయూసీ ఉత్తీర్ణులై, 1972లో గుల్బర్గా విశ్వవిద్యాలయంలో మెడిసిన్ చదివారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల నుంచి హౌస్ సర్జెన్సీ పూర్తి చేసి వైద్య విద్యలో పట్టా అందుకున్నారు. తరువాత జమ్మలమడుగు క్యాంబెల్ ఆసుపత్రిలో వైద్యునిగా పేదలకు ఏడాది కాలం సేవలందించారు. తర్వాత కొంతకాలం జమ్మలమడుగులో వైద్యాధికారిగా పనిచేసి, అనంతరం తండ్రి రాజారెడ్డి పేరుతో 30 పడకల ఆసుపత్రి నిర్మించి, పేదలకు వైద్య సేవలు అందించి, రెండు రూపాయల డాక్టర్‌గా గుర్తింపు పొందారు.

తండ్రి కోరిక మేరకు 1978లో తొలిసారి పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, జనతాపార్టీ అభ్యర్థి నారాయణరెడ్డిపై 20 వేల 496 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి శాసన సభలో కాలు పెట్టినప్పటినుంచీ 2009 వరకు ఆయన పోటీ చేసిన అన్ని సార్లూ విజయం సాధించారు. 4 పర్యాయాలు పార్లమెంటు సభ్యుడిగా, 6 సార్లు ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు పీసీసీ అధ్యక్షుడిగా, మూడు పర్యాయాలు సీఎల్పీ నేతగా, రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా, రాజకీయ నేతలకు మార్గదర్శకంగా నిలిచారు.

పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్న వైఎస్సార్ 2004 మే 14న తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి, ఉచిత విద్యుత్, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల రద్దుపై తొలి, మలి సంతకాలు చేశారు. అది మొదలు ఎన్నో ప్రజా ప్రయోజన పథకాలు ప్రవేశపెట్టి అమలు జరిపారు. ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం వంటివి ఆయనను చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేలా చేశాయి.

నిర్లక్ష్యం నీడలో ఉన్న కడప జిల్లాను 2004–09 కాలంలో సమగ్రాభివృద్ధి దిశగా పరుగులు పెట్టించారు. కడప మునిసిపాలిటీని కార్పొరేషన్‌గా, రాయచోటి, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు, రాజంపేట మేజర్ పంచాయతీలను మునిసిపాలిటీలుగా రూపొందించారు. జిల్లాలో యోగి వేమన యూనివర్సిటీ, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, పశువైద్య విద్య కళాశాలను నెలకొల్పారు. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల, 750 పడకల రిమ్స్ ఆసుపత్రి, దంత వైద్యశాల, అలాగే ట్రిపుల్ ఐటీ నెలకొల్పారు. అనేక పరిశ్రమలు స్థాపింపజేశారు.

ఆయన హయాంలో జలయజ్ఞంలో భాగంగా సుమారు రూ. 12 వేల కోట్లతో కడప జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను చేపట్టారు. గాలేరు–నగరి సుజల స్రవంతి, గండికోట కెనాల్, టన్నెల్, గండికోట వరద కాల్వ, గండికోట ఎత్తిపోతల పథకాలు వైఎస్ హయాంలో రూపొందించినవే. మైలవరం ఆధునికీకరణ, సర్వారాయ సాగర్, వామికొండ ప్రాజెక్టు, సీబీఆర్, పీబీసీ, వెలిగల్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పనులు చకచకా సాగించారు. ఇంతలో 2009 సెప్టెంబర్ 2న సంభవించిన ఆయన అకాల మరణం రాష్ట్ర అభివృద్ధికి పెద్ద కుదుపయ్యింది.

– నందిరాజు రాధాకృష్ణ, సీనియర్ జర్నలిస్ట్, 98481 28215

(నేడు వైఎస్సార్ 75వ జయంతి)

భక్తిలో విశ్వాసం

భక్తి లేకుండా, విశ్వాసం లేకుండా కేవలం యాంత్రికంగా ఎన్ని రకాల, ఎన్ని వర్ణాల పూలతో పూజ చేసినా ఉపయోగం ఉండదు. విశ్వాసం లేకుండా చేసే తీర్థయాత్రల వల్ల, గంగా స్నానాల వల్ల ఫలితం ఉండదు. గంగలో మునక వేస్తే పాపాలు హరిస్తాయంటారు కానీ నిజంగా అలా జరుగుతుందని నమ్మకం ఏమిటి? అనే అవిశ్వాసంతోనే చాలా మంది ఉంటారు. మనుషులలో సందేహ జీవులే ఎక్కువ.



జ్యోతిర్మయం

ఒకసారి పార్వతీ పరమేశ్వరులు ఈ విషయం గురించే 'నిత్యం గంగలో ఎంతోమంది స్నానం చేస్తూ, శివ స్మరణ చేస్తున్నారు కానీ ఎవరిలోనూ పూర్తి విశ్వాసం కనిపించటం లే'దని అనుకుంటారు. నిజమైన భక్తి ఎవరిదో పరీక్షిద్దామని అనుకుని వృద్ధ దంపతుల రూపంలో గంగా తీరానికి వెళతారు. అక్కడ వృద్ధుడు ఒక గోతిలో పడిపోతాడు. భార్య దుఃఖిస్తూ ఎవరైనా చేయందించి తన భర్తను కాపాడమని అక్కడ చుట్టూ చేరిన వారిని కోరుతుంది. వాళ్ళు ముందుకు రాబోతుంటే ఆమె 'మీలో ఎప్పుడూ ఏ పాపం చేయని వాళ్ళు మాత్రమే నా భర్తను కాపాడండి. లేకుంటే, చేయందిస్తున్నప్పుడు మీ చేయి కాలిపోతుంది' అంది. అక్కడ ఉన్నవారంతా గంగా స్నానం చేసినవారు. నిరంతరం శివ స్మరణ చేసేవారు. అయినా, తమ భక్తి మీద తమకు నమ్మకం లేదు. ఎవరూ ముందుకు రాలేదు. వృద్ధుణ్ణి కాపాడే ప్రయత్నం చేయలేదు.

అంతలో ఒక దొంగ అక్కడికి వచ్చాడు. వృద్ధురాలు చెప్పిన విషయం తెలుసుకుని, వెంటనే గంగలో మూడు మునకలు వేశాడు. వృద్ధుణ్ణి కాపాడాడు. గంగలో మునిగిన తర్వాత తన పాపాలన్నీ నశించిపోయాయని అతని నమ్మకం. వృద్ధునికి చేయందించినపుడు అతని చేయి కాలలేదు. అదీ విశ్వాసమంటే! ఆ తర్వాత అతడు దొంగతనాలు మాని శివభక్తుడయ్యాడు.

అపనమ్మకంతో, సందేహంతో చేసే పనులు ఏవీ సత్ఫలితాన్నివ్వవు. చేసే పనిపై విశ్వాసం ఉండాలి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ; ఆషాఢ మాసం ; **తిథి:** శు.తదియ తె.5.20 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి చవితి ; **నక్షత్రం:** పుష్యమి ఉ.6.12 వరకు, తదుపరి ఆశ్లేష ; **వర్జ్యం:** రా.7.53 నుండి 9.36 వరకు ; **దుర్ముహూర్తం:** ప.12.30 నుండి 1.22 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.58 వరకు ; **అమృత ఘడియలు:** ఉ.6.08 నుండి 8.24 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు ; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు ; **సూర్యోదయం:** 5.34 ; **సూర్యాస్తమయం:** 6.35

క్లుప్తంగా...

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి

గుంటూరు మేయర్ మనోహర్ నాయుడు



కట్టా నాగభూషణంకు చెక్కు అందజేస్తున్న మేయర్ మనోహర్‌నాయుడు

యడ్లపాడు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండాలని గుంటూరు మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. యడ్లపాడు ఎస్సీ కాలనీలో గతనెల 4న టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కట్టా నాగభూషణంను ఆదివారం ఆయన పరామర్శించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపించిన రూ.50 వేల చెక్కును బాధితుడికి అందించారు. అనంతరం మనోహర్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ బెదిరింపులకు భయపడొద్దని.. పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రాచమంటి చింతారావు, సీనియర్ నాయకులు పిడతల దయాసాగర్, నాదెండ్ల జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు ఉన్నారు.

చీరాలలో 'సాక్షి' ప్రతులు దహనం చేసిన టీడీపీ నేతలు



చీరాల: 'చీరాలలో కొండంత అవినీతి' శీర్షికన ఆదివారం సాక్షి పత్రికలో చీరాల టీడీపీ ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్యపై ప్రచురితమైన కథనం చూసి ఆ పార్టీ నేతలు ఉలిక్కిపడ్డారు. తమ నాయకుడిపై కథనం రావడంతో ఆగ్రహించిన టీడీపీ నాయకులు ఆదివారం రాత్రి చీరాల గడియార స్తంభం సెంటర్‌లో సాక్షి పత్రిక ప్రతులను దహనం చేశారు. రిసార్ట్స్‌లో మామూళ్ల వసూళ్లు, అక్రమంగా బియ్యం రవాణా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి మామూళ్ల వ్యవహారంపై కథనం ప్రచురితమైంది. ఇది నియోజకవర్గంలోనేగాక పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కథనంలో పేర్లు లేకపోయినా ఉలిక్కిపడిన ఎమ్మెల్యే తన అనుచరులతో మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి సాక్షి పత్రికపై అక్కసు వెళ్లగక్కారు. ఈ నేపథ్యంలో సాక్షి ప్రతులను దహనం చేశారు. ఎమ్మెల్యేపై తప్పుడు కథనాలు ప్రచురిస్తే సాక్షి కార్యాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పి.సుబ్బయ్య, ఎస్.సత్యానందం పాల్గొన్నారు.

ముస్లిం వర్గీయులపై దాడి

నలుగురికి గాయాలు

గుంటూరు (తొండపి): పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలో ఆదివారం పొలం వెళుతున్న ముస్లిం వర్గీయులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు దాడిచేశారు. ఎన్నికలప్పటి నుంచి గ్రామంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయుల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ సానుభూతిపరులు మూకుమ్మడిగా రాళ్లతో దాడిచేసి ఇళ్లల్లోని విలువైన వస్తువులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన 40కిపైగా కుటుంబాల వారు ఊరు వదిలి వేరే ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. కొంతమంది గ్రామంలోనే బిక్కుబిక్కుమంటూ ఇళ్లకే పరిమితమై జీవిస్తున్నారు. ఆదివారం షేక్ తుమ్మలచెరువు సుభాని తన ద్విచక్ర వాహనంపై గ్రామానికి దక్షిణం వైపు ఉన్న పొలం వెళుతుండగా టీడీపీ సానుభూతిపరులు మూకుమ్మడిగా దాడిచేశారు. పెట్రోల్ పోసి ద్విచక్రవాహనాన్ని తగులబెట్టారు. ఇదేమని ప్రశ్నిస్తున్న వారిపైన టీడీపీ వర్గీయులైన కొత్తా రవి, ముజావర్ బాజీ, ముజావర్ సుభాని, షేక్ బాజీ, దుగ్గినేని వెంకటరామయ్య, రాయిడి శ్రీనివాసరావు దాడిచేసి గాయపరిచారు. ఈ దాడిలో షేక్ తుమ్మలచెరువు సుభాని, అతడి భార్య నాగూర్‌బీ, బందెల పెదబాజీ, బందెల నూర్ గాయపడ్డారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లు కూల్చివేత



సాక్షి టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం మహల్‌రాజుపల్లెలో మూడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లను టీడీపీ నేతలు కూల్చేశారు. జి.మునిస్వామి భార్య మంగమ్మ, జి.సుధాకర్ భార్య పద్మజ, ఆర్.భాస్కర్‌రెడ్డి భార్య కళావతమ్మ తమకు పట్టాలున్న స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారు. వీరు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశారన్న కారణంతో కక్షకట్టిన టీడీపీ నేతలు జేసీబీతో వారి ఇళ్లను కూల్చేశారు. ఈ మూడిళ్లకు ఇంటిపట్టాలు, ఇంటిపన్నులు, కరెంట్ బిల్లులు కూడా ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. ఏదైనా ఆక్రమణలు జరిగితే అధికారులు విచారించాలి తప్ప ఇళ్లను టీడీపీ నాయకులు కూల్చడమేంటని ప్రశ్నిస్తున్నారు.

అర్ధరాత్రి ఇండోర్ స్టేడియం కూల్చివేత







పుంగనూరులో ఇండోర్ స్టేడియంలో ఆడుకుంటున్న క్రీడాకారులు (ఫైల్)

▶ మొదటి పేజీ తరువాయి

ఎంతగానో ఉపయోగపడుతున్న ఇండోర్ స్టేడియాన్ని శనివారం అర్ధరాత్రి జేసీబీలతో కూల్చి వేశారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని ఏమనాలో, వారి పైశాచిక ఆనందం ఏమిటో అర్థం కావడం లేదు.

చందాలతో అధునాతన వసతుల కల్పన

పుంగనూరు సమీపంలోని ఎంబీటీ రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో షటిల్ కోర్టు నిర్మించేందుకు అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ శరణ్, హరిప్రసాద్, రాజారెడ్డి, అనిల్‌కుమార్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఇరవై ఏళ్ల క్రితం రెవెన్యూ అధికారులను సంప్రదించారు. పట్టణ ప్రజల రిక్రియేషన్‌కు ఇండోర్ స్టేడియం నిర్మిస్తామని, ఇందుకోసం ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. దీనిపై రెవెన్యూ అధికారులు సర్వే నం.225/6లో 17 సెంట్ల భూమిని 10-9-2004లో సంఘం పేరున పట్టా మంజూరు చేశారు. దీనిపై అనుమతులు పొందిన సంఘ ప్రతినిధులు అప్పట్లో సుమారు రూ.30 లక్షల వరకు చందాలు వేసుకుని స్టేడియాన్ని నిర్మించారు. తిరిగి మరో రూ.50 లక్షలు ఖర్చుచేసి అధునాతన వసతులు కల్పించారు. దీంతో ప్రతిరోజు ఉ.5 గంటల నుంచి రాత్రి 10 వరకు వందల సంఖ్యలో అన్ని వర్గాల వారు ఇక్కడ ఆడుకునేందుకు వస్తున్నారు. ఇంతలో.. శనివారం రాత్రి కూటమి నేతలు హిటాచీలు, జేసీబీలతో దానిని కూల్చి వేసి విధ్వంసం సృష్టించారు. రూ.కోటి విలువ చేసే ఈ స్టేడియాన్ని నేలమట్టం చేశారు. ఈ ఘటనపై పట్టణ ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఇండోర్ స్టేడియం కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని షటిల్ సంఘ ప్రతినిధులు డాక్టర్ శరణ్, సీఏస్ రాజారెడ్డి, అనిల్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, హరిప్రసాద్, మునిరాజులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్, సీఐ కృష్ణారెడ్డిలు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఇదిలా ఉంటే.. ప్రభుత్వ అనుమతితో స్థలాన్ని పొంది నిర్మించిన ఈ ఇండోర్ స్టేడియంతో ఎవరికీ నష్టం లేదని సంఘ ప్రతినిధులు తెలిపారు. ప్రజల మానసికోల్లాసం కోసం ఎలాంటి స్వార్థం లేకుండా నిర్మించిన స్టేడియాన్ని కూల్చి వేయడం బాధాకరమన్నారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు.. ఈ ఇండోర్ స్టేడియాన్ని కూల్చివేసిన వారిపై పోలీసులు తక్షణమే కేసులు నమోదు చేసి, పట్టణ ప్రజల్లో భయాన్ని పోగొట్టి, భరోసా కల్పించాలని మాజీ ఎంపీ రెడ్డప్ప డిమాండ్ చేశారు.

ఇలా ఇంకెన్ని ధ్వంసం చేస్తారు?

ఈ ఇండోర్ స్టేడియం కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉండేలా సంఘ సభ్యులు చర్యలు చేపట్టారు. ఐదేళ్ల క్రితం అధునాతన వసతులతో, నేలపై చెక్క పలకలతో క్రీడాకారులకు బాక్సులు సిద్ధం చేశారు. రంగుల మ్యాట్‌లు వేశారు. ఎల్ఈడీ దీపాలు, మంచి నీరు ఏర్పాటు చేశారు. నిత్యం పోటీలు నిర్వహిస్తూ యువతీ, యువకులకు క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తున్నారు. ఇక్కడ షటిల్‌తో పాటు స్నూకర్స్, క్యారమ్స్, చెస్ ఇలా అన్ని రకాల ఆటలకు స్టేడియం వేదికగా మారింది. ఇలాంటి స్టేడియం రాత్రికి రాత్రే విధ్వంసానికి గురై కనుమరుగు కావడం పట్ల స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అధికారం కట్టబెట్టింది ఇందుకేనా? అని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఇంకెన్ని ఆస్తులు ధ్వంసం చేస్తారని నిలదీస్తున్నారు.

వేలేరుపాడులో టీడీపీ శ్రేణుల దాడి

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్‌కు గాయాలు
- ఎంపీటీసీ ఇంటిపై దాడికి యత్నం



శ్రీనివాస్‌గౌడ్‌పై దాడి చేస్తున్న టీడీపీ శ్రేణులు

వేలేరుపాడు: ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్‌పై టీడీపీ శ్రేణులు ఆదివారం దాడికి పాల్పడ్డాయి. వేలేరుపాడు ఆటో సెంటర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి శ్రీనివాసగౌడ్ కారులో రాగా.. టీడీపీ కార్యకర్తలు షేక్ దస్తగిరి, సవలం రాధాకృష్ణ, సోడే రమేష్, కుంజా కోటేష్, పులి యేసు, శెట్టిపల్లి కళ్యాణ్, తాటి హనుమంతు దాడికి తెగబడ్డారు. తొలుత శ్రీనివాస్‌గౌడ్‌ను అడ్డగించి సెల్‌ఫోన్ లాక్కున్నారు. అనంతరం కాళ్లతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దారు. దాడిని ఆపేందుకు వైఎస్సార్‌సీపీకి చెందిన వేద కుమారి, మాలశ్రీ ప్రయత్నించగా.. వారి సెల్‌ఫోన్లు లాక్కుని పగులగొట్టారు. శ్రీనివాస్‌గౌడ్ తల, వీపుపై గాయాలయ్యాయి. ఆయనను వేలేరుపాడు పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం ఎర్రబోరులో ఉంటున్న తాట్కూరుగొమ్ము ఎంపీటీసీ సభ్యుడు కొమ్మరాజు రాంబాబు ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడికి ప్రయత్నించాయి. ఆ సమయంలో రాంబాబు ఇంట్లో లేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తమపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపుతామని కత్తులతో బెదిరించారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేలేరుపాడు ఎంపీపీ వాళ్ల లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా.. లోపలికి వారిని పోలీసులు అనుమతించలేదు.

ఆగని విధ్వంసాలు

- విజయనగరం జిల్లా కోనాడలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం..
- కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో శిలాఫలకాలు ధ్వంసం

సాక్షి నెట్‌వర్క్: కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు సాగిస్తున్న విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను, అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారు. ఈ విధ్వంసాలు శనివారం రాత్రి, ఆదివారం కూడా కొనసాగాయి.

➡ విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం పూసపాటిరేగ మండలంలోని కోనాడ గ్రామం బజారు కూడలిలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని శనివారం రాత్రి ధ్వంసం చేశారు. వైఎస్సార్ జయంతి కార్యక్రమం సందర్భంగా విగ్రహానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దడంతో తట్టుకోలేక విగ్రహం చేతిని విరగ్గొట్టడంతోపాటు తల వెనక భాగంలో రాడ్డుతో కొట్టారు. కోనాడ బజార్‌లో ఉన్న సీసీ కెమెరా వైర్లను కట్‌చేసి ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సమాచారం అందుకున్న పూసపాటిరేగ ఎస్.ఐ. సన్యాసినాయుడు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని పట్టుకుంటామని ఎస్.ఐ. చెప్పారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నేతలు దాడిశెట్టి త్రినాథరావు, అమర గురువులు, బొడ్డు ఎల్లాజీ, దారపు లక్ష్మణరెడ్డి, దాడిశెట్టి గోవింద, విజ్జపు కిరణ్, కంబపు రామిరెడ్డి ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు. ప్రశాంతతకు మారుపేరైన కోనాడలో అసాంఘిక శక్తులు బరితెగించి విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి వెనుక ఉన్న వ్యక్తులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు.

➡ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం జిల్లేళ్ళవారిపేటలో వాటర్ ట్యాంకు శిలాఫలకాన్ని మాయం చేశారు. జిల్లేళ్ళవారిపేట ఎస్సీ గ్రామానికి మంచి నీరు అందించాలనే లక్ష్యంతో అప్పటి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.54 లక్షలతో 40 వేల లీటర్ల ట్యాంకు, పైపులైన్ పనులు, ఇంటింటా కుళాయిల పనులు పూర్తిచేసి ప్రారంభించారు. దీనికి సంబంధించిన శిలాఫలకాన్ని ఇప్పుడు మాయం చేశారు. వారం రోజుల కిందట గ్రామంలో చర్చికి వెళ్లే పంచాయతీ పైపులైన్‌ను టీడీపీ కార్యకర్తలు కట్ చేశారు.

➡ ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలులో ఇటీవల నిర్మించిన గ్రామ సచివాలయ భవనంపై ఉన్న ఫొటోలను పగులగొట్టారు. ఈ భవనానికి ఘంటా రంగారావు తన తండ్రి పేరిట 12 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆయన పేరిట ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని ఇప్పుడు ధ్వంసం చేశారు. దీంతో పాటు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు వేసిన శిలాఫలకాలను నేలమట్టం చేశారు. ఈ ఘటనను జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తీవ్రంగా ఖండించారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.



కోనాడలో ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం

➡ పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం జుత్తిగ గ్రామ పంచాయతీ బీసీ కాలనీలో కొవ్వూరి గంగిరెడ్డి స్మారక మందిరం వద్ద 2021లో సీసీ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా వేసిన శిలాఫలకాన్ని శనివారం రాత్రి కూల్చేశారు. రూ.కోటితో నాలుగు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సచివాలయ భవన విస్తరణ పనులు చేసిన తరువాత 2021 సెప్టెంబరు 5న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, అప్పటి హోం మంత్రి మేకతోటి సుచరిత తదితరులు ప్రారంభించి శిలాఫలకాలు ఆవిష్కరించారని సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి చెప్పారు. బీసీ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఇప్పుడు కూల్చేశారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆయన చెప్పారు.

భయానక వాతావరణం సృష్టించేందుకే..

- కాంట్రాక్టర్ సగం పనులు ఇస్తానన్నా మొత్తం కావాలని టీడీపీ నాయకుల డిమాండ్
- ఒత్తిడి తెచ్చినా అంగీకరించని కాంట్రాక్టర్ శివప్రసాద్‌రెడ్డి
- గ్రీన్‌ఫీల్డ్ క్యాంపు ఆఫీసును తగులబెట్టిన దుండగులు



దగ్ధమవుతున్న గ్రీన్‌ఫీల్డ్‌హైవే క్యాంపు ఆఫీస్ (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ జిల్లా నల్లచెరువుపల్లె గ్రామ సమీపంలో చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో వాటా అడిగారని, ఇస్తానని చెప్పినా చివరికి పనులు మొత్తం ఇవ్వాలని టీడీపీ నాయకులు ఒత్తిడి తెచ్చారని కాంట్రాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. దీనికి అంగీకరించని తాను 15 రోజులుగా నిలిచిపోయిన పనుల్ని తిరిగి ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో భయానక వాతావరణం సృష్టించడానికి గ్రీన్‌ఫీల్డ్ హైవే క్యాంపు ఆఫీసుకు దుండగులు నిప్పుపెట్టారని చెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులను మెగా ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకుంది. ఇందులో నాలుగు కిలోమీటర్ల మేర పనుల్ని సబ్ కాంట్రాక్ట్ కింద సిద్ధార్థ కంపెనీ యజమాని రామిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి తీసుకున్నారు. ఏప్రిల్‌లో పనులు మొదలుపెట్టారు. పనులు జరుగుతుండగా కూటమి అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి హైవే పనులకు అడ్డంకులు ఎదురయ్యాయి. టీడీపీ నేతలు నల్లచెరువుపల్లె గ్రామ సమీపంలో జరిగే హైవే పనులను అడ్డుకున్నారు. వాటా ఇవ్వందే పనులు చేయకూడదని హుకుం జారీచేశారు. అయినా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడానికి సిద్ధమైన తరుణంలో వారు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో రాయల్టీ లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారని అధికారులు టిప్పర్లను సీజ్‌చేశారు. రాయల్టీ అధికారులు విధించిన జరిమానా చెల్లించి టిప్పర్లను తెచ్చుకుని పనులు ప్రారంభించే సమయంలో క్యాంపు ఆఫీసును తగులబెట్టారు. హైవే రోడ్డు పనులు నాలుగు కిలోమీటర్లు సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నాని, దాన్లో రెండు కిలోమీటర్లు చేసుకునేందుకు ఇచ్చేస్తానని టీడీపీ నేతలకు చెప్పినట్లు కాంట్రాక్టర్ తెలిపారు. కానీ వారు మొత్తం నాలుగు కిలోమీటర్ల పనులు కావాలంటూ ఒత్తిడి తెచ్చారు. ఇందుకు అంగీకరించని తాను పనులు ప్రారంభించడానికి సిద్ధమయ్యానని, ఈ పనులను ఎలాగైనా ఆపాలనే ఉద్దేశంతో కొంతమంది దుండగులు గ్రీన్‌ఫీల్డ్ హైవే క్యాంపు ఆఫీసును తగులబెట్టారని చెప్పారు. ఈ సంఘటనలో సుమారు రూ.30 లక్షల నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

దళితుడిపై 'దేశం' నేతల దాడి



మొక్కజొన్న పంటను దున్నేస్తున్న టీడీపీ నేతలు

- కులం పేరుతో దూషిస్తూ కొట్టి పంటను దున్నేసిన వైనం
- అనంతపురం జిల్లా గాజుల మల్లాపురంలో ఘటన

సాక్షి టాస్క్‌ఫోర్స్: అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం గాజుల మల్లాపురం గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. మాజీ వలంటీర్ దళితుడైన నాగరాజును కులం పేరుతో దూషించి దాడిచేశారు. అతడు కౌలుకు సాగుచేసిన మొక్కజొన్న పంట పొలాన్ని దౌర్జన్యంగా దున్నేశారు. బాధితుడు తెలిపిన మేరకు.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాగరాజు వలంటీర్ ఉద్యోగం పోయింది. దీంతో వ్యవసాయం చేసుకుందామనుకున్న నాగరాజు గ్రామంలోని కొత్తింటి రామ్మోహన్, రుద్రగౌడులకు చెందిన ఎనిమిదెకరాలను కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగుచేశాడు. ఎకరాకు రూ.30 వేల చొప్పున మొత్తం రూ.2.40 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఆదివారం అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు గాజుల పెద్ద ఎర్రిస్వామి, చిన్న ఎర్రిస్వామి, వారి కుమారులు.. అనంతపురం నుంచి మరికొందరిని తీసుకొచ్చి నాగరాజు సాగు చేసిన మొక్కజొన్న పంటను హొన్నూరు అలియాస్ హరి అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌తో దున్నేశారు. పంటను నాశనం చేయవద్దని బాధితుడు కాళ్లావేళ్లాపడినా కరుణించలేదు. పొలంలోనే తీవ్రంగా కొట్టారు. పొలం తగాదాలుంటే మీరుమీరూ చూసుకోవాలని, పంటను నాశనం చేయవద్దని వేడుకున్నా వినలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం మాది.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ దాడిచేశారని తెలిపాడు. తనకు జరిగిన అన్యాయంపై పాల్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని చెప్పాడు.



నాగరాజుపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు (వృత్తంలో)

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నాగరాజును కులం పేరుతో దూషించి, దాడిచేసిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు కెంగూరి ఎర్రిస్వామి డిమాండ్ చేశారు. దళితుడి పంటను దౌర్జన్యంగా దున్నేయడం దారుణమని పేర్కొన్నారు. బాధితుడికి న్యాయం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిర్మాణాల ధ్వంసం

- కనిగిరిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఎమ్మెల్యే ఉగ్ర కక్ష
- అక్రమ కట్టడాల పేరుతో కక్షసాధింపు
- రూ.కోటి విలువైన ఇళ్లు, కట్టడాలను కూల్చేసిన అధికారులు

కనిగిరి రూరల్: ప్రకాశం జిల్లా కనిగిరిలో టీడీపీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అధికారులను అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. సుమారు రూ.కోటి విలువైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల ఇళ్లు, నిర్మాణాలను ఆదివారం కూలగొట్టించారు. మున్సిపల్, రెవెన్యూ అధికారుల సహాయంతో పోలీస్ బందోబస్తు మధ్య పొక్లెయిన్లతో విరుచుకుపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. కనిగిరి మున్సిపాలిటీ కాశిరెడ్డినగర్ సమీపంలో ఎస్కే హుస్సేన్‌బీ పేరుతో 1976లో పాస్‌బుక్ పట్టా ఉంది. హుస్సేన్ పేరుతో 863ఏ సర్వే నంబరులో ఉన్న 4.56 ఎకరాలకు సంబంధించి 1976–2008 సంవత్సరాల మధ్య 10 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆ తరువాత ఆ భూమి క్రయవిక్రయాలు జరిగాయి. ఆ భూమిలో పలువురు ఇళ్లు నిర్మించుకున్నారు. ఇంటిపన్ను కడుతున్నారు. విద్యుత్ కనెక్షన్లున్నాయి. మరికొంత భూమిలో పదేళ్ల కిందటే ఐదారుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు రేకులషెడ్లు, కట్టడాలు, ప్రహరీలు నిర్మించుకున్నారు. తాజాగా మరికొందరు వారి స్థలాలకు ప్రహరీలు కట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కక్షసాధింపులో భాగంగా ఎమ్మెల్యే ఉగ్ర ముందుగా ఒక పక్షపత్రికల్లో ఆ భూమి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ఆక్రమించారని రాయించి, కనీస సమాచారం ఇవ్వకుండా ఆదివారం సెలవురోజు అయినా ఒక్కసారిగా ఆర్డీవో జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు సమక్షంలో నిర్మాణాలను కూల్చివేశారు. గతంలో సర్వే నంబరు 863ఎలోని 4.56 ఎకరాలను మున్సిపాలిటీ భవన నిర్మాణానికి కేటాయించి ఉన్నట్లు, అసైన్డ్ భూమి కింద ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో ఆ భూమిని మున్సిపాలిటీకి కేటాయించినప్పుడు భూ హక్కుదారులు కోర్టుకు వెళ్లారు. దానిపై హైకోర్టు స్టే ఆర్డర్ ఉంది. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఇళ్లు, కట్టడాలను ధ్వంసం చేయించారు.



పొక్లెయిన్‌తో ఇళ్లను, ప్రహరీలను ధ్వంసం చేస్తున్న మున్సిపల్ అధికారులు

హైకోర్టు, ఆర్డీవో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నా..

అధికారులు ఆదివారం కూల్చేసిన భవన నిర్మాణాలకు సంబంధించిన స్థల వివాదం ప్రస్తుతం ఆర్డీవో కోర్టులో పెండింగ్‌లో ఉంది. దీనిపై శేఖర్, బ్రహ్మయ్య, బాషా తదితరులు కోర్టులకు వెళ్లి పిటిషన్లు వేశారు. అయినా అవేమీ లెక్క చేయకుండా ఆక్రమణల తొలగింపు పేరుతో ఆదివారం కూల్చేశారు. కనీసం తమకు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా ఎందుకు కూల్చేస్తున్నారంటూ నిర్మాణదారులైన ఖాశిం, రసూల్, బ్రహ్మయ్య అధికారులను అడిగినా పట్టించుకోలేదు. బాధితులు శ్రీను, రసూల్, ఖాశిం, బ్రహ్మయ్య, బాషా తదితరులు హైకోర్టులో, ఆర్డీవో కోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయనడానికి సంబంధించిన ఆధారాలను, ఇతర డాక్యుమెంట్లను చూపించినా ఆర్డీవో, కమిషనర్ లెక్క చేయలేదు. ఈ వ్యవహారంపై మళ్లీ కోర్టును ఆశ్రయించనున్నట్లు బాధితులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల షెడ్లు కూల్చివేత

బిక్కవోలు: తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు చెందిన రేకుల షెడ్లను పంచాయతీ వారు నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. గ్రామంలోని చెరువు గట్టుపై 11 మంది షెడ్లు నిర్మించుకుని ఎన్నో ఏళ్లుగా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది ఆదివారం భారీ పోలీసు బందోబస్తు నడుమ రెండు జేసీబీలతో అక్కడకు చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన గండి నాగవెంకటరమణ, గొరపల్లి సీతారామయ్య రేకుల షెడ్లను కూల్చేశారు. దీనిపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ వార్డు సభ్యురాలు కూడా అయిన వెంకటరమణ భార్య రామతులసి.. షెడ్ల కూల్చివేతపై అధికారులను నిలదీశారు. కనీస సమాచారం ఇవ్వకుండా కక్షపూరితంగా షెడ్లు కూల్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమనే ఒకే ఒక్క కారణంతో తమ ఆస్తులు ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు అనపర్తి సీఐతో పాటు ముగ్గురు ఎస్.ఐ.లు, సుమారు 30 మంది పోలీసు సిబ్బందితో వచ్చిన పంచాయతీ సిబ్బంది గ్రామంలో యుద్ధవాతావరణం సృష్టించారని చెప్పారు. షెడ్లను కూల్చడం అధికార పార్టీ నాయకుల ఆకృత్యాలకు, వ్యవస్థల పనితీరుకు అద్దం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆ షెడ్లు అక్రమ కట్టడాలని తాము నోటీసులు ఇవ్వగా పలువురు గడువు కోరారని, వెంకటరమణ, సీతారామయ్య స్పందించనందున వారి షెడ్లు కూల్చేశామని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ చెప్పారు.



పందలపాకలో జేసీబీతో షెడ్ల కూల్చివేత

రష్యాలో మోదీ పర్యటన

● ఇండో-రష్యా శిఖరాగ్రంలో పాల్గొననున్న ప్రధాని.. పుతిన్‌తో విస్తృతస్థాయి చర్చలు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం నుంచి రెండు రోజుల పాటు రష్యాలో పర్యటించనున్నారు. 22వ ఇండో-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. పలు రంగాల్లో విస్తృతస్థాయి సహకారంపై వారు చర్చిస్తారు. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగాక మోదీ రష్యాలో పర్యటించడం ఇదే తొలిసారి. మూడేళ్ల విరామం తర్వాత భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు జరుగుతున్న నేపథ్యంలో ఈ సమిట్‌లో చర్చించబోయే అంశాలు, తీసుకోబోయే ఉమ్మడి నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరిసారిగా 2021 డిసెంబర్‌లో ఢిల్లీలో ఈ సదస్సు జరిగింది. సోమవారం మధ్యాహ్నం రష్యాకు మోదీ చేరుకున్నాక పుతిన్ ఇచ్చే ప్రత్యేక విందు కార్యక్రమానికి మోదీ హాజరుకానున్నారు. తర్వాత శిఖరాగ్ర సదస్సు జరగనుంది. మరుసటి రోజు రష్యాలోని భారతీయసంతతి వ్యక్తులతో మోదీ మాట్లాడతారు. తర్వాత క్రెమ్లిన్‌లో అనామక సైనికుల స్మారకం వద్ద అంజలి ఘటిస్తారు. తర్వాత మాస్కోలో ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు.

ఆస్ట్రియాలోనూ పర్యటన

రష్యా పర్యటన తర్వాత 9వ తేదీన మోదీ ఆస్ట్రియాకు వెళ్తారు. ఆస్ట్రియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వాన్ డీర్ బెల్లాన్, చాన్స్‌లర్ కార్ల్ నెహామెర్‌లతో విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. 'ఆస్ట్రియా, భారత్ మైత్రీబంధానికి 75 ఏళ్లు పూర్తవుతున్న వేళ మోదీతో చర్చల కోసం సిద్ధంగా ఉన్నా' అని నెహామెర్ శనివారం 'ఎక్స్'లో చేసిన పోస్టుకు మోదీ ఆదివారం స్పందించారు. ''ఇరు దేశాల మధ్య బంధాన్ని మరింత పటిష్టం చేసేందుకు, సహకారంలో కొత్త పథాలను అన్వేషించేందుకు మీతో చర్చల కోసం ఎదురుచూస్తున్నా'' అని మోదీ ఆదివారం 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. భారత ప్రధాని ఒకరు ఆస్ట్రియాలో పర్యటిస్తుండటం గత 40 ఏళ్లలో ఇదే తొలిసారికావడం విశేషం. భారత్, ఆస్ట్రియాకు చెందిన పారిశ్రామిక దిగ్గజాలతో మోదీ భేటీ కొనసాగుతుంది. మాస్కోతోపాటు వియన్నాలోని భారతీయ సంతతి ప్రజలతో ప్రధాని ముచ్చటించనున్నారు.

నీట్‌పై నేడు సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ: వివాదాస్పదంగా మారిన నీట్-యూజీ 2024 నిర్వహణపై దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టులో సోమవారం నుంచి విచారణ మొదలుకానుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం నీట్‌కు సంబంధించి దాఖలైన 38 పిటిషన్లపై వాదనలు విననుంది. అయితే, పరీక్షను రద్దు చేయడం సహేతుకం కాదని, పేపర్ లీకేజీ భారీపెద్ద ఎత్తున జరిగినట్లు ఎటువంటి ఆధారాలు లేవని ఇప్పటికే సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. మే 5వ తేదీన జరిగిన ఈ పరీక్షలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ విద్యార్థులు, రాజకీయ పార్టీలు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. పేపర్ లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేపట్టింది.

పూరీలో వైభవంగా రథయాత్ర

హాజరైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ● తొక్కిసలాటలో ఒకరి మృతి

భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పూరీలోని జగన్నాథుని రథయాత్ర అంగరంగ వైభవంగా మొదలైంది. సాయంత్రం లక్షలాది భక్తుల నినాదాల నడుమ జగన్నాథ ఆలయం నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలోని గుండీచా ఆలయం దిశగా భారీ రథాలు ముందుకు సాగాయి. 5.20 గంటలకు రథాలు కదిలాయి. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మూడు రథాలకు పూజలు చేశారు. ఆమె, ఒడిశా గవర్నర్ రఘుబర్ దాస్, సీఎం మోహన్ చరణ్ మాఝి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జగన్నాథ రథం తాళ్లను లాగి యాత్రను లాంఛనంగా ప్రారంభించారు. ముందున్న బలభద్రుని ప్రతిష్ఠించిన 45 అడుగుల ఎత్తైన రథాన్ని దేవీ సుభద్ర, జగన్నాథుని రథాలు అనుసరించాయి. రథయాత్రకు ముందు భక్తుల బృందాలు జగన్నాథుని కీర్తనలను ఆలపిస్తూ ముందుకు సాగారు. రెండు రోజులపాటు సాగే యాత్ర కోసం భారీగా బందోబస్తు చేపట్టారు.

సాయంత్రం వేళ బలభద్రుని రథం లాగుతున్న చోట ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. దీంతో ఊపిరాడక తొమ్మిది మంది భక్తులు అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి తీసుకొచ్చేలోగా ఒడిశాలోని బాలాంగిర్ జిల్లాకు చెందిన లలిత్ బాగార్తి అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. భక్తుని మృతి పట్ల సీఎం చరణ్ మాఝీ సంతాపం వ్యక్తంచేశారు. అయితే 300 మందిదాకా గాయపడినట్లు మీడియాలో వార్తలొచ్చాయి.



రథయాత్రలో అశేషంగా పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) కలశ స్థాపన చేస్తున్న పూజారులు

విషం చల్లడం వల్లే...

హత్రాస్ ఘటనపై భోలే బాబా లాయర్

న్యూఢిల్లీ: యూపీలోని హత్రాస్‌లో ఈనెల 2వ తేదీన సత్సంగ్‌లో తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులపై భోలే బాబా తరఫు న్యాయవాది ఏపీ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..భోలే బాబాకు పెరుగుతున్న ఆదరణ చూసి కొందరు కుట్ర చేశారు. సత్సంగ్‌లో పాల్గొన్న భక్తులపైకి క్యాన్లతో తెచ్చిన విష పదార్థాన్ని చల్లారు. జనం భయకంపితులై అక్కడి నుంచి వెళ్లే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది'అని ఆయన వివరించారు. కనీసం 16 మంది గుర్తు తెలియని వ్యక్తులు సత్సంగ్ వద్దకు విష పదార్థం నింపిన క్యాన్లతో వచ్చినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు కొందరు తనకు తెలిపారన్నారు. అనంతరం వారు తప్పించుకుని వెళ్లేందుకు అక్కడ వాహనాలు కూడా సిద్ధంగా ఉన్నట్లు కూడా తమ వద్ద రుజువులున్నాయన్నారు. సాక్ష్యులకు భద్రత కల్పించాలని ఆయన అధికారులను కోరారు. ఈ ఘటనలో 121 మంది భక్తులు, ముఖ్యంగా మహిళలు ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. కాగా, ఈ ఘటనలో కీలక నిందితుడు దేవ్‌ప్రకాశ్ మధుకర్ సహా ఇప్పటి వరకు 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

డేంజర్ మార్కు దాటేస్తున్న...

భగభగలు

ప్రచండమైన ఎండలతో అల్లాడుతున్న భూమి


శతాబ్ది చివరికల్లా భూతాపం 2.5 డిగ్రీలు పైకి! ● అప్పుడిక సర్వ నాశనమేనంటున్న తాజా సర్వే

ఈ వేసవిలో ఉత్తర భారతమంతా కనీవిని ఎండలతో తల్లడిల్లిపోయింది. ఢిల్లీలో ఏకంగా 40 రోజుల పాటు 40 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పై చిలుకు ఉష్ణోగ్రతలు నమోదై జనాలను బెంబేలెత్తించాయి.

అలస్కాలో హిమానీ నదాలు ఇటీవలి కాలంలో వేసిన అంచనాలను కూడా మించి శరవేగంగా కరిగిపోతున్నట్టు తాజా అధ్యయనాలు తేల్చాయి.

భూగోళానికి ఊపిరితిత్తులుగా చెప్పే అమెజాన్ సతత హరిత అరణ్యాలే క్రమంగా ఎండిపోతున్నాయి. ఎన్నడూ లేనంతగా కార్చిచ్చుల బారిన పడుతున్నాయి.

సౌదీ అరేబియాలో ఏకంగా 50 డిగ్రీలు దాటేసిన ఎండలకు తాళలేక 1,300 మందికి పైగా మరణించారు.



ఈ ఉత్పాతాలన్నీ సూచిస్తున్నది ఒక్కటే. భూగోళం శరవేగంగా విపత్కర పరిస్థితుల్లోకి వెళ్తోంది. వాతావరణ మార్పుల ప్రభావం శాస్త్రవేత్తల అంచనాలకు కూడా అందనంత దారుణ ప్రభావం చూపుతోంది. భూతాపం ఈ శతాబ్దంలోనే ఏకంగా 2.5 డిగ్రీలకు పైగా పెరిగి మొత్తం మానవాళినే వినాశనం వైపు నెట్టడం ఖాయమని వందలాది మంది ప్రపంచ ప్రఖ్యాత వాతావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు ముక్త కంఠంతో హెచ్చరిస్తున్నారు! పారిశ్రామికీకరణ ముందు స్థాయితో పోలిస్తే భూతాపం ఇప్పటికే 1.2 డిగ్రీ సెంటీగ్రేడ్ మేరకు పెరిగింది. అది 1.5 డిగ్రీలను దాటితే ఊహించని ఉత్పాతాలు తప్పవని సైంటిస్టులు ఎప్పటినుంచో మొత్తుకుంటున్నారు. అలాంటిది, ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే ఈ శతాబ్దాంతానికే భూతాపంలో పెరుగుదల 2.5 డిగ్రీల డేంజర్ మార్కును దాటేయడం ఖాయమని ప్రపంచ వాతావరణ సంస్థ నిర్వహించిన తాజా అంతర్జాతీయ సర్వే తేల్చింది. ఎండాకాలంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కనీవినీ ఎరగని విపరిణామాలు తదితరాలను పరిగణనలోకి తీసుకున్న మీదట ఈ అంచనాకు వచ్చింది. గత ఏడాది కాలంగా ప్రపంచవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు ప్రతి నెలా రికార్డులు బద్దలు కొట్టాయి. ఈ ఏడాది సంభవించిన ఎల్‌నినో ఇప్పటిదాకా నమోదైన ఐదు అత్యంత శక్తిమంతమైన ఎల్‌నినోల్లో ఒకటిగా నిలిచింది. శిలాజ ఇంధనాల వాడకం తదితరాల వల్ల జరుగుతున్న భారీ కాలుష్యం వంటివి వీటికి తోడవుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్‌లో మూడొంతులు కేవలం కార్బన్ డయాక్సైడ్ (సీఓటూ) ఉద్గారం వల్లనే జరుగుతోంది. వాతావరణంలో సీఓటూ స్థాయి పెరుగుతున్న కొద్దీ వేడిగాలులు, హరికేన్లు, కార్చిచ్చులు, వరదలు వచ్చిపడుతున్నాయి. గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాల్లో చైనా, అమెరికా, భారత్ టాప్ 3లో ఉన్నాయి. అయితే గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధానంగా సంపన్న దేశాలే కారణమని ఐపీఈ గ్లోబల్ క్లైమేట్ చేంజ్ హెడ్ అబినాశ్ మహంతీ చెప్పుకొచ్చారు. ఆ దేశాల్లో గత రెండు శతాబ్దాలుగా జరిగిన మితిమీరిన పారిశ్రామికీకరణ పర్యావరణానికి చెప్పలేనంత చేటు చేసిందని వివరించారు. ''ఇప్పుడు కూడా సంప్రదాయేతర ఇంధనాల వాడక తదితరాల ద్వారా గ్లోబల్ వార్మింగ్‌కు అడ్డుకట్ట వేస్తామన్న పెద్ద దేశాల ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయి. ఫలితంగా భరించలేని ఎండలు, ఆ వెంటే వరదలు, హరికేన్ల వంటి ఉత్పాతాలు కొన్నేళ్లుగా సాధారణ పరిణామంగా మారిపోతున్నాయి. ఇవన్నీ ప్రమాద సూచికలే'' అని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మేల్కొని గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలకు అడ్డుకట్ట వేయకపోతే పరిస్థితి చేయి దాటిపోయే రోజు ఎంతో దూరంలో లేదని హెచ్చరిస్తున్నారు. **- సాక్షి, నేషనల్ డెస్క్**

ఉత్తరాదిన పాతాళానికి భూగర్భ జలాలు
20 ఏళ్లలో 450 క్యుబిక్ కి.మీ. మేరకు మాయం

ఉత్తర భారతదేశంలో భూగర్భ జల వనరులు శరవేగంగా అడుగంటుతున్నాయి! ఎంతగా అంటే, 2002 నుంచి 2021 మధ్య కేవలం 20 ఏళ్లలోనే ఏకంగా 450 క్యుబిక్ కిలోమీటర్ల మేర భూగర్భ జలాలు లుప్తమైపోయినట్టు ఐఐటీ గాంధీనగర్ తాజా సర్వే తేల్చింది. దేశంలోకెల్లా అతి పెద్ద జలాశయమైన ఇందిరా సాగర్ మొత్తం నీటి పరిమాణానికి ఇది ఏకంగా 37 రెట్లు ఎక్కువని సర్వేకు సారథ్యం వహించిన ఐఐటీ గాంధీనగర్ సివిల్ ఇంజనీరింగ్, ఎర్త్ సైన్సెస్ విభాగంలో విక్రం సారాబాయి చైర్ ప్రొఫెసర్ విమల్ మిశ్రా వివరించారు! అందుబాటులో ఉన్న సంబంధిత గణాంకాలతో పాటు శాటిలైట్ డేటా తదితరాలను విశ్లేషించి ఈ మేరకు తేల్చినట్టు తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావం ఇలాగే కొనసాగితే ఈ ధోరణి మరింతగా ఊపందుకుంటుందని హెచ్చరించారు. ''ఉత్తరాదిన గత 75 ఏళ్లలో వర్షపాతం ఇప్పటికే 8.5 శాతం తగ్గిపోయింది. వాతావరణం 0.5 డిగ్రీల మేరకు వేడెక్కింది. దాంతో సాగునీటికి డిమాండ్ అమాంతంగా పెరిగిపోయి విచ్చలవిడిగా బోర్లు పుట్టుకొచ్చాయి. దాంతో కనీసం భూగర్భ జల వనరులు 12 శాతం తగ్గిపోయాయి'' అని మిశ్రా వెల్లడించారు. ఒక్క 2009లోనే వర్షాకాలంలో అల్ప వర్షపాతం, చలికాలంలో హెచ్చు ఉష్ణోగ్రతల దెబ్బకు ఉత్తరాదిన భూగర్భ జలాలు 10 శాతం మేర తగ్గిపోయాయని అంచనా! ''గ్లోబల్ వార్మింగ్ మరింత పెరిగే సూచనలే ఉన్నందున భూగర్భ జలాలు ఇంకా వేగంగా ఎండిపోయేలా ఉన్నాయి. ఎలా చూసినా ఇవన్నీ ప్రమాద సంకేతాలే. ఉత్తర భారత దేశంలో ఉష్ణోగ్రతలు గనుక 1 నుంచి 3 డిగ్రీల మేరకు పెరిగితే భూగర్భ జలాలు మరో 10 శాతం దాకా తగ్గిపోతాయి'' అంటూ సర్వేలో పాల్గొన్న హైదరాబాద్ ఎన్‌జీఆర్ఐ పరిశోధకులు కూడా ఆందోళన వెలిబుచ్చారు. సర్వే ఫలితాలను జర్నల్ ఎర్త్ తదుపరి సంచికలో ప్రచురించనున్నారు.

మనోళ్లు కొంటున్నది... పోషకాలున్న స్నాక్సే!

ఏం పదార్థాలు వాడారో 73 శాతం మంది భారతీయులు చదువుతున్నారన్న సర్వే

న్యూఢిల్లీ: మార్కెట్‌లో స్నాక్స్ కొనేటప్పుడు ప్యాక్‌పై ఉన్న వివరాలు తప్పనిసరిగా చదువుతున్నారా? అయితే ఈ లిస్ట్‌లో మీరూ ఉన్నట్టే. ఆహారపదార్థాలు, ప్రత్యేకించి స్నాక్స్ కొనేటప్పుడు దానిలో వాడిన పదార్థాలేంటి? అందులో ఏమాత్రం పోషక విలువలున్నాయని 73శాతం మంది భారతీయులు చదువుతున్నారని హెల్తీ స్నాకింగ్ రిపోర్ట్-2024 సర్వే తెలిపింది. దేశవ్యాప్తంగా 6వేల మందిపై సర్వే నిర్వహించి నివేదికను ఆదివారం విడుదల చేసింది. వీరిలో 93 శాతం మంది ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను ఎంచుకోవడానికే ఇష్టపడుతున్నారని తెలిపింది. ఆహార కల్తీకి సంబంధించి కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సుగంధ ద్రవ్యాలు, స్వీట్స్, ఇతర స్నాక్స్ ప్యాకెట్స్ కొనుగోలుదారులపై సర్వే నిర్వహించింది. ప్రతి 10 మందిలో 9 మంది సంప్రదాయ చిరుతిళ్లకు బదులుగా ఆరోగ్యకరమైన స్నాక్స్ కొనాలని చూస్తున్నారని తెలిపింది. డ్రైఫ్రూట్స్, నట్స్, తృణధాన్యాలతో చేసిన సహజమైన ఉత్పత్తులను కొనడానికి ఇష్టపడుతున్నారని తెలిపింది. డ్రైఫ్రూట్స్, తామర గింజలతో చేసిన పేలాల (మఖనా)ను హెల్తీ స్నాక్‌గా గుర్తించారు. పోషకాలు అత్యధికంగా ఉన్న వీటిని కొనడానికి 67శాతం మంది భారతీయులు ఆసక్తి చూపుతున్నారని సర్వే వెల్లడించింది.



ఉత్తరాదిన వరదలు

చార్‌ధామ్ యాత్ర నిలిపివేత

లక్నో/గువాహటి/కోల్‌కతా/పణజి: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు, వరద ముంచెత్తాయి. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్, అస్సాం, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అస్సాంలోని 29 జిల్లాల్లో భారీ వర్షాలకు దాదాపు 24 లక్షల మంది జనం ప్రభావితులయ్యారు. లక్షలాది మంది పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. పశ్చిమబెంగాల్‌లోని పర్వతప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొండప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిని రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి.

49 మందిని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్

మహారాష్ట్రలోని థానె, పాల్ఘర్‌లను భారీ వర్షాలు చుట్టుముట్టాయి. థానె పరిధిలోని షాపూర్ ప్రాంతంలో ఓ రిసార్ట్ పూర్తిగా జలమయమైంది. అందులో చిక్కిన 49 మంది పర్యాటకులను ఎన్డీఆర్ఎఫ్ రక్షించింది. గోవాలోనూ పాలీ జలపాతాన్ని చూసేందుకు నది ప్రవాహాన్ని దాటిన 80 మంది పర్యాటకులు వరదలో చిక్కుకుపోయారు. రాష్ట్ర పోలీసులు, అగ్నిమాపక, అత్యవసర విభాగ సిబ్బంది సమన్వయంతో వారిని కాపాడారు. బిహార్‌లో కోసీ, మహానంద, భాగమితి తదితర నదుల్లో ప్రవాహమట్టాలు ప్రమాదస్థాయిని దాటేశాయి.

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల ధాటికి చార్‌ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపేశారు. నేడు గర్వాల్ ప్రాంతంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. బద్రీనాథ్‌కు రహదారిపై కొండచరియలు విరిగిపడ్డాయి. జోషిమఠ్ సమీపంలో అలకనంద నది ఉధృతంగా ప్రవహిస్తోంది.



ఫ్రాన్స్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం పుదుచ్చేరిలో ఓటేస్తున్న స్థానికులు. ఇక్కడి వారిలో పలువురికి ఫ్రాన్స్ పౌరసత్వముంది

ఫ్రాన్స్ రెండో దశలో...

రికార్డు పోలింగ్

పారిస్: ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో ఆదివారం కీలకమైన రెండో దశలో రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఐదుగంటలకు 59.7 శాతం పోలింగ్ నమోదైనట్లు ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. 1981 తర్వాత ఇంతటి పోలింగ్ నమోదవడం ఇదే తొలిసారి. జూన్ 30వ తేదీన జరిగిన తొలి రౌండ్‌లో 67 శాతం పోలింగ్ జరిగింది. ఐరోపా ఎన్నికల్లో మధ్యేవాదుల పరాజయం తర్వాత అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ జూన్ 9న పార్లమెంట్‌ను రద్దు చేసి ఎన్నికలకు పిలుపునిచ్చారు. ఫ్రాన్స్‌లో అధ్యక్ష ఎన్నికలైనా, పార్లమెంటు ఎన్నికలైనా రెండు దశల్లో జరుగుతాయి. ఆదివారం జరిగిన రెండో దశ కీలకమైనది. మాక్రాన్ అధ్యక్ష పదవీ కాలం ఇంకా మూడేళ్లు ఉంది. ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల ఫలితాల వల్ల ఆయన పదవికి తక్షణ ప్రమాదం ఏమీ లేకున్నా, చట్టాలు చేసేటప్పుడు పార్లమెంటులో అడుగడుగునా పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. ముందస్తు ఎన్నికలకు వెళ్లిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌కు తొలిరౌండ్‌లో చేదు అనుభవం ఎదురైన విషయం తెల్సిందే. మేక్రాన్‌కు చెందిన మితవాద సెంట్రిస్ట్ ఎన్‌సెంబల్ కూటమి మూడో స్థానంలో సరిపెట్టుకుంది. తొలి రౌండ్‌లో అతివాద నేషనల్ ర్యాలీ కూటమి 33.14 శాతం ఓట్లను ఒడిసిపట్టి విజయం సాధించింది. విపక్షాలకు చెందిన న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమి 27.99 శాతం ఓట్లను సాధించింది. మేక్రాన్ పార్టీ కేవలం 20.04 శాతం ఓట్లతో సరిపెట్టుకుంది. ఇటీవల యురోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో నాయకురాలు మెరీన్ లీ పెన్‌కు చెందిన నేషనల్ ర్యాలీ పార్టీ విజయం సాధించింది. ఆలస్యం చేస్తే విపక్షాలు మరింత పుంజుకుంటాయన్న భయంతో మేక్రాన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లిన విషయం విదితమే.

కశ్మీర్‌లో రెండు ఎన్‌కౌంటర్లు

ఆరుగురు ఉగ్రవాదులు హతం ● ఇద్దరు సైనికుల వీరమరణం

శ్రీనగర్/రాజౌరీ/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో కుల్గాం జిల్లాలో ఆదివారం రెండు ఎన్‌కౌంటర్లలో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇద్దరు సైనికులు వీర మరణం పొందారు. ఉగ్రవాదులతో శనివారం ప్రారంభమైన కాల్పులు ఆదివారం ముగిశాయి. మోదెర్గామ్‌లో రెండు, చిన్నిగామ్‌లో నాలుగు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలియజేశారు. పారా కమాండో, మరో జవాను మృతిచెందినట్లు వెల్లడించారు. కశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలన ప్రక్రియ చివరి దశకు చేరుతోందని డీజీపీ ఆర్.ఆర్.స్వాయిన్ చెప్పారు. రాజౌరీ జిల్లాలో సైనిక శిబిరంపై ఉగ్రవాదుల కాల్పుల్లో ఓ జవాను గాయపడ్డాడు. ముష్కరుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

సీబీఐకి ఆర్మ్‌స్ట్రాంగ్ కేసు: మాయా



ఆదివారం ఆర్మ్‌స్ట్రాంగ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాయవతి

సాక్షి, చెన్నై: తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడు కె.ఆర్మ్‌స్ట్రాంగ్ (52) హత్యోదంతం కేసును సీబీఐకు అప్పగించాలని పార్టీ చీఫ్ మాయవతి డిమాండ్ చేశారు. ఆయన్ను శుక్రవారం రాత్రి చెన్నైలో గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడిచేసి దారుణంగా హత్య చేయడం తెలిసిందే. ఆదివారం పెరంబూరులో ఆర్మ్‌స్ట్రాంగ్ పార్థివదేహానికి మాయావతి నివాళులర్పించారు. ఆయన భార్యను ఓదార్చారు. తర్వాత మాట్లాడుతూ తమిళనాట శాంతిభద్రతలు శూన్యమంటూ మండిపడ్డారు. ''అసలు హంతకులు బయటే తిరుగుతున్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యతో తమిళ దళితుల్లో భయం గూడుకట్టుకుంది. వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అన్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతికకాయాన్ని పెరంబూరులోని బీఎస్పీ కార్యాలయంలో ఖననం చేయాలని భావించగా అది నివాస ప్రాంతమంటూ రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వలేదు. దాంతో ఈ వ్యవహారం హైకోర్టు దాకా వెళ్లింది. చివరికి చెన్నై శివారులో పొత్తూరులోని ఆర్మ్‌స్ట్రాంగ్ బంధువు భూమిలో ఖననం చేశారు.

ఖల్సా కలల్లో తప్పేముంది?

ఖలిస్తానీ నేత అమృత్‌పాల్ వ్యాఖ్యలు

చండీగఢ్: ''ఖల్సా రాజ్య స్థాపన గురించి కలలు కనడం గౌరవమే తప్ప నేరం కాదు. ఈ కల సాకారానికి లక్షలాది సిక్కులు జీవితాలను త్యాగం చేశారు'' అని ఖలిస్తానీ వేర్పాటువాది, లోక్‌సభ సభ్యుడు అమృత్‌పాల్ సింగ్ అన్నారు. అమృత్‌పాల్ సింగ్ ఖలిస్తానీ మద్దతుదారు కాదని, ఆయన్ను వెంటనే విడుదల చేయాలని తల్లి బల్వీందర్ కౌర్ కోరడం తెలిసిందే. ఆ ప్రకటన తనకు బాధ కలిగించిందంటూ అమృత్‌పాల్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బైక్‌ను ఢీకొట్టి.. మహిళను ఈడ్చుకెళ్లి

- ముంబైలో బీఎండబ్ల్యూ బీభత్సం
- మహిళ అక్కడికక్కడే మృతి
- నిందితుడు శివసేన నేత కుమారుడు

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలో ఓ బీఎండబ్ల్యూ కారు బీభత్సం సృష్టించింది. భార్యాభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైక్‌పై ఉన్న మహిళ అక్కడిక్కడే మృతి చెందింది. వర్లీ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఈ విషాద ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్లీలోని కోలివాడకు చెందిన చేపల వ్యాపారి అయిన ప్రదీప్, భార్య కావేరీ నఖ్వా(45)తో కలిసి సాసూన్ డాక్‌కు వెళ్లి చేపలు తీసుకుని తిరిగి వస్తున్నాడు. ఉదయం 5.30 నిమిషాల సమయంలో అనీబీసెంట్ రోడ్‌లో ప్రయాణిస్తుండగా అటుగా వస్తున్న లగ్జరీ కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పైన ఉన్న ఇద్దరూ గాల్లో ఎగిరి కారు బానెట్‌పై పడ్డారు. ఆ తరువాత కింద పడిన కావేరీని కారు కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ప్రమాదం జరిగిన వెంటనే కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను నాయర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కావేరీ చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. కారు డ్రైవర్ రాజేంద్రసింగ్ బిదావత్, పక్కనే ఉన్న మిహిర్ షా అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. మిహిర్ అధికార శివసేన నాయకుడు రాజేష్ షా కుమారుడు.

'సూరత్' మృతులు ఏడుగురు


సూరత్: శనివారం సూరత్ పట్టణంలో ఆరంతస్తుల భవంతి కూలిన ఘటనలో మరణాల సంఖ్య ఆదివారానికి ఏడుకు పెరిగింది. పాల్ ఏరియాలోని భవంతి శనివారం కూలినపుడు ఒకరిని రక్షించి, శిథిలాల కింద ఒకరి మృతదేహాన్ని గుర్తించిన విషయం తెల్సిందే. శనివారం నుంచి ఆదివారం దాకా కొనసాగిన శిథిలాల తొలగింపు, గాలింపు తర్వాత మరో ఆరు మృతదేహాలను గుర్తించారు. భవంతిలో నివసించే వారి నుంచి అద్దెలు వసూలుచేసే ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్‌చేశారు. శిథిలావస్థలో ఉన్న భవంతి యజమానులపై కేసు నమోదుచేశారు.

ఎల్‌ఏసీ పరిస్థితిపై ప్రజాభిప్రాయం: ఖర్గే

న్యూఢిల్లీ: చైనాతో సరిహద్దుల్లో పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నదే తమ పార్టీ అభిమతమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పునరుద్ఘాటించారు. వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి పాంగోంగ్ సరస్సు చుట్టుపక్కల ప్రాంతాల్లో చైనా శాశ్వత సైనిక శిబిరాలు, ఆయుధ, ఇంధన నిల్వల డిపోలను ఏర్పాటు చేసిందంటూ మీడియాలో వచ్చిన వార్తలను ఆయన ఆదివారం 'ఎక్స్'లో షేర్ చేశారు. ''2020 దాకా మన ఆధీనంలో ఉన్న పాంగోంగ్ సరస్సు సమీపంలోని సిరిజాప్ వద్ద చైనా మిలటరీ బేస్‌ను ఎలా నిర్మించింది? ఐదేళ్లుగా చైనా మన ప్రాదేశిక సమగ్రతను భంగం కలిగిస్తూనే ఉంది. ఎల్‌ఏసీ వెంట యథాతథ పరిస్థితులను కొనసాగించలేకపోతే మోదీ ప్రభుత్వానిదే బాధ్యత'' అన్నారు.

ఆరోరాల కనువిందు

ఒడిసిపట్టిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం



వాషింగ్టన్: భూ ఉపరితల నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో భూమి చుట్టూ చక్కర్లు కొడుతున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం అద్భుతమైన చిత్రాలను కెమెరాల్లో బంధించింది. కనువిందు చేసే ఆకుపచ్చ, ఊదా రంగుల కాంతి పుంజాల (ఆరోరా) ఫొటోలు, వీడియోలను భూమికి పంపింది. ఆరోరాల పైనుంచి అంతరిక్ష కేంద్రం పయనిస్తున్న సమయంలో ఈ అద్భుతం ఆవిష్కృతమైంది. ఉత్తర ధ్రువజ్యోతి అని, కాంతి ప్రవాహం అని పిలిచే ఆరోరాలు భూమి నుంచి అరుదుగా కనిపిస్తుంటాయి. గాలి రేణువులు, విద్యుత్ శక్తి కలిగిన సూర్యకాంతి రేణువులు భూ అయస్కాంత క్షేత్రంలో ఢీకొన్నప్పుడు అరోరాలు ఏర్పడుతుంటాయి. ఇవి సాధారణంగా ఆకుపచ్చ, ఎరుపు, పసుపు రంగుల్లో కనిపిస్తాయి.

అంతరిక్ష నడకల్లో చైనా రికార్డు

16 స్పేస్‌వాక్‌లు చేసిన వ్యోమగాములు

బీజింగ్: అంతరిక్ష పరిశోధనల్లో చైనా దూసుకెళ్తోంది. చైనా వ్యోమగాములు 16 స్పేస్‌వాక్‌లు నిర్వహించి సరికొత్త రికార్డు సృష్టించారు. భూదిగువ కక్ష్యలోని చైనా అంతరిక్ష కేంద్రం (సీఎస్ఎస్) 'తియాన్‌గాంగ్'లో షెన్‌జౌ-18 మిషన్‌లో భాగంగా బుధవారం ముగ్గురు వ్యోమగాములు యె గాంగ్‌ఫు, లీ కాంగ్, లీ గాంగ్‌సూ దాదాపు 6.5 గంటలపాటు స్పేస్‌వాక్ చేశారు. అంతరిక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చి, శూన్య వాతావరణంలో విహరించడమే స్పేస్‌వాక్. సీఎస్ఎస్ అప్లికేషన్, డెవలప్‌మెంట్ దశలో ఇది 16వ స్పేస్‌వాక్ అని చైనా అంతరిక్ష పరిశోధకులు తెలిపారు. సంబంధిత వీడియోలను విడుదల చేశారు. ఇందులో వ్యోమగామి లీ కాంగ్ తెల్ల రంగు స్పేస్ సూట్ ధరించి చేసిన తొలి స్పేస్‌వాక్ కనిపిస్తోంది. లీ కాంగ్ వెనుక భూగోళం స్పష్టంగా దర్శనమిస్తోంది. షెన్‌జౌ-18 మిషన్‌లో ఇది రెండో స్పేస్‌వాక్. ఇదే మిషన్‌లో మే 28వ తేదీన వ్యోమగాములు 8.5 గంటల పాటు స్పేస్‌వాక్ నిర్వహించారు. చైనా అంతరిక్ష పరిశోధనల్లో అత్యంత సుదీర్ఘకాలం జరిగిన స్పేస్‌వాక్ ఇదే కావడం విశేషం. సీఎస్ఎస్ నుంచి మొట్టమొదటి అంతరిక్ష నడక 2021 జూలై నెలలో జరిగింది. షెన్‌జౌ-12 మిషన్ వ్యోమగాములు 7 గంటలపాటు స్పేస్‌వాక్ చేశారు. షెన్‌జౌ-13 మిషన్‌లో మొట్టమొదటిసారిగా ఓ మహిళా వ్యోమగామి స్పేస్‌వాక్‌లో పాల్గొన్నారు. షెన్‌జౌ-14 మిషన్ ఆస్ట్రోనాట్స్ మూడు స్పేస్‌వాక్‌లు నిర్వహించారు. షెన్‌జౌ-15 మిషన్‌లో భాగంగా ఒకే వ్యోమగామి ఆరు నెలల వ్యవధిలో నాలుగు స్పేస్‌వాక్‌లు చేశారు. ప్రస్తుతం షెన్‌జౌ-18 మిషన్ కొనసాగుతోంది. మరికొన్ని స్పేస్‌వాక్‌లు చేసే, కొత్త రికార్డులు నెలకొల్పే అవకాశం కనిపిస్తోంది. భూదిగువ కక్ష్యలో పరిశోధనల విషయంలో చైనా ముందంజలో ఉంది. స్పేస్‌వాక్‌లు సునాయాసంగా చేయడం అనేది సాంకేతిక పరిపక్వతకు నిదర్శనం అని చెప్పొచ్చు.



టీఎంసీ ఎంపీ మొయిత్రాపై కేసు

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై కేసు నమోదైంది. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మపై ఎక్స్‌వేదికగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకుగాను కేసు నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. హత్రాస్‌లో తొక్కిసలాట మృతుల కుటుంబాలను రేఖా శర్మ పరామర్శించిన సందర్భంగా వర్షం పడుతుంటే పక్కనున్న ఆమెకు గొడుగు పట్టారు. ఆ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన మహువా 'నా గొడుగు నేనే పట్టుకోగలను' అని పోస్టు చేశారు. దీనిపై కేసు నమోదుకు ఎన్సీడబ్ల్యూ డిమాండ్ చేసింది.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

సోమవారం ⋅ 8 ⋅ జూలై ⋅ 2024

మరో బృహత్ ఎయిర్‌పోర్టు: మంత్రి

శివాజీనగర: రాష్ట్రంలో రెండో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తామని ఆదివారం భారీ, మధ్యతరహా పరిశ్రమల మంత్రి ఎం.బీ.పాటిల్ చెప్పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాధికారతో చేసుకున్న ఒప్పందం ప్రకారం, 2032 వరకు మరో విమానాశ్రయం నిర్మించరాదన్నారు. కొన్ని ప్రత్యేక రాయితీల వల్ల అంతవరకూ వేచి ఉండే పని లేదని, రెండో అంతర్జాతీయ విమానాశ్రయం స్థాపనకు సర్కారు నిర్ణయించిందని చెప్పారు. విమానాశ్రయానికి స్థలం ఎంపిక, భూ సేకరణ తదితరాలు మొదలైనట్లు తెలిపారు. బెంగళూరు దక్షిణలో ఒక విమానాశ్రయం అవసరమని, వైట్‌ఫీల్డ్, కనకపుర సహా ఐదారు స్థలాలను ఇప్పటికే గుర్తించామన్నారు. సీఎం, మంత్రిమండలిలో చర్చించి ఖరారు చేస్తామన్నారు.

న్యూస్‌రీల్

కరెంటు స్తంభానికి కారు ఢీ



శివమొగ్గ: వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటన శివమొగ్గ నగరంలో ఆల్కోళ ఎఫ్‌సీఐ ఆఫీసు ముందు వంద అడుగుల రోడ్డులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కారు వేగంగా వెళ్లి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టడంతో కారు ముందు భాగం దెబ్బతింది, కారులోనివారికి చిన్నపాటి గాయాలయ్యాయి. వెంటనే అక్కడున్నవారు కరెంటు బంద్ చేశారు. కరెంటు స్తంభం పూర్తిగా విరిగిపోయింది. దీంతో స్థానికంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. డ్రైవింగ్ రానివారు, మైనర్లు ఇష్టానుసారం కార్లు, బైకులు నడుపుతూ ఇలాంటి ప్రమాదాలకు పాల్పడుతున్నారని, ప్రజల ప్రాణాలతో ఆడుకునేవారిని కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు.

సామరస్యంగా పరిష్కారం చేసుకోవాలి



బొమ్మనహళ్లి: ఎలాంటి వివాదాలు ఉన్న కూడా వాటిని సామరస్యంగా పరిష్కారం చేసుకోవాలని, కోర్టుల వరకు లాగొద్దని హైకోర్టు న్యాయమూర్తి కృష్ణ ఎస్ దీక్షిత్ యువ న్యాయవాదులకు పిలుపునిచ్చారు. బెంగళూరు నగరంలోని సౌందర్య న్యాయ కళాశాలలో న్యాయవాదులు వాహిని పత్రిక సహకారంతో న్యాయ విభాగం విద్యార్థుల జాగృతి కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. న్యాయవాద వృత్తిలో ఉన్న వారు సమాన న్యాయం పాటించాలని అన్నారు. దేశంలో ఇప్పుడు చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏళ్ల నుంచి అవి పరిష్కారం కావడం లేదన్నారు. దీనికి న్యాయవాదులు, న్యాయమూర్తులు మాత్రమే బాధ్యులు కాదని, ఎలాంటి కేసు అయిన ఒకటి రెండు అప్పీళ్ల తరువాత పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు.

మోదీ సర్కార్‌తో సిద్దు అనవసర పేచీ

- కేంద్రమంత్రి కుమారస్వామి

దొడ్డబళ్లాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీతో కావాలని కయ్యానికి కాలుదువ్వుతున్నారని కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి విమర్శించారు. చిన్న విషయానికి, రాజకీయ ప్రేరితంగా కేంద్రంతో శతృత్వం వల్ల ప్రయోజనం లేదన్నారు. ప్రతీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రధానిని నిందించడమే పనిగా పెట్టుకుందన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈమేరకు మాట్లాడిన కుమారస్వామి రాష్ట్రం అభివృద్ధి అవసరాలు తీరాలంటే కేంద్రంతో సఖ్యతగా ఉండాలన్నారు. సిద్దరామయ్య మాటల వల్లే రాష్ట్రానికి నష్టం కలుగుతోందన్నారు. నిందారోపణల వల్ల కేంద్రానికి వచ్చే నష్టమేమీ లేదని, రాష్ట్రానికే నష్టమన్నారు.

ఎల్‌ఈడీ లైట్లను బిగిస్తే జరిమానా

- రాష్ట్రంలో 5 వేల వాహనాలకు చలానాలు



యశవంతపుర: అధిక వెలుగునిచ్చే, కళ్లు బైర్లు కమ్మేలా ఎల్‌ఈడీ లైట్లను వాహనాలకు అదనంగా బిగించుకోవడం ఇటీవల పెరిగింది. ఎక్కువ వెలుతురు వస్తుందని చాలా శక్తివంతమైన లైట్లను అమర్చుకుంటారు. కానీ దీనివల్ల ఎదురుగా వస్తున్న పాదచారులు, వాహనదారులకు దారి కనపడక ప్రమాదాలకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పోలీసులు అటువంటి లైట్లు బిగించిన వాహనాలపై దాడులు చేపట్టారు. ఇప్పటికి ఐదు వేల వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కళ్లు కుక్కే రీతిలోఎల్ఇడి లైట్లను వేసుకొన్న లారీ, ట్రక్, బస్, ఆటోలను గుర్తించి పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల వాహనాలకు జరిమానా విధించారు. బెంగళూరులో 2153, మైసూరు 302, తుమకూరు 237, ఉత్తర కన్నడ 236, రాయచూరు 260, విజయనగర 182 వాహనాలపై చలానాలు వేశారు. అధిక వెలుగునిచ్చే ఎల్ఇడి దీపాల వల్ల ఎదురుగా వచ్చే వాహనాల డ్రైవర్లకు చాలా ఇబ్బంది కలిగి రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. వాహనానికి అదనంగా ఎలాంటి లైట్లను బిగించరాదని సూచించారు.

డెంగీ డేంజర్

- రాష్ట్రంలో విపరీతంగా వ్యాప్తి
- 7 వేలకు చేరిన బాధితులు
- ఆస్పత్రులు కిటకిట





బెంగళూరులో జ్వర బాధితులకు పరీక్ష



మైసూరులో ఓ ఆస్పత్రిలో కిక్కిరిసిన రోగులు

బనశంకరి: ఎండాకాలం పోయి వర్షాకాలం రావడంతోనే దోమల బెడద విపరీతంగా పెరిగింది, ఫలితంగా రాష్ట్రంలో డెంగీ డేంజల్ బెల్ మోగిస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 7 వేల డెంగీ కేసులు వెలుగుచూడటంతో ప్రజలు భీతిల్లుతున్నారు. గత 24 గంటల అవధిలో రాష్ట్రంలో 175 మందిలో డెంగీ ధృవీకరణ కాగా, బీబీఎంపీ పరిధిలో 1,908 డెంగీ కేసులు ఉన్నాయి. బాధితులు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. అనేక ఆస్పత్రులు జ్వర బాధితులతో కిక్కిరిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 7 వేల డెంగీ కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

గదగ్, హాసన్‌లో ఒక్కొక్కరు మృతి

రాష్ట్రంలో డెంగీకి బాలలు అధికంగా బలవుతున్నారు. గదగ తాలూకా శిరుంజ గ్రామానికి చెందిన 5 ఏళ్ల బాలుడు తీవ్రజ్వరంతో బాధపడుతూ గదగ జిమ్స్ ఆసుపత్రిలో ఆదివారం చనిపోయాడు. హాసన జిల్లాలో 26 ఏళ్ల యువతి డెంగీ జ్వరంతో మరణించింది. హాసన్ జిల్లాలో 224 మంది డెంగీ బారినపడ్డారు.

నివారణ చర్యలు

నివారణ చర్యల్లో భాగంగా డెంగీ ప్రబలిన ప్రాంతాల్లో డ్రైనేజీలు, చెత్తడిబ్బలు, ఇతరత్రా ప్రదేశాలలో పురుగుమందులు స్ప్రే చేస్తూ దోమల నివారణ చేపట్టారు. చెరువులు, ఇళ్ల చుట్టుపక్కల ఉన్న నీటి ట్యాంకుల్లో దోమల గుడ్లను తినేసే గంబూసియా చేపలను వదిలారు.

పీడిస్తున్న ఔషధాల కొరత

డెంగీ భయపెడుతున్న తరుణంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔషధాల కొరత ఏర్పడటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలావరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్యారాసిటమాల్ మినహా మిగిలిన యాంటిబయాటిక్స్, ఇతర ముఖ్య ఔషధాల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వం నుంచి ఔషధాల కొనుగోలుకు నిధులు అందడంలేదని ఆరోపణలున్నాయి. సుమారు 7 వేల మంది డెంగీ బారినపడటంతో చికిత్సకు కావలసిన మందులు, ల్యాబొరేటరీ పరికరాల కొరత తలెత్తింది. సాధారణంగా ప్రతి ఏడాది ఆగస్టు నుంచి సెప్టెంబరు మధ్య డెంగీ వ్యాపించడం సహజం. ఈసారి గత రెండు నెలలుగా డెంగీ కేసులు పెరుగుతున్నా వైద్యారోగ్య శాఖ స్పందించలేదని విమర్శలున్నాయి. అనేక ఏళ్ల నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔషధాల సరఫరా 30 శాతానికి తగ్గింది. జిల్లా ఆసుపత్రుల్లో వందమంది రోగులు చికిత్స తీసుకుంటే వారిలో 30 శాతం మందికి మాత్రమే ఔషధాలు ఇవ్వగలరు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రమాణం 60 నుంచి 70 శాతానికి పెంచింది. వైద్యులు బయట తెచ్చుకోవాలని రోగులకు చీటి రాసిస్తారు, దీంతో ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనక తప్పడం లేదని రోగులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సౌకర్యాల కొరత కూడా ఎక్కువగా ఉంది. రోగం వస్తే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేవారు అక్కడి దుస్థితిని గమనించి కోపోద్రిక్తులు అవుతారు. ప్రస్తుతం డెంగీ సమస్యతో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళితే డాక్టర్లు బయటకు ఔషధాలు రాసిస్తారు. పేద రోగులు ఖరీదైన మందులను కొనలేకపోతారు. దీంతో జబ్బుకు సరిపడా చికిత్స అందదు.


వైద్య ఉద్యోగిని మృత్యువాత

మైసూరు: మైసూరు జిల్లాలో డెంగీ మహమ్మారి తాండవం చేస్తోంది. డెంగీబారిన పడి మహిళ మృతి చెందిన సంఘటన నగరంలో జరిగింది. మైసూరులోని జయదేవ హృద్రోగ ఆస్పత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న లలిత మృతురాలు. ఆమె ఇటీవల డెంగీ జ్వరానికి గురైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి ఆదివారం మరణించింది. గత గురువారం జిల్లాలోని హుణసూరు సముదాయ ఆరోగ్య కేంద్రం వైద్యుడు కూడా డెంగీతోనే మరణించారు. జిల్లాలో ఇద్దరు, అందులోనూ వైద్య సిబ్బందిని డెంగీ పొట్టనబెట్టుకుంది.



మృతురాలు లలిత (ఫైల్)

సేవాయజ్ఞంగా నేడు వైఎస్సార్ జయంతి



మహానేత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి

బనశంకరి: పేదల పెన్నిధి, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, అపర భగీరథునిగా పేరుగాంచిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ ఘనంగా నిర్వహించనుంది. పలు సేవా కార్యక్రమాలను చేపట్టనుంది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు యలహంక ఓల్డ్‌టౌన్ శ్రీ చౌడేశ్వరి దేవస్థానం వెనుక నీలకంఠేశ్వర ప్రభుత్వ కన్నడ, తెలుగు, తమిళ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, స్టేషనరి సామగ్రిని వితరణ చేయనున్నారు. అలాగే కేక్ కట్ చేస్తారు. డాక్టర్ వైఎస్సార్, జగనన్న అభిమానులు, పార్టీ కార్యకర్తలు అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐటీ వింగ్ నేతలు తెలిపారు. మరిన్ని వివరాలకు - 9035193106, 9703518965 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. వీలైతే పాఠశాల విద్యార్థులకు ఇవ్వడానికి ఏ4 సైజు రూల్డ్ నోట్‌బుక్స్ తీసుకురాగలరని పేర్కొన్నారు.

రాష్ట్రంలో డెంగీ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- విపక్షనేత ఆర్.అశోక్

శివాజీనగర: రాష్ట్రంలో డెంగీ కేసులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వ వెంటనే డెంగీ ఎమర్జెన్సీ ప్రకటించి అందరికి ఉచితంగా వైద్యం అందించాలని బీజేపీ పక్ష నేత ఆర్ అశోక్ డిమాండ్ చేశారు. బెంగళూరులో డెంగీ కేసులు అధికమవుతున్న నేపథ్యంలో జయనగర సంజయ్ గాంధీ జనరల్ ఆసుపత్రికి మాస్కు లేకుండా భేటీ చేసిన ఆయన, రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ... జనవరి నుంచి డెంగీ అధికమైందని, జూలై మాసానికి ప్రమాదకరంగా మారిందన్నారు. ప్రతి రోజు ముగ్గురు, నలుగురు చనిపోతున్నారని, వారిలో పిల్లలు కూడా ఉన్నారన్నారు. కోవిడ్ తరహాలో డెంగీకి ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలి, అధికారులు ఏసీ రూమ్ నుండి బయటికి వచ్చి పని చేయాలని అన్నారు. ఇక నగరంలో పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా తాను ప్రభుత్వాన్ని హెచ్చరించే పని చేస్తున్నాను. తమ రాష్ట్రాధ్యక్షుడితో పాటుగా మిగతా నాయకులు కూడా సోమవారం నుండి ఆసుపత్రులను సందర్శిస్తారని అన్నారు.

సీఎం మార్పు, అదనపు డీసీఎంలపై చర్చలు ఆపండి

- కాంగ్రెస్ హైకమాండ్ సందేశం

శివాజీనగర: రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు, అదనపు ముఖ్యమంత్రి పదవులు ఉండవని కాంగ్రెస్ అధిష్టానం స్పష్టం చేసింది. ప్రస్తుత పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండదని అధిష్టానం సందేశం పంపింది. రాజకీయ మనుగడ కోసం వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కొందరికి ముఖభంగమైంది. అత్యున్నత స్థాయిలో చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా లేవనెత్తుతూ గందరగోళం సృష్టించడంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ హైకమాండ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వివాదాస్పద ప్రకటనలు చేస్తున్న కొందరు నేతలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా ఫోన్ చేసి మాట్లాడారు. నిత్యం వివాదంలో ఉండాలంటే పదవులకు రాజీనామా చేసి ఆ తరువాతే ప్రకటనలు చేయాలని ఘాటుగా సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి స్థానం గురించి వివాదాలు సృష్టిస్తే అది పరిపాలనపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అధిష్టానం జోక్యం చేసుకుని వివాదాలకు ముకుతాడు వేయాలని సిద్దరామయ్య ఇటీవల ఢిల్లీ భేటీలో హైకమాండ్‌ను కోరారు. ఈ నేపథ్యంలో రణ్‌దీప్‌సింగ్ సుర్జేవాలా రాష్ట్ర నాయకులకు ఘాటుగా హెచ్చరిక ఇచ్చారని తెలిసింది. ఇకపై వ్యాఖ్యలు చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని చెప్పినట్లు సమాచారం.

త్వరలో ముడా స్థల అక్రమాల వెల్లడి: మంత్రి

మైసూరు: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారలో 50:50 నిష్పత్తిలో ఇళ్ల స్థలాలను తీసుకొన్నవారి పేర్లను త్వరలోనే తాము ప్రజల ముందు పెడతామని మంత్రి హెచ్‌సీ మహదేవప్ప అన్నారు. ఆదివారం జలదర్శిని అతిథి గృహంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముడాలో 50:50 పద్ధతిలో ఇళ్ల స్థలాలను కొన్నవారిలో వివిధ రాజకీయ పార్టీలకు చెందినవారున్నారు, వారు ఎవరెవరికి ఈ స్థలాలను ఇప్పించారు అనే పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. చట్టపరంగా మంజూరు అయిన స్థలాల గురించి ఏమీ మాట్లాడనని, చట్టవ్యతిరేకంగా పొందిన స్థలాల గురించి విచారణ జరుగుతుందని అన్నారు. కాగా, సీఎం సిద్దరామయ్య కుటుంబ సభ్యులు అక్రమంగా ఇళ్ల స్థలాలను పొందారని ఆరోపణలు రావడంతో మంత్రి ఈ మేరకు స్పందించారు.

మహదాయి వివాదమేమిటి?

- బెళగావి జిల్లాలో కేంద్ర బృందం టూర్



మహదాయి జలానయన ప్రాంతంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

సాక్షి, బళ్లారి: బెళగావి జిల్లాలో గోవాతో వివాదంలో ఉన్న మహదాయి జలానయన ప్రాంతాన్ని కేంద్ర వరద అధ్యయన బృందం పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. ఈ బృందం మొదట చోర్లగాట్, అరతాళ కాలువను పరిశీలించిన తర్వాత బెళగావి జిల్లా ఖానాపుర తాలూకాలోని కనకుంబి అతిథి గృహంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులతో చర్చలు జరిపారు. కళసా బండూరి యోజన గురించి అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. తరువాత కళసా బండూరి ప్రాజెక్టు స్థలానికి వెళ్లి పరిశీలించారు. రాష్ట్ర నీరుపారుదల మండలి ఎండీ రాజేష్ అమ్మినబావి మీడియాతో మాట్లాడుతూ మొత్తం 8 మందితో కూడిన కేంద్ర బృందం పర్యటించి పరిశీలించిందన్నారు. మహదాయి ప్రాజెక్టు ప్రాంతంలో ఏం జరుగుతుందో పరిశీలించిందని చెప్పారు. ఇప్పుడు కర్ణాటక అసలు రాజకీయం బయటపడుతుందని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ చేసిన ట్వీట్‌ను విలేకరులు ప్రస్తావించగా అది తనకు తెలియదన్నారు. కేంద్ర బృందం వచ్చింది కర్ణాటకకు అనుకూలం కోసమేనా? అన్న ప్రశ్నకు జవాబు చెప్పకుండా నమస్కరించి ఆయన వెళ్లి పోయారు.

గోవా సీఎం విమర్శలు

కాగా అంతకు ముందు కేంద్ర బృందానికి బెళగావి జిల్లాలో చోర్ల సరిహద్దులో నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు స్వాగతం పలికారు. మహదాయి పోరాట యోధుల వ్యతిరేకత మధ్య బెళగావికి కేంద్ర బృందం వచ్చింది. గోవా సర్కారు ఒత్తిడి మేరకే ఈ బృందాన్ని కేంద్రం నియమించిందనే విమర్శలున్నాయి. రెండు రాష్ట్రాలకు చెందిన మహదాయి నదిపై తమ అనుమతి లేకుండా కర్ణాటక మహదాయి ప్రాజెక్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని గోవా సీఎం ప్రమోద్ సావంత్ తరచూ ఆరోపిస్తున్నారు.

పారిశుధ్యానికి పెద్దపీట: మంత్రి

శివాజీనగర: రాష్ట్రంలో డెంగీ జ్వరాలను అరికట్టడానికి అన్ని గ్రామ పంచాయితీలు చర్యలను చేపట్టాలని గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆదేశించారు. తాగునీరు ట్యాంక్‌లు, చెరువులు, కుంటలు తదితరాలను శుభ్రం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలన్నారు. ఎవరూ ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలల్లోనూ పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

డీ గ్యాంగ్‌కు బిగుస్తున్న ఉచ్చు

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్ అండ్ గ్యాంగ్‌కు ఉచ్చు బిగుస్తోంది. పోలీసులు సేకరించిన సాక్ష్యాధారాలన్నీ నిందితులకు వ్యతిరేకంగా నిరూపితమవుతున్నాయి. హత్య జరిగిన స్థలం, శవాన్ని తరలించిన వాహనాలు తదితర ప్రదేశాల్లో సేకరించిన వేలిముద్రలు 10 మంది నిందితుల వేలిముద్రలతో సరిపోయాయి. 10 మంది నిందితుల్లో పవిత్రగౌడ, దర్శన్ కూడా ఉన్నారు. డీఎన్ఏ శాంపిల్స్ కూడా మ్యాచ్ అవుతున్నాయి. హత్యానేరం తనపై రాకుండా దర్శన్ రూ.30 లక్షలు ఇచ్చి ఏ మనుసులను పురమాయించాడో వారే ఈ కేసులో కీలక సాక్షులుగా మారారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు కూడా ఈ కేసులో ప్రముఖ సాక్ష్యంగా నిలిచింది.

ఆగుంబె అందం



రుతు పవనాల రాకతో అడవులు కొత్త అందాలను సంతరించుకున్నాయి. మోడువారిన చెట్లు పచ్చగా మారాయి. మేఘాలు వాటిని తాకుతూ వెళ్తున్నాయి. శివమొగ్గ జిల్లా ఆగుంబె అడవుల్లో మనోహర దృశ్యం

రాజధానిలో లక్ష కొత్త ఆటోలకు అనుమతి



శివాజీనగర: బెంగళూరులో ఆటో రిక్షాల సంఖ్యను పెంచేందుకు రవాణా శాఖ ఆమోదించింది. కొత్తగా లక్ష ఆటో రిక్షాలకు లైసెన్స్‌లు ఇవ్వాలని ప్రభుత్వం తీర్మానించింది. ఇప్పటికే వాహనాల ఒత్తిడితో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఐటీ సిటీలో మరిన్ని ఆటోలు రోడ్లపైకి రానున్నాయి. బెంగళూరులో ప్రస్తుతం 1,55,000 ఆటో రిక్షాలకు పర్మిట్ ఉంది. దీనిని 2,55,000కు పెంచుకోవచ్చని రవాణా శాఖ ఆదేశించింది. ఇంతకు ముందు 2018లో 1,25,000 ఉన్న ఆటోలను 1,55,000 కి పెంచడానికి అనుమతించారు. దీంతో 30 వేల కొత్త ఆటోలు వినియోగంలోకి వచ్చాయి. అంతకు ముందు కూడా 2011లో ఆటోల పెంపునకు అనుమతి ఇచ్చారు.

తీరాన్ని వీడని వానలు



ఆదివారం బెళగావి జిల్లా గోకాక్ వద్ద జలపాతం పరవళ్లు



మంగళూరు పణంబూరు బీచ్‌లో అలల తీవ్రత



మంగళూరు శివార్లలో లారీపై కూలిన చెట్టు

- అరేబియాలో అలజడి

యశవంతపుర: అరేబియా సముద్రంలో తుపాను వాతావరణం వల్ల వర్షాలు కురిసే అవకాశముంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటూ కరావళి జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు. మలెనాడులో ప్రాంతంలో మంచి వానలు కురుస్తున్నాయి. శివమొగ్గ జిల్లా హొసనగర తాలూకాలో కుండపోత కురిసింది. ఉత్తరకన్నడ, ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాల్లో అప్రమత్తత ప్రకటించారు. మంగళూరు తీరంలో అరేబియా సముద్రంలో ఉవ్వెత్తున అలలు వస్తున్నాయి. బీచ్‌ల వద్ద సందర్శకులు సముద్రంలోకి వెళ్లరాదని ప్రకటించారు. పెనుగాలులకు కొన్నిచోట్ల రోడ్లపై చెట్లు విరిగి పడ్డాయి. బెంగళూరు నగర, గ్రామాంతర, హాసన్, శివమొగ్గ, చిక్కమగళూరు, మండ్య, మైసూరు, తుమకూరు, కొడగు జిల్లా వ్యాప్తంగా భారీ వానలు పడవచ్చు. చామరాజనగర, మైసూరు, కోలారు, రామనగర దావణగెరె, బళ్లారి జిల్లాలలో ఓ మోస్తరు వానలు పడొచ్చని వాతావరణ అధికారులు తెలిపారు. మరోవైపు హావేరి, గదగ, కొప్పళ సహా కళ్యాణ కర్ణాటకలో వానలు లేక కరువు పరిస్థితి అలముకొంది.

గోకాక్ జలపాతం కనువిందు

ఎగువన మహారాష్ట్రలో వర్షాల వల్ల బెళగావి జిల్లా గోకాక్ వద్ద జలపాతం జీవం సంతరించుకుంది. ఆదివారం నుంచి నిండుగా ప్రవహిస్తోంది. దీంతో సందర్శకులు తరలివచ్చారు.

జగన్నాథ రథయాత్ర



రమణీయంగా స్వామి వారి రథాలు

రాయచూరు రూరల్: పూరిలో ప్రఖ్యాత జగన్నాథ రథయాత్ర సందర్భంగా ఆదివారం రాయచూరులోనూ ఇస్కామ్ టెంపుల్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను నిర్వహించారు. ఇస్కాన్ ఆలయం నుంచి చెరువు వరకు మూడు తేరులను ఊరేగించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు నృత్యాలు చేస్తూ జై జగన్నాథ్ అని నినాదాలు చేశారు.

క్లుప్తంగా

జలసిరి సంరక్షణ బాధ్యత మనందరిది



ప్రారంభిస్తున్న శశికాంత్ శివపురె

రాయచూరు రూరల్: జిల్లాలో జలసిరిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జెడ్పీ ఉప కార్యదర్శి శశికాంత శివపురె అభిప్రాయపడ్డారు. ఆదివారం జెడ్పీ జల నిర్మల సభాగంణంలో జలసేవా చారిటబుల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన అమృత వర్షిణి పథకం శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. భూగర్భ జలాల స్థాయిని పెంపొందించాలన్నారు. వాన నీరు, చెరువు నీరు, వ్యవసాయ నీటి కుంటలు, చెక్ డ్యాంలు, బావుల మరమ్మతు వంటివి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు అభివృద్ధి అధికారి చేతన్ కుమార్, చంద్రశేఖర్, శశికాంత్ కామేల్కర్, శోభ, పద్మ, వెంకటేష్, శ్రీధర్, శిల్ప, నాగరాజ్, పల్లవి, మమత, శంకరప్పలున్నారు.

జెడ్పీ సీఈఓకు వీడ్కోలు



జెడ్పీ సీఈఓను సన్మానిస్తున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: విజయనగర జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభుకు వీడ్కోలు కార్యక్రమం శనివారం సాయంత్రం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షత వహించిన జిల్లాధికారి దివాకర్ మాట్లాడుతూ సదాశివ ప్రభు జిల్లాలో గ్రామీణ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమన్నారు. కానీ వృత్తిలో మనం చేసిన సేవలు మాత్రం ప్రజల్లో చిర కాలం గుర్తుంటాయన్నారు. అనంతరం సదాశివ ప్రభు మాట్లాడుతూ తాను జిల్లాలో సుమారు 14 నెలలు జెడ్పీ సీఈఓగా సేవలు అందించానన్నారు. జిల్లా ప్రజలు, అధికారులు, సిబ్బంది తనపై చూపిన ఆప్యాయత మరువలేనిదన్నారు. నూతన జెడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్ మహమ్మద్ అలీ అక్రమ్ షా, సదాశివ ప్రభు భార్య గీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తామంటూ బెదిరింపులు

హుబ్లీ: కుసుగల్ రోడ్డులో బైక్ ఓవర్‌టేక్ చేసిన విషయానికి సంబంధించి సదరు వ్యక్తిపై ముగ్గురు దాడి చేసి ప్రాణాలు తీస్తామంటూ బెదిరించిన ఘటనపై కేశ్వాపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గదగ్ రోడ్డు గాంధీవాడ నివాసి రాకేష్ మనిగేటి కుసుగల్ రోడ్డు వద్ద బైక్ ఓవర్‌టేక్ చేశాడు. ఈ క్రమంలో మరో బైక్‌పై ఉన్న ముగ్గురు రాకేష్‌పై దాడి చేసి చంపుతామంటూ బెదిరించారు.

బురదదారిపై నాట్లు వేసి నిరసన



నడి రోడ్డులో నాట్లు వేస్తున్న దృశ్యం

మైసూరు: బురద దారిపై నాట్లు వేసి గ్రామస్తులు నిరసన తెలిపిన ఘటన మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా హాడీ గ్రామంలో చోటుచేసుకుంది. గిరిజనులు నివాసం ఉంటున్న ఈ గ్రామంలో సరైన రోడ్డు సౌకర్యం లేదు. వర్షం పడితే కనీసం నడవడానికి కూడా సాధ్యం కాదు. పలుమార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో ఆదివారం గ్రామస్తులు బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్ల వసతి కల్పించాలని వారు కోరారు.

ఘనంగా ప్రతిష్ఠాపన వేడుక



పూజలు చేస్తున్న దృశ్యం


మండ్య: కృష్ణాపుర గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయం, చెలువరాయస్వామి ఆలయం ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వివిధ ధార్మిక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పురోహిత్ గణేశ్ ఆచార్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

హాస్టల్ విద్యార్థులకు పరామర్శ

రాయచూరు రూరల్: హాస్టల్‌లో భోజనం వికటించి చికిత్స పొందుతున్న 30 మంది విద్యార్థులను మాన్వి శాసన సభ్యుడు హంపయ్య నాయక్ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. సంగాపుర రోడ్డులోని రాజలబండ మొరార్జి దేశాయి(గురుకుల) పాఠశాలలో తాగు నీటి ట్యాంకులో అధికంగా బ్లీచింగ్, క్లోరిన్ పౌడర్లు కలిపిన నీటితో వంట చేయడంతో బాలబాలికలకు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరిన సంగతి విదితమే. హాస్టల్ వార్డెన్లు, సంబంధిత అధికారులు సకాలంలో అందుబాటులో లేకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ఎమ్మెల్యే అధికారులపై మండిపడ్డారు.

ఆశలు రేపుతున్న తుంగభద్రమ్మ

- రోజురోజుకూ జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం
- పొలం పనులతో అన్నదాతలు బిజీబిజీ



రైతుల జీవనాడిగా పేరొందిన తుంగభద్ర జలాశయం



ఆయకట్టు కింద ఇప్పటికే సిద్ధంగా ఉన్న వరినారుమళ్లు

సాక్షి,బళ్లారి: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలో బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర, అనంతపురం, కర్నూలు, వైఎస్‌ఆర్ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లాలకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయమైన తుంగభద్ర డ్యాంలో జలకళ ఉట్టిపడుతోంది. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల తుంగభద్ర డ్యాంలో ఇదే సమయానికి కేవలం 4 టీఎంసీల లోపు నీరు నిల్వ ఉండటంతో ఇన్‌ఫ్లో కూడా లేకపోవడంతో తుంగభద్ర ఆయకట్టు రైతులు సకాలంలో పంటలు పెట్టలేక తీవ్ర నష్టాల పాలయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి అదునులో వర్షాలు పడటంతో పాటు తుంగభద్ర డ్యాంకు ఎగువ ప్రాంతాలైన ఆగుంబె, శృంగేరి, తీర్థహళ్లి ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో తుంగభద్ర డ్యాంలో రోజు రోజుకూ నీటిమట్టం పెరుగుతోంది.

సకాలంలో సాగు నీరు వదిలే అవకాశం

ఆదివారం కూడా డ్యాంలోకి ఇన్‌ఫ్లో 45 వేల క్యూసెక్కులు రావడంతో డ్యాంలో నీటి నిల్వ 20 టీఎంసీలకు పైగా చేరుకోవడంతో రైతులకు సకాలంలో కాలువలకు నీరు వదిలే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తుంగభద్ర డ్యాం నుంచి హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ కాలువలకు ఈనెల 20 నుంచి నీరు విడుదల చేయాలని అధికారులు ముందుగానే నిర్ణయించడంతో ఆమేరకు కాలువలకు నీరు వదిలేందుకు తగినంత నీరు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని టీబీడ్యాం ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి సాక్షికి తెలిపారు. డ్యాంలో నీటి నిల్వ 40 టీఎంసీలకు చేరితే కాలువకు నీరు వదిలేందుకు వీలుంటుందన్నారు. ఖచ్చితంగా డ్యాంలోకి 20వ తేదీ లోపు 40 టీఎంసీల నీరు చేరుతుందనే నమ్మకం ఉందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుడా పొలాల్లో దుక్కులు దున్నుకుని, పంటలు పెట్టేందుకు సిద్ధం చేసుకోవాలన్నారు.

వరినారుకు పెరిగిన డిమాండ్

డ్యాంలో నీటి నిల్వ పెరుగుతుండటంతో వరినారుకు డిమాండ్ ఏర్పడుతోందని రైతులు పేర్కొంటున్నారు. నీటిపారుదల వసతి కలిగిన రైతులు ముందుగా వరినారు పోసుకుని కాలువలకు నీరు వదిలిన తర్వాత ఆయకట్టు రైతులకు నారుమళ్లు అమ్మకాలు చేస్తుంటారు. రెండు రోజులు క్రితం జిల్లాలో కురిసిన వర్షానికి పొలాల్లో దుక్కులు దున్నే పనిలో ఆయకట్టు రైతులు బిజీబిజీగా ఉంటున్నారు. ట్రాక్టర్లు, ఎద్దులతో ఆయకట్టు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. అదునులో వర్షాలు కురవడంతో ఆయకట్టు రైతులు ఖరీఫ్‌లో వరినాట్లు సకాలంలో వేసుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ముందుకు కదులుతున్నారు. వరితో పాటు మిర్చి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను ఆయకట్టు పరిధిలో సాగు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.



ఖరీఫ్ సీజన్‌కు ట్రాక్టర్‌తో దుక్కి దున్ని పొలాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

సాయి అవతార వైభవం



అవతార వైభవంలో ఆదిపర్వం నృత్యరూపకం ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

- మురిపించిన భక్తుల ప్రదర్శన



సంగీత విభావరి నిర్వహిస్తున్న సంగారెడ్డి జిల్లా సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి అవతార వైభవాన్ని చాటుతూ భక్తులు నిర్వహించిన సంగీత నృత్య రూపకం ఆద్యంతం అలరించింది. పర్తి యాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన సంగారెడ్డి జిల్లా సత్యసాయి భక్తులు ఆదివారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో మహా సమాధి చెంత సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. ఉదయం సంగీత విభావరి పేరుతో భక్తిగీతాలు ఆలపించారు. ఆదిపర్వం పేరుతో సాయంత్రం సంగీత నృత్యరూపకం తన్మయుల్ని చేసింది. సత్యసాయి అవతరించి భువిపై ప్రదర్శించిన లీలలను, మానవాళికి అందించిన సేవలను చాటి చెప్పారు.

భక్తాభీష్ట దాయిని రాజలక్ష్మి దేవి



అలంకరణలో రాజలక్ష్మి దేవి



దేవాలయ ఆవరణలో లభించిన శిలాశాసనం

- కోర్కెలు ప్రసాదించే దేవతగా ప్రసిద్ధి

గౌరిబిదనూరు: తాలూకా చిక్కకురుగోడు సమీపంలోని శ్రీ చక్ర సహిత రాజలక్ష్మి దేవాలయం భక్తాభీష్ట దాయినిగా ప్రసిద్ధి చెందింది. సంతానం ప్రాప్తించే అమ్మగా కొలుస్తారు. ఇక్కడికి భక్తులు శుక్రవారాలు వచ్చి పూజలు చేసి సంతానం, వివాహం కావాలని మొక్కుకుంటారు. ఈ దేవాలయం నిర్జన ప్రదేశంలో చిన్నగుట్టపై ఉంది. తరచూ నెమళ్లు, జింకలు సంచరిస్తూ ఉంటాయి.

శిలా శాసనాల ప్రకారం స్థల చరిత్ర

ఇక్కడున్న బండరాయిపై చెక్కిన శిలా శాసనంలో పైనుంచి కిందకు, కింద నుంచి పైకి రెండు శాసనాలు కన్నడ భాషలో చెక్కబడింది. మొదటిది క్రీ.శ. 1524వ అక్టోబరు 27న చెక్కబడిన దానిలో ఇప్పటి హిందూపురానికి సమీపంలోని పరిగి అప్పటి(పరవి) సంస్థానాన్ని పాలిస్తున్న ఓబప్ప నాయక, చిన్నప్ప నాయకులు ఇక్కడ తమ తల్లిదండ్రులకు పాలించే విజయనగర రాజులకు మంచి జరగాలని అహోబిలం నరసింహస్వామి దేవాలయం నిర్మించినట్లు తెలపబడింది. కింది నుంచి పైకి చెక్కబడిన శాసనం 1527 జనవరి 7న చెక్కినట్లు ఉంది. దానిలో ఈ దేవాలయానికి ఓబప్ప నాయక, చిన్నప్ప నాయకులు ఇక్కడ సంతను ఏర్పాటు చేసి దానినుంచి వచ్చే సుంకాన్ని దేవాలయం పూజా కార్యాలకు వినియోగించారని సారాంశం. ఇటీవల శాసనాలను పరిశోధించిన నిపుణులు నరసింహన్,, ధనపాల్ ఆమేరకు వివరించారు.

రాజలక్ష్మి ఆలయ ప్రతిష్ఠకు కారణాలు



ఆధునీకరించిన ఆలయం

అహోబిలం నరసింహస్వామి దేవాలయం ఆవరణలో ఉన్న రాజలక్ష్మి దేవాలయాన్ని నిధుల కోసం దొంగలు ధ్వంసం చేయడం జరిగింది. దేవీ విగ్రహాన్ని సైతం భగ్నం చేశారు. చిత్రదుర్గానికి చెందిన భక్తుడి కలలో దేవి కనబడి ఇక్కడ వెలిసినానని పూజలకు సౌకర్యం చేయించాలని ఆదేశించగా వారు వచ్చి వెతకగా పొదల మాటున రాజలక్ష్మి దేవి విగ్రహం కనిపించింది. దానినే ప్రతిష్ఠించి పూజలకు ఏర్పాటు చేశారు. కాలక్రమంలో భూమరాజు నరేంద్ర శర్మ ఇక్కడి దేవాలయం గొప్పతనాన్ని తెలుసుకొని వచ్చి పూజించగా సంతానం లేని వీరికి కవలలను దేవి ప్రసాదించిన పిదప వీరు ఇక్కడే ప్రధాన అర్చకులుగా పనిచేయడం ప్రారంభించారు. భిన్నమైన అమ్మవారి విగ్రమున్న చోట హిందూపురానికి చెందిన శిల్పి నాగరాజు చెక్కిన నూతన రాజలక్ష్మి దేవి విగ్రహాన్ని 2004లో ప్రతిష్ఠించారు. ప్రస్తుతం రాజగోపురం, ధ్వజస్తంభం నిర్మాణాలు సైతం జరిగాయి. ప్రతి శుక్రవారం భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం సైతం ఏర్పాటు చేశారు. అయితే వెనుకన ఉన్న ప్రాచీన అహోబిల నరసింహస్వామి దేవాలయం అభివృద్ధికి నోచుకోకపోవడం విచారకరం.

సీఎం, డీసీఎం పదవులపై రచ్చ తగదు

- ఎక్సైజ్ మంత్రి ఆర్‌జీ.తిమ్మాపుర

హుబ్లీ: ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవులకు సంబంధించిన విషయం నడివీధుల్లో చర్చించుకొనే అంశం కాదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి ఆర్‌బీ.తిమ్మాపుర అసంతృప్తి వెళ్లగక్కారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ రెండు పదవులకు ఎంతో ఘనత, ప్రాధాన్యత ఉందన్నారు. నడివీధుల్లో రచ్చ చేసే విషయం కాదన్నారు. ఈ విషయంలో రూపురేఖలు ఉన్నాయన్నారు. హైకమాండ్ ఉంది. నాలుగు గోడల మధ్య చర్చించాలి. అలాకాకుండా ఎక్కడ పడితే అక్కడ చర్చించరాదన్నారు. మీడియా ప్రతినిధులే సీఎం, డీసీఎంలపై చర్చిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్పీ, టీఎస్పీ నిధుల దుర్వినియోగంపై స్పందించిన ఆయన ఆ నిధులు ఎట్టి పరిస్థితుల్లోను దుర్వినియోగం కాలేదన్నారు. వాస్తవాలను చూడండి అన్నారు. బీసీలకు సహాయం చేసే ప్రవృత్తి సీఎంకు ఉందన్నారు. ఏ బీసీ వర్గాలకూ అన్యాయం జరగలేదన్నారు.

విపక్షాలది అనవసర రాద్ధాంతం

ఈ విషయంలో విపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ బార్ వ్యాపారస్తులకు వ్యాపార స్నేహి అదాలత్ ప్రారంభించే అంశంపై మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖలో ఇది తప్పకుండా జరగాల్సిన కార్యక్రమం అన్నారు. గోవాలో చాలా లిక్కర్ తక్కువ ధరకే దొరుకుతుందన్నారు. ఇక్కడ ఎటువంటి పన్నులు లేవన్నారు. గోవా, మహారాష్ట్రలకు స్పిరిట్ సరఫరా అవుతుందన్నారు. ముందుగా దీన్ని అడ్డుకోవాలన్నారు. కర్ణాటక లిక్కర్ బాగుంది. ఇతర రాష్ట్రాల నాసిరకం లిక్కర్ మన రాష్ట్రానికి రాకుండా నివారించాలన్నారు. ఇప్పట్లో మద్యం ధర పెంచబోమన్నారు. ధర పెరుగుతుందన్న వార్తలు కేవలం ఊహాగానాలే అన్నారు. ఎంఎస్‌ఈఎస్‌లకు ఇక ముందు అనుమతి ఇవ్వడంపై ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. బార్‌లకు ఇబ్బంది కలుగుతుందని కాదు, ఇది పాలనా పరంగా తీసుకున్న నిర్ణయం అన్నారు.

ఆన్‌లైన్‌లో రూ.7.19 లక్షల వంచన

హుబ్లీ: తనకు తెలియకుండా తన బ్యాంక్ ఖాతా నుంచి ఆన్‌లైన్ ద్వారా రూ.7.19 లక్షలను బదలాయించుకున్నారని బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడి వినాయక నగర శివానంద నింబక్కనవర్ బ్యాంక్ ఖాతాలో డబ్బులు బదిలీ కావడంపై శివానంద ఫోన్‌కు మొబైల్ సందేశం వచ్చింది. వెంటనే బ్యాంక్‌కు వెళ్లి పరిశీలించగా ఆన్‌లైన్‌లో బదలాయించుకున్నట్లుగా తేలింది. అందుకే తన ఖాతాలోని డబ్బుల్లో కోత పడిందని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కోలారు వార్తలు...

పుణ్య క్షేత్రాలకు బస్సు సౌకర్యం

కోలారు : జిల్లాలోని వివిధ డిపోల నుంచి రాష్ట్రంలోని వివిధ ధార్మిక, పుణ్య క్షేత్రాలకు నూతన బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నామని, పుణ్యక్షేత్రాలకు వెళ్లదలచినవారు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేఎస్‌ఆర్టీసీ డివిజనల్ కంట్రోలర్ ఓ ప్రకటనలో తెలిపారు. కోలారు నుంచి పావగడ, సిగందూరు, మలెమహదేశ్వర బెట్ట, మూడబిద్రె, మంగళూరు, ధర్మస్థల, కేజీఎఫ్ నుంచి సిగందూరు, కమ్మరడి, శ్రీనివాసపుర నుంచి మంగళూరు, మాలూరు నుంచి తిరుపతి, ముళబాగిలు నుంచి తిరుపతి, సోమవారపేటె, సిగందూరు, ఆగుంబె, కుక్కె సుబ్రమణ్య, తీర్థహళ్లి మార్గాల్లో నూతనంగా బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

భారీ పరిశ్రమలు స్థాపించండి



ఎంపీకి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కేజీఎఫ్ : నిరుద్యోగ యువత కోసం బృహత్ పరిశ్రమలను స్థాపించాలని ఎంపీ మల్లేష్‌బాబుకు స్వాభిమాని వర్గం తాలూకా అధ్యక్షుడు దయానంద్, మోహనకృష్ణ మనవి చేశారు. ఆదివారం వారు ఎంపీని ఆయన స్వగృహంలో సన్మానించిన అనంతరం వినతిపత్రం సమర్పించారు. నిరుద్యోగ సమస్య అధికమై యువతీ యువకులు ఉద్యోగాల కోసం నిత్యం వేల సంఖ్యలో బెంగళూరుకు వెళుతున్నారన్నారు. తాలూకాలో పరిశ్రమలు స్థాపిస్తే నిరుద్యోగ సమస్య పరిష్కారమై యువత స్థానికంగానే ఉద్యోగాలు చేసుకుని జీవిస్తారన్నారు. బీజీఎంఎల్ కార్మికులకు రూ.52 కోట్ల నివృత్తి నిధిని చెల్లించేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు పి.దయానంద్, బీజీఎంఎల్ నివృత్త కార్మికులు పాల్గొన్నారు.

మారణాయుధాలతో తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్

హుబ్లీ: మారణాయుధాలతో సంచరిస్తున్న ఓ వ్యక్తిని ఏపీఎంసీ నవనగర పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రెండు తల్వార్లను స్వాధీనం చేసుకున్నారు. రాయాపుర నివాసి డ్రైవర్ తిప్పన్న సిశనళ్లి అరెస్ట్ అయిన నిందితుడు. బహిరంగ స్థలంలో గూడ్స్ వాహనంలో మారణాయుధాలను పెట్టుకుని సంచరిస్తున్నాడన్న ఆరోపణలపై అతడిని అరెస్ట్ చేసి సంబంధిత ఆయుధ చట్టం ఉల్లంఘన సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఆ స్టేషన్ సీఐ సమీర్ ఉల్లా తెలిపారు.

అభివృద్ధి పనుల పూర్తికి సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: చిక్కతిరుపతి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో రూ.14 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం ఎమ్మెల్యే కేవై నంజేగౌడ పరిశీలించారు. అభివృద్ధి కార్యక్రమాలను సత్వరం పూర్తి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. ఆలయ ప్రాంగణంలో రథం సంచారానికి రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టిన కాంక్రీట్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఆలయానికి నిత్యం, యేటా నిర్వహించే బ్రహ్మరథోత్సవానికి కూడా అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం హయాంలో కాంక్రీట్ రహదారి నిర్మాణానికి దేవదాయ శాఖా మంత్రి రామలింగారెడ్డి నిధులు మంజూరు చేసి పనులను కూడా ప్రారంభించారన్నారు. ఆలయ సమగ్ర అభివృద్ధికి అన్ని చర్యలు చేపడతామన్నారు. ఆలయ ఈఓ టి.సెల్వమణి, జీపీ అధ్యక్షుడు టీఎం రాంప్రసాద్ ఉన్నారు.

వసతి పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత వెంకటేష్ అయ్యంగార్ పేరిట తాలూకాలోని కెసరగెరెలో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వసతి పాఠశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే కేవై నంజేగౌడ పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వసతి పాఠశాలను అన్ని సౌకర్యాలతో మూడు నెలల్లోగా సీఎం లేదా డీసీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందన్నారు. మాస్తి గ్రామంలో రహదారులకు మరమ్మతులు చేసి అభివృద్ధి చేస్తామన్నారు. రహదారులు, పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామన్నారు. బీఈఓ హెచ్‌ఎన్ చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయనరసింహ, పీఎల్‌డీ బ్యాంకు డైరెక్టర్ చెన్నరాయప్ప తదితరులు ఉన్నారు.

ఎస్డీఎంసీ అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

కోలారు: తాలూకాలోని ఆరాభికొత్తనూరు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి నిర్వహణ సమితి(ఎస్డీఎంసీ)నూతన అధ్యక్షుడిగా వి.రాఘవేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిని సమితి సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఎన్నిక అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ సభ్యులు, ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి ప్రయత్నిస్తానన్నారు. పాఠశాలకు దాతల సహకారం తీసుకోడానికి విశేషంగా కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ అధ్యక్ష స్థానం అధికారం కాదు, పాఠశాల అభివృద్ధి బాధ్యత అన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరుగుదొడ్డి, సీసీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ పాలకవర్గంపై ఒత్తిడి తేవాలన్నారు. ప్రధానోపాధ్యాయిని తాహీరా సుభ్రత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మొక్కల పోషణ ప్రతి ఒక్కరి బాధ్యత

కోలారు: మొక్కలను నాటి పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. ఆదివారం నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవాళితో పాటు అన్ని ప్రాణి పక్షులకు స్వచ్ఛమైన గాలిని అందించేది కేవలం చెట్లు మాత్రమేనన్నారు. చెట్లను నరకడం సులభం కానీ వాటిని పోషించడం ఎంతో ముఖ్యమన్నారు. పరిసరాల సంరక్షణతోనే మానవాళి ఆయుర్దాయం పెరుగుతుందన్నారు. భావి తరాలకు ఉత్తమ వాతావరణంతో కూడిన పరిసరాలను అందించే బాధ్యత మనదే అన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు తమ విద్యా సంస్థల్లో మొక్కలను నాటి పెంచాలన్నారు. ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ కరోనా సమయంలో ఆక్సిజన్ లభించక ప్రజలు అనుభవించిన ఎన్నో కష్టాలను గుణపాఠంగా తీసుకుని ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లాధికారి అక్రం పాషా, అటవీశాఖ ఉప సంరక్షణాధికారి ఏడుకొండలు, జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప, ఏఎస్పీ జగదీష్‌లున్నారు.

బాలల సృజన



ఆదర్శ గ్రామం నమూనాతో బాలలు

మైసూరు: నగరంలోని హెచ్‌డి కోటె రోడ్డులో ఉన్న పూర్ణ చేతన పాఠశాలకు చెందిన సుమారు 132 మంది విద్యార్థులు దేశంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతుల సమస్యలకు పరిష్కారం చూపుతూ స్మార్ట్ విలేజ్ నమూనాను రూపొందించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు 17 గంటల పాటు శ్రమించి తమ కలల గ్రామాన్ని తీర్చిదిద్దారు.

ఫాగింగ్‌తో దోమల బెడదకు చెక్



యంత్రంతో ఫాగింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నగరసభ సిబ్బంది దోమల నియంత్రణ కోసం ఆదివారం ఫాగింగ్ యంత్రంతో ఫాగింగ్ నిర్వహించారు. తాలూకాలో డెంగీ నియంత్రణలో ఉన్నా ముందు జాగ్రత్తగా నగరసభ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించి దోమలను నాశనం చేసే ప్రయత్నం చేశారు. తాలూకాలో ఇప్పటికే మొత్తం 7 డెంగీ కేసులు నమోదు కాగా అందరూ కోలుకున్నారు. ఆరోగ్య శాఖ నుంచి డెంగీ పరీక్షలను నిర్వహించడానికి డెంగీ కిట్‌లను అందించారు. జ్వరంతో బాధపడుతూ వచ్చే ప్రతి ఒక్కరికీ, ప్లేట్‌లెట్ల సంఖ్య 1 లక్ష కంటే తక్కువగా ఉంటే వెంటనే డెంగీ పరీక్షను నిర్వహిస్తున్నారు. డెంగీ కేసులు పెరిగితే చికిత్స అందించడానికి తాలూకా వైద్యాధికారులు అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 10 ప్రత్యేక బెడ్‌లను ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టు మృతి



మధు (ఫైల్)

మండ్య: జాతీయ రహదారిలో నిలబడి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన మృతి చెందిన ఘటన శనివారం రాత్రి మండ్య జిల్లా మద్దూరు తాలూకా మళవల్లి రోడ్డులో చోటు చేసుకుంది. మృతుడిని తాలూలోని బేసగరహళ్లి గ్రామానికి చెందిన మధుకుమార్ (32)గా గుర్తించారు. విలేకరిగా పనిచేస్తున్న మధుకుమార్ మళవల్లి మార్గంలో బైక్‌పై వెళ్తుండగా లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలంటూ మోసం

హుబ్లీ: ముంబై షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు సంపాదించవచ్చని నమ్మించిన కేటుగాళ్లు ఓ వ్యక్తిని మోసగించిన ఘటన వెలుగు చూసింది. స్థానిక కుబుసదవీధికి చెందిన ప్రశాంత్ మురుగోడ నుంచి రూ.18 లక్షలను తమ ఖాతాలోకి బదలాయించుకొని మోసగించినట్లుగా బాధితుడు నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా

అపర దేశ భక్తుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ



ముఖర్జీ చిత్ర పటానికి నివాళి

గౌరిబిదనూరు: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అపర దేశభక్తుడని, యువత ఆయనను మార్గదర్శకంగా తీసుకోవాలని బీజేపీ అధ్యక్షుడు మార్కెట్ మోహన్ అన్నారు. శనివారం సాయంత్రం శ్యామ్ ప్రకాశ్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని ఇక్కడి బజార్ రోడ్డులో ఉన్న బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ...న్యాయవాదిగా ప్రజలకు ఎంతో సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మురళీధర్, మాజీ అధ్యక్షుడు రవినారాయణరెడ్డి, జయణ్ణ, వేణు మాధవ్, రాఘవేంద్ర, వెంకటాద్రి, పార్వతమ్మ, మంజునాథ, హోటల్ రమేశ్ బాబు, కృష్ణయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడు మృతి

యశవంతపుర: అదుపుతప్పి రాజకాలువ డ్రైనేజీలో పడి కొట్టుకుపోయిన యువకుని మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది 24 గంటల పాటు కష్టపడి మైసూరు రోడ్డు వంతెన కింద కాలువలో చిక్కుకున్న హేమంత్‌కుమార్ (27) మృతదేహాన్ని బయటకు తీశారు. ఇతడు బ్యాటరాయనపుర చెందినవాడు. శుక్రవారం రాత్రి 10:30 గంటలకు పని ముగించుకొని బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. జ్ఞానభారతి మెట్రో స్టేషన్ వద్ద బైకు డివైడర్‌ను ఢీకొని కాలువలోకి పడిపోవడంతో నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. అప్పటినుంచి గాలింపు చర్యలు జరుగుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

యశవంతపుర: ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన యలహంక ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు... కేరళకు చెందిన మహ్మద్ సుహేల్, అనిరుద్ ఇద్దరు స్నేహితులు. శనివారం రాత్రి హుణసమారనహళ్లిలో భోజనం చేసుకుని ఎన్‌ఫీల్డ్ బైక్‌లో బయలుదేరారు. బెంగళూరు-బళ్లారి రోడ్డు బీఎస్‌ఎఫ్ క్యాంప్ ఎదురుగా వాహనం అదుపుతప్పడంతో రోడ్డు పక్కన ఉన్న గ్రిల్‌కు ఢీకొని మహ్మద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అనిరుద్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. యలహంక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లడాక్‌లో పర్యటన



లడాక్‌లో కమిటీ సభ్యులు

యశవంతపుర: కర్ణాటక సార్వజనిక లెక్కపత్ర సమితి సభ్యులు ఉత్తర భారత అధ్యయన పర్యటన చేపట్టారు. ఎమ్మెల్యే సీసీ పాటీల్ నేతృత్వంతో ప్రజా లెక్కల సమితి అధ్యయనం చేయటానికి లడాఖ్‌లో పర్యటించింది. గత గురువారం సమితి సభ్యులు ఉత్తర భారత పర్యటనకు బయలుదేరి వెళ్లారు. లేహ్, ఢిల్లీ, ఇండోర్, అమృతసర్‌లో అధ్యయనం పూర్తి చేసిన కమిటీ లడాఖ్‌కు చేరుకుంది. ఆయా రాష్ట్రాలలో జరిగే ప్రజ లెక్క పత్రాల మాదిరిని తెలుసుకుంటూ స్థానిక పర్యాటక కేంద్రాలను వీక్షిస్తున్నారు.

రాష్ట్ర అభివృద్ధి ఆగిపోయింది

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో సీఎం, డీసీఎం మధ్య జరుగుతున్న కోల్డ్ వార్ కారణంగా రాష్ట్ర అభివృద్ధి జరగడం లేదని కేంద్రమంత్రి శోభా కరంద్లాజె ఆరోపించారు. ఆదివారం బెంగళూరు శేషాద్రిపురంలోని మెట్రో హోటల్‌లో జరిగిన మెమోరి ఛాంపియన్ షిప్ కార్యక్రమంలో హాజరైన ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో డెంగీ కేసులు, మరణాలు పెరుగుతున్నాయని, ప్రభుత్వం మాత్రం ఇవేమీ పట్టించుకోవడం లేదన్నారు. ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతోందని, వారికి సరిపడా మందులు అందుబాటులో లేవన్నారు. డెంగీ పరీక్షలకు ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాన్ని ఎక్కడా తీసుకోవడంలేదని, ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు.

కేఆర్‌ఎస్ నుంచి విశ్వేశ్వరయ్య కాలువకు నీరు

బనశంకరి: కేఆర్‌ఎస్ పరివాహక ప్రాంతంలోని విశ్వేశ్వరయ్య కాలువకు కావేరీనీరు విడుదల చేస్తామని వ్యవసాయశాఖమంత్రి చెలువరాయస్వామి తెలిపారు. ఆదివారం విధానసౌధలో కావేరి నీరావరి సలహాసమితితో సమావేశమైన అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం కేఆర్‌ఎస్ నీటిమట్టం 100 అడుగులకు పైగా చేరుకుంది. సాధారణంగా జూలై మొదటి రెండోవారంలో నీటిని విడుదల చేయడం ప్రారంభమౌతుంది. ఈసారి మార్చి, ఏప్రిల్‌లో నీరు విడుదల చేయడం సాధ్యంకాకపోవడంతో చెరువులు ఎండిపోవడంతో చెరువుల్లో నీరు నింపాలని ఈ ప్రాంత ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. 8 తేదీ సోమవారం నుంచి 15 రోజుల పాటు కావేరి నీటిని విడుదల చేయాలని తీర్మానించామని తెలిపారు. కాలువలో సుమారు 30 కిలో మీటర్ల పనులు పూర్తయ్యాయని అన్నారు. సుమారు 3000 క్యూసెక్కులు నీరు విడుదల చేయాలని తీర్మానించామని మంత్రి చలువరాయ స్వామి తెలిపారు.



హంపీ విరుపాక్షేశ్వర ఆలయం



హంపీలోని ఏకశిల రాతిరథం



కూర్గు కాఫీ తోటలు

పర్యాటకుల స్వర్గధామం ఈ నేల

- ప్రకృతి సౌందర్యాలతో కనువిందు చేసే అందాలు
- రుతుపవన కాలంలో తప్పక వీక్షించాల్సిందే

బనశంకరి: కర్ణాటక ప్రకృతి రమణీయ ప్రదేశాలకు నిలయం. ఒక్కసారి చూస్తే చాలు జీవితంలో మళ్లీ మరచిపోలేని అనుభూతి పొందుతారు. అందుకే పర్యాటకులు పెద్ద ఎత్తున పర్యటిస్తారు. అందమైన బీచ్‌లు, ఆకర్షణీయమైన ఆర్కిటెక్చర్, పశ్చిమ కనుమలు, జలపాతాలు, అడవులు, హిల్‌స్టేషన్లు పర్యాటకులు మదిదోచేస్తాయి. ఇక్కడ చారిత్రక కట్టడాలు, ప్యాలెస్‌లను వీక్షించే పర్యాటకులు మంత్రముగ్ధులను చేస్తాయి. రుతుపవనాలు ప్రారంభం కాగానే కర్ణాటకలో ప్రకృతి అందం మరింత రెట్టింపు అవుతుంది. వర్షాకాలంలో ఇక్కడ పచ్చదనం రమణీయత ఎంతో భిన్నంగా ఉంటుంది. మాన్‌సూన్‌లో కర్ణాటకను సందర్శించాలంటే మాత్రం ఈ ప్రదేశాలను చూసి తరించాల్సిందే.

చిక్‌మగళూరు...

చిక్‌మగళూరు దీనిని అధికారికంగా కాఫీల్యాండ్ ఆఫ్ కర్ణాటక అని పిలుస్తారు. పశ్చిమ కనుమలు హిల్‌స్టేషన్ మల్లయనగిరి పర్వతాలు దిగువన ఉంటుంది. ప్రశాంతమైన స్వభావం, పచ్చని అడవులు, యాగాచి నదికి ప్రసిద్ధి. కెమ్మనగుండి, కుద్రేముఖ్, కుద్రేముఖ్‌జాతీయ ఉద్యానవనం, మల్లయనగిరి, హెబ్బేఫాల్స్, బాబాబుడాన్‌గిరి, సందర్శించడానికి ఉత్తమమైన ప్రదేశాలు. సముద్రమట్టానికి 3400 అడుగుల ఎత్తులో ఉంటుంది ఈ ప్రదేశం. బెంగళూరు నుంచి 242 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ హిరేకొలలేసరస్సు, మాణిక్యధార ఫాల్స్, అయ్యనకెరె సరస్సు, మల్లయనగిరి ప్రదేశాలు పర్యాటకులను అబ్బురపరుస్తాయనడంలో ఎలాంటి సందేహంలేదు.

హంపీ....

హంపీ కర్ణాటకలో అత్యంత అందమైన ప్రదేశాల్లో ఒకటి వర్షాకాలం ప్రారంభంతో ప్రకృతి మరింత శోభాయమానంగా ఉంటుంది. ఇక్కడ పాడిప్రాంతం పచ్చని పచ్చిక బయళ్లుగా మారుతుంది. హంపీలోని సహజ దృశ్యాలతో మమేకమై అనేక దేవాలయాలు వర్షం రాకతో మరింత అందంగా కనిపిస్తాయి. హంపీ కర్ణాటకలో లోతైన లోయలు, కొండలతో దాగి ఉంది. తుంగభద్ర నది ఒడ్డున ఉన్న ఈ పురాతన నగరాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. ఇక్కడ విజయనగర సామ్రాజ్యం శిథిలమైన దేవాలయ శిథిలాలు ఆనవాళ్లు ఉంటాయి. ఇది కర్ణాటకలో సందర్శించడానికి ఉత్తమమైన ప్రదేశాల్లో ఒకటి. మీకు చరిత్ర తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటే ఈ ప్రదేశం కచ్చితంగా సందర్శించాలి. ఇక్కడి కళాకారులు హస్తకళను చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. బెంగళూరు నుంచి హంపీ 340 కిలోమీటర్ల దూరంలో ఉంది.

భూతల స్వర్గం కూర్గ్...


కొడగు లేదా కూర్గుగా వ్యవహరించే ఈ ప్రాంతం ప్రకృతి అందాలకు ప్రపంచ ప్రసిద్ధి. ఇక్కడ కాఫీతోటలు వర్షాకాలంలో మరింత మనోహరంగా ఉంటాయి. ఇక్కడి ఈడెన్‌గార్డెన్స్ దృశ్యాలు పర్యాటకులు హృదయాన్ని తాకుతాయి. దీనిని భారత స్కాట్‌ల్యాండ్ అని కూడా అంటారు. కొడగు అని కూడా పిలుస్తారు. మడికేరి పట్టణం, హై పాయింట్ రాజాసీటు, అబ్బేఫాల్స్ వీక్షణ కూర్గ్ పర్యాటకులు స్వర్గధామం. కర్ణాటకలో ఈ హిల్‌స్టేషన్ చాలా ప్రసిద్ధిచెందింది. సహజసౌందర్యం, రుచికరమైన వంటకాలను ఇక్కడ ఆస్వాదించవచ్చు. బెంగళూరు నుంచి ఈ ప్రాంతం 265 కిలో మీటర్ల దూరంలో ఉంది.

సకలేశ్‌పుర....

సకలేశ్‌పుర మలెనాడులోని పశ్చిమ కనుమల దిగువన గల ప్రదేశం. సకలేశపుర పర్యాటకులను కనువిందు చేస్తుంది. ఇక్కడ కాఫీ, టీ, యాలకులు, మిరియాల తోటతో కప్పబడిన పచ్చని కొండల మధ్య ట్రెక్కింగ్ చేయవచ్చు. ఇది ఒక అద్భుతమైన అనుభవం. ఈ నగరంలో అనేక జలపాతాలు, పాత కోటలు, గొప్ప దేవాలయాలు అందమైన కొండలతో కూడిన హాట్‌స్పాట్‌లను వీక్షించవచ్చు.



చిక్కమగళూరులోని మల్లయనగిరి




కూర్గులోని స్టేహోమ్‌లు



కొడగులోని అబ్బే జలపాతం

నేడు హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లో వైఎస్సార్ జయంతి



జయంతి వేడుకల పోస్టర్

బొమ్మనహళ్లి: రైతు పక్షపాతి, ఆరోగ్యశ్రీ ప్రదాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను బెంగళూరు బొమ్మనహళ్ళి హెచ్‌ఎస్ ఆర్ లేఔట్‌లో సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ అభిమానులైన సీ.కృష్ణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, లక్ష్మిరెడ్డి, పిల్లారెడ్డిలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఇక్కడి వాజ్‌పేయి క్రీడా మైదానం వద్ద కూల్ జాయింట్ సర్కిల్‌లో మహాయోగి వేమన విగ్రహం వద్ద ఉదయం సుమారు 9 గంటలకు జయంతి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. కేక్ కటింగ్‌తో పాటు పేదలకు అన్నదానం చేస్తామని, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అంబులెన్స్ దగ్ధం

మైసూరు: రోడ్డు పక్కన నిలిపి ఉంచిన అంబులెన్స్ ఆకస్మికంగా దగ్ధమైన ఘటన నమైసూరు నగరంలోని ద్యావప్ప సర్కిల్లో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. అంబులెన్స్‌లో ఇంజిన్ వేడి కారణంగా మంటలు వచ్చి ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దేవరాజు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బేకరీలో తిని డబ్బులు అడిగేతే దాడి

బేకరీలో తిన్న వాటికి డబ్బులు చెల్లించాలని అడిగిన వ్యక్తిని కత్తితో పొడిచిన ఘటన మైసూరు నగరంలోని హొటెగళ్లికాలో చోటుచేసుకుంది. ఇక్కడ కృష్ణా బేకరీలో పనిచేసే మహ్మద్ సాజిద్ బాధితుడు. రౌడీషీటర్ ప్రజ్వల్, సంజు అనే ఇద్దరు బేకరీలో పఫ్‌లు తిన్నారు. వాటికి డబ్బులు అడిగినందుకు మహ్మద్‌ను చాకుతో పొడిచారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

చెరువులో మట్టిని తరలించరాదు



కరేకల్లహళ్ళి చెరువులో పరిశీలన

గౌరిబిదనూరు: సమీపంలోని కరేకల్లహళ్ళి చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో తహసీల్దారు మహేశ్ పత్రి ఆదివారం చెరువును పరిశీలించారు. సంబంధిత శాఖల అనుమతి లేనిదే చెరువులలో మట్టిని, ఇసుకను తీయడం నేరం, మట్టిని తీయడానికి నిర్ణీత రాయల్టీని చెల్లించి మట్టిని తీయాలి. కరేకల్లహళ్ళి చెరువులో కొందరు అక్రమంగా 10 అడుగుల లోతు వరకు మట్టిని తీశారు. అలాంటి వారికి నోటీసులు జారీ చేయాల్సిందిగా పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశిస్తాన్నారు. మట్టిని తీయడం వల్ల గుంతలు ఏర్పడి వర్షాలు వచ్చినపుడు గుంతలు నీటితో నిండి పశువులు, మనుషుల మునిగిపోయే ప్రమాదం ఉందని అన్నారు. కాబట్టి అక్రమ మట్టి రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ ఎఇఇ రఘునాథ మూర్తి పాల్గొన్నారు.

లాల్‌బాగ్‌లో అంబేడ్కర్ థీమ్ ఫ్లవర్‌షో

బనశంకరి: ఈ ఏడాది పంద్రాగస్టు స్వాతంత్ర దినోత్సవం నేపథ్యంలో లాల్‌బాగ్ ఫ్లవర్ షోలో బాబాసాహేబ్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ థీమ్‌ను ఏర్పాటు చేయాలని ఉద్యానవనశాఖ తీర్మానించింది. ఆగస్టు మొదటివారంలో ఫ్లవర్‌షో ప్రారంభం కానుండగా అవసరమైన ఏర్పాటన్లు ఉద్యానవనశాఖ అధికారులు చేస్తున్నారు. లాల్‌బాగ్ గ్లాజ్‌హౌస్‌లో అంబేడ్కర్ విగ్రహం భారత రాజ్యాంగ ఆకృతి, అంబేడ్కర్ జీవిత నేపథ్యం, ఆయన ఆదర్శాలను పూల ఆకృతులు ద్వారా ప్రదర్శన చేపడతారు.

స్థలాలు తీసుకోలేదు

మైసూరు: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార నుంచి తాను ఏ ఒక్క ఇంటి స్థలం కూడా తీసుకోలేదని, తీసుకున్నట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే ఎస్టీ సోమశేఖర్ సవాల్ విసిరారు. ఆదివారం ఆయన మైసూరు ముడాలో ఇంటి స్థలాల పంపిణీలో జరిగిన అక్రమాలపై మీడియాతో మాట్లాడారు. ముడా నుంచి తను ఇంటి స్థలం తీసుకోలేదని, ఎవరికి కూడా ఇంటి స్థలం ఇప్పించలేదన్నారు. ఈ విషయంలో తన పేరును తీసుకురావొద్దని కోరారు.

బసవేశ్వర చరిత్రలో లోపదోషాలు

- వీరశైవ శివాచార్య అసహనం

శివాజీనగర: ప్రస్తుత విద్యా సంవత్సర తొమ్మిదో తరగతి సాంఘిక శాస్త్ర పుస్తకంలో వీరశైవ బసవేశ్వర చరిత్రకు సంబంధించి అనేక లోపదోషాలు ప్రకటితమయ్యాయి. వీటిని సరిచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అఖిల భారత వీరశైవ శివాచార్యుల సంస్థ విన్నవించింది. ఈ మేరకు మెజిస్టిక్‌లో ఉన్న సర్పభూషణ శివయోగిల మఠంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన విభూతిపుర వీరసింహాసన సంస్థాన మఠం డాక్టర్ మహాంతలింగ శివాచార్య స్వామి, గతంలో సాహితీవేత్త డాక్టర్ బరగూరు రామచంద్రప్ప నేతృత్వంలో పాఠ్యపుస్తక పరిష్కార కమిటీలో వీరశైవ సిద్ధాంతాన్ని బసవణ్ణ, అనుచర స్వాములు ప్రచారం చేయించారు. కూడల సంగమలో శైవ గురువుల సాన్నిత్యంలో లింగదీక్ష పొంది ధ్యాన సాధన చేశారని ప్రకటించారని తెలిపారు. అయితే 2024 పాఠ్య పుస్తకంలో వీరశైవ తత్వ ప్రచారకులనే సమాచారాన్ని విడచి, బసవణ్ణ అరివన్నే గురువుగా చేసుకొని ఇష్టలింగపు పరికల్పనతో దేహవే దేగులవని స్థావర దేవాలయాలను నిరాకరించి, ఏకదేవ నిష్ఠను ప్రతిపాదించారని ప్రచురించారని ఇది బసవేశ్వర చరిత్రకు ద్రోహం చేసినట్లుగా ఉంది. మతం, చరిత్ర, సమాజానికి ప్రభుత్వం చేస్తున్న అపరాచరమన్నారు. వీరశైవ లింగాయత్ సమాజాన్ని విడగొట్టే కుట్ర చేస్తున్నారని అసంతృప్తిని వ్యక్తం చేశారు.

బనశంకరీదేవి సన్నిధిలో ఆషాఢ పూజలు



శాకంబరీ అలంకరణలో బనశంకరీదేవి



ప్రత్యేక అలంకరణలో మారమ్మ దేవి

బనశంకరి: బనశంకరీదేవి సన్నిధిలో ఆషాఢ మాసం పూజలు నిర్వహించారు. ఆదివారం సుప్రభాతసేవ అనంతరం ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ బనశంకరీదేవి మూలవిరాట్ అభిషేకం, అర్చనలు చేపట్టి కూరగాయలతో అలంకరణచేసి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా శాకంబరీదేవి మూలవిరాట్‌కు కూడా కూరగాయలతో అలంకరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.

మారమ్మదేవికి పూజలు

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో వెలసిన గ్రామ దేవత శ్రీమారమ్మదేవికి ఆదివారం ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వినయ్ కుమార్ అమ్మ వారిని గాజులతో అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎలుగుబంటి దాడి, గేట్ కీపర్‌కు గాయాలు

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర సమీపంలో బన్నేరుఘట్ట నేషనల్ పార్క్ ఉద్యానవనంలోని సఫారి గేట్ వద్ద విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచిన ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో బెట్టయ్య (54) అనే వ్యక్తి గాయపడ్డాడు. సఫారి గేట్ ఆపరేటర్‌గా పని చేస్తున్న బెట్టయ్య రోజు లాగే కాపలాగా ఎలుగుబంట్లు ఉన్న గేట్ వద్దకు వచ్చాడు. పర్యాటకుల వాహన వచ్చిన సమయంలో గేట్ తీసి వాహనాన్ని లోపలికి వదిలిన సమయంలో అక్కడ మూలమీద ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా బెట్టయ్య మీద దూకి గాయపరిచింది. అక్కడ బస్సులో ఉన్న వారు గట్టిగా అరుస్తున్నా కూడా దాడి చేసింది. సమీపంలోని సహచర ఉద్యోగులు బెదిరించడంతో ఎలుగుబంటి వదిలివెళ్లింది. బాధితుడిని వెంటనే అపోలో ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

ఓపికతో ఉండాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: రాష్ట్ర ప్రభుత్వం ముందున్న 7వ వేతన కమిషన్ సిఫారసును అమలు చేయడానికి రూ. 18 వేల కోట్లు కావాలని, దాంతో పాటు ఓపీఎస్ అమలుతో పాటు వందల కోట్లు నగదు కావాలని, ఒక్కరోజులో అన్నింటిని అమలు చేయడం సాధ్యం కాదని, ఓపికతో ఉండాలని, సీఎం సిద్దరామయ్య ఎవరిని మోసం చేయరని హోం మంత్రి పరమేశ్వర్ అన్నారు. తుమకూరు నగరంలోని ఎంప్రెస్ సమావేశం హాల్లో శాసన మండలి సభ్యుడు డి.టి.శ్రీనివాస్ అభిమాన సంఘం, ఉపాధ్యాయ వర్గం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధన్యవాదాల సమావేశాన్ని ప్రారంభించి పరమేశ్వర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపైన ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయదన్నారు. ఆగ్నేయ విభాగం ఉపాధ్యాయ శాసన మండలిలో కాంగ్రెస్ విజయం సాధించడం ఎంతో సంతోషమని అన్నారు. డీటీ శ్రీనివాస్ గెలుపునకు కృషి చేసి వారికి, అదే విధంగా డీటీ శ్రీనివాస్, ఆయన భార్య పూర్ణిమకు అభినందనలు తెలిపారు.

డ్రైనేజీలు శుభ్రం చేయాలి

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని మహానగర పాలికె పరిధిలో 5వ వార్డులోని మైసూరు వీధిలో మురుగు కాలువలు చెత్తా చెదారంతో నిండిపోయాయి. మురుగునీరు అక్కడే నిలిచిపోయి అందులో దోమలు పెరుగుతున్నాయి. అపరిశుభ్రతతో పాటు డెంగీ లాంటి రోగాలు వస్తున్నాయి, ఇప్పటికైన పాలికె అధికారులు, సిబ్బంది వచ్చి వాటిని శుభ్రం చేయాలని స్థానిక ప్రజలు కోరారు. దుర్వాసన భరించలేకున్నామని తెలిపారు. అనేక మంది ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారని వాపోయారు.

యోగేశ్వర్‌తో మాట్లాడండి

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ ఉప ఎన్నిక గురించి యోగేశ్వర్‌తో చర్చించాలని జేడీఎస్ పార్టీ నేతలకు, కార్యకర్తలకు కేంద్రమంత్రి కుమారస్వామి సూచించారు. ఆదివారం జేపీ నగర్‌లోని తమ నివాసంలో కార్యకర్తలు, నేతలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ కూటమి నుండి ఎవరు అభ్యర్థిగా పోటీ చేసినా వారి గెలుపునకు శ్రమించాలన్నారు. అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. యోగేశ్వర్‌ను కలిసి ఉప ఎన్నికల గురించి చర్చించాలని అవసరమైతే తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ఆయన మార్గదర్శనంలో పనిచేయాలని కోరారు.

హోసూరు వార్తలు..

క్రికెట్ కిట్ల పంపిణీ



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హోసూరు: వేపనపల్లి నియోజకవర్గ క్రీడాకారులకు ఆ ప్రాంత ఎమ్మెల్యే కే.పి.మునిస్వామి ఉపకరణాలను అందజేశారు. సూళగిరి సమితి పన్నపల్లి గ్రామపంచాతీ తట్టనపల్లి, కుంభళం, రామన్‌దొడ్డి గ్రామాలకు చెందిన క్రీడాకారులు క్రికెట్ కిట్లను ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరుతూ వచ్చారు. ఈ సందర్భంగా కిట్లను అందజేసి క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. స్థానిక నాయకులు, క్రికెట్ ఆటగాళ్లు పాల్గొన్నారు.

గుట్కా స్వాధీనం

హోసూరు: కర్ణాటక నుంచి విల్లుపురానికి బస్సులో గుట్కా తరలిస్తున్న వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ విజయరాణి నేతృత్వంలో పోలీసులు శనివారం సాయంత్రం హోసూరు బస్టాండులో తనిఖీలు చేయగా, ఓ బస్సులో తిరుమురుగన్ (40) అనే వ్యక్తి బెంగళూరు నుంచి 7 కిలోల గుట్కా బస్సులో తరలిస్తున్నట్లు తెలిసింది. అతన్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

ఏటీఎంలో రూ. 14.50 లక్షలు చోరీ

హోసూరు: ఏటీఎం కత్తిరించి అందులోని సుమారు రూ. 14.50 లక్షల నగదు దోచేసిన ఘటన హడ్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... బాగలూరు రోడ్డులోని ఓ హోటల్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ బ్యాంకుకు చెందిన ఏటీఎం కేంద్రంలో శనివారం వేకువజాము గుర్తు తెలియని దుండగులు వెల్డింగ్ యంత్రం ద్వారా బద్దలుకొట్టి నగదును దోచుకెళ్లారు. విషయం గమనించిన స్థానికులు బ్యాంక్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలిస్తున్నారు.


పెళ్లి కాలేదని ఆత్మహత్య

క్రిష్ణగిరి: పెళ్లి కాలేదని విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూళగిరి వద్ద జరిగింది. వివరాల మేరకు నంజాపురం గ్రామానికి చెందిన శక్తివేల్ (36) కూలీపనులు చేసుకుంటూ ఉండేవారు. తల్లిదండ్రులు ఇతనికి పలు సంబంధాలను చూసినా కుదరలేదు. ఇటీవలే ఒక సంబంధం కుదిరినట్లే కుదిరి క్యాన్సిల్ అయ్యింది. ఇలా జీవితంపై విరక్తి చెందిన శక్తివేల్ రెండురోజుల కిందట మద్యంలో పురుగుల మందు కలిపి తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మిత్రులు గమనించి శక్తివేల్‌ను చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక శనివారం రాత్రి మృతి చెందాడు. సూళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

నడిచి వెళుతున్న కార్మికుడిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మరణించాడు. వివరాలు.. బెంగళూరుకు చెందిన రవీంద్ర (43) శనివారం పనిపై క్రిష్ణగిరికి వచ్చి జాతీయ రహదారిపై నడిచి వెళుతుండగా ఏదో వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్ర గాయాలేర్పడిన రవీంద్ర ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తాలూకా పోలీసులు శవాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఆక్రమణలో తల్లిపాల కేంద్రం



ఆక్రమణలకు గురైన పాలకేంద్రం

కెలమంగలం: కెలమంగలం బస్టాండులో ఏర్పాటు చేసిన పిల్లలకు పాలిచ్చే కేంద్రాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకొన్నారని, పట్టణ పంచాయతీ యంత్రాగం చర్యలు చేపట్టి ఆ కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు. గత జయలలిత హయాంలో బస్టాండు ప్రాంతాల్లో పిల్లల తల్లులు పాలిచేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేసింది. కెలమంగలం బస్టాండులో ఏర్పాటు చేసిన పాల కేంద్రాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకొని దుకాణాలు నిర్వహిస్తున్నారని, సంబంధిత శాఖాధికారులు ఆక్రమణలు తొలగించి, ఈ కేంద్రానికి మరమ్మతులు చేపట్టి వినియోగానికి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

స్విమ్మింగ్‌పూల్ వివాదం, మంత్రి ఎదురుదాడి

శివాజీనగర: రెజ్లర్లను లైంగికంగా వేధించిన వారు బీజేపీలో ఉండగా ఈతని క్రీడగా చూడటం వారికి ఎలా సాధ్యమవుతుందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి దినేశ్ గుండురావు ఎదురుదాడికి దిగారు. గతంలో తాను మంగళూరులో ఈత కొలను ప్రారంభోత్సవానికి రాలేకపోయాను, ఆ సమయంలో అక్కడ క్రీడాభిమానులు అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో మరోసారి వచ్చి స్విమ్మింగ్ పూల్‌లో ఈత చేస్తానని హామీఇచ్చానని, అందుకు తగ్గట్టు స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టినట్లు మంత్రి చెప్పారు. తాను ఈత కొట్టడానికి రాష్ట్రంలో డెంగీ పెరిగేందుకు ఏమిటి సంబంధం అంటూ ధ్వజమెత్తారు. డెంగీ నిర్మూలనకు చర్యలు వేగవంతం చేశామన్నారు.

రోడ్డును బాగు చేయరూ



కంకర తేలిన రోడ్డు

కెలమంగలం: మదగొండపల్లి నుంచి బిన్నమంగలం వెళ్లే మార్గం కంకర తేలిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని మదగొండపల్లి నుంచి సారకపల్లి వెళ్లే మార్గంలో రోడ్డుపై కంకర తేలిపోయి ప్రమాదకరంగా మారిందని వాపోయారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- రూ.1,76,500 నగదు, కారు, బైక్, 11 సెల్‌ఫోన్ల స్వాధీనం
- 8 మంది జూదరుల అరెస్ట్.. మరికొందరు పరార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పై పద్మ

కోనేరుసెంటర్ (మచిలీపట్నం): కృష్ణా జిల్లా మచిలీపట్నంలో భారీ పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు ఆదివారం మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో పెద్దమొత్తంలో నగదుతో పాటు 8మంది జూదరులను పోలీసులు పట్టుకున్నారు. మచిలీపట్నం మండలం సత్రవపాలెం గ్రామంలో కొంతమంది పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న స్పెషల్ బ్రాంచ్ పోలీసులు టౌన్ ఇన్‌చార్జి సీఐ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో కొందరు ఆటగాళ్లు పోలీసుల నుంచి తప్పించుకుని పరారవగా.. 8 మంది పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వారి నుంచి ఒక కారు, ఒక బైక్, 11 సెల్‌ఫోన్లు, రూ.1,76,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న 8 మందిని కోర్టుకు హాజరుపరచనున్నట్టు సీఐ సోమేశ్వరరావు తెలిపారు. పేకాట నిర్వాహకుడు తృటిలో తప్పించుకున్నట్టు పోలీసువర్గాలు తెలిపాయి.

మంత్రి సాక్షిగా పేకాట నిర్వాకంపై రగడ

సీఐ, కానిస్టేబుల్ మధ్య వాగ్వాదం

రాయచోటి: రవాణా, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్‌రెడ్డి పర్యటనలో ఉండగా.. పేకాట నిర్వాకంపై పోలీసుల మధ్య వివాదం రచ్చకెక్కింది. అన్నమయ్య జిల్లా సంబేపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి అధికారులతో సమావేశం నిర్వహిస్తుండగా.. కార్యాలయం ఎదుట అంతా చూస్తుండగానే ఓ కానిస్టేబుల్, సీఐ మధ్య రగడ మొదలైంది. రూ.లక్షలు తీసుకుని పోలీసులు పేకాట ఆడిస్తున్నారని మీడియాలో వార్తలు వచ్చిన విషయం పాఠకులకు విదితమే. ఈ క్రమంలో సీఐ, కానిస్టేబుల్ మధ్య మాటల యుద్ధం మొదలై తారస్థాయికి చేరింది. పక్కన ఉన్న పోలీసులు సర్దిచెప్పడంతో ఇద్దరు వెళ్లిపోయారు. పది మందికి మంచి చెప్పాల్సిన వారే ఇలా రచ్చకెక్కడం కలకలం రేపింది.

పేరుకే ఉచితం

షరతులు షరా మామూలే..

- స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను వినియోగదారులకు సరఫరా చేయనున్న ప్రభుత్వం
- లోడింగ్, రవాణా చార్జీలను మాత్రమే వసూలు చేస్తామంటున్న అధికారులు
- ఈ చార్జీలు ఎంతో ఇప్పటికీ వెల్లడించని వైనం
- వాహనాలు, లోడింగ్ వ్యవస్థ అంతా వారి గుప్పెట్లోనే..
- ఈ ముసుగులో దండుకునేందుకు టీడీపీ నేతల పక్కా వ్యూహం
- వర్షాకాలం కావడంతో వచ్చే మూడు నెలలు ఇసుక తవ్వకాలు నిలిపివేత
- మళ్లీ సెప్టెంబర్ నుంచి తవ్వకాలకు కొత్త విధానం ప్రకటించనున్న ప్రభుత్వం



సాక్షి, అమరావతి : ఉచితంగా ఇసుక పేరుతో అందినకాడికి దండుకోవడానికి అధికార పార్టీ నేటి నుంచి ముసుగు తీయనుంది. ఇందుకు సంబంధించి అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయకపోయినా స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక నిల్వలను నేటి నుంచి అవసరమైన వారికి సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు అందాయి. ఆ మేరకు కలెక్టర్లు ఆయా జిల్లాల్లో సన్నాహాలు చేస్తున్నారు. వర్షాకాలంలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయే పరిస్థితి ఉండడంతో కొరత రాకుండా ఉండేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్టాక్ పాయింట్లలో పెద్ద ఎత్తున ఇసుక నిల్వ చేసింది. ఇప్పుడు ఆ ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామంటూ ఆ ముసుగులో ఆ పార్టీ నేతలకు భారీగా లబ్ధి చేకూర్చేందుకు సిద్ధమైంది. పైకి మాత్రం వినియోగదారులే సొంతంగా వాహనాన్ని సమకూర్చుకుంటే, అందులో ఉచితంగా ఇసుకను నింపి పంపుతారని అధికారులు చెబుతున్నప్పటికీ అది ఆచరణలో మరో రకంగా ఉంటుందని సమాచారం. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు.. ఇసుక లోడింగ్, స్టాక్ యార్డ్ నిర్వహణ, రవాణా, పన్నులు, లెవీకి సంబంధించి కొంత మొత్తాన్ని వసూలు చేయనున్నారు. వీటన్నింటికీ కలిపి జీఎస్టీ కూడా వసూలు చేస్తారు. ఇవన్నీ కలిపి టన్నుకు రూ.250 నుంచి రూ.300 వరకు వినియోగదారుల నుంచి వసూలు చేసే అవకాశం ఉందని చెబుతున్నా, వాస్తవంగా అంతకు రెట్టింపు వసూలు చేయనున్నట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టన్నుకు రూ.475తో ఇసుకను విక్రయించారు. దీనివల్ల ప్రభుత్వానికి ఏడాదికి రూ.780 కోట్లకుపైగా ఆదాయం లభించేది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం కొత్తగా అమలు చేసే విధానంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పరిస్థితి ఉండదు. అదే సమయంలో వినియోగదారులపై భారం తప్పదు. 'వాహనాలన్నీ టీడీపీ నేతలవే.. అలాంటప్పుడు ఆ పన్ను, ఈ పన్ను అంటూ బాదుడు మామూలే' అని ఓ అధికారి వ్యాఖ్యానించారు.

సచివాలయ ఉద్యోగులకు స్టాక్ యార్డ్ బాధ్యతలు

ఇసుక స్టాక్ యార్డు బాధ్యతలను ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అప్పగించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఇసుక కాంట్రాక్టు సంస్థలుగా ఉన్న జేసీకేసీ, ప్రతిమి ఇన్‌ఫ్రా సంస్థలకు చెందిన సిబ్బందిని గత నెల అధికారం మారగానే టీడీపీ శ్రేణులు బెదిరించి అక్కడి నుంచి పంపించేశాయి. స్టాక్ యార్డులన్నీ ప్రస్తుతం టీడీపీ శ్రేణుల చేతిలో ఉన్నాయి. ఉచిత ఇసుక సరఫరాను అమలు చేయడం కోసం శనివారం నుంచి జిల్లా కలెక్టర్లు వాటిని తమ స్వాధీనంలోకి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ అది కొలిక్కి వచ్చినట్లు లేదు. మైనింగ్ సిబ్బందితోపాటు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి వాటిని అప్పగించనున్నట్లు తెలిసింది. వారితోపాటు వీఆర్‌ఓ, వీఆర్‌ఏల ద్వారా ఇసుకను సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి స్టాక్ యార్డ్‌లో ఒక ఇన్‌ఛార్జిని నియమించి, అతని ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బంది కొందరు పని చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలం కావడంతో సెప్టెంబర్ వరకు ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. అప్పటి వరకు స్టాక్ యార్డుల్లో ఉన్న ఇసుక నిల్వల్ని ఉచిత ఇసుక విధానంలో సరఫరా చేయనున్నారు. ఆ తర్వాత ఇసుక రీచ్‌లను తెరిచి తవ్వకాలు ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇప్పుడున్న ఇసుక కాంట్రాక్టు సంస్థలు జేసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రాలను పక్కకు తప్పించి ఇసుక తవ్వకాలకు కొత్త విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇసుక స్టాక్ యార్డులను స్థానిక టీడీపీ లీడర్లే నిర్వహించనున్నట్లు క్షేత్ర స్థాయిలో పరిస్థితి కనిపిస్తోంది. అధికారుల పాత్ర నిమిత్త మాత్రమేనని తెలుస్తోంది.

ఎమ్మార్పీఎస్ ఉద్యమం సువర్ణ అధ్యాయం

- మాదిగ జన జాతర సభలో వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ



మాట్లాడుతున్న ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ

నాగులుప్పలపాడు:మాదిగ జాతి చరిత్రలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఓ సువర్ణ అధ్యాయమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఏర్పడి 30 సంవత్సరాలైన సందర్భంగా ఆదివారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో నిర్వహించిన మాదిగ జనజాతర సభకు రాష్ట్రం నలుమూలల నుంచీ వేలాదిగా ఎమ్మార్పీఎస్ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పెద్దఎత్తున పాల్గొని మాదిగల ఆత్మగౌరవ చిహ్నానికి ప్రత్యేక నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో బ్రహ్మయ్య మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం అంటరానితనం, వివక్షను ఎదుర్కొంటున్న మాదిగ సమాజం గుర్తింపు కోసం 3 దశాబ్దాల క్రితం ఈదుమూడి గ్రామంలో 20 మంది యువకులతో కలిసి ఏర్పడిన ఉద్యమం మాదిగలతోపాటు సమాజంలోని మిగతా వర్గాల ప్రజలకు న్యాయం చేయడంలో కీలకపాత్ర పోషించిందన్నారు.

తెలుగు రాష్ట్రాలు నాకు రెండు కళ్లు

- తెలంగాణ గడ్డపై టీడీపీకి పూర్వవైభవం
- హైదరాబాద్‌లో నాలెడ్జ్ ఎకానమీకి నాంది పలికాం
- ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో ఏపీ సీఎం చంద్రబాబు



సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాలు తనకు రెండు కళ్లు అని ఏపీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. ఏపీలో టీడీపీ విజయానికి తెలంగాణ పార్టీ శ్రేణులు పరోక్షంగా ఎంతో కృషి చేశాయన్నారు. ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు తొలిసారిగా ఆదివారం హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌కు వచ్చారు. అంతకుముందు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి పార్టీ కార్యాలయం వరకు తెలంగాణ టీడీపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణగడ్డపై టీడీపీకి పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో విజయానికి పరోక్షంగా కృషి చేసిన తెలంగాణ పార్టీశ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో అధికారంలో లేకున్నా కార్యకర్తలు పార్టీని వదల్లేదని చెప్పారు. తెలుగుజాతి ఉన్నంత వరకు టీడీపీ జెండా రెపరెపలాడుతుందని, సంక్షోభాన్ని అవకాశంగా మలచుకొని మళ్లీ అధికారంలోకి వచ్చినట్టు చంద్రబాబు చెప్పారు.

నా తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ అభివృద్ధిని కొనసాగించాయి

తెలంగాణలో నాలెడ్జి ఎకానమీకి తాను సీఎంగా ఉమ్మడి రాష్ట్రంలో నాంది పలికినట్టు చంద్రబాబు చెప్పారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభివృద్ధిని కొనసాగించాయన్నారు. రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చూపిన చొరవ అభినందనీయమని చెప్పారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఐకమత్యం ఉండాలని, వివాదాలుంటే నష్టాలే ఎక్కువ అని, ఇచ్చిపుచ్చుకునే ధోరణితోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, ఏపీలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉన్నాయని, సిద్ధాంతపరంగా ఆలోచనలు వేరుగా ఉన్నా, తెలుగుజాతి ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తామని చెప్పారు.

ఆ చర్చలు ఓటుకు కోట్లు గురించే

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపాటు
- రాష్ట్ర ప్రయోజనాలు పణంగా పెడుతున్న చంద్రబాబు
- వాస్తవాలు చెప్పడం లేదని ప్రజల్లో అనుమానం
- పోర్టులు, తిరుమలలో వాటా అడిగారా.. లేదా?
- విలీన గ్రామాలను అప్పగించాలని తెలంగాణ కోరలేదా?
- అత్యున్నత స్థాయి సమావేశం పొగడ్తలకే పరిమితం



నెల్లూరు (పొగతోట):రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అత్యున్నత స్థాయి సమావేశంగా ప్రచారం చేశారే కానీ రాష్ట్రానికి ప్రయోజనం చేకూరే విధంగా చర్చలు జరగలేదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు పణంగా పెట్టేలా ఆ సమావేశం సాగిందని మండిపడ్డారు. సీఎంల సమావేశంలో పైకి రాష్ట్ర సమస్యలు, విభజన సమస్యలు అని చెబుతున్నప్పటికీ, లోపల ఓటుకు రూ.కోట్ల కేసు విషయంపై మాట్లాడుకున్నారని చెప్పారు. ఆ కేసులో అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్‌కు దండం పెట్టి చంద్రబాబు ఏపీకి పారిపోయి వచ్చారన్నారు. అందువల్లే రాష్ట్రం రూ.1.50 లక్షల కోట్లు నష్టపోయిందని చెప్పారు. చంద్రబాబు చేసిన తప్పుడు పని వల్ల రాష్ట్రానికి కొలుకోలేని దెబ్బ తగిలిందన్నారు. రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చేలా చర్చలు జరగలేదని తెలిపారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏయే అంశాలపై చర్చించారు.. ఏయే సమస్యల పరిష్కారం దిశగా చర్చలు జరిగాయనే అంశాలపై మంత్రులు సరైన సమాధానం చెప్పలేదన్నారు. దిశ, దశ లేని విధంగా సమావేశం ముగిసిందన్నారు. ఇద్దరు సీఎంలు ఒకరినొకరు పొగుడుకోవడానికే సమయం సరిపోయిందన్నారు. అత్యుత్తమ స్థాయి సమావేశం రాష్ట్రానికి ఉరితాడుగా మారనుందనే సందేహాలు ప్రజల్లో ఉన్నాయన్నారు.

తెలంగాణ చేతుల్లో రాష్ట్రం జుట్టు

ఏపీలోని పోర్టుల్లో వాటాలు, తిరుమలలో 48 శాతం వాటా, పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి ఏపీలో విలీనం చేసిన గ్రామాలను తిరిగి తెలంగాణలో కలుపుతామని వార్తలు వచ్చాయన్నారు. వీటిపై సీఎం, మంత్రులు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. ఇద్దరు సీఎంల భేటీ తర్వాత రాష్ట్రం జుట్టు తెలంగాణ చేతుల్లో పెడుతున్నట్లు ఉందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పోలవరం నిర్మించేలా చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు రెండున్నర సంవత్సరాలు పోలవరాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఏపీలో గంజాయి అంటూ రాష్ట్రం పరువు తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేంద్రంతో చర్చించి విద్యుత్ బకాయిలు రూ.7 వేల కోట్లు రావాలని ఆదేశాలు తీసుకువచ్చారన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ఏపీకి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఆయా రాష్ట్రాల సీఎస్‌లతో కమిటీలు వేసి కృషి చేశారని చెప్పారు. ఇప్పుడు ఒక్క సమస్య పైనా ఇద్దరు సీఎంలు నిర్దిష్టంగా వ్యవహరించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని తెలిపారు.

వందేళ్ల నేస్తాలు

- నగర పరిధిలో పురాతన వృక్షాల గుర్తింపునకు శ్రీకారం
- డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్న ఇంటాక్
- వందేళ్లకు పైబడిన చెట్లు 20 వేలకు పైగా ఉంటాయని అంచనా
- ఇప్పటికే 800 వృక్షాలు గుర్తించిన ఇంటాక్ ప్రతినిధులు
- ఈ చెట్లే పర్యావరణ పరిరక్షణ నేస్తాలుగా ప్రచారం



వారసత్వ వృక్షాలపై అధ్యయనం చేస్తున్న ఇంటాక్ బృందం



వందేళ్ల నాటి చెట్టు



నగరంలోని ఓ శతాబ్ది వృక్షం

సాక్షి, విశాఖపట్నం: వారసత్వ వృక్షాలను ప్రజలకు అనుసంధానం చేయడం ద్వారా చెట్ల పట్ల ఆప్యాయత, అనుబంధాన్ని పెంపొందించేందుకు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్(ఇంటాక్) నడుం బిగించింది. నగరంలో ఉన్న శతాబ్ది వృక్షాల వారసత్వ సంపదని గుర్తించి, పరిరక్షించేందుకు ప్రత్యేక డాక్యుమెంట్ సిద్ధం చేస్తోంది. విశాఖ నగర పరిధిలో వందేళ్లకు పైబడిన వృక్షాలు 20 వేలకు పైగా ఉన్నట్లు అంచనా వేసింది. ఇప్పటివరకు సుమారు 800 వృక్షాలను గుర్తించింది. వారసత్వ వృక్షాల పరిరక్షణకు 1975లో చెట్ల రక్షణ, సంరక్షణ చట్టం ఏర్పాటు చేశారు. చెట్ల సంరక్షణకు సంబంధించి అన్ని నిర్ణయాలను తీసుకునే స్థానిక పౌర సంస్థలతో కలిసి నగర పాలక సంస్థలు సిద్ధం కావాలని చట్టంలో పేర్కొన్నారు. కానీ.. ఆ పరిస్థితులు నగరంలో ఎక్కడా కనిపించకపోవడంతో ఇంటాక్ సంస్థ ఆ బాధ్యతను తన భుజస్కంధాలపైకెత్తుకుంది.

వారసత్వ వృక్షాలంటే..?

1975 చట్టం ప్రకారం 50 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్న ఏ చెట్టునైనా వారసత్వ వృక్షంగా నిర్వచించాలి. ఈ క్రమంలో చెట్టు చారిత్రక ప్రాముఖ్యతను కూడా పరిగణించాలి. స్థానిక అథారిటీ వారసత్వ చెట్ల గణనతో పాటు ప్రతి ఐదేళ్లకు ఒకసారి చెట్ల గణనను నిర్వహించాలి. కానీ నగరంలో ఎక్కడా అది అమలవ్వడం లేదు.

నగరంలో 20 వేలకు పైగా..

ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన మాజీ పర్యావరణ, వృక్షశాస్త్ర ప్రొఫెసర్ల నేతృత్వంలో వైజాగ్‌లోని పర్యావరణవేత్తలు నగర పరిధిలో 20 వేల వారసత్వ వృక్షాలు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించి ఇంటాక్ ప్రతినిధులు నగరంలో అధ్యయనం ప్రారంభించి వారసత్వ వృక్షాల డాక్యుమెంట్ రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 800 పురాతన వృక్షాలను గుర్తించారు. ఈ వారసత్వ వృక్షాలు చారిత్రక, పర్యావరణ ప్రాముఖ్యతను కలిగి ఉన్నట్లు డాక్యుమెంట్‌లో పొందుపరుస్తున్నారు. శతాబ్దాలుగా వైజాగ్ అభివృద్ధిలో భాగస్వామ్యమవుతున్న ప్రతి చెట్టును పరిరక్షించాలన్నది వీరి ప్రధాన ఉద్దేశం.

కాపాడితేనే మనుగడ

వారసత్వ వృక్షాలు నేల సారవంతం పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. వృక్షజాలం, జంతుజాలాల జీవిత కాలాన్ని పెంచడమేకాకుండా.. భూగర్భ జల వనరులు పెంపొందించడంలోనూ ముఖ్య భూమిక వహించి ప్రజలకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చుతాయి. ఈ పురాతన వృక్షాలు మొత్తం పర్యావరణ వ్యవస్థకు బూస్టర్‌లుగా కార్బన్ డయాక్సైడ్ నుంచి రక్షించే రక్షకులుగా వ్యవహరిస్తున్నాయి. ఈ చెట్లను సంరక్షించడం, వాటిని తదుపరి తరానికి అందించడం చాలా కీలకమని ఇంటాక్ బృందం చెబుతోంది. హెరిటేజ్ ట్రీ వాక్ పేరుతో ఇంటాక్ చాప్టర్ కన్వీనర్ డా.రాజశేఖర్ రెడ్డి, కో–కన్వీనర్ డా.సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఎడ్వర్డ్ పాల్, జయశ్రీ హట్టంగిడి, మయాంక్ కుమారి డియో, వెంకటరమణారెడ్డి, తన్మయ్ ముఖోపాధ్యాయ, వివేక్ రాథోడ్ తదితర సభ్యులు, పర్యావరణ వేత్తల సమక్షంలో ఈ డాక్యుమెంట్ తయారవుతోంది. మరో 15 రోజుల్లో తమ పరిశోధన పూర్తి చేసి వారసత్వ వృక్షాలకు సంబంధించిన సమగ్ర డాక్యుమెంట్ సిద్ధం చేసి భావితరాలకు అందించనుంది.

భావితరాలకు అందించేందుకు..



50 ఏళ్ల పైబడిన చెట్టు భూ సారవంతంతో పాటు భూగర్భ జల వనరుల్ని పెద్ద ఎత్తున సంరక్షిస్తుంది. ఒక భారీ మర్రి చెట్టు తన జీవిత కాలంలో 5 వేల టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను సేకరిస్తుంది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి అని ప్రచారం చేస్తారు. కానీ.. ప్రస్తుతం ఉన్న ఈ తరహా వారసత్వ వృక్షాన్ని ఒకదాన్ని సంరక్షిస్తే వందల మొక్కలు నాటిన ఫలితం ఉంటుంది. అందుకే ఈ తరహా హెరిటేజ్ ట్రీ ప్రొటెక్షన్ కోసం వర్క్‌షాప్‌లు నిర్వహించాలని భావిస్తున్నాం. పర్యావరణ వ్యవస్థ స్థిరత్వం కోసం పని చేసే వారసత్వ వృక్ష సంపదను విశాఖ ప్రజలంతా కలిసికట్టుగా కాపాడాలని కోరుతున్నాం.

– ప్రొ.డా.కామేశ్వరరావు, ఇంటాక్ ప్రతినిధి

సింహాచలం కొండపై 250 ఏళ్ల నాటి చెట్టు



ఇంటాక్ ప్రతినిధుల పరిశోధనల్లో శతాబ్దాల నాటి చెట్లను గుర్తిస్తున్నారు. ఇవి విశాఖ పర్యావరణ పరిరక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు డాక్యుమెంట్‌లో స్పష్టం చేశారు. నగర పరిధిలో అనేక చెట్లు 200 సంవత్సరాలకు పైగా వయసున్నవి ఉన్నాయి. సింహాచలం కొండపై ఉన్న ఒక మర్రి చెట్టు వయసు దాదాపు 250 ఏళ్లు ఉంటుందని గుర్తించారు. వాల్తేరు డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలో ఉన్న చెట్టు 130 ఏళ్లనాటిది. ఆంధ్ర విశ్వవిద్యాలయం సిరిపురం క్వార్టర్స్‌లో 200 ఏళ్లనాటి మర్రి చెట్టు, రావిచెట్టు, మామిడి చెట్టు ఉన్నట్లు గుర్తించారు. ఇలా నగరంలో వివిధ ప్రాంతాల్లో శతాబ్ది వృక్షాలున్నట్లు ఇంటాక్ పరిశీలనలో బయటపడుతున్నాయి.

కాఫీ రైతులకు.. వరుణ కటాక్షం



పాడేరు మండలం మోదాపల్లిలో పిండెలతో కళకళలాడుతున్న కాఫీ తోటలు

కాఫీ రైతులకు కొన్నేళ్లుగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తున్నాయి. ఈ ఏడాది కూడా ముందుగా వర్షాలు కురవడంతో పూత కూడా నెలరోజులు ముందుగా వచ్చింది. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో కాఫీ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- అనుకూలించిన వాతావరణం
- మేలు చేసిన ముందస్తు వర్షాలు
- ఈ ఏడాది ముందుగా వచ్చిన పూత
- పిందెతో కళకళ
- మంచి దిగుబడి వచ్చే అవకాశం

సాక్షి,పాడేరు: ఏటా గిరిజనులకు మంచి ఆదాయం ఇస్తున్న కాఫీ సాగు ఈ ఏడాది కూడా సిరులు కురిపించనుంది. గత మూడేళ్లుగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తున్నాయి. ముందస్తుగా కురుస్తున్న వర్షాలు ఎంతగానో ఉపయోపడుతున్నాయి. ఈ ఏడా ది కూడా ఏప్రిల్, మే నెలల్లో కాఫీతోటలు విర బూశాయి. పిందెలతో కళకళలాడుతున్నాయి. అదేస్థాయిలో దిగుబడి ఉంటుందని కాఫీ రైతులు ఆశిస్తున్నారు.

పాడేరు డివిజన్‌లో..

జిల్లాలో పాడేరు డివిజన్‌లో మాత్రమే కాఫీ తోటలు ఉన్నాయి. 11 మండలాల పరిధిలో సుమారు 2 లక్షల ఎకరాల్లో సాగు ఉండగా 1.50 లక్షల ఎకరాలు ఫలసాయం ఇస్తున్నాయి. సుమారు 12 వేల టన్నుల క్లీన్ కాఫీని గిరిజన రైతులు మార్కెటింగ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం జీసీసీ ఆధ్వర్యంలో కిలో రూ.280 ధరతో కాఫీ గింజలను కొనుగోలు చేసింది. దీంతో మంచి దిగుబడి సాధించిన రైతులంతా అధిక ఆదాయం పొందారు.

గిట్టుబాటు ధరకు కొనుగోలు

పాడేరు ఐటీడీఏతో పాటు పలు ప్రైవేట్ సంస్థలు కూడా పండ్ల దశలోనే కాఫీ పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేశాయి. సుమారు 1.20 లక్షల గిరిజన కుటుంబాలు ఎకరాకు రూ.60 వేల వరకు ఆదాయం పొందారు. ఈ ఏడాది కూడా మంచి ఆదాయం వచ్చే పరిస్థితి ఉందని వారు ఆశిస్తున్నారు.

10వేల ఎకరాల్లో కాఫీ మొక్కల పునరుద్ధరణ

పాత తోటల్లో కాఫీ మొక్కల పునరుద్ధరణకు పాడేరు ఐటీడీఏ చర్యలు తీసుకుంది. జిల్లాలో 1.60 లక్షల ఎకరాల కాఫీ తోటల్లో పది వేల ఎకరాలు ఫలసాయం ఇవ్వడం లేదు. దీని ప్రభావం దిగుబడిపై చూపిస్తోంది. ఈ సమస్యను గుర్తించిన ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు ఆయా తోటల్లో ఆ ఎండిన మొక్కలను తొలగించి కొత్తగా కాఫీ మొక్కలు నాటేందుకు కసరత్తు మొదలు పెట్టారు.

మొక్కల పంపిణీకి నర్సరీలు

ఎకరానికి 2,500 చొప్పున కాఫీ మొక్కల పంపిణీకి నర్సరీలు ఏర్పాటుచేశారు. ఈ నెలాఖరు నుంచి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతుందని వారు తెలిపారు. మూడేళ్ల తరువాత ఈ మొక్కలు కూడా ఫలసాయం ఇవ్వడం ద్వారా దిగుబడులు పెరుగుతాయని వారు తెలిపారు.

అన్నివిధాలా ప్రోత్సాహం



గిరిజనులు సాగు చేస్తున్న కాఫీ తోటల్లో ఈ ఏడాది కూడా కాపు అధికంగా ఉంది. అయితే పిందె, కాయ దశలో చీడపీడల బెడద లేకుండా సస్యరక్షణ చేపట్టేందుకు ఐడీడీఏ కాఫీ విభాగం అన్ని విధాలా ప్రోత్సహిస్తుంది. ఈఏడాది కూడా గిట్టుబాటు ధరతో కాఫీ గింజలను కొనుగోలు చేసేందుకు జీసీసీ ముందుకు వస్తుంది. ఐటీడీఏ కూడా కాఫీపంటకు గిట్టుబాటు ధర లక్ష్యంగా పనిచేస్తుంది.

– అశోక్, కాఫీ విభాగం ఏడీ, ఐటీడీఏ, పాడేరు

తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో గ్రామదేవతలకు ప్రతియేటా ఆషాఢమాసంలో పూజలు జరిపి, బోనాలు సమర్పించే ఈ సంప్రదాయం ఎనిమిది వందల ఏళ్లుగా వస్తోంది. నగర వాతావరణంలో ఎన్ని హంగులు, ఆర్భాటాలు మార్పులు చేర్పులు చోటు చేసుకున్నా, కాలగమనంలో సంప్రదాయక పండుగలెన్నో పేరు తెలీకుండా అదృశ్యమై పోతున్నా,ఈ బోనాల వేడుకలు మాత్రం అలనాటి ఆచార సంప్రదాయాలతో వైభవోపేతంగా నేటికీ కొనసాగుతుండడం విశేషం.

ఆషాఢ బోనాలు

అమ్మా బైలెల్లినాదో...



మూసీ నది వరదల కారణంగా అంటువ్యాధులకు ఆలవాలమైన నగరంలో నాటి హైదరాబాద్ రాష్ట్ర ప్రధాని మహారాజా కిషన్‌ప్రసాద్ సలహా మేరకు నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ లాల్‌దర్వాజ సమీపంలోని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి చార్మినార్ వద్దకు చేరిన వరద నీటిలో పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలు సమర్పించాడట. అప్పటికి అమ్మ తల్లి శాంతించి నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో నవాబులే బోనాల ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఎందుకు సమర్పిస్తారు?

ఆషాఢమాసమంటే వర్షాకాలం.. అంటే అంటువ్యాధులకు ఆలవాలమైన మాసం. కలరా, ప్లేగు, మశూచి, క్షయ, తట్టు, పొంగు, అమ్మవారు వంటి అంటువ్యాధుల బారిన పడకుండా గ్రామదేవతలు గ్రామాలను చల్లంగా చూసేందుకే బోనాలు సమర్పిస్తారు.

అచ్చ తెలంగాణ జానపదాలు బోనాలపాటలు

ఆడమగ, చిన్న పెద్ద, ధనిక బీద తారతమ్యం లేకుండా ఆనందంతో చిందులేస్తూ చెవులకింపైన అచ్చ తెలంగాణ జానపదాలు ''గండిపేట గండెమ్మా దండ బెడత ఉండమ్మా....., బోనాలంటే బోనాలాయే బోనాల మీద బోనాలాయే....., అమ్మా బైలెల్లినాదే....అమ్మా సల్లంగ సూడమ్మ..... మైసమ్మా మైసమ్మా.... వంటి పాటలు, పోతురాజుల నృత్యవిన్యాసాలు, శివసత్తుల చిందులు చూపరులను అలరిస్తాయి.

అమ్మవార్లకు సోదరుడు పోతురాజు

పోతురాజు అంటే అమ్మవారికి సోదరుడు. తమ ఇంటి ఆడపడుచును ఆదరించేందుకు, ఆమెకు సమర్పించే ఫలహారపు బండ్లకు కాపలా కాసేందుకు విచ్చేసే పోతురాజులు నృత్యవిన్యాసాలు చేస్తారు. చిన్న అంగవస్త్రాన్ని ధరించి ఒళ్ళంతా పసుపు రాసుకుని కాళ్ళకు మువ్వల గజ్జెలు, బుగ్గన నిమ్మపండ్లు, కంటికి కాటుక, నుదుట కుంకుమ దిద్దుకుని మందంగా పేనిన పసుపుతాడును కొరడాగా ఝళిపిస్తూ, తప్పెట్ల వాయిద్యాలకు అనుగుణంగా గజ్జెల సవ్వడి చేస్తూ లయబద్ధంగా పాదాలు కదుపుతూ కన్నుల పండుగ చేస్తారు.

బోనం అంటే...

భోజనం అని అర్థం కలిగిన బోనం దేవికి సమర్పించే నైవేద్యం. మహిళలు వండిన అన్నంతో పాటు పాలు, పెరుగు, బెల్లం, కొన్నిసార్లు ఉల్లిపాయలతో కూడిన బోనాన్ని మట్టి లేక రాగి కుండలలో తమ తలపై పెట్టుకుని, డప్పుగాళ్ళు, ఆటగాళ్ళు తోడ్కొని రాగా దేవి గుడికి వెళ్తారు. మహిళలు తీసుకెళ్ళే ఈ బోనాల కుండలను చిన్న వేప రెమ్మలతో, పసుపు, కుంకుమ లేక కడి (తెల్ల ముగ్గు) తో అలంకరించి, దానిపై ఒక దీపం ఉంచుతారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు.

గోల్కొండ జగదంబికదే తొలిబోనం

బోనాల మొదట వేడుకలు గోల్కొండ జగదాంబిక ఆలయంలో ఆరంభమవడం ఆచారం. తర్వాత ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో. ఇక ఆ తర్వాత అన్నిచోట్లా బోనాల సంరంభం మొదలవుతుంది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఒక్కోరోజు ఆషాఢ ఘటోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఘటాల ఊరేగింపు తర్వాతే బోనాల వేడుకలు ప్రారంభమవుతాయి. గోల్కొండ జగదాంబిక ఆలయంలో మొదలైన ఉత్సవాలు తిరిగి ఆ అమ్మకు సమర్పించే తుదిబోనంతో ముగియడం ఆచారం.

ఇంటి ఆడబిడ్డ లెక్క

ఆషాఢ మాసంలో దేవి తన పుట్టింటికి వెళుతుందని నమ్మకం. అందుకే భక్తులు ఈ పండుగ సమయంలో దేవిని దర్శించుకుని తమ స్వంత కూతురు తమ ఇంటికి వచ్చిన భావనతో, భక్తి శ్రద్ధలతోనేగాక, ప్రేమానురాగాలతో బోనాలను ఆహార నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ తంతును ఊరడి అంటారు. వేర్వేరు ప్రాంతాల్లో పెద్ద పండుగ, ఊరపండుగ వంటి పేర్లతో పిలిచేవారు. ఊరడే తర్వాతి కాలంలో బోనాలుగా మారింది.

బోనాల పండుగ సందోహం గోల్కొండ కోటలోని గోల్కొండ ఎల్లమ్మ ఆలయం వద్ద మొదలయ్యి లష్కర్ బోనాలుగా పిలువబడే సికింద్రాబాదులోని ఉజ్జయిని మహంకాళి ఆలయం, బల్కంపేట్ లోని ఎల్లమ్మ దేవాలయాల మీదుగా పాతబస్తీ ప్రాంతానికి చేరుకుంటుంది. ఆషాడంలోనే కాకుండా కొన్ని ప్రాంతాల్లో శ్రావణంలో కూడా జరుపుకుంటారు.

– డి.వి.ఆర్. భాస్కర్



కలిపురుషుడు... కల్కి అవతారం

మనం ఏదైనా పూజాది కార్యక్రమాలలో సంకల్పం చెప్పుకునేప్పుడు కలియుగే, ప్రథమ పాదే అని చెప్పుకుంటాం. అంటే కలియుగం మొదటి నాలుగవ వంతులో అని అర్థం. కలియుగంపైన అధికారం కలిపురుషుడిది. అతడి పెత్తనంలో ఉండే కలియుగ లక్షణాలని కొద్దిగానో, విపులంగానో అన్ని పురాణాలు ప్రస్తావించాయి. ధర్మం ఒక పాదం అంటే నాలుగవ వంతు మాత్రమే ఉంటుంది, మూడు పాళ్ళు అధర్మమే ఉంటుంది. అది మరింత పెచ్చు పెరిగి సజ్జనులు బతక లేని పరిస్థితి వచ్చినప్పుడు శ్రీమహావిష్ణువు దుష్టసంహారం చేసి, శిష్టరక్షణ చేయటానికి భూమిపై అవతరిస్తాడు. ఆ అవతారం పేరు కల్కి.

శంబల అనే గ్రామంలో విష్ణుయశుడు అనే సదాచార సంపన్నుడైన నైష్ఠిక బ్రహ్మణుడికి, సుమతికి జన్మించి, పద్మావతి అనే సింహళ రాజకన్యని వివాహమాడి, తెల్లని గుర్రాన్ని అధిరోహించి ఖడ్గం ధరించి దుష్టసంహారం చేస్తాడు. భూ భారాన్ని తగ్గిస్తాడు – ఇదీ పురాణాలన్నింటి క్లుప్తసారాంశం. ఈ అవతారం కలియుగం చివరలో వస్తుంది. త్రేతాయుగం చివరలో రామావతారం, ద్వాపరయుగం చివరలో కృష్ణావతారం వచ్చినట్టు.

కల్కి ఎప్పుడు అవతరిస్తాడు? కలి విజృంభించినప్పుడు కల్కి అవతరిస్తాడు, యుగాంతంలో. యుగాంతం అనగానే సృష్టి అంతా జలమయం అయిపోయి ఏమీ లేని స్థితి అని అర్థం కాదు. కలి లక్షణాలు కలవారు, కలిప్రభావితులు సమసిపోతారు. కృతయుగంలో ఉండదగిన వారు మిగిలి ఉంటారు.

కలి లక్షణాలు: పరీక్షిత్తు పరిపాలన చేస్తున్న కాలంలో కురుజాంగల దేశాలలో పర్యటిస్తూ ఒంటికాలితో సంచరిస్తున్న వృషభరూపంలో ఉన్న ధర్మదేవుడు, గోరూపంలో ఉన్న భూమాతల సంభాషణ విన్నాడు. గోమాత కన్నీరు కార్చటానికి కారణం ధర్మదేవుడు అడిగాడు. ''దేహం వ్యాధిగ్రస్తమై, ముఖం వాడిపోయి ఉన్నాయి. బంధువులకి ఆపద కలిగిందా? మూడు కాళ్ళు లేని నన్ను పట్టుకుంటారని బాధపడుతున్నావా? ఇక ముందు లోకమెట్లా ఉంటుందో తలుచుకుని దుఃఖిస్తున్నావా?'' అని గోవు భయానికి కారణాలని అడుగుతాడు. అవి కలియుగ లక్షణాలు. 1. యజ్ఞాలు లేక దేవతలకి హవిస్సులు అందవు. 2. భర్తలు భార్యలను భరించరు. 3. పిల్లలు తల్లితండ్రులను పోషించరు. 4. సరస్వతి చెడ్డవారిని ఆశ్రయిస్తుంది. 5 ఉత్తమ విప్రులు రాజులకి సేవ చేస్తారు. 6. ఇంద్రుడు వానలు కురిపించడు. 7. దేశంలో న్యాయం నశించి పోతుంది. 8. మానవులు ఆహార నిద్రా భయ మైథునాదుల పట్ల మాత్రమే ఆసక్తి కలిగి ఉంటారు. 9. నీచులు పరిపాలిస్తూ ఉంటారు.

''ఇదంతా కృష్ణుడు శరీరం వదలటం వల్ల జరిగింది. నీవు కూడా ఒక్క కాలితో కుంటుతూ ఉన్నావు. కలిపురుషుడి ప్రేరణతో భయంకర పాపకృత్యాలని చేస్తున్న మానవులని చూస్తే దుఃఖం కలుగుతోంది. దేవతలకు, పితృదేవతలకు, ఋషులకు, నాకు, నీకు, నానా వర్ణాశ్రమాలకి, గోవులకి బాధ కలుగుతోంది.'' అని తన బాధకి కారణాన్ని చెప్పింది గోరూపధారి అయిన భూదేవి. ఇది కలి ప్రభావం యొక్క ఫలితం.

పరీక్షిత్తు ధర్మదేవుణ్ణి, భూదేవిని సముదాయించి, కలితో కఠినంగా మాట్లాడుతూ కత్తి తీశాడు. భయపడిన కలిపురుషుడు రాజచిహ్నాలని వదలి పరీక్షిత్తు కాళ్ళమీద పడి దయ తలచమని ప్రార్థించాడు. పరీక్షిత్తు అతడిని చంపక ధర్మవర్తనులు ఉండే తన రాజ్యం వదలి దూరంగా పొమ్మన్నాడు. కలిపురుషుడు తాను ఎక్కడ ఉండాలో చెప్పమని ప్రార్థించాడు. పరీక్షిత్తు అతడు ఉండటానికి నాలుగు ప్రదేశాలని సూచించాడు. అవి జూదం, మద్యపానం, ప్రాణివధ, స్త్రీ (పరస్త్రీ వ్యామోహం) ఉన్న చోట్లు. అవి చాలవు మరికొన్ని కావాలని అడిగాడు. బంగారం అనే ఐదో చోటు కూడా కలికి ఇచ్చాడు. బంగారంతో వచ్చే అసత్యం, గర్వం, కామం, హింస, వైరం అనే మరొక ఐదు స్థానాలు కలి నివాసాలు అయ్యాయి.

ఇప్పుడే ఇట్లా ఉంటే, చివరి నాలుగోవంతు సమయంలో ఎట్లా ఉంటుందో? అని భయం అక్కర లేదు. ధర్మమార్గంలో చరించే వారి దగ్గరకు కలిపురుషుడు రాడు. అధర్మమార్గంలో ఉండే వారిని చక్కజేసి, ప్రేరేపించే వారిని మట్టుపెట్టటానికి కల్కి రానే వస్తాడు.

> కలి ఉంటే ప్రపంచం ఎట్లా ఉంటుందో గోవు మాటల్లో తెలిసింది. ఈ లక్షణాలు మానవులలో కొద్దిగానైనా ఉంటాయి. అవి కృతయుగంలో నామ మాత్రంగా ఉంటే, త్రేతాయుగంలో నగానికి నగం ఉంటే, ద్వాపరంలో మూడువంతులు ఉంటే, కలియుగంలో క్రమక్రమంగా పెరిగి అవి మాత్రమే ఉండే స్థితికి చేరుకోటం జరుగుతుంది. అప్పుడు కల్కి గుర్రమెక్కి వచ్చి, కత్తితో దుష్టసంహారం చేస్తాడు. అది ఎప్పుడు? గో వృషభ సంభాషణలో కలియుగం ఎప్పుడు మొదలైనది తెలిసింది కదా! కృష్ణ నిర్యాణంతో. కలియుగం ఆరంభం అయి 5,125 సంవత్సరాలు.

– డా.ఎస్. అనంతలక్ష్మి

సినిమా


● 'అల్లరి' నరేష్

డబ్బింగ్ ఆరంభం

'అల్లరి' నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బచ్చల మల్లి' డబ్బింగ్ పనులు ఆరంభమయ్యాయి. 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై 'సామజవరగమన, ఊరుపేరు భైరవకోన' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న 'బచ్చల మల్లి' సెప్టెంబర్‌లో విడుదల కానుంది. కాగా తాజాగా ఈ సినిమా డబ్బింగ్‌ని ప్రారంభించారు మేకర్స్. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'బచ్చల మల్లి'. ఈ మూవీలో గతంలో ఎన్నడూ చూడని మాస్ క్యారెక్టర్‌లో నరేష్‌ని చూపించనున్నారు డైరెక్టర్ సుబ్బు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: రిచర్డ్ ఎం.నాథన్.


● అశ్విన్ రామ్, విశ్వక్ సేన్, చైతన్య, నభా నటేష్, ప్రియదర్శి

డార్లింగ్ విజయం సాధిస్తుంది - విశ్వక్ సేన్

''డార్లింగ్' మూవీ ట్రైలర్ చాలా బాగుంది. డైరెక్టర్ రామ్ అద్భుతంగా తీశారు. ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుంది. యూనిట్‌కి ఆల్ ది బెస్ట్'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. ప్రియదర్శి, నభా నటేష్ జోడీగా అశ్విన్ రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డార్లింగ్'. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ను విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ–''ఈ నగరానికి ఏమైంది?' సినిమా సమయంలో నన్ను వేదికపైకి ఆహ్వానించి సైకో వివేక్‌గా పరిచయం చేశాడు ప్రియదర్శి. 'మల్లేశం, బలగం' లాంటి సినిమాలు అందరికీ పడవు.. రాసి పెట్టి ఉండాలి. ఇప్పుడు తను 'డార్లింగ్' తో రావడం చాలా ఆనందంగా ఉంది. దర్శి గెలిస్తే నేను గెలిచినట్లు అనిపిస్తుంది'' అన్నారు. ''డార్లింగ్ అనగానే ప్రభాస్‌అన్న పేరు గుర్తొస్తుంది. అలాంటి టైటిల్ పెట్టుకోవాలంటే భయంగా ఉండేది. అయితే కథని నమ్మి 'డార్లింగ్' టైటిల్ పెట్టుకున్నాం'' అన్నారు ప్రియదర్శి. ''నేను ప్రమాదం నుంచి కోలుకున్న తర్వాత ఎలాంటి సినిమా చేయాలి? అని ఆలోచిస్తున్నప్పుడు 'డార్లింగ్' అవకాశం వచ్చింది'' అన్నారు నభా నటేష్. ''మూడేళ్ల ప్రయాణం 'డార్లింగ్'. వినోదాత్మకంగా రూపొందిన ఈ సినిమా ఫ్రెష్ ఫీలింగ్ ఇస్తుంది'' అన్నారు అశ్విన్ రామ్. ''కథని నమ్మి తీసిన ఈ మూవీకి ప్రేక్షకుల ప్రోత్సాహం కావాలి'' అన్నారు చైతన్య.


● ప్రియాంక మోహన్

చారులత ఆన్ డ్యూటీ

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నారు. 'గ్యాంగ్ లీడర్' మూవీ తర్వాత నాని, ప్రియాంక మోహన్ జోడీగా నటిస్తున్న రెండో చిత్రం 'సరిపోదా శనివారం'. ఎస్‌జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ''యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ మూవీలో చారులత అనే పోలీస్ కానిస్టేబుల్ పాత్రలో నటిస్తున్నారు ప్రియాంక మోహన్. ఆమె పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. భారీ బడ్జెట్, ఉన్నత ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఆగస్టు 29న ఈ మూవీ పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది'' అని చిత్రబృందం పేర్కొంది.


● రెబ్బా మౌనికా జాన్

సూపర్ చాన్స్?

'సామజవరగమన' సినిమాలో మంచి నటన కనబరచి తెలుగు ప్రేక్షకుల మెప్పు పొందారు హీరోయిన్ రెబ్బా మౌనికా జాన్. అయితే ఈ బ్యూటీకి తాజాగా ఓ సూపర్ చాన్స్ లభించిందట. రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలోని ఓ కీలక పాత్రకు రెబ్బా మౌనికా జాన్‌ను లోకేష్ కనగరాజ్ ఎంపిక చేశారని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్‌తో స్క్రీన్ స్పేస్ అంటే ఆమెకు కెరీర్ పరంగా ఓ సూపర్‌చాన్స్ కావొచ్చు. ప్రస్తుతం 'కూలీ' చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. రజనీకాంత్, శ్రుతీహాసన్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. సత్యరాజ్, మహేంద్రన్ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న 'కూలీ' వచ్చే ఏడాది విడుదల కానుంది.


● సిద్ధార్థ్, శంకర్, కమల్‌హాసన్, జాన్వీ నారంగ్, రకుల్‌ప్రీత్ సింగ్

ఇకపై నా లక్ష్యం అదే: కమల్‌హాసన్

''యాభై రెండేళ్ల క్రితం నేను హైదరాబాద్‌కు ఓ సాంకేతిక నిపుణుడిలా వచ్చాను. నటుడిగా మూడు తరాలుగా నన్ను అభిమానిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇంతకాలం నన్ను ప్రేక్షకులు స్టార్‌డమ్‌లో ఉంచారు. ఇక నాకు ఏదైనా లక్ష్యం ఉందా? అంటే బాలచందర్‌గారిలా చాలామందిని చిత్ర పరిశ్రమకు తీసుకురావాలి. నాలాంటి నటులను తయారు చేయాలి. అలా ప్రేక్షకుల రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తాను'' అని కమల్‌హాసన్ అన్నారు. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా రూపొందిన తాజా చిత్రం 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2'). రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ఎస్‌జే సూర్య, బ్రహ్మానందం, సముద్ర ఖని, బాబీసింహా, గుల్షన్ గ్రోవర్ ఇతర రోల్స్‌లో నటించారు. సుభాస్కరన్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 12న విడుదల కానుంది. 'భారతీయుడు 2' తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్, శ్రీలక్ష్మి మూవీస్ దక్కించుకున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ–''కమ్‌బ్యాక్ ఇండియన్' అంటే ఇండియన్ తాత గురించి కాదు.. మనవడు రావాలి.. వస్తాడు. 'ఇండియన్ 2'ను హిట్ చేయండి.. త్వరగా 'ఇండియన్ 3' చూస్తారు. 'భారతీయుడు' నిర్మించిన ఏఎయం రత్నంగారికి ధన్యవాదాలు. శంకర్‌గారిలాంటి విజన్ ఉన్న దర్శకులు ఇండియన్ సినిమాను ఇంటర్నేషనల్ స్థాయి సినిమా చేశారు. ఇందులో తెలుగు సినిమాకు పెద్ద భాగం ఉంది. కళాకారులు భాష సరిహద్దులను చెరిపేశారు. అలాంటి వారిలో కె.విశ్వనాథ్, బాలచందర్, శంకర్‌గార్ల వంటి దర్శకులు, ఆర్టిస్టులు ఉన్నారు'' అన్నారు. శంకర్ మాట్లాడుతూ–''లంచగొండి వార్తలను చదివిన ప్రతిసారి 'భారతీయుడు' మళ్లీ రావాలని నాకు అనిపించేది. కానీ స్టోరీ కుదరలేదు. '2.ఓ' తర్వాత కమల్‌గారికి 'భారతీయుడు' సీక్వెల్ కథ చెప్పాను. నేను రాసిన ఓ సన్నివేశాన్ని తన నటనతో పదింతలు గొప్పగా ఉండేలా చేస్తారు కమల్‌గారు. బ్రహ్మానందంగారికి నేను అభిమానిని. 'ఇండియన్ 2, గేమ్‌చేంజర్'లో ఆయన అతిథి పాత్ర చేశారు. ఈ సినిమాని తెలుగులో విడుదల చేస్తున్న సునీల్, తిరుపతి ప్రసాద్‌గార్లకు థ్యాంక్స్. రామ్‌చరణ్‌తో 'గేమ్ చేంజర్' చేస్తున్నాను. త్వరలోనే రిలీజ్ డేట్ లాక్ చేస్తాం'' అన్నారు. ''కమల్‌హాసన్‌గారితో నటించడం నాకు లభించిన ఆశీర్వాదంగా భావిస్తున్నాను'' అన్నారు'' అన్నారు ఎస్‌జే సూర్య. ''నా అభిమాన నటుడు కమల్‌గారితో నటించాలన్న నా కల నిజమైంది. కమల్‌హాసన్‌గారికి నేను ఎప్పటికీ విద్యార్థినే. యువతరానికి కోపం వస్తే ఏం జరుగుతుంది? అన్నది 'భారతీయుడు 2'లో ఉంటుంది'' అన్నారు సిద్ధార్థ్. ''కమల్‌హాసన్‌గారితో నటించడం హ్యాపీ'' అన్నారు రకుల్‌ప్రీత్ సింగ్. ''ఈ విశ్వంలో కమల్‌గారి లాంటి నటుడు మరొకరు లేరు. ఆయనతో నటించానని చెప్పడానికి గర్వపడుతున్నాను'' అన్నారు బ్రహ్మానందం. ఈ వేడుకలో నిర్మాతలు సునీల్ నారంగ్, జాన్వీ నారంగ్, నటులు బాబీసింహా, సముద్ర ఖని, గీత రచయితలు సుద్దాల అశోక్ తేజ, రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ వస్తోంది


● విజయ్ ఆంటోనీ, మేఘా ఆకాష్

విజయ్ ఆంటోనీ, మేఘా ఆకాష్ జంటగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, డి.లలితా, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న థియేటర్స్‌లో విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన 'తుఫాన్' సినిమా ట్రైలర్ ఇంట్రడక్షన్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ– ''ఈ 'తుఫాన్' సినిమా నేపథ్యం కొత్తగా ఉంటుంది. ఇలాంటి చిత్రాన్ని నాకు ఇచ్చిన విజయ్ మిల్టన్‌కు ధన్యవాదాలు. హైదరాబాద్‌లో త్వరలో ఒక లైవ్ కాన్సర్ట్ చేస్తాను'' అన్నారు. ''తుఫాన్' సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు విజయ్ మిల్టన్. ''ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నాం'' అన్నారు నిర్మాత ధనుంజయ. ''నా కెరీర్‌లో ఓ స్పెషల్ ఫిల్మ్ ఇది'' అన్నారు మేఘా ఆకాష్.

టైటానిక్ నిర్మాత కన్నుమూత


● జోన్ లండౌ

హాలీవుడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. యూనివర్సల్ బ్లాక్ బస్టర్ చిత్రాలైన 'టైటానిక్, అవతార్' వంటి సినిమాలు నిర్మించిన జోన్ లండౌ (63) కన్నుమూశారు. కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన లాస్ ఏంజిల్స్‌లో ఈ నెల 5న(శుక్రవారం) మృతి చెందారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జోన్ లండౌ 1980లో ప్రొడక్షన్ మేనేజర్‌గా సినీ కెరీర్‌ను ప్రారంభించారు. డైరెక్టర్ జేమ్స్ కామెరూన్‌తో కలిసి 'టైటానిక్'(1977), 'అవతార్'(2009) వంటి చిత్రాలు నిర్మించారు. జేమ్స్ కామెరూన్‌తో కలిసి ప్రస్తుతం 'అవతార్' ఫ్రాంచైజీ చిత్రాలను నిర్మిస్తున్నారు జోన్. ఇప్పటి వరకు ఆయన 8 సినిమాలు నిర్మించారు. మరో రెండు సినిమాలకు సహ నిర్మాతగా వ్యవహరించారు. జోన్ లాండౌ నిర్మించిన 'అవతార్' సిరీస్‌లో 3వ భాగం 2026లో, 4వ భాగం 2030లో విడుదలకానున్నాయి. జోన్ లాండౌకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సైకలాజికల్ థ్రిల్లర్


● నాగ్ అశ్విన్, రాఘవేంద్రా రెడ్డి, గౌతమ్ వర్మ

ప్రిన్స్, నరేష్ అగస్త్య హీరోలుగా, నేహా కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కలి'. శివ శేషు దర్శకత్వం వహించారు. కథా రచయిత కె.రాఘవేంద్రా రెడ్డి సమర్పణలో రుద్ర క్రియేషన్స్‌పై లీలా గౌతమ్ వర్మ నిర్మించిన ఈ మూవీ త్వరలో రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'కలి' టీజర్‌ను డైరెక్టర్ నాగ్ అశ్విన్ విడుదల చేసి, మాట్లాడుతూ–''టీజర్ ఆసక్తిగా ఉంది. ఒక కొత్త కాన్సెప్ట్‌ను తెలుగు ప్రేక్షకుల ముందుకు శివ శేషు తీసుకొస్తున్నట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది'' అన్నారు. ''కలి పాత్ర నేపథ్యంతో సాగే ఇంట్రెస్టింగ్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ ఇది'' అన్నారు కె. రాఘవేంద్రా రెడ్డి. ''మైథాలజీ, సైకలాజికల్ థ్రిల్లర్ జానర్స్ కలిపిన చిత్రమిది'' అన్నారు లీలా గౌతమ్ వర్మ, శివ శేషు.



సెమీఫైనల్లో ప్రియాన్షు పరాజయం

కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్ ప్రియాన్షు రజావత్ పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 39వ ర్యాంకర్ ప్రియాన్షు 17–21, 10–21తో ప్రపంచ 37వ ర్యాంకర్ అలెక్స్ లేనియర్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. క్వార్టర్ ఫైనల్లో నాలుగో ర్యాంకర్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)పై సంచలన విజయం సాధించిన ప్రియాన్షు సెమీఫైనల్లో మాత్రం తడబడ్డాడు. ప్రియాన్షుకు 6,090 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 5 లక్షలు), 6,420 పాయింట్లు లభించాయి.

అభయ్ సింగ్ 'డబుల్' ధమాకా

ఆసియా డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ అభయ్ సింగ్ పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో విజేతగా నిలిచాడు. మలేసియాలో జరిగిన ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ ఫైనల్లో అభయ్–వెలవన్ 11–4, 11–5తో ఒంగ్ సై హుంగ్–సిఫిక్ (మలేసియా)లపై నెగ్గారు. 'మిక్స్‌డ్' ఫైనల్లో అభయ్–జోష్నా చినప్ప (భారత్) 11–8, 10–11, 11–5తో టాంగ్ వింగ్–టాంగ్ హాంగ్ (హాంకాంగ్)లపై గెలిచారు.





20 ఏళ్ల తర్వాత సెమీఫైనల్లో నెదర్లాండ్స్

బెర్లిన్: యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో రెండు దశాబ్దాల తర్వాత నెదర్లాండ్స్ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. టర్కీ జట్టుతో ఆదివారం జరిగిన చివరి క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్ 2–1 గోల్స్ తేడాతో గెలిచింది. 35వ నిమిషంలో సామెత్ అకైదిన్ గోల్‌తో టర్కీ ఖాతా తెరిచింది. 70వ నిమిషంలో డెవ్రిజ్ గోల్‌తో నెదర్లాండ్స్ స్కోరును 1–1తో సమం చేసింది. 76వ నిమిషంలో టర్కీ ప్లేయర్ మెర్ట్ ముల్డర్ 'సెల్ఫ్ గోల్' చేయడంతో నెదర్లాండ్స్ 2–1తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని నెదర్లాండ్స్ కాపాడుకొని 2004 తర్వాత మళ్లీ యూరో టోర్నీలో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మంగళవారం జరిగే తొలి సెమీఫైనల్లో స్పెయిన్‌తో ఫ్రాన్స్; బుధవారం జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో నెదర్లాండ్స్ తలపడతాయి.

బ్రెజిల్‌కు చుక్కెదురు



లాస్ వేగస్: కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో తొమ్మిదిసార్లు చాంపియన్ బ్రెజిల్ జట్టు కథ ముగిసింది. 'షూటౌట్' ద్వారా ఫలితం తేలిన క్వార్టర్ ఫైనల్లో ఉరుగ్వే 4–2తో బ్రెజిల్ జట్టును ఓడించి 2011 తర్వాత ఈ టోర్నీలో మళ్లీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. నిర్ణీత సమయంలో రెండు జట్లు గోల్స్ చేయలేదు. 'షూటౌట్'లో ఉరుగ్వే తరఫున నలుగురు ప్లేయర్లు వల్వెర్డె, బెంటాన్‌కర్, అరాసెటా, ఉగార్టె... బ్రెజిల్ తరఫున ఇద్దరు ప్లేయర్లు పెరీరా, మార్టినెల్లి గోల్స్ సాధించారు. మరో క్వార్టర్ ఫైనల్లో కొలంబియా 5–0తో పనామా జట్టును ఓడించింది. బుధవారం జరిగే తొలి సెమీఫైనల్లో కెనడాతో అర్జెంటీనా; గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో ఉరుగ్వేతో కొలంబియా ఆడతాయి.

అభిషేక్ అదరహో...

'శత'క్కొట్టిన భారత ఓపెనర్

47 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో 100

రెండో టి20లో జింబాబ్వేపై 100 పరుగులతో టీమిండియా ఘనవిజయం



అభిషేక్ శర్మ



రుతురాజ్

హరారే: అంతర్జాతీయ వేదికపై తన ఆగమనాన్ని అదరగొట్టే ఇన్నింగ్స్‌తో అభిషేక్ శర్మ చాటుకున్నాడు. జింబాబ్వేతో ఆదివారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో అభిషేక్ శర్మ సెంచరీ సాధించాడు. శనివారం జరిగిన తొలి టి20లో 'సున్నా'కే అవుటైన ఈ పంజాబ్ బ్యాటర్ రెండో టి20లో మాత్రం 'శత'క్కొట్టాడు. 47 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో చెలరేగిపోయిన అభిషేక్ సరిగ్గా 100 పరుగులు చేసి అవుటయ్యాడు. రుతురాజ్ గైక్వాడ్ (47 బంతుల్లో 77; 11 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (22 బంతుల్లో 48 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) కూడా మెరిపించడంతో భారత జట్టు 100 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసింది. టి20ల్లో జింబాబ్వేపై ఓ జట్టు చేసిన అత్యధిక స్కోరు ఇదే. అనంతరం 235 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 18.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. మధెవెరె (39 బంతుల్లో 43; 3 ఫోర్లు, 1 సిక్స్), జోంగ్వి (26 బంతుల్లో 33; 4 ఫోర్లు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో ముకేశ్ కుమార్ (3/37), అవేశ్ ఖాన్ (3/15), రవి బిష్ణోయ్ (2/11) రాణించారు. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు శుభారంభం లభించలేదు. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (2) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నిరాశపరిచాడు. గిల్ అవుటయ్యాక అభిషేక్, రుతురాజ్ భారత ఇన్నింగ్స్‌ను నడిపించారు. వ్యక్తిగత స్కోరు 27 పరుగుల వద్ద అభిషేక్ ఇచ్చిన క్యాచ్‌ను మసకద్జా వదిలేశాడు. ఆ తర్వాత అభిషేక్ చెలరేగిపోయాడు. మైర్స్ వేసిన ఇన్నింగ్స్ 11వ ఓవర్లో అభిషేక్ 2,4,6,4,6,4తో 28 పరుగులు సాధించాడు. దాంతో భారత స్కోరు 100 పరుగులు దాటింది. మసకద్జా వేసిన ఇన్నింగ్స్ 14వ ఓవర్లో అభిషేక్ వరుసగా 3 సిక్స్‌లు కొట్టి 46 బంతుల్లోనే తన అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే మైర్స్‌కు క్యాచ్ ఇచ్చి అభిషేక్ పెవిలియన్ చేరుకున్నాడు. రుతురాజ్‌తో కలిసి అభిషేక్ రెండో వికెట్‌కు 137 పరుగులు జోడించాడు. అభిషేక్ నిష్క్రమించాక వచ్చిన రింకూ సింగ్ కూడా దూకుడుగా ఆడటంతో భారత స్కోరు 200 పరుగులు దాటింది. భారత్ చివరి 10 ఓవర్లలో 160 పరుగులు చేయడం విశేషం. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు జట్లు 1–1తో సమంగా ఉన్నాయి. మూడో మ్యాచ్ బుధవారం జరుగుతుంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: శుబ్‌మన్ గిల్ (సి) బెనెట్ (బి) ముజరబాని 2; అభిషేక్ శర్మ (సి) మైర్స్ (బి) మసకద్జా 100; రుతురాజ్ గైక్వాడ్ (నాటౌట్) 77; రింకూ సింగ్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 234. వికెట్ల పతనం:** 1–10, 2–147. **బౌలింగ్:** బెనెట్ 2–0–22–0, ముజరబాని 4–1–30–1, చటారా 4–0–38–0, సికందర్ రజా 3–0–34–0, జోంగ్వి 4–0–53–0, మైర్స్ 1–0–28–0, మసకద్జా 2–0–29–1.

జింబాబ్వే ఇన్నింగ్స్: ఇన్నోసెంట్ కాయా (బి) ముకేశ్ కుమార్ 4; మధెవెరె (బి) రవి బిష్ణోయ్ 43; బెనెట్ (బి) ముకేశ్ కుమార్ 26; మైర్స్ (సి) రింకూ సింగ్ (బి) అవేశ్ ఖాన్ 0; సికందర్ రజా (సి) ధ్రువ్ జురెల్ (బి) అవేశ్ ఖాన్ 4; క్యాంప్‌బెల్ (సి) రవి బిష్ణోయ్ (బి) సుందర్ 10; మదాండె (ఎల్బీడబ్ల్యూ) (బి) రవి బిష్ణోయ్ 0; మసకద్జా (రనౌట్) 1; జోంగ్వి (సి) రుతురాజ్ (బి) ముకేశ్ కుమార్ 33; ముజరబాని (సి) సుందర్ (బి) అవేశ్ ఖాన్ 2; చటారా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (18.4 ఓవర్లలో ఆలౌట్) 134. వికెట్ల పతనం:** 1–4, 2–40, 3–41, 4–46, 5–72, 6–73, 7–76, 8–117, 9–123, 10–134. **బౌలింగ్:** ముకేశ్ 3.4–0–37–3, అభిషేక్ శర్మ 3–0–36–0, అవేశ్ 3–0–15–3, రవి బిష్ణోయ్ 4–0–11–2, వాషింగ్టన్ సుందర్ 4–0– 28–1, పరాగ్ 1–0–5–0.

రెండో టి20 వర్షార్పణం

- దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిశాక భారీ వర్షం
- సాధ్యపడని భారత ఇన్నింగ్స్



చెన్నై: భారీ వర్షం కారణంగా భారత్, దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్ల మధ్య ఆదివారం రెండో టి20 మ్యాచ్ రద్దయింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 177 పరుగులు సాధించింది. తజ్మీన్ బ్రిట్స్ (39 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్), అనెక్ బోష్ (32 బంతుల్లో 40; 6 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో పూజా వస్త్రకర్, దీప్తి శర్మ రెండు వికెట్ల చొప్పున తీశారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగియగానే వర్షం మొదలైంది. రాత్రి 10 దాటినా వాన తగ్గుముఖం పట్టకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తొలి టి20లో నెగ్గిన దక్షిణాఫ్రికా 1–0తో ఆధిక్యంలో ఉంది. చివరిదైన మూడో టి20 మ్యాచ్ మంగళవారం జరుగుతుంది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: లౌరా వొల్‌వార్ట్ (సి) రాధా యాదవ్ (బి) పూజా వస్త్రకర్ 22; తజ్మీన్ బ్రిట్స్ (స్టంప్డ్) ఉమా ఛెత్రి (బి) దీప్తి 52; మరిజన్ కాప్ (సి) సజన (బి) దీప్తి శర్మ 20; అనెక్ బోష్ (బి) శ్రేయాంక 40; చోల్ ట్రైరన్ (సి అండ్ బి) రాధా యాదవ్ 12; నదినె డి క్లెర్క్ (సి) సజన (బి) పూజా వస్త్రకర్ 14; డెర్క్‌సెన్ (నాటౌట్) 12; ఎలీజ్ మార్క్స్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 177. వికెట్ల పతనం:** 1–43, 2–75, 3–113, 4–131, 5–164, 6–164. **బౌలింగ్:** పూజా వస్త్రకర్ 4–0–37–2, సజన సజీవన్ 1–0–13–0, అరుంధతి రెడ్డి 4–0–37–0, శ్రేయాంక పాటిల్ 4–0–37–1, రాధా యాదవ్ 3–0–31–1, దీప్తి శర్మ 4–0–20–2.



క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్), ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ అల్‌కరాజ్ 6–3, 6–4, 1–6, 7–5తో ఉగో హంబెర్ట్ (ఫ్రాన్స్)పై, టాప్ సీడ్ సినెర్ 6–2, 6–4, 7–6 (11/9)తో బెన్ షెల్టన్ (అమెరికా)పై గెలుపొందారు. మరోవైపు ఏడుసార్లు చాంపియన్, రెండో ర్యాంకర్ జొకోవిచ్ (సెర్బియా) ఈ టోర్నీలో 16వసారి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మూడో రౌండ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 4–6, 6–3, 6–4, 7–6 (7/3)తో పాపిరిన్ (ఆస్ట్రేలియా)పై నెగ్గాడు.

హామిల్టన్ రికార్డు



సిల్వర్‌స్టోన్ (ఇంగ్లండ్): ప్రపంచ మాజీ చాంపియన్ లూయిస్ హామిల్టన్ 945 రోజుల తర్వాత ఫార్ములావన్ (ఎఫ్1) రేసులో మళ్లీ విజయం అందుకున్నాడు. ఆదివారం జరిగిన బ్రిటిష్ గ్రాండ్‌ప్రిలో ఈ బ్రిటన్ డ్రైవర్ విజేతగా నిలిచాడు. చివరిసారి హామిల్టన్ 2021 డిసెంబర్ 5న సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రిలో గెలుపొందాడు. సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌పై ఆదివారం జరిగిన 52 ల్యాప్‌ల రేసును హామిల్టన్ (మెర్సిడెస్) అందరికంటే వేగంగా ఒక గంటా 22 నిమిషాల 27.059 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ క్రమంలో ఫార్ములావన్ చరిత్రలో ఒకే సర్క్యూట్‌పై అత్యధికంగా 9 సార్లు విజేతగా నిలిచిన డ్రైవర్‌గా హామిల్టన్ రికార్డు నెలకొల్పాడు. మైకేల్ షుమాకర్ (జర్మనీ) ఫ్రాన్స్‌లోని మాగ్నీ కోర్స్ సర్క్యూట్‌లో అత్యధికంగా 8 సార్లు గెలిచాడు. తాజా గెలుపుతో షుమాకర్ రికార్డును హామిల్టన్ సవరించాడు. 24 రేసుల తాజా సీజన్‌లో 12 రేసులు ముగిశాక వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) 255 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. సీజన్‌లోని తదుపరి రేసు హంగేరి గ్రాండ్‌ప్రి ఈనెల 21న జరుగుతుంది.

అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో పేలుడు

16 మంది కార్మికులకు గాయాలు

- ఒకరి మృతి, మరో ముగ్గురి పరిస్థితి విషమం
- విజయవాడ, తాడేపల్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు
- ప్రమాదంపై ఆరా తీసిన ముఖ్యమంత్రి
- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- కర్మాగారంలో ఫర్నీచర్ ధ్వంసం



ప్రమాదం జరిగిన కర్మాగారం

తీవ్రంగా గాయపడిన కార్మికులు



బూదవాడ (జగ్గయ్యపేట)/సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్/ : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో లైమ్‌స్టోన్ ఐరన్ రెడ్ సాయిల్ రియాక్టర్‌లో ఆదివారం ఉదయం పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 16 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరు మృతిచెందగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కర్మాగారంలోని మూడో ఫ్లోర్‌లో లైమ్‌స్టోన్ ఐరన్ రెడ్‌సాయిల్ రా మెటీరియల్ మిక్స్ చేయటానికి 1,300 డిగ్రీల ఉష్ణోగ్రతతో హీట్‌చేసే రియాక్టర్ వద్దకు ఉదయం షిఫ్టులో 16 మంది కార్మికులు విధులకు వచ్చారు. వారు విధుల్లో ఉండగా ఒక్కసారిగా రియాక్టర్ పెద్ద శబ్దంతో పేలింది. అందులోని సిమెంట్ కార్మికులందరిపై పడింది. దీంతో వారి శరీర భాగాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో విధుల్లో ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరవింద్ యాదవ్, సుభం సోని, గుడ్డు కుమార్, దినేష్‌కుమార్, నాగేంద్ర, బిహార్‌కు చెందిన బి. సింగ్, పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన బొంతా శ్రీనివాసరావు, బూదవాడ గ్రామానికి చెందిన ధారావతు వెంకటేశ్వరరావు, వేముల సైదులు, గుగులోతు గోపినాయక్, గుగులోతు బాలాజీ, బాణావతు సైదా, బాణావతు స్వామి, పరిటాల అర్జునరావు, బాణావతు సైదా, అవుల వెంకటేష్ గాయపడ్డారు. వీరిలో బాణావతు స్వామి, పరిటాల అర్జునరావు, బాణావతు సైదా, అవుల వెంకటేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితులను హుటాహుటిన జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఆంధ్ర ఆస్పత్రి, తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో అవుల వెంకటేష్ (35)కు 80 శాతం కాలిన గాయాలవడంతో మృతిచెందాడు. గాయపడిన వారిలో మరో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది.

ఫర్నిచర్ ధ్వంసం చేసిన గ్రామస్తులు..

యాజమాన్యం నిర్లక్ష్యంవల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులతో పాటు క్షతగాత్రుల కుటుంబ సభ్యులు కర్మాగారం వద్ద ఆందోళన చేశారు. ప్రమాదం జరిగినా కనీస స్పందనలేదని ఆరోపించారు. సమాధానం చెప్పడానికి కర్మాగారం తరఫున ఎవరూ లేకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు, క్షతగాత్రుల బంధువులు కర్మాగారంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సీఐ జానకీరాం, చిల్లకల్లు ఎస్‌ఐ సతీష్ పరిస్థితిని చక్కదిద్దారు. ఘటనా స్థలాన్ని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఏసీపీ కె. శ్రీనివాసరావు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పరిశీలించారు.

రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి..


ఈ దుర్ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్, అధికారులను ఆదేశించారు. అలాగే, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. సృజన, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కూడా పరామర్శించారు. ఇదిలా ఉంటే.. పేలుడు ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. మిగిలిన వారికి గాయాల తీవ్రతను బట్టి నష్టపరిహారాన్ని అందించాలన్నారు. అలాగే, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సీఐటీయు నేతలు కూడా బాధితులను పరామర్శించారు. యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని.. గాయపడ్డ ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం, యాజమాన్యం నుంచి నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది..

ఇదిలా ఉంటే.. గాయాలైన ఎనిమిది మందిని తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో చేర్పించడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడకు వచ్చారు. 24 గంటలు గడిస్తే తప్ప ఎవరి పరిస్థితి ఏవిధంగా ఉందో చెప్పలేమని తెలియడంతో తమవారికి ఏమవుతుందా అని వారంతా ఆందోళన చెందుతున్నారు. అలాగే, దుర్ఘటనపై ఆదివారం మణిపాల్ ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఉదయం 10.00–10.30 మధ్య ప్రమాదం జరిగిందని.. తమకు తెలిసేసరికి రెండు గంటలు పట్టిందని, ఆ తర్వాత తాము ఫ్యాక్టరీకి వెళ్లిన రెండు గంటల తరువాతే గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారని మండిపడ్డారు. ఇంతగా జాప్యంచేసి కార్మికుల ప్రాణాలంటే లెక్కలేకుండా యాజమాన్యం ప్రవర్తించిందని ఆరోపించారు. తొలుత.. గాయపడిన వారిని బయటకు తెచ్చేందుకు తామంతా ప్రయత్నించగా అక్కడ భద్రతా సిబ్బంది అనుమతించలేదని.. పైగా తమను తోసేసి చేయిచేసుకున్నారని చెప్పారు. అయినా వారిని తోసుకుంటూ వెళ్లగా గాయపడ్డ వారంతా కేకలు పెడుతున్నారని.. మొత్తం 16మందిని తీసుకుని బయటకు వచ్చామన్నారు. అలాగే, మృతుడు అవుల వెంకటేష్ తమ్ముడు గోవింద్ మాట్లాడుతూ.. మా అన్నయ్య బూడిదలో కూరుకుపోయాడని, పైకి లేవలేకపోయాడని చెప్పాడు.

చదువులకు రాజకీయ చెద

- ప్రభుత్వ విద్యాసంస్థలపై కూటమి పార్టీల జులుం
- ఉపాధ్యాయులపై దాడులు.. బెదిరింపులు
- స్కూళ్ల నుంచి యూనివర్సిటీల వరకు అదే తీరు
- మరుగుదొడ్ల కార్మికులను సైతం తమ వారినే నియమించాలని హుకుం
- నంద్యాలలో టీచర్‌పై టీడీపీ రేషన్ డీలర్ బూతు పురాణం
- విశాఖలో బురదలోనే విద్యార్థుల మధ్యాహ్న భోజనాలు
- దర్శిలో వంట మనిషిని తొలగించడంతో పస్తులు
- కూటమి నెల రోజుల పాలనలో విద్యారంగం అస్తవ్యస్తం



సాక్షి, అమరావతి: మూడు రోజుల క్రితం నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోరమా నుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశులుపై టీడీపీకి చెందిన రేషన్ డీలర్ దుర్భాషలాడాడు. ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా రేషన్ బియ్యాన్ని బడిలో భద్రపరచడం కుదరదన్నందుకు నోటికొచ్చినట్టు దూషించాడు.

'మాకు 160కిపైగా ఎమ్మెల్యే సీట్లు వచ్చాయి.. మేం చెప్పినట్టు చేయకుంటే అంతు చూస్తా..!' అని బెదిరించాడు. గత నెల 14న తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం ధారవరం గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రహరీని టీడీపీ నేతలు రాత్రికి రాత్రే కూల్చేశారు. గత ప్రభుత్వ హయాంలో 'మన బడి నాడు – నేడు' కింద నిర్మించిన ఈ ప్రహరీని కూలగొట్టి స్థలాన్ని ఆక్రమించారు. కూటమి సర్కారు కొలువుదీరిన కొద్ది రోజులకే విశాఖలోని కప్పరాడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను బురదలో కూర్చొబెట్టి భోజనాలు చేసే దుస్థితికి తీసుకొచ్చారు. బురదగా ఉందని.. గదుల్లో కాకపోయినా కనీసం వరండాలో అయినా తింటామని విద్యార్థులు వేడుకున్నా సిబ్బంది కనికరించలేదు. కర్నూలు జిల్లా సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో భోజనం సరిగా లేదని, పుచ్చిపోయిన కూరగాయలు, పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇటీవల అనంతపురం జిల్లా ధర్మవరంలో బడిలో ఏ పని చేయాలన్నా తమకు చెప్పకుండా జరిగితే సహించేది లేదని ఉపాధ్యాయులను స్థానిక టీడీపీ నాయకులు బెదిరించారు. ఇలా ఒకటీ రెండూ కాదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నెల రోజుల్లోనే ప్రాథమిక పాఠశాలల నుంచి యూనివర్సిటీల దాకా విద్యారంగంపై అధికార పార్టీ నేతలు జులుం ప్రదర్శిస్తున్నారు. మధ్యాహ్న భోజనం వంట వారి నుంచి వీసీల దాకా బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు.

అధికారం మాది.. పెత్తనమూ మాదే..

గత ఐదేళ్ల పాటు రాజకీయాలకు తావులేకుండా ఉన్నతంగా ఉన్న విద్యావ్యవస్థ తిరోగమనం బాట పట్టింది. 'రాష్ట్రంలో మేం చెప్పిందే జరగాలి. అది బడైనా, యూనివర్సిటీ అయినా సరే.. !' అని టీడీపీ, జనసేన నేతలు పెత్తనం కోసం ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ముందు వరకు పాఠశాల భవనంలో ఫ్యాన్ల కింద ఆత్మ విశ్వాసంతో మధ్యాహ్న భోజనాలు చేసిన విద్యార్థులు ఇప్పుడు బురదలో కూర్చొని తినాల్సిన పరిస్థితులు కల్పించారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం బండి వెలిగండ్ల పాఠశాలలో గత 15 ఏళ్లుగా వంట చేస్తున్న మహిళను వైఎస్సార్‌సీపీ అభిమాని అనే నెపంతో స్థానిక టీడీపీ నేతలు ఒత్తిడి తెచ్చి తొలగించారు. దీంతో ఈనెల ఒకటో తేదీన విద్యార్థులు పస్తులుండాల్సి వచ్చింది. టాయిలెట్లు శుభ్రం చేసే కార్మికులను సైతం తొలగించి తమ వారినే నియమించాలని పట్టుబట్టిన దాఖలాలు అనేకం ఉన్నాయి. ఉన్నవారు వెళ్లిపోగా కొత్తవారు ముందుకు రాకపోవడంతో నాడు–నేడు ద్వారా తీర్చిదిద్దిన మరుగుదొడ్లు దారుణంగా కనిపిస్తున్నాయి.

చట్ట వ్యతిరేకంగా వీసీలు, రిజిస్ట్రార్ల తొలగింపు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్థానిక కూటమి నాయకులు తమ పరిధిలో విద్యా వ్యవస్థ, ఉపాధ్యాయులపై దాడులు చేస్తుంటే రాష్ట్ర స్థాయిలో టీడీపీ పెద్దలు వీసీలు, రిజిస్ట్రార్లు, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్లపై పడ్డారు. రాజ్యాంగ బద్ధమైన వర్సిటీలను రాజకీయ విష క్రీడకు బలి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నియమితులైన వీసీలు, రిజిస్ట్రార్లకు ఫోన్లు చేసి బెదిరించి బలవంతంగా రాజీనామాలు చేయించారు. మానవ వనరుల శాఖ మంత్రి కార్యాలయం నుంచే ఈ ఫోన్లు వెళ్లడం గమనార్హం. దీంతో విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కె.బాబ్జీ రాజీనామా చేశారు. 2026 ఫిబ్రవరి వరకూ ఆయన పదవీకాలం ఉన్నప్పటికీ వైద్య శాఖ ఉన్నతాధికారి ఒకరు ఫోన్ చేసి రాజీనామా చేయాలని ఆదేశించడంతో వైదొలిగారు. కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్‌ను సైతం ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్, డిప్యూటీ సెక్రటరీ ఫోన్ చేసి వెళ్లిపోవాలని ఆదేశించడంతో రాజీనామా చేయాల్సి వచ్చింది. కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ తొలి వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ కూడా తన పదవీకాలం పూర్తవకుండానే ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో రాజీనామా సమర్పించారు. వైఎస్సార్ జిల్లాలోని యోగి వేమన వర్సిటీ (వైవీయూ) వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డితోనూ బలవంతంగా రాజీనామాలు చేయించారు. పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి పదవీ కాలం మరో రెండేళ్లు ఉన్నప్పటికీ బలవంతంగా రాజీనామా చేయించారు. జేఎన్‌టీయూ–కాకినాడ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజుకు మరో నాలుగు నెలలు పదవీకాలం ఉన్నా రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్, రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, కో–ఆర్డినేటర్లు, డైరెక్టర్లను సైతం ఒత్తిడి చేసి పదవులకు రాజీనామా చేయించారు. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో పాటు రిజిస్ట్రార్ల చాంబర్లను కూటమి నాయకులు ముట్టడించి మరీ భయపెట్టి రాజీనామా చేయించారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీకి విద్యాశాఖ మంత్రి కార్యాలయం నుంచి బెదిరింపులు రావడంతో శనివారం రాజీనామా సమర్పించారు. మరో రెండున్నరేళ్ల పదవీ కాలం ఉన్నా తప్పుకునే పరిస్థితి కల్పించారు.

శ్రీరామవరంలో టీడీపీ అరాచకం

- దెందులూరు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడి ఇంటిపై దాడి
- బైక్, కార్యాలయ అద్దాలు పగులగొట్టిన టీడీపీ శ్రేణులు



ఇంటి వద్ద వస్తువులను ధ్వంసం చేసిన టీడీపీ వర్గీయులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: దెందులూరు మండలం శ్రీరామవరంలో టీడీపీ శ్రేణులు ఆదివారం రాత్రి అరాచకం సృష్టించాయి. వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల శాఖ అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఇంటిపై దాడిచేసి ఇంట్లోని సామగ్రి, పక్కనే ఉన్న కార్యాలయ అద్దాలు పగులగొట్టారు. నాని తండ్రి పోస్టుమాస్టరుగా పనిచేస్తున్నారు. ఇంటివద్దే పోస్టాఫీస్ నిర్వహిస్తుండగా.. అక్కడ ఉన్న టేబుల్, ద్విచక్ర వాహనం పగులకొట్టారు. ఇంటి ఎదుట, కార్యాలయంలో ఉన్న కుర్చీలను సైతం పగులకొట్టారు. నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య నేతృత్వంలో పెదవేగి సీఐ కే.శ్రీనివాసకుమార్, దెందులూరు ఎస్‌ఐ కె.స్వామి శ్రీరామవరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. దాడి ఘటనను ఎస్పీ డీ.మేరీప్రశాంతి, ఇతర ఉన్నతాధికారులకు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలియజేశారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	53	79,997
నిఫ్టీ △	22	24,314

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	18,353	△	164
డోజోన్స్	39,376	△	68
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,203	▽	37
డాక్స్	18,475	△	25
హాంగ్‌సెంగ్	2,949	▽	8
నికాయ్	40,912	▽	1

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.06	84.08
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.44	107.80
€	యూరో	ఎస్‌బీఐ	89.27	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.47	52.60
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.30	57.28
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

పాలసీ సరెండర్ చేస్తే.. ఇక ఊరట!



- నిబంధనల్లో తాజాగా మార్పులు..
- తొలి నాళ్లలో రద్దు చేసుకుంటే అధిక మొత్తం
- సెప్టెంబర్ నాటికి అమలు చేయాలన్న ఐఆర్‌డీఏఐ
- ప్రీమియం భారమైతే సరెండర్ ఒక మార్గం
- తప్పుడు పాలసీ అంటగట్టినా వదిలించుకోవచ్చు..



ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ ఎంతో అవసరం. జీవిత బీమాను పెట్టుబడి సాధనంగా చూసే ధోరణి మన సమాజంలో ఎక్కువగానే ఉంది. నేటికీ సంప్రదాయ బీమా పాలసీలు (ఎండోమెంట్, మనీబ్యాక్/జీవించి ఉన్నా రాబడులు వచ్చేవి) ఎక్కువగా విక్రయమవుతుండడం దీనికి నిదర్శనం. నిజానికి ఈ తరహా ప్లాన్లలో తక్కువ రక్షణకే ఎక్కువ ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. దీంతో ప్రీమియం భారంగా మారి కట్టలేని పరిస్థితుల్లో అర్థాంతరంగా విడిచిపెట్టేసేవారు ఉన్నారు. ఇక పాలసీ వద్దనుకుని వెనక్కి ఇచ్చేస్తే (సరెండర్) బీమా సంస్థలు నిబంధనల మేరకు కొంత మొత్తాన్ని వెనక్కి ఇస్తుంటాయి. పాలసీ తీసుకున్న తొలినాళ్లలో రద్దు చేసుకుంటే చేతికి వచ్చేది పిసరంతే. ఇది గమనించిన బీమారంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) పాలసీదారుల ప్రయోజనాల పరిరక్షణకు వీలుగా నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చింది. కనుక పాలసీని సరెండర్ చేస్తే ఎంత మొత్తం వెనక్కి వస్తుందన్న దానిపై పాలసీదారులు అవగాహన కలిగి ఉండడం అవసరం. ఆ వివరాలే ఈ వారం ప్రాఫిట్ ప్లస్ కథనం.

సరెండర్ వేల్యూ?

జీవిత బీమాలో సరెండర్ వేల్యూ అంటే.. గడువు తీరకుండానే పాలసీని రద్దు చేసుకుంటే పాలసీదారుకు బీమా సంస్థ తిరిగి చెల్లించే మొత్తం. పాలసీ కాల వ్యవధి మధ్యలో వైదొలిగితే కట్టిన ప్రీమియంల నుంచి కొంత మొత్తాన్ని బీమా సంస్థ వెనక్కి ఇస్తుంది. సరెండర్ చార్జీల (స్వాధీనపు చార్జీలు) పేరుతో కొంత మినహాయించుకుంటుంది. సరెండర్ చేయడం కంటే పాలసీని కొనసాగించడమే నయమనే విధంగా, పాలసీ ముందస్తు రద్దును నిరుత్సాహపరిచే స్థాయిలో సరెండర్ చార్జీలు ఇంతకుముందు అమల్లో ఉండేవి. ఇది అసమంజసమని భావించిన ఐఆర్‌డీఏఐ పాలసీదారుల ప్రయోజనాల కోణంలో నిబంధనలు మార్చింది. సరెండర్ వేల్యూ అన్నది.. గ్యారంటీడ్ సరెండర్ వ్యాల్యూ (జీఎస్‌వీ), స్పెషల్ సరెండర్ వ్యాల్యూ (ఎస్‌ఎస్‌వీ) అని రెండు రకాలుగా ఉంటుంది. గ్యారంటీడ్ అంటే పాలసీ రద్దుతో బీమా సంస్థ చెల్లించాల్సిన కనీస మొత్తం. ఇందులో పాలసీ గడువు తీరినప్పుడు ఇచ్చే బోనస్‌లను కలపరు. అదే స్పెషల్ సరెండర్ వేల్యూలో అప్పటి వరకు సమకూరిన బోనస్‌లు, ఇతర ప్రయోజనాలు కూడా కలుస్తాయి. బీమా సంస్థలతో సంప్రదింపుల మీదట ఐఆర్‌డీఏఐ కొత్త నిబంధనలు తీసుకొస్తూ జూన్ 12న జీవిత బీమా సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రధానంగా స్పెషల్ సరెండర్ వ్యాల్యూ నిబంధనల్లో కీలకమైన మార్పును ఐఆర్‌డీఏఐ తీసుకొచ్చింది.

ఎంతొస్తుంది..?



పాలసీ తీసుకున్న ఏడాది తర్వాత వైదొలిగితే గతంలో ఏమీ వచ్చేది కాదు. కానీ, ఇక మీదట కొంత మొత్తం చెల్లించక తప్పదు. అలాగే పాలసీ తీసుకున్న మొదటి ఐదేళ్లలో సరెండర్ చేస్తే గతంలో పెద్దగా తిరిగొచ్చేది కాదు. కానీ ఇప్పుడు బీమా సంస్థలు అధిక మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. పాలసీ వారీగా గ్యారంటీడ్ సరెండర్ వేల్యూ, స్పెషల్ సరెండర్ వేల్యూ, చెల్లింపుల సరెండర్ వేల్యూ గురించి పాలసీ ఇలస్ట్రేషన్ (ప్రయోజనాల) పత్రంలో పేర్కొనాలని ఐఆర్‌డీఏఐ నిర్దేశించింది. ఈ పత్రంపై పాలసీ కొనుగోలుదారు, బీమా ఏజెంట్ లేదా బీమా సంస్థ అధీకృత మధ్యవర్తి లేదా పంపిణీ ఉద్యోగి సంతకం కూడా చేయాల్సి ఉంటుంది.


సంప్రదాయ ఎండోమెంట్ పాలసీని సరెండర్ చేస్తే ఎంతొస్తుందన్నది ఉదాహరణ ద్వారా సులభంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. రవికిరణ్ రూ.5 లక్షల సమ్ అష్యూర్డ్ (బీమా కవరేజీ)తో పదేళ్ల కాలానికి (టర్మ్) పాలసీ తీసుకున్నాడని అనుకుందాం. ఏటా రూ.50,000 ప్రీమియం చెల్లించాలి. నాలుగేళ్లపాటు ఏటా రూ.50,000 చొప్పున ప్రీమియం చెల్లించిన తర్వాత అతడు పాలసీని సరెండర్ చేద్దామనుకున్నాడు. అప్పటి వరకు ప్రీమియం రూపంలో అతడు బీమా సంస్థకు రూ.2,00,000 చెల్లించాడు. ఏటా రూ.10,000 చొప్పున బోనస్ అతడికి జమ అయింది. గత నిబంధనల ప్రకారం పాలసీ తీసుకున్న తర్వాత నాలుగో ఏడాది నుంచి ఏడో ఏడాది మధ్య సరెండర్ చేస్తే అప్పటి వరకు తాము వసూలు చేసిన ప్రీమియంలలో 50 శాతాన్ని బీమా సంస్థలు వెనక్కి ఇచ్చేవి. 'అంటే పాత నిబంధనల ప్రకారం రవికిరణ్ నాలుగేళ్ల తర్వాత పాలసీని సరెండర్ చేస్తే వచ్చే మొత్తం రూ.1,20,000 అవుతుంది. చెల్లించిన ప్రీమియంతోపాటు బోనస్‌లు కూడా కలుపుకుని చూస్తే అప్పటికి రూ.2,40,000 సమకూరింది. అంటే ఇందులో సగం కోల్పోవాల్సి వచ్చేది. కానీ, నూతన స్పెషల్ సరెండర్ వేల్యూ నిబంధనల కింద నాలుగేళ్ల తర్వాత సరెండర్ చేస్తే ఇదే ఉదాహరణ కింద రవికిరణ్‌కు రూ.1.55 లక్షలు వెనక్కి వస్తాయి' అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్, సహజ్‌మనీ వ్యవస్థాపకుడు అభిషేక్ కుమార్ వివరించారు. ఆయా అంశాలకు సంబంధించి నిపుణుల సలహాలు తీసుకోవడం అవసరమన్నారు.

ఒకవేళ ఇదే పాలసీని మొదటి ఏడాది ప్రీమియం రూ.50,000 చెల్లించిన తర్వాత రవికిరణ్ సరెండర్ చేస్తే పాత నిబంధనల కింద రూపాయి కూడా వెనక్కి రాదు. కానీ, కొత్త నిబంధల కింద రూ.31,295 వెనక్కి వస్తుంది. అంటే చెల్లించిన ప్రీమియంలో 62.59 శాతానికి సమానం. ఇలా ఏటా పెరుగుతూ వెళుతుంది. రెండో ఏడాది సరెండర్ చేస్తే అప్పటికి చెల్లించిన ప్రీమియంలో 67.28 శాతం వెనక్కి వస్తుంది. మూడో ఏట 72.33 శాతం, నాలుగో ఏట 77.76 శాతం, ఐదో ఏటా 83.59 శాతం, ఆరో ఏట 89.86 శాతం, ఏడో ఏట 96.60 శాతం, ఎనిమిదో ఏడాది ప్రీమియం చెల్లించిన తర్వాత అప్పటికి చెల్లించిన ప్రీమియంపై 103.84 శాతం, తొమ్మిదో ఏట 111.63 శాతం బీమా సంస్థ వెనక్కి ఇస్తుంది. లిమిటెడ్ ప్రీమియం పేమెంట్ పాలసీలు, సింగిల్ ప్రీమియం పాలసీల్లోనూ ఒక్కసారి ప్రీమియం చెల్లించినా సరే స్పెషల్ సరెండర్ వేల్యూ వెనక్కి ఇవ్వాల్సిందేనని ఐఆర్‌డీఏఐ కొత్త నిబంధనల్లో నిర్దేశించింది.

ఎప్పటి నుంచి..?

స్పెషల్ సరెండర్ వేల్యూ కొత్త నిబంధనలను ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి అమలు చేయాలని ఐఆర్‌డీఏఐ ఆదేశించింది. స్పెషల్ సరెండర్ వేల్యూ నిబంధనలు కొత్తగా తీసుకునే ఎండోమెంట్ పాలసీలకే వర్తిస్తాయని బంధన్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో బి.సతీశ్వర్ తెలిపారు. నూతన నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత తీసుకునే పాలసీలకే ఐఆర్‌డీఏఐ తీసుకొచ్చిన స్పెషల్ సరెండర్ వేల్యూ నిబంధనలు అమలవుతాయి.

ప్రత్యామ్నాయాలు...



ఎండోమెంట్ ప్లాన్లను తీసుకుని కొన్నేళ్లపాటు ప్రీమియం చెల్లించిన తర్వాత, ఆపై కొనసాగించడం భారంగా మారిన వారికి సరెండర్ చేయడం ఒక్కటే ఆప్షన్ కాదు. ఆ పాలసీని పెయిడప్‌గా మార్చుకోవచ్చు. పెయిడప్‌గా మార్చుకోవడం వల్ల బీమా రక్షణ కొనసాగుతుంది. అప్పటి నుంచి పాలసీ ముగిసే వరకు ఏటా ప్రీమియం కూడా చెల్లించనక్కర్లేదు. అప్పటి వరకు ఎన్నేళ్లపాటు, ఎంత మేర ప్రీమియం చెల్లించారన్న దాని ఆధారంగా బీమా కవరేజీని నిర్ణయిస్తారు. ఉదాహరణకు రూ. 5 లక్షల సమ్ అష్యూర్డ్ పాలసీని 20 ఏళ్ల కాలానికి తీసుకుని, ఏటా రూ. 50వేల చొప్పున ఐదేళ్లపాటు ప్రీమియం చెల్లించారని అనుకుందాం. ఆ తర్వాత ఇక కొనసాగించడం వీలు కాని వారు పెయిడప్‌గా మార్చుకుంటే, అదే పాలసీ రూ.5 లక్షలకు బదులు రూ.1-1.5 లక్షల సమ్ అష్యూర్డ్‌తో 20 ఏళ్ల వరకు కొనసాగుతుంది. గడువు తీరిన తర్వాత నిబంధనల మేరకు, అప్పటి వరకు సమకూరిన బోనస్ ప్రయోజనాలతో కలిపి చెల్లింపులు లభిస్తాయి.

మరో మార్గంగా పెయిడప్‌గా మార్చి, సమ్ అష్యూర్డ్ తగ్గించుకుని, అప్పటి నుంచి తక్కువే ప్రీమియం చెల్లిస్తూ వెళ్లొచ్చు. దీనివల్ల పెయిడప్ సమ్ అష్యూర్డ్ కవరేజీ కొంత పెరుగుతుంది. కాకపోతే పెయిడప్ చేసేందుకు బీమా సంస్థలు చార్జీలు వసూలు చేయడమే ప్రతికూలం. ఒకవేళ నిధుల అవసరం ఏర్పడి, పాలసీని సరెండర్ చేస్తే తిరిగొచ్చే మొత్తం ఆదుకుంటుందని భావిస్తే అప్పుడు అదే ఆప్షన్‌ను పరిశీలించొచ్చు.



ప్రయోజనాలు

నూతన నిబంధనలు పాలసీదారులకు ప్రయోజనమన్నది నిపుణుల విశ్లేషణ. ఏజెంట్ చెప్పిన మాటలు విని లేదా తెలిసిన వారు చెప్పారనో ఏదైనా పాలసీ కొనుగోలు చేసిన తర్వాత.. అది తమకు సరిపడేది కాదని గుర్తించిన సందర్భాల్లో దాన్ని సరెండర్ చేసి బయటకు రావచ్చు. తమ అవసరాలకు తగిన మరో ప్లాన్‌ను కొనుగోలు చేసుకోవచ్చని చెబుతున్నారు. అనుచిత వ్యాపార విధానాలపై (బీమా కంపెనీలకు సంబంధించి) పాలసీదారుల నుంచి వచ్చే ఫిర్యాదులు 1.5 శాతం పెరిగినట్టు ఐఆర్‌డీఏఐ 2022-23 నివేదిక సైతం తెలియజేస్తోంది. ముఖ్యంగా ప్రైవేటు బీమా కంపెనీలకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయి. పాలసీదారులను తప్పుదోవ పట్టించి, వారితో పాలసీలు కొనుగోలు చేయించే అనైతిక ధోరణలకు చెక్ పెట్టడం కూడా సరెండర్ వేల్యూ పెంచడంలోని ఉద్దేశమని నిపుణులు చెబుతున్నారు.

సంప్రదాయ పాలసీలు / టర్మ్ ప్లాన్లు



ఎండోమెంట్ ప్లాన్లలో పాలసీదారు కాల వ్యవధి ముగియక ముందే మరణించినట్టయితే సమ్ అష్యూర్డ్ (బీమా కవరేజీ)తోపాటు అప్పటి వరకు సమకూరిన బోనస్‌లు చెల్లిస్తారు. పాలసీ కాల వ్యవధి ముగిసే వరకు పాలసీదారు జీవించి ఉన్నప్పటికీ.. ఈ ప్లాన్లలో నిర్దేశిత మొత్తం తిరిగొస్తుంది. ఇది సమ్ అష్యూర్డ్ కంటే ఎక్కువే ఉంటుంది. అంటే ఒకవైపు బీమా రక్షణతోపాటు, రాబడి ప్రయోజనం కూడా ఈ ప్లాన్లలో భాగంగా ఉంటుంది. అందుకే ఈ ప్లాన్ల ప్రీమియం ఎక్కువగా ఉంటుంది. అయినా సరే తాము అప్పటి వరకు కట్టిన దానికంటే ఎక్కువే వస్తుందని చాలా మంది ఈ తరహా ప్లాన్లకే మొగ్గు చూపిస్తుంటారు. కానీ, 20 ఏళ్లు, అంతకు మించిన కాలవ్యవధి గల ఎండోమెంట్ ప్లాన్లలో వచ్చే నికర వార్షిక రాబడి 5 శాతంగానే ఉంటుందని అంచనా. అంటే ద్రవ్యోల్బణం రేటుకు సమానం. కనుక పాలసీదారులకు ఈ ప్లాన్లపై వచ్చే నికర రాబడి సున్నాయే అవుతుంది. టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు వీటికి భిన్నం. ఇవి అచ్చమైన బీమా రక్షణకే పరిమితం అవుతాయి. అంటే పాలసీ కాల వ్యవధిలో (టర్మ్) పాలసీదారు మరణించినట్టయితే సమ్ అష్యూర్డ్ మొత్తం నామినీ లేదా వారసులకు లభిస్తుంది. ఒకవేళ పాలసీ కాల వ్యవధి ముగిసే వరకు పాలసీదారు జీవించి ఉంటే ఏమీ రాదు. పాలసీదారు జీవించి ఉన్నా, అప్పటి వరకు చెల్లించిన ప్రీమియంలను వెనక్కిచ్చే టర్మ్ ప్లాన్లు కూడా వచ్చాయి. కాకపోతే అచ్చమైన టర్మ్ ప్లాన్లతో పోలిస్తే వీటి ప్రీమియం 50-100 శాతం ఎక్కువే ఉంటుంది. 30 ఏళ్ల వ్యక్తి రూ.కోటి జీవిత బీమా కవరేజీని కేవలం రూ.10 వేల వార్షిక ప్రీమియానికే టర్మ్ ప్లాన్‌తో సొంతం చేసుకోవచ్చు.

స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎఫ్‌డీ సురక్షితమేనా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

రిటైర్మెంట్ సమయంలో ప్రావిడెంట్ ఫండ్ ద్వారా నాకు రూ.కోటి సమకూరింది. ఆదాయపన్ను రిటర్నుల దాఖలు సమయంలో ఈ మొత్తాన్ని వెల్లడించాలా?

– ఫణి వాణి

మీరు చెప్పింది నిజమే. ప్రావిడెంట్ ఫండ్ (భవిష్యనిధి) మొత్తంపై పన్ను మినహాయింపు ఉంటుంది. అయినా కానీ, ఈ మొత్తాన్ని ఆదాయపన్ను రిటర్నుల్లో తప్పకుండా వెల్లడించాలి. ఎందుకూ? అన్న సందేహం రావచ్చు. ఇలా వచ్చిన మొత్తాన్ని మీరు పెట్టుబడిగా పెడితే దానిపై వచ్చే రాబడులు పన్ను పరిధిలోకే వస్తాయి. మరి ఆ పెట్టుబడి ఎక్కడి నుంచి వచ్చిందో (మూలం) రిటర్నుల్లో వెల్లడించకపోతే, ఆ తర్వాత పలు సమస్యలు ఎదుర్కోవాల్సి రావచ్చు. లేదంటే పెనాల్టీ కూడా చెల్లించాల్సి రావచ్చు. రిటర్నుల్లో పీఎఫ్ మొత్తాన్ని ఎక్కడ చెల్లించాలన్న సందేహం రావచ్చు. పన్ను మినహాయింపు ఉన్న ఆదాయం ఏదైనా సరే దానిని 'షెడ్యూల్ ఈఐ'లో వెల్లడించాలి. ఈ షెడ్యూల్ కింద వెల్లడించిన మొత్తం సిస్టమ్ ఆటోమేటిక్‌గా పన్ను బాధ్యత లెక్కింపు సమయంలో మినహాయిస్తుంది. దాంతో పన్ను చెల్లించాల్సిన అవసరం రాదు.

స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌ల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు డెట్ మ్యూచువల్ ఫండ్స్ కంటే సురక్షితమేనా? డెట్ ఫండ్స్‌కు ఉన్న అదనపు ప్రయోజనాలు ఏమిటి?

– జబీర్

స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు), డెట్ మ్యూచువల్ ఫండ్స్ రెండూ దాదాపు సురక్షితమైనవే. కాకపోతే పెట్టుబడుల వైవిధ్యం పరంగా డెట్ మ్యూచువల్ ఫండ్స్ కాస్తంత అధిక రక్షణతో ఉంటాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లను ఆర్‌బీఐ సునిశితంగా పర్యవేక్షిస్తుంటుంది. భద్రతా ప్రమాణాలు పాటించినప్పుడే ఆర్‌బీఐ లైసెన్స్ జారీ చేస్తుంది. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లోనూ రూ.5 లక్షల వరకు ఎఫ్‌డీలకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) కింద బీమా రక్షణ ఉంటుంది. దీన్ని అదనపు భద్రతగా భావించొచ్చు. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ప్రయోజనాలను గమనించినట్టయితే.. ప్రధానమైనది వైవిధ్యం. రూ.5లక్షలను డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశారనుకుంటే.. మీ పెట్టుబడి 50 వేర్వేరు డెట్ సెక్యూరిటీల మధ్య విస్తరించి ఉంటుంది. ఈ డెట్ సెక్యూరిటీల్లో ఏదైనా చెల్లింపుల్లో వైఫల్యం చెందినా, దాని ప్రభావం మొత్తం పెట్టుబడుల్లో 3-4 శాతం మించదు. డెట్ మ్యూచువల్ ఫండ్స్ అయితే పన్ను బాధ్యతను వాయిదా వేసుకోవచ్చు. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను విక్రయించినప్పుడే లాభాలు పన్ను పరిధిలోకి వస్తాయి. కానీ, ఎఫ్‌డీల్లో అలా కాకుండా వడ్డీపై ఏటా పన్ను పడుతుంది. ఇక డెట్ మమ్యూచువల్ ఫండ్స్‌లో లిక్విడిటీ (కోరుకున్నప్పుడు వెంటనే నగదుగా మార్చుకోవడం) మెరుగ్గా ఉంటుంది. ఎఫ్‌డీలను ముందుగా రద్దు చేసుకుంటే పెనాల్టీ విధించొచ్చు. డెట్‌లో ఇది ఉండదు. కాకపోతే ఎఫ్‌డీల మాదిరిగా డెట్ ఫండ్స్ హామీపూర్వక రాబడులను ఆఫర్ చేయవు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మార్కెట్ స్థిరీకరణ అంచనాలు	హిండెన్‌బర్గ్ నివేదిక దురుద్దేశమే!

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-7-2024	
విశాఖ	570-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	550-00
హైదరాబాద్	530-00
వరంగల్	532-00

కుటుంబానికి రూ.10 వేలకే హెల్త్ ఇన్సూరెన్స్

నారాయణ హెల్త్ వినూత్న పాలసీ

న్యూఢిల్లీ: ఆరోగ్య బీమా ప్రీమియం సామాన్యులకు భారంగా మారిన తరుణంలో.. ప్రముఖ వైద్య సేవల సంస్థ 'నారాయణ హెల్త్' చౌక ప్రీమియంతో ఒక ప్లాన్‌ను ఆవిష్కరించింది. ఈ ఆరోగ్య బీమా పాలసీకి 'అతిథి' పేరు పెట్టింది. దంపతులు, ఇద్దరు పిల్లలు (గరిష్టంగా) కలిగిన నలుగురు సభ్యుల కుటుంబానికి ఏడాదికి ప్రీమియం కేవలం రూ.10,000గా నిర్ణయించింది. ఇంటిపెద్ద వయసు 45ఏళ్లకు మించకుండా ఉంటేనే ఈ ప్రీమియం. ఇంతకంటే అధిక వయసులోని వారికి ప్రీమియం (అది కూడా ఇతర బీమా సంస్థల కంటే తక్కువే) వేరుగా ఉంటుంది. నలుగురు సభ్యుల కుటుంబానికి ఒక ఏడాదిలో రూ.కోటి రూపాయల వరకు సర్జరీలకు ఈ పాలసీలో చెల్లింపులు లభిస్తాయి. ఇతర హాస్పిటల్ చికిత్సలకు (జ్వరం, ఇన్ఫెక్షన్ తదితర) రూ.5లక్షల వరకు కవరేజీ ఉంటుంది. కాకపోతే ప్రస్తుతానికి ఈ పాలసీ కింద సేవలు నారాయణ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనే లభిస్తాయి. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 21 హాస్పిటళ్లు ఉన్నాయి. బెంగళూరులో ఏడు ఆస్పత్రులతోపాటు, మూడు క్లినిక్‌లు ఉన్నాయి.

ఎస్‌బీఐ | బ్రోకరేజ్: జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

స్టాక్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 860 **టార్గెట్:** రూ. 1,050

ఎందుకంటే: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) తాజా వార్షిక నివేదిక ప్రకారం గతేడాది(2023-24) పలు అంశాలలో పటిష్ట పనితీరును ప్రదర్శించింది. ప్రధానంగా నాణ్యత, వృద్ధి, లాభదాయకతలో ఉత్తమ ఫలితాలు సాధించింది. క్లిష్టతర లిక్విడిటీ పరిస్థితుల్లోనూ రుణ విడుదలలో 15.8 శాతం, డిపాజిట్లలో 11.1 శాతం వృద్ధిని అందుకుంది. ఈ బాటలో కరెంట్, పొదుపు ఖాతాల(కాసా)ను 41.1 శాతం స్థాయిలో నిర్వహిస్తోంది. ఈ అంశాలన్నీ తీవ్రతర పోటీ పరిస్థితుల్లోనూ బ్యాంక్ మార్కెట్ వాటాకు రక్షణను కల్పిస్తున్నాయి. ఇక క్రెడిట్ వ్యయం 0.23 శాతానికి తగ్గింది. వార్షిక ప్రాతిపదికన 0.27 శాతం క్షీణించింది. 2019-20లో ఇది 1.87 శాతంగా నమోదుకావడం గమనార్హం! మరోవైపు వార్షికంగా చూస్తే 2008-09 తదుపరి ఆర్‌వోఏ 1 శాతాన్ని అధిగమించింది. వేతన సవరణ, పెన్షన్ బకాయిలు(లయబిలిటీస్)కు ప్రొవిజన్ల(వన్‌టైమ్) ప్రభావం అధిక నిర్వహణ వ్యయాలకు(ఒపెక్స్) కారణమైంది. దీంతో వార్షికంగా 1.87 శాతం నుంచి 2.02 శాతానికి పెరిగింది. పటిష్ట రుణ వృద్ధి, నికర వడ్డీ మార్జిన్ల(3.28 శాతం)లో నిలకడ, తగ్గిన ప్రొవిజన్లు నికర లాభం మరింత(వార్షికంగా 22 శాతం) బలపడేందుకు దోహదం చేశాయి. 2023 నవంబర్‌లో ఆర్‌బీఐ తప్పనిసరి చేయడంతో పెరిగిన రిస్క్ వెయిట్స్ నేపథ్యంలోనూ మూలధన(సీఈటీ-1) నిష్పత్తి 9 బేసిస్ పాయింట్లు పుంజుకుని 10.36 శాతానికి చేరింది. ఇది మూలధన నిర్వహణలో ఎస్‌బీఐ సమర్థతను ప్రతిఫలిస్తోంది. స్టాండెలోన్ ప్రాతిపదికన బ్యాంక్ సీఏఆర్ 14.25 శాతాన్ని తాకింది. బలపడుతున్న క్రెడిట్ డిమాండ్(ప్రధానంగా హోల్‌సేల్ విభాగంలో), ప్రయివేట్ రంగంలో పెట్టుబడి వ్యయాలు పెరగనున్న అంచనాలు సమీప భవిష్యత్‌లో మరింత మెరుగైన పనితీరుకు మార్గం చూపనున్నాయి.



మేదాంతా | బ్రోకరేజ్: యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,267 **టార్గెట్:** రూ. 1,475

ఎందుకంటే: మేదాంతా పేరుతో ఆరోగ్య పరిరక్షణ సర్వీసులందిస్తున్న గ్లోబల్ హెల్త్ లిమిటెడ్ పటిష్ట బ్రాండ్ ఈక్విటీని కలిగి ఉంది. అంతర్జాతీయంగా సుప్రసిద్ధులైన కార్డియోవాస్కులర్, కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ త్రెహాన్ ఏర్పాటు చేసిన సంస్థ ఇది. రోగుల ఆరోగ్య పరిరక్షణలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పడంతోపాటు, అత్యంత క్లిష్టమైన చికిత్సలలో ప్రత్యేకతను చాటుకుంటూ సంస్థ మార్కెట్లో బాగా బలపడింది. ప్రధానంగా గుండె సంబంధ వ్యాధుల చికిత్స(కార్డియాక్)సహా.. డైజెస్టివ్, అంకాలజీ, న్యూరో విభాగాలు కంపెనీకి ఆర్థికంగా బలిమినిస్తున్నాయి. మొత్తం ఆదాయంలో ఈ విభాగాల వాటా 59 శాతంకాగా.. వీటికి అదనంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్(కాలేయ మార్పిడి), కిడ్నీ, యూరాలజీ, ఆర్థోపెడిక్స్, విభిన్న చికిత్సలతోకూడిన ఇంటర్నెల్ మెడిసిన్ తదితర సేవలను అందిస్తోంది. వెరసి ఇవన్నీ మేదాంతా ఆదాయ వృద్ధికి దన్నుగా నిలుస్తున్నాయి. భారీ వృద్ధికి వీలు కల్పిస్తూ వ్యూహాత్మకంగా ఏర్పాటైన సంస్థ వేగవంత విస్తరణకు ప్రణాళికలు అమలు చేస్తోంది. దీనిలో భాగంగా నిర్వహణలోగల ఆసుపత్రులపైనే దృష్టి పెట్టింది. తద్వారా ప్రస్తుతమున్న 2,823 పడకల(బెడ్స్) సామర్థ్యాన్ని భారీ స్థాయిలో విస్తరించనుంది. రానున్న మూడేళ్ల కాలంలో అదనంగా 1,394 బెడ్స్‌ను జత చేసుకునే ప్రణాళికలకు తెరతీసింది. ఫ్రీ క్యాష్‌ఫ్లో- నిర్వహణ లాభ(ఎఫ్‌సీఎఫ్ఎఫ్/ ఇబిటా) నిష్పత్తిలో ఆరోగ్య పరిరక్షణ రంగంలోకెల్లా అత్యధికంగా 60 శాతం మార్పిడిని సాధిస్తోంది. ఇకపై అమలుకానున్న విస్తరణ ప్రణాళికలకు అవసరమయ్యే పెట్టుబడులను.. అంతర్గత వనరుల నుంచే సమకూర్చుకునేందుకు ఇది దారి చూపనుంది. వెరసి వార్షికంగా రూ. 900-1,000 కోట్ల ఎఫ్‌సీఎఫ్ఎఫ్ సాధించేందుకు వీలు కలగనుంది. అదికూడా రానున్న మూడేళ్లలో ప్రతీ ఏడాది రూ. 300 కోట్ల కనీస పెట్టుబడి వ్యయాలతోనే సాధించేందుకు వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

మలేరియాతో గిరిజన విద్యార్థి మృతి

- శ్రీకాకుళం జిల్లాలో ఘటన
- మరో నలుగురికీ మలేరియా..


రిష్మిత (ఫైల్)

సరుబుజ్జిలి: శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి మండలం, వెన్నెలవలస వద్ద గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న బిడ్డిక రిష్మిత(8) మలేరియా బారిన పడి మృతి చెందింది. ఇదే హాస్టల్‌లో మరో నలుగురు విద్యార్థినులు మలేరియాతో శ్రీకాకుళంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. మన్యం పార్వతీపురం జిల్లా సీతంపేట మండలం అచ్చబ గ్రామానికి చెందిన రిష్మిత ఇటీవలే పాఠశాలకు హాజరైంది. అయితే తనతో పాటు సవర ప్రభావతి అనే మరో బాలికకు తీవ్ర జ్వరం రావడంతో సిబ్బంది స్థానిక పీహెచ్‌సీకి సమాచారం అందించారు. వైద్య సిబ్బంది ఇద్దరి బాలికల రక్త నమూనాలు సేకరించి టెస్ట్ చేశారు. రిష్మితకు మలేరియాగా నిర్ధారించారు. మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు పంపించగా.. అక్కడ చికిత్స పొందుతూ రిష్మిత ఆదివారం కన్నుమూసింది. హాస్టల్‌లో అందరికీ రక్త పరీక్షలు చేయగా మరో నలుగురికి మలేరియా పాజిటివ్ రావడం గమనార్హం.

ఎస్వీ జూలో పులి మృతి



తిరుపతి మంగళం (తిరుపతి జిల్లా): తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)లో ఆదివారం ఐదు సంవత్సరాల వయసు గల జూలీ అనే ఆడ పులి అనారోగ్యంతో మృతి చెందినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. జంతు మార్పిడి కింద 2024 ఫిబ్రవరి 13న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలోని నవాబ్ వజీద్ అలీ షాహ్ జూలాజికల్ పార్క్ నుంచి తీసుకొచ్చినట్లు చెప్పారు. అప్పటి నుంచి ఎంక్లోజర్స్‌లో ఉంచి సందర్శకుల సందర్శనకు ఉంచామన్నారు. అయితే అది ఆడుకునే క్రమంలో దాని కాలికి, పొత్తికడుపులో గాయమైందని, అప్పటి నుంచి ఆహారం, నీరు తీసుకోవడం లేదన్నారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యం అందించినట్లు తెలిపారు. చిన్నప్రేగులో సమస్యతో పాటు ఇటెస్టినల్ టోర్సిషన్‌తో మృతి చెందినట్లు ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వైద్యులు నిర్ధారించినట్లు జూ క్యూరేటర్ వివరించారు.

జాలర్ల వలలో డెవిల్ ఫిష్



ఆలమూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారంలోని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రధాన కాలువలో అరుదైన చేప (డెవిల్ ఫిష్) ఆదివారం జాలర్లకు చిక్కింది. అడుగు పొడవు ఉన్న ఈ చేప పైభాగం నల్లటి చారలు, మచ్చలతో విచిత్రంగా ఉంది. సాధారణ చేపలకు భిన్నంగా నోరు ఉన్న ఈ చేప మాంసాహార జీవి. ఉత్తరాదిన గంగానదిలో ఎక్కువగా లభించే ఈ చేపను డెవిల్ ఫిష్ లేదా వీడ్ ఫిష్ అని పిలుస్తారని మత్స్యకార అభివృద్ధి అధికారి జి.గోపి తెలిపారు. ఈ రకాలను అక్వేరియంలో పెంచుతుంటారని, దీని వల్ల సాధారణ చేపలకు ముప్పు ఉంటుందని పేర్కొన్నారు.

తుంగభద్ర డ్యామ్‌లోకి 50,715 క్యూసెక్కులు

- ఆల్మట్టిలోకి 59,306 క్యూసెక్కులు

సాక్షి, అమరావతి: కృష్ణానది పరివాహక ప్రాంతం (బేసిన్)లో ఎగువన విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రధాన పాయతోపాటు ఉపనదుల్లో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ప్రధాన ఉపనది తుంగభద్రలో శనివారంతో పోలిస్తే ఆదివారం వరద ఉధృతి పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 50,715 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 18.25 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర డ్యామ్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 105.78 టీఎంసీలు. డ్యామ్ నిండాలంటే ఇంకా 87.53 టీఎంసీలు అవసరం. ఇక కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి డ్యామ్‌లోకి 59,306 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 61.06 టీఎంసీలకు చేరుకుంది. ఆల్మట్టి డ్యామ్ నిండాలంటే ఇంకా 68.66 టీఎంసీలు అవసరం.

2 రోజుల పాటు వర్షాలు

- దక్షిణాంధ్ర తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

సాక్షి, విశాఖపట్నం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంలో సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో విస్తరించి కొనసాగుతోంది. దీని ప్రభావంతో నేడు, రేపు ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే సూచనలూ ఉన్నాయని వెల్లడించారు. తీరం వెంబడి 30 నుంచి 40 కిమీ వేగంతో గాలులు వీస్తాయని.. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

విద్యార్థుల ఆశలపై నీళ్లు

- 2024–25లో ఐదు వైద్య కళాశాలల్లో తరగతులకు ఎన్ఎంసీ అనుమతులు నిరాకరణ
- ఇందుకు ఏమాత్రం చొరవ చూపని రాష్ట్ర ప్రభుత్వం
- వీటి ప్రారంభం కోసం గత వైఎస్సార్‌సీపీ సర్కారు విశేష కృషి



సాక్షి, అమరావతి: అనుకున్నంతా అయింది.. రాష్ట్రంలో ఈ ఏడాది ప్రారంభించాల్సి ఉన్న ఐదు కొత్త ప్రభుత్వ కళాశాలల ప్రారంభంపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) నీళ్లజల్లింది. ఈ ఏడు తరగతులు ప్రారంభించుకునేందుకు అనుమతివ్వలేదు. దీంతో వీటిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వీటికి అనుమతులు సాధించడంలో టీడీపీ–జనసేన–బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపెట్టకపోవడమే కారణమని వైద్యశాఖ వర్గాల్లో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఉద్దేశపూర్వకంగానే ఈ కొత్త కళాశాలల ప్రారంభానికి చంద్రబాబు మోకాలడ్డారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజానికి.. 2024–25 విద్యా సంవత్సరం నుంచి పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పాడేరులలో ఈ కళాశాలలు ప్రారంభించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాటలు వేసింది. ఇందులో భాగంగా.. ఈ ఐదుచోట్ల ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడంతో పాటు, వైద్య కళాశాలలు ప్రారంభించడానికి వీలుగా పోస్టులను మంజూరుచేసి భర్తీ ప్రక్రియ చేపట్టింది. కానీ, ఎన్నికల అనంతరం ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోలేదు.

కనీసం చర్చించని బాబు సర్కారు..

గత నెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేశారు. జూన్ 25న వైద్య కళాశాలల్లో ఎన్ఎంసీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. సీఎంగా బాధ్యతలు స్వీకరించి ప్రభుత్వం ఏర్పాటుచేయడానికంటే ముందే సీఎస్ నియామకం, ఇతర అధికారుల మార్పు చేపట్టారు. ఈ అంశాలపై ఫోకస్ పెట్టిన బాబు అండ్ కో ప్రజల భవిష్యత్తు వైద్య అవసరాలు, విద్యార్థుల ఆకాంక్షలతో ముడిపడి ఉన్న వైద్య కళాశాలల ప్రారంభంపై మాత్రం దృష్టిపెట్టలేదు. పైగా.. సీఎం హోదాలో ఈనెల 3న వైద్యశాఖపై బాబు తొలి సమీక్ష నిర్వహించారు. ఇందులో కూడా వైద్య కళాశాలల అంశాన్ని చర్చించలేదు. మరోవైపు.. తనిఖీల అనంతరం కళాశాలలతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించిన ఎన్ఎంసీ పలు లోపాలపై రాష్ట్ర అధికారుల నుంచి వివరణ కోరింది. అడ్మిషన్లు ప్రారంభించే నాటికి తొలి ఏడాది విద్యార్థులకు తరగతులు నిర్వహించడానికి వీలుగా కళాశాలల్లో ల్యాబ్, లెక్చర్ హాల్, హాస్టళ్లు అందుబాటులో ఉంటే సరిపోతుంది. ఐదుచోట్ల 80 శాతం మేర ఈ సదుపాయాలున్నాయి. ఇంటీరియర్ పనులు, పలు పరికరాలను సమకూరిస్తే సరిపోతుంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తరగతులు ప్రారంభమయ్యే అవకాశమున్నందున ఈలోపు వసతులను కల్పించడానికి వీలుంటుంది. కానీ, ఈ అంశాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి ఒప్పించే ప్రయత్నం చేయలేదు. పైగా.. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి అయ్యుండి చంద్రబాబు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. మరోవైపు.. ఈ కళాశాలల్లో పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీని నియమించడానికి సీఎం జగన్ ప్రభుత్వం పలు దఫాలుగా నోటిఫికేషన్లు ఇచ్చింది. నగరాలకు దూరంగా ఉన్న క్రమంలో పలు స్పెషాలిటీల్లో వైద్యులు ముందుకు రానందున ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తామని కూడా ప్రకటించింది. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక మూడు వారాలు.. సీఎం ప్రమాణ స్వీకారం అయ్యాక రెండు వారాల పాటు సమయం ఉన్నప్పటికీ ఈ కొత్త వైద్య కళాశాలల ప్రారంభం గురించి పైస్థాయిలో ఏమాత్రం చర్చించలేదు. అలా చర్చించి అనుమతులు రాబట్టడానికి ఫ్యాకల్టీ కొరతను అధిగమించేలా చర్యలు తీసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సూపర్ స్పెషాలిటీ వైద్యం చేరువే లక్ష్యంగా..

రాష్ట్ర ప్రజలందరికీ సూపర్ స్పెషాలిటీ వైద్యం చేరువ చేయడంతో పాటు, విద్యార్థులకు వైద్య విద్యావకాశాలను పెంచడమే లక్ష్యంగా రూ.8 వేల కోట్లకు పైగా నిధులతో 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి గత సీఎం జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఓ వైపు కళాశాలల నిర్మాణం చేపడుతూనే విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల కళాశాలలను గత విద్యా సంవత్సరంలో ప్రారంభించింది. వందేళ్ల చరిత్రలో తొలిసారిగా ఒకే ఏడాది 750 ఎంబీబీఎస్ సీట్లను సమకూర్చింది. ఈ ఏడాది ఐదు కళాశాలలను, మిగిలిన ఏడు కళాశాలలను 2025–26లో ప్రారంభించేలా ప్రణాళిక రచించింది.

అనుమతులు వస్తే 500 సీట్లు..

ఇదిలా ఉంటే.. ఐదు కళాశాలలకు అనుమతులు లభిస్తే ఒక్కోచోట 100 చొప్పున 500 ఎంబీబీఎస్ సీట్లు కొత్తగా సమకూరేవి. 10 లక్షల జనాభాకు వంద సీట్లు అనే నిబంధనను గత ఏడాది ఎన్ఎంసీ ప్రవేశపెట్టింది. అలాగే, కళాశాలలకు అనుమతులు మంజూరు కోసం కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. దీంతో రాష్ట్రం నుంచి ఐదు వైద్య కళాశాలలకు దరఖాస్తు చేయడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొనడంతో అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరిపి, నిబంధనల నుంచి మినహాయింపు తెచ్చుకుని దరఖాస్తు చేసింది. అదే విధంగా.. 2023–24లో విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలల ప్రారంభ సమయంలో కేంద్రంతో సంప్రదింపులు జరిపి, వంద శాతం 750కు గాను 750 ఎంబీబీఎస్ సీట్లను రాబట్టింది. తొలివిడత తనిఖీల్లో విజయనగరం మినహా, మిగిలిన నాలుగు కళాశాలలకు అప్పట్లో అనుమతులు రాలేదు. భవనాలు, హాస్టళ్లు సిద్ధంగా లేకపోవడంతో పాటు, పలు అంశాల్లో కొరత ఉందని నిరాకరించారు. కానీ, అడ్మిషన్లు ప్రారంభమయ్యే నాటికి అన్ని వసతులు కల్పిస్తామని ఎన్ఎంసీకి హామీ ఇవ్వడం ద్వారా రెండో విడత తనిఖీల్లో అనుమతులను రాబట్టారు. ప్రస్తుతం కూడా అనుమతుల నిరాకరణపై అప్పీల్‌కు అవకాశం ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోతే విద్యార్థులకు తీవ్రనష్టం జరిగే అవకాశముంది.

అదో దా‘రుణ’ యాప్

- నిషేధించినా బురిడీ కొట్టిస్తున్న ‘క్యాష్ ఎక్స్‌పాండ్ యూ’ యాప్
- ఆరు నెలల్లోనే 1,062 పైగా ఫిర్యాదులు
- ఆ యాప్‌ను ఫోన్ల నుంచి తొలగించాలని నేషనల్ సైబర్ పోర్టల్ ప్రకటన

సాక్షి, అమరావతి: లోన్ యాప్ మోసాలు ఆగడం లేదు. కేంద్ర ప్రభుత్వం నిషేధించినా వివిధ లోన్ యాప్‌లు అనధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తూ భారీ మోసాలకు పాల్పడుతున్నాయి. అక్రమ మార్గాల ద్వారా మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అందుబాటులో ఉంటూ మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా ‘క్యాష్ ఎక్స్‌పాండ్ యూ’ లోన్ యాప్ నిర్వాకం వెలుగుచూసింది. ఈ యాప్ సులభంగా రుణాలు ఇస్తామని సామాన్యులను బురిడీ కొట్టిస్తోంది. లోన్ ఇచ్చిన అనంతరం భారీ వడ్డీలు వేస్తూ ఖాతాదారులను వేధిస్తోంది. రుణాలు చెల్లించలేని వారి వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేస్తూ వారిని బ్లాక్‌మెయిల్ చేస్తోంది. వారి ఫొటోలను మార్ఫింగ్ చేసి మరీ సోషల్ మీడియాలో వైరల్ చేస్తుండటంతో రుణాలు తీసుకున్న వారు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్లకు తమ ఏజెంట్లను పంపించి మరీ దాడులు చేయిస్తూ వారి ఆస్తులను రాయించుకుంటున్న ఉదంతాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ‘క్యాష్ ఎక్స్‌పాండ్ యూ’ లోన్‌యాప్‌పై గడచిన ఆరు నెలల్లోనే ఏకంగా 1,062 కేసులు నమోదు కావడం గమనార్హం.

నిషేధించినా సరే..

‘క్యాష్ ఎక్స్‌పాండ్ యూ’ లోన్ యాప్ మోసాలపై సైబర్ పోలీసులకు సవాల్‌గా మారింది. వాస్తవం ఏమిటంటే.. ఆ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లోనే నిషేధించింది. ఆ సమాచారాన్ని గూగుల్‌తోపాటు ఇతర సెర్చ్ ఇంజన్ల యాజమాన్యాలకు కూడా సమాచారమిచ్చింది. అయినా సరే.. ఆ యాప్ స్మార్ట్ ఫోన్లలో ఎలా అందుబాటులో ఉంటోందన్నది అంతు చిక్కడం లేదు. గత నాలుగేళ్లలో మొత్తం 1,600 లోన్ యాప్‌లను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. వాటిలో అత్యధికం చైనా కేంద్రంగా నిర్వహిస్తున్న యాప్‌లే ఉండటం గమనార్హం. నిషేధించాం కాబట్టి ఇక ఆ యాప్‌లు మోసాలకు పాల్పడలేవని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ భావిస్తోంది. కానీ ‘క్యాష్ ఎక్స్‌పాండ్ యూ’ లోన్ యాప్ మోసాలు కొనసాగుతుండటం విస్మయానికి గురి చేస్తోంది.

ఆ యాప్‌ను డిలీట్ చేయండి

ఈ నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ సైబర్ పోర్టల్ స్పందించింది. ‘క్యాష్ ఎక్స్‌పాండ్ యూ’ లోన్ యాప్‌ను తాము నిషేధించినట్లు తెలిపింది. అయినా వివిధ గేట్‌వేల ద్వారా ఆ యాప్ స్మార్ట్ ఫోన్‌లో అందుబాటులో ఉంటున్నట్టు గుర్తించినట్టు పేర్కొంది. కాబట్టి.. మొబైల్ ఫోన్ వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్లలో ఉన్న ఆ యాప్‌ను డిలీట్ చేయాలని సూచించింది. తద్వారా ఆ యాప్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు అప్రమత్తంగా ఉండాలని చెప్పింది. నిషేధించినా సరే ఇతర మార్గాల ద్వారా మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అందుబాటులో ఉంటున్న యాప్‌లపై నేషనల్ సైబర్ పోర్టల్ సమగ్ర దర్యాప్తు చేస్తోంది. దీనిపై త్వరలోనే తగిన కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొంది. లోన్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. ఎవరైనా మోసపోతే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని నేషనల్ సైబర్ పోర్టల్ కోరింది.

ఇవేం కష్టాలు తిరుమలేశా!

- శ్రీవారి క్షేత్రంలో భక్తుల ఇక్కట్లు
- కనీసం నేలపై కూర్చునే అవకాశం లేకుండా బాత్రూమ్ నీళ్లు వదలడంపై ఆగ్రహం



సాక్షి, టాస్క్‌ఫోర్స్: శ్రీవారి భక్తులకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. క్యూలైన్లలో అష్టకష్టాలు పడుతున్నారు. కనీసం కూర్చునేందుకు అవకాశం లేక.. ఆహారం మాట దేవుడెరుగు మంచినీళ్లు అందించే దిక్కులేక అలమటిస్తున్నారు. ఆదివారం శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రూ.300 టికెట్ తీసుకున్న భక్తులు సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటలు దాటినా క్యూలైన్‌లోనే నిలబడాల్సి వచ్చింది. అంత సమయం వేచిఉన్నా మంచినీరు, అన్న ప్రసాదం, చిన్న పిల్లలకు పాలు కూడా సరఫరా చేయలేదు. తమకు ఎదురైన ఇబ్బందులతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూర్చునేందుకూ గతి లేదు

ప్రత్యేక దర్శనాలకు వచ్చిన భక్తులను కంపార్ట్‌మెంట్‌లో ఉంచాల్సింది పోయి గంటల తరబడి క్యూలైన్‌లో నిలబెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము నిలబడిన ప్రాంతంలో బాత్‌రూమ్ నీళ్లు విడిచిపెట్టడంతో కూర్చోవటానికి వీలులేకుండా పోయిందని మండిపడ్డారు. తిరుమలలో పరిస్థితిపై ఓ భక్తుడు టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేశారు. ‘రూ.300 తీసుకుని గంటలు గంటలు లైన్‌లో నిలబెట్టడం ఏమిటి. కూర్చుందామనుకుంటే బాత్‌రూమ్ నీరు విడిచిపెట్టారు. తాగటానికి మంచినీరు లేదు. అన్న ప్రసాదం లేదు. చిన్న పిల్లలకు పాలు లేక ఏడుస్తున్నారు. వినిపిస్తోందా’ అని ప్రశ్నించారు. ‘తిరుమల ప్రక్షాళన అంటే ఇదేనా. ఇప్పటికంటే గత ప్రభుత్వ పాలనలోనే పరిస్థితి బాగుంది’ అని పలువురు భక్తులు వాపోయారు.

టీటీడీ పరిపాలన భవనంలో సోదాలు

తిరుపతి (అలిపిరి): గత ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రస్తుత ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఆదివారం విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం స్థానిక టీటీడీ భవనంలో సోదాలు చేపట్టింది. పరిపాలన భవనంలోని పలు విభాగాల్లో ముఖ్యమైన ఫైళ్లను అధికారులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి


స్వామివారి చిత్రపటం అందుకుంటున్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు

మోపిదేవి(అవనిగడ్డ): కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి వచ్చిన జస్టిస్ జ్యోతిర్మయి ప్రతాప దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం న్యాయమూర్తి పుట్టలో పాలుపోసి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ స్వామికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు.

సంఘాల పేరుతో డీఎస్సీ వాయిదాకు కుట్ర

- ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ

సాక్షి, అమరావతి: ఎంతో కాలంగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థుల కోసం వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నిరుద్యోగ సంఘాల పేరు చెప్పి డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా వేయడం సరికాదని కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ పేర్కొన్నారు. టెట్ అర్హత సాధించిన వారు లక్షల్లో ఉన్నారని, డీఎస్సీకి సమయం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఇచ్చినా రెండు నెలలు సరిపోతుందన్నారు. ఇప్పుడు నోటిఫికేషన్ ఇచ్చి ముందుగా 16,347 పోస్టులు రెండు నెలల్లో భర్తీ చేయాలని, మరోసారి టెట్ అర్హత సాధించిన వారికి మరో డీఎస్సీలో అవకాశం కల్పించాలని సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న సీనియర్లపై కొత్త వారిని పోటీకి దించడం న్యాయం కాదన్నారు. నోటిఫికేషన్ వాయిదా వేయడం మానుకుని వెంటనే డీఎస్సీ ప్రకటించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను డిమాండ్ చేశారు. విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల పేరుతో ప్రభుత్వం డీఎస్సీ ప్రకటనను దాటవేస్తోందని, దీనిపై టీచర్ ఎమ్మెల్సీలు స్పందించి నోటిఫికేషన్ ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రెండు ఏటీఎంల్లో రూ.26 లక్షలు చోరీ

గుడిపాల(చిత్తూరు జిల్లా): ఏటీఎంలను గ్యాస్ కట్టర్‌తో పగులగొట్టి రూ.26 లక్షలను దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఆదివారం చిత్తూరు జిల్లా గుడిపాల మండల కేంద్రంలో జరిగింది. ఎంపీడీవో కార్యాలయం ఆనుకుని ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి ముగ్గురు ముఖాలకు గుడ్డ కట్టుకుని చొరబడ్డారు. ఒక ఏటీఎంను పగులగొట్టారు. వెంటనే పక్కనే ఉన్న మరో ఏటీఎంను పగలగొట్టి ఏటీఎంల్లో ఉన్న రూ.26 లక్షలను ఎత్తుకెళ్లారు. సీసీటీవీలో వ్యక్తుల కదలికలను బట్టి ఉత్తరభారత్‌కు చెందినవారై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఘటనాస్థలం వద్ద సీసీటీవీ పుటేజీ ఏటీఎం బ్రేకింగ్, అలారం, సెన్సార్లను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ చోరీకి పాల్పడిన వారిని త్వరగా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

2, 3 రోజుల్లోనే ఆ ప్రేమోన్మాదిని పట్టుకుంటాం

- మైనర్ బాలిక హత్య కేసుపై హోం మంత్రి అనిత స్పందన



అనకాపల్లి: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో మైనర్ బాలికను కిరాతకంగా హత్య చేసిన ప్రేమోన్మాదిని 2,3 రోజుల్లో పట్టుకుంటామని రాష్ట్ర హోం మంత్రి అనిత తెలిపారు. అనకాపల్లిలోని గవరపాలెంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. 8 నుంచి 9 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కశింకోట మండలానికి చెందిన బద్ది దర్శిని(14)ని నిందితుడు సురేశ్ గతంలో ప్రేమ పేరుతో వేధిస్తే.. పోలీసులు పోక్సో కేసు పెట్టి జైలుకు పంపారని చెప్పారు. నిందితుడు 15 రోజుల క్రితం బెయిల్‌పై వచ్చి జైలుకు పంపిందన్న కక్షతో బాలికను శనివారం రాత్రి హత్య చేసినట్లు చెప్పారు. బాలిక కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. నిందితుడు మళ్లీ బాలిక వెంటపడుతున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు 2,3 రోజుల క్రితం రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసిందని, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారని విలేకరులు ప్రశ్నించగా..అలాంటిది జరిగినట్లు తన దృష్టికి రాలేదని, అదే నిజమైతే సంబంధిత పోలీస్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పవర్ ఫుల్ సింహాద్రి

ఆరు రాష్ట్రాలకు వెలుగులు • నేడు సింహాద్రి ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం



ఒకప్పుడు అది చిన్న గ్రామం. జనసంచారం ఉండేది కాదు. సాయంత్రం 5 దాటితే అటువైపు వెళ్లడానికి ఎవరూ సాహసించేవారు కాదు. గాఢాంధకారంలో ఉండేది. అడవిని తలపించేది. అదంతా గతం.ఇప్పుడా కుగ్రామం పగలు కన్నా రాత్రి వేళల్లో విద్యుత్ కాంతుల్లో ధగధగలాడుతోంది. అంతేకాదు మన రాష్ట్రంతో పాటు పక్కనే ఉన్న ఆరు రాష్ట్రాలకు ఎంతో అవసరమైన విద్యుత్ సరఫరా చేస్తూ అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. ఆ కుగ్రామం పరవాడ. ఈ వెలుగులకు కారణం 26 ఏళ్ల కిందట ఏర్పాటైన సింహాద్రి జాతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీపీసీ). భారీ పరిశ్రమ అంటే విశాఖ స్టీల్‌ప్లాంట్ తప్ప తెలియని పరవాడ ప్రజలకు తమ చెంత ఇంత పెద్ద ఎత్తున విద్యుత్ కేంద్రం ఏర్పాటవుతున్నట్లు తమ కలలో కూడా ఊహించలేదు. వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో

అడుగుపెట్టి అనతి కాలంలో అంచెంచెలుగా ఎదిగి 2వేల మెగావాట్ల విద్యుదుత్పత్తితో పాటు మరో 25 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ ప్రగతిపథంలో దూసుకుపోతోంది. సోమవారం పరవాడ ఎన్టీపీసీ 27వ వసంతంలోకి అడుగుపెట్టనుంది. – పరవాడ

పరవాడ సమీపంలో 3,383 ఎకరాల విస్తీర్ణంలో రూ.3,700 కోట్ల వ్యయంతో సింహాద్రి ఎన్టీపీసీని 1997లో ఏర్పాటు చేశారు. సుమారు 600 మంది శాశ్వత ఉద్యోగులతో పాటు రెండు వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. రెండు వేల మెగావాట్ల విద్యుదుత్పత్తిని సరఫరా చేయడానికి 30 వేల మెట్రిక్ టన్నుల బొగ్గును అవసరమవుతుంది. బొగ్గును ఒడిశాలోని మహానంది బొగ్గు గనుల నుంచి దిగుమతి చేసుకొంటుంది.

- మహారత్న కంపెనీగా ఎదిగిన సింహాద్రి ఎన్టీపీసీ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తూ ప్రగతిపదంలో దూసుకుపోతుంది.
- సింహాద్రికి అతిసమీపంలోని రిజర్వాయర్‌పై రూ.110 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఫ్లొటింగ్ సోలార్ ప్లాంట్ సరఫరా చేస్తున్న 25 మెగావాట్ల విద్యుత్‌ను సింహాద్రి తన సొంత అవసరాలకు వినియోగిస్తోంది. సింహాద్రి ఎన్టీపీసీ విద్యుదుత్పత్తి కోసం అవసరమైన నీటిని తిక్కవానిపాలెం సముద్ర జలాలను తీసుకొంటున్నారు.
- కేంద్ర కాలుష్య మండలి సూచనల మేరకు కాలుష్యాన్ని నియంత్రించేందుకు వీలుగా ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్ ప్లాంటును ఏర్పాటు చేసింది.
- ప్లాంటు నుంచి నిత్యం 4 వేల టన్నులకు పైగా బూడిదను ఇటుకలు, రహదారుల నిర్మాణాలు, సిమెంటు పరిశ్రమలకు సరఫరా జరుగుతుంది.

సేవా కార్యక్రమాలు

నిర్వాసిత గ్రామాల్లో సంస్థ రూ.కోట్లతో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతూ ప్రజా మన్ననలను పొందుతోంది. తాగునీరు, విద్య, రహదారులు, పాఠశాలలు, ఉచిత వైద్య శిబిరాలు, కాలువలు, వీధి దీపాలు, నిరుద్యోగయువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని 120 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా రూ.1.46 కోట్లతో నిరుద్యోగులను నాలుగు బ్యాచ్‌లుగా విభజించి విజయవాడలో సీపెట్‌ఈటీ ద్వారా శిక్షణ ఇస్తోంది. అనకాపల్లి ఇండోర్ స్టేడియం, పునరుద్ధరణ కోసం రూ.2 కోట్ల ఆర్థిక సాయాన్ని అందజేసింది. పరవాడ మండలంల బెబ్బిలి నుంచి మూలస్వయంభూవరం, సోమునాయుడుపాలెం వరకు పైపులైన్ నిర్మాణానికి రూ.71 లక్షలు వెచ్చించింది. సీఎస్సార్ నిధుల నుంచి రూ.50 లక్షలను తానాం రెసిడెన్షియల్ పాఠ శాల, కళాశాల డార్మిటరీని నిర్మించింది.

బస్సులో బంగారం రవాణా..

సాక్షి, హైదరాబాద్: గుట్టుచప్పుడు కాకుండా బస్సులో బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న కేటుగాళ్లకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) హైదరాబాద్ యూనిట్ అధికారులు చెక్ పెట్టారు. కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్న 3.9 కిలోల బంగారాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్టు డీఆర్ఐ అధికారులు తెలిపారు. పట్టుబడిన బంగారం విలువ రూ.2,89,90,780 ఉంటుందని వెల్లడించారు. బంగారం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో అక్రమంగా బంగారాన్ని కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టుగా డీఆర్ఐ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఆ ఇద్దరు వ్యక్తులు బంగారు బిస్కెట్లను ఒక వస్త్రంలో చుట్టి దాన్ని నడుము చుట్టూ కట్టుకుని ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్త తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. వారి నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకుని కస్టమ్స్ యాక్ట్ 1962 కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు వివరించారు. అయితే, బంగారం తరలిస్తున్న వ్యక్తులు ఎవరు? కోల్‌కతా నుంచి వారు ఏ బస్సులో హైదరాబాద్‌కు వస్తున్నారు? వారిని ఎక్కడ అరెస్టు చేశారన్న విషయాలు మాత్రం వెల్లడించలేదు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నందున ఈ దశలో వివరాలు వెల్లడించలేమని డీఆర్ఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

చిరుత పులి దాడిలో ముగ్గురికి గాయాలు

ఆగ్రహంతో కొట్టి చంపిన గ్రామస్తులు



రాయచూరు రూరల్: చిరుత పులి దాడిలో ముగ్గురు గాయపడిన ఘటన కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా కామదాళ గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఊరిబయట కొండ వద్దకు వెళ్లిన గ్రామస్తులపై ఓ చిరుత దాడి చేసింది. ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు కొండలో గాలింపు చేపట్టారు. సాయంత్రం ఓ గుహలో దాక్కున్న చిరుతను గుర్తించి కట్టెలు, ఈటెలతో దాడి చేసి హతమార్చారు. అటవీ సిబ్బంది చేరుకుని చిరుత కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మాజీ సభ్యుడిని హతమార్చిన మావోలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా సున్నంపెంట గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు బర్సె మాస(43)ను మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో హతమార్చారు. మాస కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడిగా దళంలో పనిచేసి కొన్ని రోజుల క్రితం భార్య, మరికొందరు దళ సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. కాగా, శనివారం రాత్రి కొందరు మావోయిస్టులు అతడిని ఇంటి నుంచి కిడ్నాప్ చేసి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారు. పోలీసుల ఎదుట లొంగిపోవడమే కాక వారికి ఇన్‌ఫార్మర్‌గా మారి సమాచారం అందజేస్తున్నారని, ఆ సమాచారంతోనే పోలీసులు పార్టీ సానుభూతిపరులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ కత్తులతో పొడిచి హతమార్చారు. మృతదేహాన్ని అటవీ ప్రాంతంలో వదిలేసి వెళ్లగా, స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

జలసిరి సంరక్షణ బాధ్యత మనందరిది



ప్రారంభిస్తున్న శశికాంత్ శివపురె

రాయచూరు రూరల్: జిల్లాలో జలసిరిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జెడ్పీ ఉప కార్యదర్శి శశికాంత శివపురె అభిప్రాయపడ్డారు. ఆదివారం జెడ్పీ జల నిర్మల సభాగంణంలో జలసేవా చారిటబుల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన అమృత వర్షిణి పథకం శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. భూగర్భ జలాల స్థాయిని పెంపొందించాలన్నారు. వాన నీరు, చెరువు నీరు, వ్యవసాయ నీటి కుంటలు, చెక్ డ్యాంలు, బావుల మరమ్మతు వంటివి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు అభివృద్ధి అధికారి చేతన్ కుమార్, చంద్రశేఖర్, శశికాంత్ కామేల్కర్, శోభ, పద్మ, వెంకటేష్, శ్రీధర్, శిల్ప, నాగరాజ్, పల్లవి, మమత, శంకరప్పలున్నారు.

జెడ్పీ సీఈఓకు వీడ్కోలు



జెడ్పీ సీఈఓను సన్మానిస్తున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: విజయనగర జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభుకు వీడ్కోలు కార్యక్రమం శనివారం సాయంత్రం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షత వహించిన జిల్లాధికారి దివాకర్ మాట్లాడుతూ సదాశివ ప్రభు జిల్లాలో గ్రామీణ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమన్నారు. కానీ వృత్తిలో మనం చేసిన సేవలు మాత్రం ప్రజల్లో చిరకాలం గుర్తుంటాయన్నారు. అనంతరం సదాశివ ప్రభు మాట్లాడుతూ తాను జిల్లాలో సుమారు 14 నెలలు జెడ్పీ సీఈఓగా సేవలు అందించానన్నారు. జిల్లా ప్రజలు, అధికారులు, సిబ్బంది తనపై చూపిన ఆప్యాయత మరువలేనిదన్నారు. నూతన జెడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్ మహమ్మద్ అలీ అక్రమ్ షా, సదాశివ ప్రభు భార్య గీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తామంటూ బెదిరింపులు

హుబ్లీ: కుసుగల్ రోడ్డులో బైక్ ఓవర్‌టేక్ చేసిన విషయానికి సంబంధించి సదరు వ్యక్తిపై ముగ్గురు దాడి చేసి ప్రాణాలు తీస్తామంటూ బెదిరించిన ఘటనపై కేశ్వాపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గదగ్ రోడ్డు గాంధీవాడ నివాసి రాకేష్ మనిగేటి కుసుగల్ రోడ్డు వద్ద బైక్ ఓవర్‌టేక్ చేశాడు. ఈ క్రమంలో మరో బైక్‌పై ఉన్న ముగ్గురు రాకేష్‌పై దాడి చేసి చంపుతామంటూ బెదిరించారు.

హాస్టల్ విద్యార్థులకు పరామర్శ



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

రాయచూరు రూరల్: హాస్టల్‌లో భోజనం వికటించి చికిత్స పొందుతున్న 30 మంది విద్యార్థులను మాన్వి శాసన సభ్యుడు హంపయ్య నాయక్ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. సంగాపుర రోడ్డులోని రాజలబండ మొరార్జి దేశాయి(గురుకుల) పాఠశాలలో తాగు నీటి ట్యాంకులో అధికంగా బ్లీచింగ్, క్లోరిన్ పొడర్లు కలిపిన నీటితో వంట చేయడంతో బాలబాలికలకు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరిన సంగతి విదితమే. హాస్టల్ వార్డెన్లు, సంబంధిత అధికారులు సకాలంలో అందుబాటులో లేకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ఎమ్మెల్యే అధికారులపై మండిపడ్డారు.

జాగ్రత్తలు పాటిస్తే గుండెపోటు దూరం




మాట్లాడుతున్న బాబూరావ్ శేగుణిసి

రాయచూరు రూరల్: కనీస జాగ్రత్తలను పాటిస్తే గుండెపోటును నివారించవచ్చని ఎస్‌కేఈ ప్యారా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బాబురావ్‌శేగుణిసి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఎస్‌కేఈ ప్యారా వైద్య కళాశాల, భారతీయ పిల్లల వైద్య నిపుణుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుండెపోటు బారిన పడిన వారికి తమదైన శైలిలో వైద్య సేవలు అందించాలన్నారు. గుండెపోటు నేడు సింహస్వప్నంగా మారిందన్నారు. అత్యవసర సమయంలో గుండెపోటును అరికట్టడానికి నోటితో గాలిని ఊదాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు హుల్లేష్ గౌడ, ఉషా, అజయ్, ప్రణయ్, మల్లేశప్పలున్నారు.

ఆశలు రేపుతున్న తుంగభద్రమ్మ

- రోజురోజుకూ జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం
- పొలం పనులతో అన్నదాతలు బిజీబిజీ



రైతుల జీవనాడిగా పేరొందిన తుంగభద్ర జలాశయం



ఆయకట్టు కింద ఇప్పటికే సిద్ధంగా ఉన్న వరినారుమళ్లు

సాక్షి,బళ్లారి: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలో బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర, అనంతపురం, కర్నూలు, వైఎస్ఆర్ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లాలకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయమైన తుంగభద్ర డ్యాంలో జలకళ ఉట్టిపడుతోంది. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల తుంగభద్ర డ్యాంలో ఇదే సమయానికి కేవలం 4 టీఎంసీల లోపు నీరు నిల్వ ఉండటంతో ఇన్‌ఫ్లో కూడా లేకపోవడంతో తుంగభద్ర ఆయకట్టు రైతులు సకాలంలో పంటలు పెట్టలేక తీవ్ర నష్టాల పాలయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి అదునులో వర్షాలు పడటంతో పాటు తుంగభద్ర డ్యాంకు ఎగువ ప్రాంతాలైన ఆగుంబె, శృంగేరి, తీర్థహళ్లి ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో తుంగభద్ర డ్యాంలో రోజు రోజుకూ నీటిమట్టం పెరుగుతోంది.

సకాలంలో సాగు నీరు వదిలే అవకాశం

ఆదివారం కూడా డ్యాంలోకి ఇన్‌ఫ్లో 45 వేల క్యూసెక్కులు రావడంతో డ్యాంలో నీటి నిల్వ 20 టీఎంసీలకు పైగా చేరుకోవడంతో రైతులకు సకాలంలో కాలువలకు నీరు వదిలే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తుంగభద్ర డ్యాం నుంచి హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ కాలువలకు ఈనెల 20 నుంచి నీరు విడుదల చేయాలని అధికారులు ముందుగానే నిర్ణయించడంతో ఆమేరకు కాలువలకు నీరు వదిలేందుకు తగినంత నీరు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని టీబీడ్యాం ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి సాక్షికి తెలిపారు. డ్యాంలో నీటి నిల్వ 40 టీఎంసీలకు చేరితే కాలువకు నీరు వదిలేందుకు వీలుంటుందన్నారు. ఖచ్చితంగా డ్యాంలోకి 20వ తేదీ లోపు 40 టీఎంసీల నీరు చేరుతుందనే నమ్మకం ఉందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుడా పొలాల్లో దుక్కులు దున్నుకుని, పంటలు పెట్టేందుకు సిద్ధం చేసుకోవాలన్నారు.

వరినారుకు పెరిగిన డిమాండ్

డ్యాంలో నీటి నిల్వ పెరుగుతుండటంతో వరినారుకు డిమాండ్ ఏర్పడుతోందని రైతులు పేర్కొంటున్నారు. నీటిపారుదల వసతి కలిగిన రైతులు ముందుగా వరినారు పోసుకుని కాలువలకు నీరు వదిలిన తర్వాత ఆయకట్టు రైతులకు నారుమళ్ల అమ్మకాలు చేస్తుంటారు. రెండు రోజులు క్రితం జిల్లాలో కురిసిన వర్షానికి పొలాల్లో దుక్కులు దున్నే పనిలో ఆయకట్టు రైతులు బిజీబిజీగా ఉంటున్నారు. ట్రాక్టర్లు, ఎద్దులతో ఆయకట్టు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. అదునులో వర్షాలు కురవడంతో ఆయకట్టు రైతులు ఖరీఫ్‌లో వరినాట్లు సకాలంలో వేసుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ముందుకు కదులుతున్నారు. వరితో పాటు మిర్చి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను ఆయకట్టు పరిధిలో సాగు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.



ఖరీఫ్ సీజన్‌కు ట్రాక్టర్‌తో దుక్కి దున్ని పొలాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

మారణాయుధాలతో తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్

హుబ్లీ: మారణాయుధాలతో సంచరిస్తున్న ఓ వ్యక్తిని ఏపీఎంసీ నవనగర పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రెండు తల్వార్లను స్వాధీనం చేసుకున్నారు. రాయాపుర నివాసి డ్రైవర్ తిప్పన్న సిశనళ్లి అరెస్ట్ అయిన నిందితుడు. బహిరంగ స్థలంలో గూడ్స్ వాహనంలో మారణాయుధాలను పెట్టుకుని సంచరిస్తున్నాడన్న ఆరోపణలపై అతడిని అరెస్ట్ చేసి సంబంధిత ఆయుధ చట్టం ఉల్లంఘన సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఆ స్టేషన్ సీఐ సమీర్ ఉల్లా తెలిపారు.

ఆన్‌లైన్‌లో రూ.7.19 లక్షల వంచన

హుబ్లీ: తనకు తెలియకుండా తన బ్యాంక్ ఖాతా నుంచి ఆన్‌లైన్ ద్వారా రూ.7.19 లక్షలను బదలాయించుకున్నారని బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడి వినాయక నగర శివానంద నింబక్కనవర్ బ్యాంక్ ఖాతాలో డబ్బులు బదిలీ కావడంపై శివానంద ఫోన్‌కు మొబైల్ సందేశం వచ్చింది. వెంటనే బ్యాంక్‌కు వెళ్లి పరిశీలించగా ఆన్‌లైన్‌లో బదలాయించుకున్నట్లుగా తేలింది. అందుకే తన ఖాతాలోని డబ్బుల్లో కోత పడిందని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలంటూ మోసం

హుబ్లీ: ముంబైకు చెందిన షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు సంపాదించవచ్చని చెప్పి నమ్మించిన కేటుగాళ్లు ఓ వ్యక్తిని మోసగించిన ఘటన వెలుగు చూసింది. స్థానిక కుబుసదవీధికి చెందిన ప్రశాంత్ మురుగోడ నుంచి రూ.18 లక్షలను తమ ఖాతాలోకి బదలాయించుకొని మోసగించినట్లుగా బాధితుడు నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శాంతి భద్రతల రక్షణకు పెద్ద పీట

రాయచూరు రూరల్: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో మట్కా, ఇస్పేట్ జూదం, అక్రమ ఇసుక రవాణా, గంజాయి సరఫరా, తదితర అక్రమాలపై నిఘా ఉంచేందుకు చర్యలు చేపడతామన్నారు. ట్రాఫిక్ సమస్య నివారణకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులకు శిక్షణ అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యంకణ్ణ

రాయచూరు రూరల్: నేటి ఆధునిక కాలంలో పోటీతత్వాన్ని ఎదుర్కోడానికి విద్యార్థులకు శిక్షణ శిబిరాలు అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యంకణ్ణ పిలుపునిచ్చారు. ఆదివారం డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వర్ధమాన్ కోచింగ్ కేంద్రాల ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై విద్యార్థులకు సలహాలు, సూచనలిచ్చారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడినప్పుడు ఈ ప్రాంత అభ్యర్థులు పోటీ పరీక్షలకు సరైన శిక్షణ కేంద్రాలు లేనందున సర్కారీ కొలువులకు ఎంపికలో వెనుకబడిన విషయాన్ని వివరించారు. భవిష్యత్తులో ఉత్తమ రీతిలో శిక్షణ పొందడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శాంత, వీరేష్, హనుమంతు, టీకప్ప, గురుస్వామి, అనంతరెడ్డి, శివరాజ్, దత్తాత్రేయ, వెంకటేష్, ప్యాటప్పలున్నారు.

కుక్కపైకి రాయి విసిరాడని దాడి

హుబ్లీ: కరవడానికి వచ్చిన కుక్కపైకి రాయి విసిరిన నేపథ్యంలో ఏడుగురు కలిసి స్థానిక గదగ్ రోడ్డు చలవాది వీధికి చెందిన ఫ్రాన్సిస్ హుడమాలపై దాడి చేసి ప్రాణాలు తీస్తామంటూ బెదిరించిన ఘటన చాళుక్య నగర్‌లో శనివారం వెలుగు చూసింది. ఇక్కడి పాఠశాల వద్ద నడుచుకుంటూ వెళుతుండగా కుక్క ఫ్రాన్సిస్ వెంట పడింది. దీంతో భయపడిన అతను రాయి తీసుకుని విసిరాడు. ఈ సందర్భంగా వచ్చిన కరణ్, భాగ్య, షడ్రిక్, జ్ఞానేష్ తదితర 7 మంది బాధితుడిని కొట్టి అసభ్యంగా నిందించారు. ఇలా మరో సారి చేస్తే ప్రాణాలు తీస్తామంటూ బెదిరించినట్లుగా బాధితుడు కేశ్వాపుర పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

జనస్పందన.. సమస్యల నివేదన



ప్రజల సమస్యలను వింటున్న అధికారులు

హొసపేటె: విజయనగర జిల్లాలోని హరపనహళ్లిలో జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ నేతృత్వంలో జనస్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. హరపనహళ్లిలోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ సభాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ నివేదనలను సమర్పించారు. రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కూడా వచ్చి వినతిపత్రాలు అందించారు. జెడ్పీ సీఈఓ నోంగ్‌జాయ్ మహ్మద్ అలీ అక్రమ్ షా, హరపనహళ్లి అసిస్టెంట్ కమిషనర్ చిదానంద గురుస్వామి, జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారుల సమక్షంలో జిల్లాధికారి ప్రజల ఫిర్యాదులను విన్నారు. హళ్లికేరి, మాదిహళ్లి, గౌరీపుర, తొగరికట్టి, జిట్టినకట్టి, యరబాళు, తావరగొంది, అరసనాళు, హలువాగలు, గర్భగుడి, బిక్కికట్టి గ్రామాల్లోని లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని, ప్లాట్లకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని వినతిపత్రాలు సమర్పించారు. అరసికెరెలో నాడకచేరి నిర్మించాలి, బస్సు సౌకర్యం కల్పించాలి, ఆస్పత్రికి వైద్యాధికారులను నియమించాలని గ్రామానికి చెందిన రైతు నాయకులు హెచ్.హాలప్ప, ఏబీ నాగరాజగౌడ తదితరులు రైతులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గిరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రితులకు మాజీ మంత్రి అండ



నిరాశ్రయుల గోడు ఆలకిస్తున్న మాజీ మంత్రి శ్రీరాములు

బళ్లారిఅర్బన్: ఇటీవల తాళూరు రోడ్డులో హెచ్ఎల్‌సీ కింద 6వ డివిజన్ ఉపకాలువ పక్కన నిర్మించుకున్న గుడిసెలను కోల్పోయిన పేదలకు మాజీ మంత్రి శ్రీరాములు అండగా నిలిచారు. వీధి పాలైన నిరాశ్రయులకు ఆయన తాత్కాలికంగా షెడ్లను నిర్మించారు. ఘటన స్థలంలో నాలుగు గంటల పాటు బస చేసి సదరు నిరాశ్రిత 10 కుటుంబ సభ్యులకు ఓ నెల రోజులకు సరిపడా ఆహార ధాన్యాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ఈ పేదల గుడిసెలను కూల్చివేసిన స్థానిక పలుకుబడి కలిగిన వ్యక్తులు, నీటిపారుదల శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత తహసీల్దార్, నీటిపారుదల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ కార్పొరేటర్ గుడిగంటి హనుమంత, పార్టీ ప్రముఖులు గోవిందరాజులు, గురులింగనగౌడ, సుగుణ, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించకుండానే కొత్త ఎస్పీ వెనక్కు



కొత్త ఎస్పీ డాక్టర్ రామ్ అరసిద్ధి(ఫైల్)



ప్రస్తుత ఎస్పీ యశోదా వంటగోడి (ఫైల్)

హొసపేటె: రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం పెద్ద సంఖ్యలో ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. వీరిలో ఎక్కువ మంది ఎస్పీలు ఉన్నారు. కొప్పళ ఎస్పీ యశోదా వంటగోడిని లోకాయుక్తకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆమె స్థానంలో డాక్టర్ రామ్ అరసిద్ధిని నియమించింది. కొప్పళ జిల్లా ఎస్పీగా బదిలీ నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన కొత్త ఎస్పీ డాక్టర్ రామ్ అరసిద్ధికి ఉన్నతాధికారులు షాకిచ్చారు. ఆయన బాధ్యతలు తీసుకోవాల్సిన సమయంలో నియామకం రద్దయినట్లు ఆదేశాలు వచ్చాయి. గురువారం సాయంత్రం కొప్పళ జిల్లాకు బాధ్యతలు తీసుకొనేందుకు వచ్చిన నూతన ఎస్పీ డాక్టర్ రామ్ అరసిద్ధికి ఎస్పీగా బాధ్యతలు తీసుకోవద్దని ఉన్నతాధికారులు ఆదేశించడంతో చివరి క్షణంలో ఆయన కార్యాలయం నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే ప్రస్తుత ఎస్పీ యశోదా వంటగోడికి మద్దతు తెలిపినట్లు సమాచారం.

చిరుత దాడిలో ముగ్గురికి గాయాలు



చిరుత దాడిలో గాయపడిన వారు వీరే



క్షతగాత్రులను పరామర్శించిన కరెమ్మ నాయక్



చిరుతపులి దాగిన కొండ, (ఇన్‌సెట్) చిరుతపులి

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవదుర్గ తాలూకాలో చిరుత దాడి నుంచి ముగ్గురు వ్యక్తులు గాయపడి త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. తాలూకాలోని కామదాళలో తెల్లవారు జామున రంగప్ప, పదో తరగతి విద్యార్థి కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులోకి వెళ్లి చిరుతను చూసి భయపడి గ్రామంలోకి పరుగెత్తారు. ఈ విషయంపై గ్రామంలోని రంగనాథ్(29), మల్లన్న(42), రమేష్(35) తదితరులకు సమాచారం అందించారు. వారు ముగ్గురు ఆయుధాలతో చిరుతను తరమడానికి వెళ్లగా అది తిరగబడి వారిపై దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళన నెలకొంది. క్షతగాత్రులు దేవదుర్గ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా సమాచారం అందిన వెంటనే శాసన సభ్యురాలు కరెమ్మ నాయక్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

సీఎం, డీసీఎం పదవులపై రచ్చ తగదు

- ఎక్సైజ్ మంత్రి ఆర్‌బీ.తిమ్మాపుర

హుబ్లీ: ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవులకు సంబంధించిన విషయం నడివీధుల్లో చర్చించుకొనే అంశం కాదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి ఆర్‌బీ.తిమ్మాపుర అసంతృప్తి వెళ్లగక్కారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ రెండు పదవులకు ఎంతో ఘనత, ప్రాధాన్యత ఉందన్నారు. నడివీధుల్లో రచ్చ చేసే విషయం కాదన్నారు. ఈ విషయంలో రూపురేఖలు ఉన్నాయన్నారు. హైకమాండ్ ఉంది. నాలుగు గోడల మధ్య చర్చించాలి. అలాకాకుండా ఎక్కడ పడితే అక్కడ చర్చించరాదన్నారు. మీడియా ప్రతినిధులే సీఎం, డీసీఎంలపై చర్చిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్పీ, టీఎస్పీ నిధుల దుర్వినియోగంపై స్పందించిన ఆయన ఆ నిధులు ఎట్టి పరిస్థితుల్లోను దుర్వినియోగం కాలేదన్నారు. వాస్తవాలను చూడండి అన్నారు. బీసీలకు సహాయం చేసే ప్రవృత్తి సీఎంకు ఉందన్నారు. ఏ బీసీ వర్గాలకూ అన్యాయం జరగలేదన్నారు.

విపక్షాలది అనవసర రాద్ధాంతం

ఇప్పటికే సీఎం తాను తెచ్చిన చట్టం ఇదని మరింత నిధులు ఇస్తున్నారన్నారు. ఈ విషయంలో విపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ బార్ వ్యాపారస్తులకు వ్యాపార స్నేహి అదాలత్ ప్రారంభం అంశంపై మాట్లాడిన ఆయన ఈ విషయం చాలా రోజుల నుంచి వినిపిస్తోందన్నారు. ఎక్సైజ్ శాఖలో ఇది తప్పకుండా జరగాల్సిన కార్యక్రమం అన్నారు. గోవాలో చాలా లిక్కర్ తక్కువ ధరకే దొరుకుతుందన్నారు. ఇక్కడ ఎటువంటి పన్నులు లేవన్నారు. గోవా, మహారాష్ట్రలకు స్పిరిట్ సరఫరా అవుతుందన్నారు. ముందుగా దీన్ని అడ్డుకోవాలన్నారు. కర్ణాటక లిక్కర్ బాగుంది. ఇతర రాష్ట్రాల నాసిరకం లిక్కర్ మన రాష్ట్రానికి రాకుండా నివారించాలన్నారు. ఇప్పట్లో మద్యం ధర పెంచబోమన్నారు. ధర పెరుగుతుందన్న వార్తలు కేవలం ఊహాగానాలే అన్నారు. ఎంఎస్ఈఎస్‌లకు ఇక ముందు అనుమతి ఇవ్వడంపై ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. బార్‌లకు ఇబ్బంది కలుగుతుందని కాదు, ఇది పాలనా పరంగా తీసుకున్న నిర్ణయం అన్నారు.

శ్రమదానంతో కళ్యాణి శుభ్రం



శ్రమదానం అనంతరం శుభ్రపడిన బావిలో జలకాలాడుతూ ఈత కొడుతున్న యువకులు



బావిలో పేరుకున్న పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: పురాతన కాలం నాటి బావులను సంరక్షించాలనే సదాశయంతో యువకులు ఆదివారం యాదగిరి జిల్లా హుణసిగిలో కళ్యాణి పుష్కరిణిని శుభ్రం చేశారు. యాదగిరి యువ బ్రిగేడ్ ఆధ్వర్యంలో మంజునాథ్ నేతృత్వంలో 15 మంది సభ్యులు స్వచ్ఛతకు నడుం బిగించి అక్కడి దేవర దాసిమయ్య తీర్థ క్షేత్రంలో పాడు పడ్డ ఈ బావిలో పేరుకొని పోయిన ముళ్ల కంప చెట్లు, ఆకు పచ్చని పిచ్చి మొక్కలు ఇతరత్ర వాటిని తొలగించి శుభ్రం చేసి చూడ చక్కగా తీర్చిదిద్దారు.

నకిలీ ఆస్తి పత్రాలతో వేధింపులు

- విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

హుబ్లీ: రుణం తీసుకోవడానికి ఇచ్చిన ఖాళీ చెక్, బాండ్‌ను దుర్వినియోగం చేసుకొని ఆస్తిని తమ పేరున రిజిస్టర్ చేయించుకోవడమే కాకుండా తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించినా ఇంకా రూ.65 లక్షల అప్పు చెల్లించాలంటూ వేధించడంతో విషం తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పాతహుబ్లీ పోలీస్ స్టేషన్‌లో శనివారం జరిగింది. వివరాలు.. నగరానికి చెందిన అమీర్‌షా(60) మృతుడు. స్థానికులు బసప్ప, గురు అనే వ్యక్తులపై కేసు నమోదైంది. అమీర్‌షా 2019లో బసప్ప దగ్గర బంధువు ఇంటికి సంబంధించిన కాగితాలు తనఖా పెట్టి మొత్తం రూ.30 లక్షలను 10 శాతం వడ్డీ మేర అప్పు తీసుకున్నాడు. ఈ క్రమంలో నాలుగు ఖాళీ బాండ్లు, 5 చెక్‌లను సంతకం చేసి ఇచ్చారు. గురు అనే వ్యక్తి ద్వారా నెలకు రూ.3 లక్షల ప్రకారం రూ.28 లక్షలు చెల్లించి కేవలం రూ.2 లక్షలు మాత్రమే బాకీ పడ్డాడు. అయితే మృతుడు గతంలో సంతకాలు చేసి ఇచ్చిన కాగితంలో మొత్తం రూ.65 లక్షలు అని పేర్కొంటూ వడ్డీ చెల్లించాలంటూ వేధించారు. అంతేగాక సదరు ఆస్తి కాగితాల నకిలీవి నకిలీ పత్రం సృష్టించుకొన్నారు. ఈ ఆవేదనతో అమీర్‌షా విషం తాగాడు. కిమ్స్‌లో చేర్పించినా చికిత్స పొందుతూ శనివారం మరణించినట్లు మృతుడి కుమారుడు సయ్యద్‌హుస్సేన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బసప్ప, గురు అనే ఇద్దరిపై కేసు నమోదైంది.

వణికిస్తున్న విష జ్వరాలు

- భయాందోళనలో ఉత్తర కర్ణాటక ప్రజలు
- హావేరి, గదగ్ జిల్లాల్లో పలువురు మృతి
- డెంగీ, ఎలుక జ్వరాలు బయట పడిన వైనం



మరణించిన బాలుడు చిరాయి హొసమని(ఫైల్)



విష జ్వరాలతో చికిత్స పొందుతున్న ప్రజలు

సాక్షిబళ్లారి: రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినప్పటి నుంచి వర్షాలు అన్ని జిల్లాల్లో బాగా కురవడంతో ఎక్కడపడితే అక్కడ బురద నీరు, అపరిశుభ్రత రాజ్యమేలడంతో విషజ్వరాలు కూడా వెంటాడుతున్నాయి. హావేరి, గదగ్ జిల్లాల్లో డెంగీ జ్వరం వణికిస్తుండగా దీనికి తోడు తాజాగా ఎలుక జ్వరం కూడా బయటపడింది. హావేరి తాలూకాలో 12 ఏళ్ల బాలుడికి ఎలుక జ్వరం ఉన్నట్లు తేలడం తీవ్ర చర్చనీయంగా మారింది. సదరు బాలుడిని 10 రోజుల క్రితం జ్వరం రావడంతో హావేరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాలుడికి కామెర్ల వ్యాధి(జాండీస్) ఉన్నట్లు బయటపడింది. అనంతరం కూడా జ్వరం తగ్గక పోవడంతో మరిన్ని పరీక్షలు చేయడంతో ఎలుక జ్వరం ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో డెంగీతో పాటు ఎలుక జ్వరం కూడా ప్రబలడంతో జనం భయాందోళన చెందుతున్నారు.

అపరిశుభ్రత తాండవం వల్లే..

అధికారులు సూక్ష్మంగా గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత పెంపొందించే కార్యక్రమాలు చేయడం లేదు. గదగ్ జిల్లాలో 5 ఏళ్ల బాలుడు డెంగీ జ్వరంతో మృతి చెందాడు. గదగ్ తాలూకా సిరంజ గ్రామానికి చెందిన చిరాయి హొసమని(5) అనే బాలుడు గత వారం రోజుల నుంచి డెంగీ జ్వరంతో బాధపడుతుండటంతో ధార్వాడలోని ఎస్‌డీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు ఆదివారం మృతి చెందడం గ్రామంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులను కలిచి వేసింది. హావేరి, గదగ్ జిల్లాల్లో డెంగీ జ్వరం ఒక వైపు, ఎలుక జ్వరం మరో వైపు వ్యాపిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇకనైనా సంబంధిత పాలకులు, అధికారులు రాష్ట్రంలో ప్రబలుతున్న విష జ్వరాలను అరికట్టే చర్యలు పకడ్బందీగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.